ఈనాడు

హైదరాబాద్ 11-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 62

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

దసరా శుభాకాంక్షలు!!

ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్



11 అక్టోబర్, 2024న

కొందుర్గ్, షాద్‌నగర్ నియోజకవర్గంలో


తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు

గౌ॥ శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారిచే

శంకుస్థాపన కార్యక్రమం

నేడే రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 28 స్కూళ్లకు శంకుస్థాపన





ప్రత్యేకతలు..

- నాలుగు నుండి పన్నెండో తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన
- అత్యాధునిక వసతులతో దాదాపు 25 ఎకరాలలో ఒక్కో స్కూల్ నిర్మాణం
- కుల, మత, వర్గ అంతరాలు లేని విద్యా సౌధం
- డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, 5 వేలకు పైగా పుస్తకాలతో లైబ్రరీలు
- క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్ & బాస్కెట్‌బాల్, టెన్నిస్ కోర్టులు

ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభాపక్ష నేతగా

ఒమర్ అబ్దుల్లా ఎన్నిక



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 42 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) శాసనసభాపక్ష నేతగా ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ విషయాన్ని ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా గురువారం వెల్లడించారు. 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూకశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమి 48 సీట్లు గెలుచుకుంది. తాజాగా ఎన్‌సీకి నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. 29 స్థానాలు గెలుచుకున్న భాజపాకు.. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు.

శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ దాడి


● గాజాలో 27 మంది దుర్మరణం

డెయిర్ అల్‌-బలా: గాజాలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరంపై గురువారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 27 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మరణించిన వారిలో ఒక చిన్నారి, ఏడుగురు మహిళలున్నారు. మృతదేహాలు ముక్కలుగా కనిపించాయి. అందులో మిలిటెంట్లు ఉన్నారని, అందుకే దాడి చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

● ఎర్ర సముద్రంలో గురువారం ఓ నౌకపై హూతీలు వరుస దాడులు చేశారు. లైబీరియా జెండాతో వెళ్తున్న కెమికల్ ట్యాంకర్‌గా దీనిని గుర్తించారు. అయితే హూతీల దాడుల కారణంగా ఎటువంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు.

● లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇద్దరు సహాయక ప్రతినిధులు గాయపడ్డారని ఐక్యరాజ్య సమితి గురువారం వెల్లడించింది.

● బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 11 మంది మృతి చెందగా.. 48 మంది గాయపడ్డారు.



ఆ విశ్వాసాన్ని కోల్పోకండి

మీరు జీవితంలో ఎన్నో కష్టాలు చవిచూస్తూ ఉండొచ్చు. ప్రపంచంలోని అన్ని సమస్యలనూ మీరు పరిష్కరించలేకపోవచ్చు. కానీ ఆత్మస్థైర్యంతో ప్రయత్నిస్తే మీరు కూడా ఏదైనా సాధించగలరన్న విశ్వాసాన్ని ఎప్పటికీ కోల్పోకండి.

– రతన్ టాటా

ఆసియా భవితకు

ఆసియాన్‌తో సంబంధాలు కీలకం

- ఆ 10 దేశాలతో భాగస్వామ్య బలోపేతానికి 10 సూత్రాల ప్రణాళిక
- భారత్‌-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రకటన

దిల్లీ, వియంటియాన్: భారత్‌-ఆసియాన్ మధ్య సమగ్ర భాగస్వామ్య బలోపేతానికి 10 సూత్రాల ప్రణాళికను ప్రధాని మోదీ ప్రకటించారు. ఆసియా భవిష్యత్తుకు ఈ ప్రాంతీయ దేశాల కూటమితో సంబంధాలు కీలకమని వ్యాఖ్యానించారు. లావోస్ రాజధాని వియంటియాన్‌లో గురువారం జరిగిన 21వ భారత్‌-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. గత దశాబ్దకాలంలో భారత్‌-ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం రెట్టింపై 130 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. భాగస్వామ్య ఆర్థిక సామర్థ్య వినియోగానికి వస్తు వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షిస్తామని వెల్లడించారు. నలంద విశ్వవిద్యాలయంలో చేరే ఆసియాన్ దేశాల విద్యార్థుల ఉపకార వేతనాల సంఖ్యను రెట్టింపు చేస్తామని, భారత్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే ఆ దేశాల విద్యార్థుల కోసం కొత్త నిధులందిస్తామన్నారు.

21వ శతాబ్దం ఆసియా దేశాలదే

'21వ శతాబ్దాన్ని ఆసియా శతాబ్దంగా భావిస్తున్నా. ఈ శతాబ్దం భారత్, ఆసియా దేశాలదే' అని ఆసియాన్ దేశాలైన మలేసియా, థాయ్‌లాండ్, బ్రూనై, కంబోడియా, ఇండోనేసియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, వియత్నాం, లావోస్, సింగపూర్ నేతలను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. ఆసియాన్ దేశాలతో భారత్‌కు గల చారిత్రక సంబంధం ఊపందుకోవడానికి, వాటి మధ్య నూతన శక్తి, దిశలను నిర్దేశించిన యాక్ట్ ఈస్ట్ పాలసీ 10వ వార్షికోత్సవాన్ని భారత్ జరుపుకొంటోందన్నారు. ''భారత్‌-ఆసియాన్ సదస్సు ఫలవంతమైన వేదిక. భారత్‌కు ఆయా దేశాలతో గల సమీకృత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మేం చర్చించాం. సాంస్కృతిక అనుబంధాలు, సాంకేతిక సహకారం, అనుసంధానత వంటి రంగాలతో సహా వాణిజ్య సంబంధాలను దృఢతరం చేసుకోవాలని భావిస్తున్నాం'' అని సదస్సు అనంతరం మోదీ 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. ఆసియాన్‌-ఇండియా, తూర్పు ఆసియా సదస్సులకు హాజరయ్యేందుకు తాను చేపట్టిన లావోస్ పర్యటన ఆసియా దేశాలతో భారత్ సంబంధాలను మరింత సుదృఢం చేస్తుందని వియంటియాన్‌కు బయలుదేరేముందు ప్రధాని మోదీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరత, పురోభివృద్ధి ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించేందుకు తూర్పు ఆసియా సదస్సు అవకాశం కల్పిస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు.



వియంటియాన్‌లో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న లావోస్ ప్రధాని సిఫాన్‌డన్. చిత్రంలో ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

లావోస్ రామాయణ ప్రదర్శనను వీక్షించిన మోదీ

ఆసియాన్‌-ఇండియా, తూర్పు ఆసియా సదస్సులకు హాజరయ్యేందుకు తన రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం లావోస్ చేరుకున్న మోదీకి ఆ దేశ హోంమంత్రి విలయ్‌వాంగ్ బౌద్ధఖామ్ హార్దిక స్వాగతం పలికారు. అనంతరం హోటల్‌లో భారత సంతతికి చెందిన ప్రజలు మోదీతో ముచ్చటించారు. అటుపై మోదీ లావోస్ రామాయణం 'ఫ్రాలక్ ఫ్రాలం' ప్రదర్శనను వీక్షించారు.

నాయకుల స్వార్థం వల్లే ఓటమి

హరియాణా ఫలితాలపై కాంగ్రెస్ సమీక్షలో వెల్లడైన అభిప్రాయాలు



దిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ వాస్తవాల వెలికితీతకు నిజనిర్ధారణ కమిటీని నియమించాలని నిర్ణయించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో దిల్లీలో గురువారం నిర్వహించిన సమావేశంలో అగ్రనేత రాహుల్‌గాంధీ, సీనియర్లు కేసీ వేణుగోపాల్, అశోక్ గహ్లోత్, అజయ్ మాకన్ తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీలో హరియాణా వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపక్ బాబరియా అనారోగ్యం వల్ల వర్చువల్‌గా భేటీకి హాజరయ్యారు. హరియాణా నేతలైన ఉదయ్ భాన్, భూపీందర్ సింగ్ హుడ్డా తదితరులను ఆహ్వానించలేదని తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణం రాష్ట్ర నేతల్లో ముఠాతత్వం, పార్టీకన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం, ప్రాయోజిత తిరుగుబాటు అభ్యర్థులని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల వారీగా ఎదురైన సమస్యలను తెలుసుకునేందుకు నిజనిర్ధారణ కమిటీని నియమించాలని భేటీలో నిర్ణయించారు. పార్టీ అభ్యర్థులందరి అభిప్రాయాలను ఈ కమిటీ తెలుసుకుంటుందని ఏఐసీసీ నేత ఒకరు వెల్లడించారు.

దిల్లీలో రూ.2,080 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

దిల్లీ: పశ్చిమ దిల్లీలోని ఓ అద్దె దుకాణంలో దాచిపెట్టిన రూ.2,080 కోట్ల విలువైన 208 కేజీల కొకైన్‌ను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. 'టేస్టీ ట్రీట్' అండ్ 'చట్‌పటా మిక్చర్' అని రాసున్న చిరుతిళ్ల ప్లాస్టిక్ సంచుల్లో నిందితులు కొకైన్‌ను దాచిపెట్టారు. రమేశ్‌నగర్ ప్రాంతంలోని ఓ చిన్న దుకాణం నుంచి సరకును స్వాధీనం చేసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు ఒకరు ఈ సరకును దాచిపెట్టాడని, ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని వెల్లడించారు. ఈ సరకును దేశంలోని వివిధ ప్రాంతాలకు రవాణా చేయాలని నిందితుడు భావించాడని, పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరారయ్యాడని వివరించారు.

కేంద్ర ఉద్యోగులకు అనుత్పాదకత ఆధారిత బోనస్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న గ్రూప్‌-సి ఉద్యోగులు, గ్రూప్‌-బి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను 30 రోజుల భత్యాలకు సమానమైన అనుత్పాదకత ఆధారిత (నాన్ ప్రొడక్టివిటీ లింక్డ్) బోనస్ ప్రకటించారు. కేంద్ర ఆర్థికశాఖ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ పరిధిలోకి రాని గ్రూప్ సి, బి ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. గరిష్ఠంగా నెలకు రూ.7 వేల భత్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ బోనస్‌ను లెక్కిస్తారు. కేంద్ర పారామిలిటరీ, సాయుధ దళాల్లో పనిచేస్తున్న అర్హులైన సిబ్బందికీ ఇది వర్తిస్తుంది. 2024 మార్చి 31 నాటికి సర్వీసులో ఉండి, 2023-24 ఆర్థిక సంవత్సరంలో వరుసగా కనీసం ఆరు నెలలు పనిచేసిన వారు ఇందుకు అర్హులు. పనిచేసిన కాలాన్ని అనుసరించి చెల్లింపులు చేస్తారు. దీని ప్రకారం అర్హులైన ఉద్యోగులకు సగటున రూ.6,908, ఏటా 240 రోజుల చొప్పున వరుసగా మూడేళ్లు పనిచేసిన క్యాజువల్ లేబర్‌కు రూ.1,184 బోనస్ దక్కే అవకాశం ఉంటుంది.

పారిశ్రామిక.. సేవారత్నం

రతన్ టాటాకు ప్రముఖుల నివాళి



దిల్లీ: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా (86) మృతికి యావద్దేశం నివాళులు అర్పించింది. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్రమంత్రులు, సినీ ప్రముఖులు భారత పారిశ్రామిక రంగానికి రతన్‌జీ అందించిన సేవలను, వివిధ ఛారిటబుల్ ట్రస్టుల ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు.

వ్యాపారవేత్తలకు సదా ప్రేరణ..

భారతీయ పారిశ్రామికరంగంలో రతన్ టాటా మహోన్నతమైన వ్యక్తి. స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించడంలో ఆయన సహకారం దేశ, విదేశాల వ్యాపారవేత్తలకు ఎప్పటికీ ప్రేరణగా ఉంటుంది. శాశ్వతమైన వారసత్వాన్ని మిగిల్చి వెళుతున్న ఆయన మరణం భారత్‌కు తీరని లోటు.

– జగదీప్ ధన్‌ఖడ్, ఉపరాష్ట్రపతి

రతన్‌జీ దార్శనికత స్ఫూర్తిదాయకం

దేశం ఒక గొప్ప పారిశ్రామికవేత్తను, సామాజిక సేవకుణ్ని కోల్పోయింది. భారతీయ పారిశ్రామికరంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చిన రతన్ టాటా నిస్వార్థంతో కూడిన తన సేవాగుణం, దాతృత్వంతో సమాజంలోని అన్ని వర్గాలను ప్రభావితం చేశారు. ఆయన నిరాడంబరత, దార్శనికత, సేవాస్ఫూర్తి యుగ యుగాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతాయి.

– ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్

పాలకులతో నిక్కచ్చిగా మాట్లాడగల ధైర్యశాలి

భారతీయ పారిశ్రామికరంగంలో రతన్ టాటా ఓ దిగ్గజం. అధికారంలో ఉన్నవారితోనూ నిక్కచ్చిగా మాట్లాడగల ధైర్యమున్న వ్యక్తి. ఓ వ్యాపారవేత్త కన్నా విస్తృతమైన వ్యక్తిత్వం తన సొంతం. ఆయన దృక్పథం, మానవీయత టాటా గ్రూపు నడుపుతున్న పలు సేవాసంస్థల్లో ప్రస్ఫుటం అవుతాయి.

– మన్మోహన్‌సింగ్, మాజీ ప్రధాని

అందుకే.. టాటా గ్రూపంటే ఎక్కువ ఇష్టం

భారతీయ వ్యాపారసంస్థల్లో టాటా గ్రూపు అంటే నాకు ఎక్కువ ఆరాధనాభావం. అపారమైన అంకితభావం, స్పష్టమైన దృక్పథం, సమగ్రతలతో రతన్ టాటా ఈ గ్రూపును దశాబ్దాల తరబడి కీర్తి శిఖరాలవైపు నడిపారు. నాకు 'భారతరత్న' ప్రకటించాక ఈ ఏడాది ఫిబ్రవరిలో రతన్ టాటా నుంచి స్నేహపూర్వకమైన లేఖ అందుకొన్నా.

– ఎల్.కె.అడ్వాణీ, మాజీ ఉప ప్రధాని

ఆయన చిరంజీవి

రతన్ టాటా దిగ్గజ పారిశ్రామికవేత్త, నిజమైన జాతీయవాది. అన్ని నిబంధనలు పాటిస్తూనే టాటా గ్రూపు పనితీరులో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. టాటా ట్రస్టులు పలు రంగాల్లో గణనీయమైన సేవా కార్యక్రమాలు చేస్తున్నాయి. టాటాల వారసత్వం రాబోయే తరాల వ్యాపారవేత్తలకు స్ఫూర్తిదాయకం. రతన్‌జీ భౌతికంగా దూరమైనప్పటికీ.. మనందరి హృదయాల్లో ఎప్పటికీ జీవించే ఉంటారు.

– అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

సామాజిక నాయకుడు రతన్ టాటా

జాతి గర్వించదగ్గ వ్యక్తి రతన్ టాటా. గత మూడు దశాబ్దాలుగా ఆయనతో నాకు వ్యక్తిగత, సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, ఉపాధి కల్పనకు ఎనలేని కృషి చేశారు. తన వ్యాపార చతురతకు అతీతంగా సమాజంలో ఎంతోమందిని ప్రభావితం చేసిన సామాజిక నాయకుడు.

– నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి

నైతిక వ్యాపార పద్ధతులు పాటించారు

భారత సమాజంపై చెరగని ముద్ర వేసిన అద్భుత నాయకుడు రతన్ టాటా. కొత్త ఆవిష్కరణలపై ఆయన చూపిన ఆసక్తి, అనుసరించిన నైతిక వ్యాపార పద్ధతులు, పాటించిన సామాజిక బాధ్యత మన పారిశ్రామికరంగాన్ని ఎంతో ప్రభావితం చేశాయి.

– నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థికమంత్రి

వ్యాపార, సేవారంగాల్లో చెరగని ముద్ర

అవిశ్రాంత కృషి, ప్రగతిశీల విధానాలతో భారత పారిశ్రామికరంగాన్ని రతన్ టాటా కొత్త శిఖరాలకు చేర్చారు. మానవాళికి సేవ చేయడంలో ఆయన సృష్టించిన అపూర్వమైన ఒరవడి కొన్ని శతాబ్దాలు స్ఫూర్తి రగిలిస్తుంది. ఇటు వ్యాపారం, అటు దాతృత్వం రెండింటిలోనూ శాశ్వతమైన ముద్ర వేసిన వ్యక్తి.

- రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత.. ప్రియాంకాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి

రతన్ టాటా నాకు దిక్సూచి

ప్రియమైన మిత్రుడిని కోల్పోయినందుకు బాధగా ఉంది. నైతికపరమైన అంశాల్లో నాలో సందిగ్ధత, గందరగోళం నెలకొన్నపుడల్లా రతన్ టాటా ఓ దిక్సూచిగా నిలిచారు.

– నారాయణమూర్తి, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు

ఈనాడు
హైదరాబాద్ 11-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 62
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




BAJAJ ELECTRONICS
LG Life's Good.
Light up this Diwali with exciting offers on the LG Objet Collection with MoodUP Refrigerator Series and let your mood set the vibe.
CELEBRATION OFFERS
INSTANT CASHBACK UP TO ₹45,000*
FIXED EMI Starting from ₹9999
0 DOWN PAYMENT
FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000
SAMSUNG
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
Upgrade to AI - Powered French Door & Side by Side refrigerators and enjoy amazing Offers
20% CASHBACK upto ₹20,000*
EMI Starting ₹3990/-*
20 Year Warranty**
Haier
VICTORIES START WITH rama, CELEBRATION STARTS WITH HAIER
OPEN DOOR TO MORE WITH 3-DOOR CONVERTIMAX SIDE BY SIDE REFRIGERATOR
EXCITING OFFERS
20% INSTANT DISCOUNT
18 MONTHS LONG TENURE
0 DOWN PAYMENT
2 Years Complete Warranty on Product & 10 Years on Compressor
BOSCH Invented for life
India's only* flexible refrigerator for its diverse needs.
Flexible #LikeABosch
₹6,000* Instant discount on selected models.
Fixed EMI ₹2,501* 300L and Above
EASY EMI 8/0 | 10/2 and 12/4
0 Attractive Finance Offer
Whirlpool
Dhamaal OFFER
OFFERS AVAILABLE
0* DOWN PAYMENT
UP TO 15% CASHBACK* WITH
LOW COST EMI*
REFRIGERATOR
RANGE STARTS FROM ₹12,490/-*
LG SAMSUNG Haier Whirlpool BOSCH
SPLIT AC RANGE STARTS FROM ₹29,990/-*
ATTRACTIVE CASHBACK*
NO COST EMI*
INSTALLATION FREE*
LG LLOYD DAIKIN BLUE STAR SAMSUNG Haier GENERAL
LG
Light up this Diwali by bringing home the New Form of Laundry with exciting offers on LG WashTower.
CELEBRATION OFFERS
CASHBACK UP TO 20%*
Max up to ₹12000/-*
(Applicable on 10 kg and Above Select Models)
SAMSUNG
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
NEW ARRIVAL
No load too big
Bespoke AI™ Laundry now available in 12kg.
WW12DB8B54GBTL
MRP ₹ 74990
Special Offer Price ₹ 59000
20% cashback of up to ₹8,000*
EMI Starting @ ₹ 2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
ULTIMATE WASHING ASSURANCE WITH 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0* DOWN PAYMENT
FIXED EMI STARTING ₹994*
20% CASH BACK
5 YEARS WARRANTY*
iPhone
iPhone 13 (128 GB) MRP ₹49,900/- EFFECTIVE PRICE ₹22,900/-* per day EMI ₹34
iPhone 15 (128 GB) MRP ₹69,900/- EFFECTIVE PRICE ₹26,500/-* per day EMI ₹42
iPhone 16 (128 GB) MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹36,900/-* per day EMI ₹57
iPhone 16 Plus (128 GB) MRP ₹89,900/- EFFECTIVE PRICE ₹46,900/-* per day EMI ₹71
24 Months - No Cost EMI
SAMSUNG
Galaxy Fold6 12GB + 256GB MRP ₹1,64,999/- EFFECTIVE PRICE ₹1,52,499/-*
S24 Ultra 12GB + 256GB MRP ₹1,29,999/- EFFECTIVE PRICE ₹1,09,999/-*
A55 5G 8GB + 256GB MRP ₹42,999/- EFFECTIVE PRICE ₹36,999/-*
Galaxy Flip6 12GB + 256GB MRP ₹1,09,999/- EFFECTIVE PRICE ₹98,999/-*
S24 8GB + 256GB MRP ₹79,999/- EFFECTIVE PRICE ₹64,999/-*
A35 5G 8GB + 128GB MRP ₹30,999/- EFFECTIVE PRICE ₹25,999/-*
Samsung Care+ @ 999/-*
*Price Including Upgrade / Cashback
vivo
V40e AVAILABLE NOW 8GB + 128GB MRP ₹33,999/- EFFECTIVE PRICE ₹26,100/-*
Y28s 4GB + 128GB MRP ₹17,999/- EFFECTIVE PRICE ₹12,499/-*
Effective Price Includes Cashback & Offers*
oppo
F27 5G 8GB + 128GB MRP ₹27,999/- EFFECTIVE PRICE ₹18,999/-*
A3 Pro 5G 8GB + 128GB MRP ₹20,999/- EFFECTIVE PRICE ₹16,499/-*
Effective Price Includes Cashback & Offers*
mi
Redmi Note 13 5G 6GB + 128GB MRP ₹20,999/- EFFECTIVE PRICE ₹14,999/-*
Redmi 13 C 5G 6GB + 128GB MRP ₹15,999/- EFFECTIVE PRICE ₹10,499/-*
*Effective Price Includes Cashback & Offers
OnePlus Nord CE4 8GB + 128GB RANGE STARTS FROM ₹21,499/-*
OnePlus Nord CE4 Lite 8GB + 256GB RANGE STARTS FROM ₹19,999/-*
*inclusive of bank discount and offers
WIDEST RANGE OF LAPTOPS
ASUS VIVOBOOK 15 MRP ₹44,990 OFFER PRICE ₹32,990* EMI - ₹3,666
DELL INSPIRON 3530 MRP ₹74,397 OFFER PRICE ₹58,490* EMI - ₹6,499
FREE BAG*
Get ₹5,990 worth Accessories @ ₹1,990 only
₹10,000/-* CASHBACK
1 EMI FREE*
0 DOWN PAYMENT*
Applicable from 2nd Oct to 13 Oct 2024
HP Fest-O-Mania OFFER Pay 299 and get VIP Trolly Bag of worth ₹9500/-*
Lenovo SLIM 5 83DA0043IN MRP ₹1,11,890 OFFER PRICE ₹83,490* EMI - ₹6,958
GAMING LAPTOP
VICTUS FA0333TX MRP ₹86,050 OFFER PRICE ₹73,490* EMI - ₹4,899
Mac Book Air M2 256GB EFFECTIVE PRICE ₹60,000* Per Day EMI ₹89
Mac Book Air M3 256GB EFFECTIVE PRICE ₹72,000* Per Day EMI ₹112
24 Months - No Cost EMI
బజాజ్ ఎలక్ట్రానిక్స్
ఎ.ఎస్.రావు నగర్ | అబిడ్స్ | అత్తాపూర్ పిల్లర్ నెం. 138 | బాలాపూర్ | బంజారా హిల్స్ | బి.ఎన్ రెడ్డి నగర్ | బోడుప్పల్ | చందా నగర్ | చాంద్రాయణగుట్ట | చింతల్ | దిల్‌సుఖ్‌నగర్ | ఈసీఐఎల్ | గచ్చిబౌలి | హబ్సిగూడ | హయత్‌నగర్ | హిమాయత్ నగర్ | ఇబ్రహీంపట్నం | ఇనార్బిట్ మాల్ | జూబ్లీ హిల్స్ | కర్మన్‌ఘాట్ | కొంపల్లి | కొండాపూర్ | కొత్తపేట్ | కూకట్‌పల్లి | లక్డీ-కా-పూల్ | ఎం.జి. రోడ్ | మదీనగూడ | మలక్‌పేట్ | మేడ్చల్ | మియాపూర్ | నార్సింగి | నాచారం | నాగోల్ | నల్లకుంట | నెక్సస్ హైదరాబాద్ మాల్ | నిజాంపేట | పంజాగుట్ట | పటాన్‌చెరు | పీట్ బషీరాబాద్ | రాజేంద్రనగర్ పిల్లర్ నెం. 215 | రామంతపూర్ | ఆర్.సి పురం | ఆర్.టి.సి 'X' రోడ్ | షా అలీ బండ | షేక్‌పేట్ | శంషాబాద్ | ఎస్.ఆర్ నగర్ | సన్ సిటీ | టోలిచౌకి | తుర్కయాంజాల్ | వనస్థలిపురం | విక్రమ్‌పురి
iQ Authorised Reseller
ATTAPUR 80085 37766 | MADHAPUR 73374 97772 | KURNOOL 91004 43871 | RAJAHMUNDRY 91003 21863
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in

ఈనాడు

హైదరాబాద్ 11-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 62

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కొత్త టీచర్ల కోసం సీనియర్ల ఎదురుచూపులు


- వారొస్తే 7 వేల మంది రిలీవ్
- డీఈఓ కార్యాలయాల్లో రిపోర్ట్ చేసిన నూతన ఉపాధ్యాయులు

6లో

'యూబిట్' దందాపై ఈడీ నజర్

- కేసు వివరాల కోసం నిర్మల్ పోలీసులకు లేఖ
- క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట ముఠా మోసం
- నిర్మల్ ప్రాంతంలో రూ.50 కోట్లు వసూలు

విలువల రత్నమా.. వీడుకోలు



పారిశ్రామిక జగజ్జేతకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

తరలివచ్చిన ప్రముఖులు • వేల మంది ప్రజల నివాళి • ప్రపంచ దేశాల సంతాపం



టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం తరలిస్తున్న పోలీసులు

విలువల వారధి రతన్ టాటాకు దేశం సవినయ వీడ్కోలు పలికింది. టాటా పారిశ్రామిక సామ్రాజ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చిన అతిరథుడికి అనమాన నివాళులర్పించింది. మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మానవతా మూర్తికి మనఃపూర్వక శ్రద్ధాంజలి ఘటించింది. అతి సాధారణ జీవితాన్ని గడిపిన అసామాన్యుడికి ఆబాలగోపాలం పుష్పాంజలి అర్పించింది. మహామహులు, వేల మంది అభిమానుల సమక్షంలో దివికేగిన ఆ అసాధారణ భారతీయుడిని దేశం మనసులో పదిలపరుచుకుంది. అందుకే రతన్ టాటా ఎప్పటికీ చిరంజీవే..

ముంబయి: ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం.. మానవతా శిఖరం.. పద్మ విభూషణ్ రతన్ టాటా అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముంబయిలోని వర్లి శ్మశాన వాటికలో అధికార లాంఛనాలతో జరిగాయి. పోలీసుల గౌరవ వందనం, కుటుంబ సభ్యులు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయల్, తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఏక్‌నాథ్ శిందే, భూపేంద్ర పటేల్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, ఏపీ మంత్రి లోకేశ్ తదితర ప్రముఖుల మధ్య వేల మంది ఆయనకు తుది వీడ్కోలు పలికారు. పార్సీ సంప్రదాయ పూజల అనంతరం రతన్ టాటా అంత్యక్రియలు పూర్తిచేశారు. 86 ఏళ్ల పారిశ్రామిక టైటాన్ రతన్ టాటా వృద్ధాప్య సమస్యల కారణంగా సోమవారం ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. తొలుత రతన్ టాటా పార్థివ దేహాన్ని గురువారం ఉదయం కొలాబాలోని ఇంటి నుంచి దక్షిణ ముంబయిలోని నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు (ఎన్‌సీపీఏ) తరలించారు.

...మిగతా 5లో

పనితో పెళ్లి... మంచికి తాళి!

- రతన్ టాటా జీవిత ప్రస్థానంలో విశేషాలెన్నో

ఎయిరిండియాకు ఊపిరులూదిన పైలట్

నలిగిపోతున్న పిల్లల కోసం 'నానో' కారు

కార్పొరేట్ కర్మయోగి

వారసుడు.. నోయల్ టాటా?

ప్రత్యేక కథనాలు 8, 9, 10 పేజీల్లో



సైబర్ నేరగాళ్లకు ఏఐతో కళ్లెం!

- రంగంలోకి బ్యాంకులు, సెల్‌ఫోన్ సంస్థలు

ఈనాడు, హైదరాబాద్: సామాన్యుల నుంచి సంపన్నుల దాకా.. పల్లెల నుంచి నగరాల దాకా.. ప్రజలకు మాయమాటలు చెప్పి.. భయపెట్టి, బెదిరించి.. వివిధ మార్గాల్లో నిలువునా లూటీచేస్తున్న సైబర్ నేరగాళ్లను అదుపుచేసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు జరపడం కంటే నేరం జరగకుండా జాగ్రత్తపడటం ముఖ్యం. ఇంతవరకు పోలీసులు మాత్రమే ఇలాంటి బాధ్యత తీసుకోగా ఇప్పుడు సెల్‌ఫోన్ ప్రొవైడర్లు, బ్యాంకులు రంగంలోకి దిగాయి. సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు కృత్రిమమేధ (ఏఐ) సాయంతో ప్రత్యేక ప్రోగ్రామ్స్ సిద్ధం చేస్తున్నాయి. కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 కోట్ల అనుమానాస్పద కాల్స్ గుర్తించామని ఎయిర్‌టెల్ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీన్నిబట్టి సైబర్ నేరగాళ్లు ఏ స్థాయిలో విరుచుకుపడుతున్నారో అర్థమవుతోంది. ఈ ఏడాది మొదటి 9 నెలల్లో ఒక్క తెలంగాణలోనే సైబర్ నేరగాళ్లు దాదాపు రూ. 1,500 కోట్లు దోచుకున్నారు.

...మిగతా 5లో

సమైక్య భావం.. సమీకృత గురుకులం

- కులమతాలకు అతీతంగా అందరికీ ఒకే చోట విద్యాభ్యాసం, వసతి
- నేడు 28 నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు
- షాద్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మధిరలో డిప్యూటీ సీఎం భట్టి శ్రీకారం



రాష్ట్ర ఆదాయ వనరులపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, రెవెన్యూ మంత్రి పొంగులేటి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పేదలందరికీ ఒకచోట అంతర్జాతీయస్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మించనుంది. తొలిదశ కింద 28 నియోజకవర్గాల్లో గురుకులాల నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కొందుర్గులో సీఎం రేవంత్‌రెడ్డి, ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురుకులాలకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో తొలిదశ కింద 28 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేస్తూ బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల్లోని పేద విద్యార్థుల్లో కులమత భేదాలకు అతీతంగా సోదరభావం పెంచేలా అందరికీ ఒకేచోట భోజన ఏర్పాట్లు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. సంబంధిత జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రుల ఆమోదంతో శంకుస్థాపన కార్యక్రమాలను వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు ఆయా జిల్లాల్లో ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని సూచించారు. రెండోదశలో నిర్మించే నియోజకవర్గాల పరిధిలో భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

శంకుస్థాపనలు జరిగే నియోజకవర్గాలు

కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్హాపూర్, అందోలు, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల,

...మిగతా 5లో

బడ్జెట్ లక్ష్యం మేరకు రాబడి ఉండాలి

- గట్టి ప్రయత్నం చేయండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

5లో

17,500 మంది బాధితులు.. రూ.229 కోట్ల మోసం

- పెట్టుబడుల పేరుతో డీకేజడ్ టెక్నాలజీస్ టోకరా
- సంస్థ ఎండీ, ఆయన భార్య అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



డీకేజడ్ సంస్థ ప్రచార పత్రం

ఈనాడు, హైదరాబాద్: రూ.లక్ష పెట్టుబడికి రూ.లక్ష లాభం ఇస్తామంటూ వేల మందిని ముంచిన వైనమిది. డీకేజడ్ టెక్నాలజీస్, డికాజో సొల్యూషన్స్ పేర్లతో ప్రజలకు టోకరా వేశారు. వాటి ఎండీ సయ్యద్ అఫ్సఖ్ రాహిల్, అతడి భార్య డైరెక్టర్ సయీదా అయేషాను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితులు.. 17,500 మందిని రూ.229 కోట్ల మేర మోసగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

...మిగతా 6లో

కొండా సురేఖకు కోర్టు నోటీసులు

- నాగార్జున పిటిషన్‌పై న్యాయస్థానం చర్యలు
- మంత్రిపై చర్యలు తీసుకోవాలంటూ తాజాగా న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున వేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్‌పై నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ కేసులో వివరణ ఇవ్వాలని ఆమెకు న్యాయస్థానం నోటీసులు పంపింది. విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. మరోపక్క సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ గురువారం నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

...మిగతా 5లో


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
బంగారు ఆభరణాల కొనుగోలుపై
వెండి ఉచితం
ఆహా... దీపావళి
రూ.60,000 విలువగల వజ్రాభరణాల కొనుగోలుపై
బంగారు నాణెం ఉచితం
T&C apply
DEVIKA | వజ్రాలలో ప్రత్యేకమైన దీపావళి కలెక్షన్
రూ.1,86,000 నుంచి ప్రారంభం
రూ.2,45,000 నుంచి ప్రారంభం
రూ.3,52,000 నుంచి ప్రారంభం
20% తగ్గింపు వజ్రాలపై
7% తగ్గింపు ప్లాటినం ఆభరణాలపై
చైన్‌లకు తరుగు 4.99% నుంచి ప్రారంభం
Push360
బంగారం ఎక్స్ఛేంజ్
మీ పాత బంగారు ఆభరణాలను సరికొత్త BIS HUID హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో ఎక్స్ఛేంజ్ చేసుకోండి అధిక లాభాలతో
0% తరుగు వెండి ఆభరణాలకు
కారు గెలుచుకోండి
లక్కీ డ్రా ద్వారా
HYDERABAD: Greenlands Road, BEGUMPET, Ph: 040-23404567 | Madinaguda, CHANDANAGAR, Ph: 040-29802916
Chaitanyapuri Main Road, DILSUKHNAGAR, Ph: 040-24045916 | Kukatpally Main Road, KPHB COLONY, Ph: 040 - 23053916.
Shop online at www.josalukkasonline.com
ANDHRA PRADESH | TELANGANA | KARNATAKA | TAMIL NADU | PUDUCHERRY | KERALA
జోస్ ఆలుక్కాస్

తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి తుమ్మల




సభలో మాట్లాడుతున్న తుమ్మల, చిత్రంలో పొంగులేటి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: శక్తిమేర పనులు పూర్తిచేసి దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లి మార్కెట్ స్థలంలో గురువారం రాత్రి మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుమ్మల హాజరై మాట్లాడారు. ‘‘రైతుల కోసం బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించాం. రూ.18వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. ఇంకో రూ.13వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. వాటిని కూడా త్వరలోనే మాఫీ చేస్తాం. ఇటీవల వరదలకు పంట నష్టపోయిన అన్నదాతలకు బ్యాంకు ఖాతాలలో పరిహారం జమ చేస్తున్నాం. గతంలో పాలేరులో తాగు, సాగునీటి ఇబ్బందులుండేవి. వాటిని పరిష్కరించాం’’ అని వివరించారు.

అధికారం కోల్పోయాక వారికి పేదవారు గుర్తుకొస్తున్నారు: పొంగులేటి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఓ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తామని, శుక్రవారం రాష్ట్రంలో 31 నియోజకవర్గాల్లో వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేట్‌కి దీటుగా అక్కడ సదుపాయాలను కల్పిస్తామన్నారు. అధికారం కోల్పోయిన తరువాత భారాస వాళ్లకు పేదవారు గుర్తుకొస్తున్నారని విమర్శించారు. ఆర్వోఆర్ కొత్త చట్టం ద్వారా ధరణి ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న అర్హులైన పేదవారికి పట్టాలు ఇస్తామని వివరించారు. అనంతరం మార్కెట్ ఛైర్మన్‌గా బైరు హరినాథబాబు, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రకృతిని పరమేశ్వరి ప్రతిరూపంగా ఆరాధించడం భారతీయ సనాతన ధర్మంలో ఒక గొప్ప ఆచారమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పువ్వుల్ని పూజించడం తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయమని పేర్కొన్నారు. గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

సూర్యచంద్రులపై మలయప్పస్వామి అభయం

- నేడు రథోత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా కొనసాగాయి. ఉదయం సూర్యప్రభ వాహనంపై విహరించిన శ్రీనివాసుడు రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఉదయం చిరుజల్లులు కురవడంతో స్వామివారు ఘటాటోపం కింద బద్రి నారాయణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకరణతో కనువిందు చేశారు.

◆ ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం రథోత్సవం జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి రథోత్సవం ప్రారంభం కానుంది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య అశ్వ వాహన సేవ జరగనుంది. శనివారం ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య ఉత్సవాల ముగింపుగా ‘చక్రస్నానం’ క్రతువు నిర్వహించనున్నారు.



ఉత్తమ నాయకులు వారే..

తమ కన్నా తెలివైనవారిని సలహాదారులుగా, బృందసభ్యులుగా నియమించుకొని, వారితో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపేవారే ఉత్తమ నాయకులు.
– రతన్ టాటా

ఈనాడు


క్రాంతదర్శికి కన్నీటి వీడ్కోలు

'వస్తువులూ భౌతిక సుఖాలేవీ ముఖ్యమైనవి కావు. మీరు ప్రేమించిన వ్యక్తుల శ్రేయస్సే అన్నింటికన్నా ప్రధానం' అన్న రతన్ టాటా వ్యాఖ్యల్లో ఆ పద్మవిభూషణుడి జీవన దృక్పథమేమిటో అవగతమవుతుంది. సామాన్య జనభారతాన్ని ప్రేమించిన ఆయన- ప్రజల బాగోగుల కోసం అహరహరం తపించారు. టాటా గ్రూప్‌ను బహుముఖంగా అంతర్జాతీయంగా విస్తరించిన రతన్ దీక్షాదక్షతలెంత ప్రత్యేకమైనవో- సమాజం పట్ల ఆయన ఆపేక్ష అంత గొప్పది! అమెరికాలో ఆర్కిటెక్ట్‌గా స్థిరపడదామనుకున్న ఆయన అనుకోకుండా స్వదేశానికి తిరిగివచ్చారు. కార్మికులతో కలిసి పనిచేయడం మొదలు భిన్న ప్రదేశాల్లో విభిన్న బాధ్యతల నిర్వహణతో విస్తృతానుభవం గడించారు. టాటా గ్రూప్ పగ్గాలు చేపట్టాక కాలానికి తగినట్లు తమ వ్యాపార సంస్థలను పునర్ వ్యవస్థీకరించారు. ఇంటాబయటా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ గెలుపు శిఖరాలను అధిరోహించారు. 590 కోట్ల డాలర్లుగా ఉన్న గ్రూప్ ఆదాయాన్ని 10వేల కోట్ల డాలర్లకు చేర్చారు. ఇదంతా ఒక చరిత్ర! నిబద్ధత, దార్శనికత, అసాధారణ నైతిక నిష్ఠలతో అత్యున్నత విజయాలు సాధించిన ఓ అసామాన్యుడి స్ఫూర్తిగాథ! విశ్వజనీన విలువలకు కట్టుబడిన రతన్ జీవితం ఒక పాఠ్యాంశం... జాతి గుండెల్లో ఆయన స్థానమెప్పటికీ పదిలం!

'అవినీతికి పాల్పడలేదన్న ఆత్మసంతృప్తితో రోజూ రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోవాలనుకుంటాను' అని ఒక సందర్భంలో పేర్కొన్నారు రతన్ టాటా. వ్యాపారంలో నెగ్గుకురావడానికి ఎటువంటి అడ్డదారులు తొక్కడానికైనా వెనకాడని వాళ్లెందరో ఉన్న లోకంలో దేనికోసమూ తన నీతీ నిజాయతీలను వదులుకోని రతన్ వ్యక్తిత్వ సంపద వెలకట్టలేనిది. మంత్రి ఎవరికో రూ.15 కోట్లు ముట్టచెబితే వ్యాపార ప్రయోజనాలేవో లభిస్తాయని ఓసారి రతన్ టాటాకు సూచించాడొక మిత్రుడు. ఆయన దాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. లంచాలు ఇవ్వకపోవడంతో పలు వ్యాపారావకాశాలను పోగొట్టుకున్నా సరే- నమ్మిన సిద్ధాంతాలకు తిలోదకాలివ్వలేదని రతన్ స్వయంగా సగర్వంగా చెప్పారు. కాంట్రాక్టుల్లో అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం తదితరాలను ఆయన తీవ్రంగా విమర్శించేవారు. ప్రజలకు, దేశానికీ చేటుచేసే అవినీతిని అసహ్యించుకునే రతన్- తప్పుడు మార్గాల్లో కోట్లు కూడబెట్టేవారి పట్ల తనకంత గౌరవభావం ఉండదనేవారు. కార్పొరేట్ ప్రపంచంలో అరుదైన ఆ లక్షణాలే ఆయనను ఆసేతుహిమాచలానికి ఆప్తుణ్ని చేశాయి. అందుకే ఆయన మరణవార్త తెలియగానే యావద్దేశం కన్నీటి సాగరంలో మునిగిపోయింది!

'తమకంటే తెలివైన సహాయకులు, సహచరులను దగ్గరకు తీసేవారే ఉత్తమ నాయకులు' అన్నది రతన్ టాటా నిశ్చితాభిప్రాయం. తమ వ్యాపార సంస్థల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ఆయన చొరవ- నిపుణ మానవ వనరుల సృష్టికి బాటలు పరచింది. పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ వంటి యాభై స్టార్టప్‌లకు ఆర్థిక దన్నుగా నిలబడిన రతన్- భారతావని ఆర్థిక ప్రగతిలో కీలక భాగస్వామి అయ్యారు. సామాన్యుల అవసరాలను తీర్చడమే ప్రధానాశయంగా వివిధ ఉత్పత్తులకు ప్రాణంపోసిన ఆయనకు వినియోగదారుల సంతృప్తే పరమ ప్రమాణం. 'భావితరాల కోసం ప్రపంచాన్ని మరింత సురక్షితంగా మార్చడంపై మనమందరం దృష్టి సారించాలి' అన్నది రతన్ టాటా ప్రబోధం. అందులో భాగంగా పర్యావరణ పరిరక్షణకు విశేషంగా కృషిచేశారు. విద్య, వైద్యం, పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్య వసతులు, శాస్త్ర సాంకేతికతలను అందరికీ చేరువ చేసేందుకు శ్రమించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అభివృద్ధికి తోడ్పాటునందించారు. వితరణశీలిగా రతన్ ఖ్యాతి జగద్విఖ్యాతం. సమ్మిళిత ప్రగతిని స్వప్నించిన ఆయన నిక్కమైన భారతరత్నం!

ఎంత చదివామన్నది ముఖ్యం కాదు, ఎంత లోతుగా ఆలోచించగలుగుతున్నామన్నది ముఖ్యం. అప్పుడే మనం ఎంత నేర్చుకున్నామో తెలుస్తుంది. ఆలోచనలే సరికొత్త ప్రయత్నాలకూ ఆవిష్కరణలకూ దారితీస్తాయి.



– సిస్టర్ నివేదిత

బాలికలతోనే... భవిత!

ఆడపిల్లల హక్కులూ నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి చర్చించి తగిన చర్యలు తీసుకోవడానికి వీలుగా ఏటా అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది ఐక్యరాజ్యసమితి. ఈ దినోత్సవానికి ఈ ఏడాది ఎంచుకున్న అంశం- భవిష్యత్తు వైపు అమ్మాయిల చూపు.



దేశ భవితే కాదు, వర్తమానమూ బాలికలదే. వారి కలలకు సమాజాన్ని మార్చగల శక్తి ఉంది. ఆ కలలను సాకారం చేసుకునే అవకాశాన్నివ్వండి. బాలికల సాధికారత ఒక లక్ష్యం మాత్రమే కాదు, సమానత్వ సాధనకి అది అవసరం... అంటుంది జాతీయ బాలికా దినోత్సవ నినాదం. మనదేశమే కాదు, ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు బాలికా దినోత్సవాలను నిర్వహిస్తున్నాయి. వాటికి ఏటా ఒక థీమ్‌ని ఇస్తూ దిశానిర్దేశం చేస్తోంది సమితి ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ బాలికా దినోత్సవం. టీనేజ్ బాలికల భౌతిక, మానసిక, లైంగిక, పునరుత్పత్తి. ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయించడం ద్వారా భవిష్యత్తులో ఆర్థిక, సామాజిక రంగాల్లో పదింతలు లబ్ధి పొందవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యంగా అయిదు ప్రధాన రంగాల ద్వారా వారి సాధికారతకు కృషిచేయాలని ఐరాస సభ్య దేశాలకు పిలుపిచ్చింది. పందొమ్మిదేళ్లలోపు అమ్మాయిల ఆరోగ్యం, పోషకాహారం, చదువు, హింస నుంచి రక్షణ, స్వేచ్ఛ... ఈ అయిదింటినీ అత్యవసరంగా పట్టించుకోవాల్సిన అంశాలుగా పేర్కొంది.

ఇద్దరూ పిల్లలే!

తల్లీ బిడ్డా ఇద్దరూ పిల్లల లెక్కలోకి వచ్చే పరిస్థితి ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలోనూ కొనసాగడం అత్యంత దారుణమైన విషయం. పది- పందొమ్మిదేళ్ల మధ్య వయసు పిల్లలు అత్యధికంగా ఉన్న దేశం మనది. అలాంటి చోట టీనేజీ అమ్మాయిల్లో 8శాతం తల్లులుగా, గర్భిణులుగా ఉన్నారని అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొంది. నాలుగు నెలల వయసులో తనకు చేసిన పెళ్లిని రద్దు చేయమంటూ ఇరవయ్యేళ్ల యువతి కోర్టుకెళ్లి న్యాయం పొందిన ఘటన ఇటీవల వెలుగుచూసింది. ఇప్పటికీ ప్రతి నలుగురు వివాహితల్లో ఒకరు బాలికా వధువేనన్నది చేదు వాస్తవం. ప్రపంచవ్యాప్తంగా ఏటా రెండు కోట్లకు పైగా అమ్మాయిలు 19 ఏళ్లలోపే గర్భం దాల్చుతున్నారు. వారిలో సగానికి అది అవాంఛిత గర్భమేనంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ఏటా కొత్తగా హెచ్‌ఐవీ ఇన్‌ఫెక్షన్ సోకుతున్నవారిలో 90శాతం కౌమార బాలికలే. ఈ నేపథ్యంలో సర్వైకల్ క్యాన్సర్, హెచ్‌ఐవీ లాంటివి సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలి. తద్వారా ఆమెను ఆరోగ్యవంతురాలైన యువతిగా తీర్చిదిద్ది మాతృమరణాలకు ఆస్కారం లేకుండా చూడటం ఆయా దేశాల ప్రధాన కర్తవ్యం.

బాలికల ఆరోగ్యానికి సంబంధించి మరో పెద్ద సమస్య- రక్తహీనతకు దారితీసే పోషకాహార లోపం. సూక్ష్మపోషకాల లేమి వల్ల ప్రపంచవ్యాప్తంగా పందొమ్మిదేళ్ల లోపు బాలికలు దాదాపు అయిదు కోట్ల మంది తక్కువ బరువుతో ఉన్నారు. మరో పదికోట్ల మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. మనదేశంలో 56 శాతం అమ్మాయిలు పోషకాహార లోపం కారణంగా తలెత్తే రక్తహీనత బాధితులే. పిల్లలు ఇలా దీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడడం వల్ల వారి విద్య, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఆ పరిస్థితి లింగ సమానత్వానికి ప్రధాన ఆటంకంగా మారుతోంది. ఈ సమస్యల్ని అధిగమిస్తే లక్షలాది బాలికల ప్రాణాలు నిలవడమే కాదు, ఉత్పాదకత 17 శాతం పెరుగుతుంది.

ఒక్క ఏడాది...

సెకండరీ విద్యమీద ఒక్కో బాలికకు రోజుకు ఒకటిన్నర డాలరు చొప్పున ఖర్చు పెట్టగలిగితే 2030 నాటికి వర్ధమాన దేశాల జీడీపీ సగటున పదిశాతం పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మన దగ్గర బాత్‌రూములు లాంటి కనీస వసతులు లేకో, దగ్గర్లో కాలేజీ లేకో, ఆర్థిక పరిస్థితి అనుకూలించకో... పదో తరగతితో అమ్మాయిలు చదువు మానేయడం చాలా సహజం. బిడ్డల్ని కనడానికి ఒకరు, ఇంటిపనులు చేసి, ఊరికి దూరంగా ఉన్న కొండ కిందినుంచి నీరు మోసుకురావడానికి మరో ఇద్దరు- మొత్తం ముగ్గుర్ని పెళ్లి చేసుకోవడంలో తప్పులేదని భావించే పురుషులున్న దేశం మనది. సహజంగానే ఆ అమ్మాయిలు చదువు మానేసిన పేదింటి ఆడపిల్లలై ఉంటారన్నది సందేహం అక్కర్లేని వాస్తవం. కొన్నేళ్లపాటు ఆడపిల్లల్ని పుట్టనీయకుండా చేసిన పాపానికి ఇప్పుడు వారసుల కోసం ఇతర రాష్ట్రాలనుంచి అమ్మాయిల్ని కొని తెచ్చుకుని కొడుకుల పెళ్లిళ్లు చేస్తున్న పరిస్థితి కొన్ని ఉత్తరాది రాష్ట్రాలది. ఈ పరిస్థితుల్లో సెకండరీ విద్య ఒక్క ఏడాది పెరిగినా స్త్రీ శిశు ఆరోగ్యాల మీద ఎంతో ప్రభావం పడుతుందంటోంది యునెస్కో. తల్లులందరూ సెకండరీ విద్య పూర్తిచేసినట్లయితే టీనేజ్ ప్రెగ్నెన్సీలు 90శాతం, అయిదేళ్లలోపు శిశుమరణాలు 61శాతం తగ్గేవి. అమ్మాయిల సెకండరీ విద్య ఒక్క ఏడాది పెరిగితే వాళ్ల సంపాదన 25శాతం పెరుగుతుందని ప్రపంచబ్యాంకు నిపుణులు చెబుతున్నారు.

జెండర్ కారణంగా అమ్మాయిలు హింసకు గురవడం అన్నిదేశాల్లోనూ ఉంది. ఇటీవల లాన్సెట్‌లో ప్రచురితమైన సర్వే ప్రకారం పందొమ్మిదేళ్లలోపే వివాహబంధంలో ఉన్నవారిలో నాలుగోవంతు అమ్మాయిలు భాగస్వామి నుంచి భౌతిక, లైంగిక హింసను ఎదుర్కొంటున్నారు. బాలికా విద్య, హక్కుల చైతన్యం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో హింస ఎక్కువగా ఉంటోంది. మూడోవంతు అమ్మాయిలు భాగస్వామి చేతిలో హింస సహజమూ, సహించదగినదీ అని భావించడం శోచనీయం. ఈ ధోరణి మారాలంటే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, మంచి కౌన్సెలింగ్ వల్ల అమ్మాయిల మీదే కాదు, మొత్తంగా పిల్లలూ స్త్రీల మీద హింస తగ్గుముఖం పడుతుందని పలు అధ్యయనాలు నిరూపించాయి. బాలికల హక్కుల పరిరక్షణకూ, ఏ రంగంలోనైనా అవకాశాలను అందిపుచ్చుకుని వారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికీ ప్రధానంగా కావాల్సింది ఆర్థిక అండదండలు. దానికి తోడు ఆమె కోరుకున్నది చదువుకునే స్వేచ్ఛనివ్వాలి. నాణ్యమైన విద్య, కాలానుగుణమైన నైపుణ్యాలను అమ్మాయిలకు అందుబాటులోకి తేవాలి.

– విస్మయ



నేర్పుతో గెలవాలి

'ఊరికే ఉంటే ఊరా పేరా, కర్ర తేరా కలిబెట్టుతాను' అన్నాడట వెనకటికి ఎవరో. నిజమే కదా. ఏమీ చెయ్యకుండా ఉండే వాళ్లకి ఏ సమస్యా ఉండదు. ఏదైనా చేయాలనుకుంటేనే కదా మంచో చెడో కష్టమో సుఖమో ఎదురయ్యేది. ఏ సమస్యలూ లేకుండా అంతా సాఫీగా సాగిపోతుంటే జీవితంలో థ్రిల్ ఏముంటుంది? అందుకే... వచ్చే సమస్య పోయే సమస్య అన్నట్లుగా ఉందనుకోండి, అనుభవంతో రాటుదేలుతాం. పెద్దలు చెప్పనే చెప్పారు కదా- కాలు తడవకుండా ఏరు దాటలేం, కళ్లు తడవకుండా జీవితాన్ని దాటలేం... అని. అయినా కొందరు సమస్య అన్న మాట వింటేనే వణికిపోతారు. మనశ్శాంతిని కోల్పోతారు. తిండి తినరు. నిద్ర పోరు. ఇంటిని సైతం అశాంతిమయం చేసేస్తారు.

ఇంకొందరుంటారు... వాయిదా పద్ధతుంది దేనికైనా అన్నట్లు సమస్యల్ని కూడా వాయిదా వేస్తూ కాలం గడిపేస్తుంటారు. మరికొందరిది 'కాలమే అన్నిటినీ పరిష్కరిస్తుంది' అనే సిద్ధాంతం. అందుకని వీరసలు దాని గురించి ఆలోచించకుండా తమ పని తాము చేసుకుపోతుంటారు. వీళ్లందరితోనూ అంత ఇబ్బంది లేదు కానీ ప్రతి సమస్యనీ ప్రపంచ యుద్ధం స్థాయిలో సీరియస్‌గా తీసుకునే వాళ్లుంటారే వారితోనే గొడవంతా! వీళ్లకు ప్రతి సమస్యా రెడీమేడ్‌గా పరిష్కారం కావాలి. లేకపోతే తీవ్ర ఒత్తిడికి లోనై ప్రాణాల మీదికి తెచ్చుకుంటారు. లేదా ఎదుటివారి ప్రాణాలమీదికి తెస్తారు. అలాంటి వాళ్లంతా చేయాల్సింది- సమస్య ఎదురైనప్పుడు ఆవేశపడకుండా కూల్‌గా ఆలోచించడం. ఎందుకంటే ఒక ప్రఖ్యాత రచయిత అన్నట్లు- 'ప్రతి సమస్యకు ఓ పరిష్కారం ఉంటుంది. పరిష్కారం లేని సమస్య ఉంటే.. ఆ తప్పు సమస్యది కాదు, పరిష్కారం కనుక్కోలేని ప్రయత్నానిది'.

'ప్రతి తాళానికీ ఒక చెవి కూడా ఉంటుంది. కాకపోతే అది దొరకడానికి మనకు కాస్త సమయం పడుతుండొచ్చు. అంతేకానీ చెవి లేకుండా మాత్రం తాళం ఉండదు' అంటారు మరో ఆంగ్ల రచయిత. ఇక్కడ తాళమూ చెవీ అంటే ఆయన ఉద్దేశం- సమస్యా పరిష్కారమూ అని.

'సమస్య'ను భూతద్దంలో చూస్తున్నంతసేపు అది మనల్ని భయపెడుతూనే ఉంటుంది. సవాలుగా తీసుకుని పరిష్కారం మీద దృష్టి పెడితే ఎంతటి సమస్య అయినా దూదిపింజలా తేలిపోతుంది. మనిషికి కావాల్సిందల్లా కాస్త ఓర్పు... మరింత నేర్పు. అసలు సమస్యకి భయపడకూడదు, వాయిదా వేయకూడదు, దానికి దూరంగా పారిపోనూకూడదు. ఆఫీసు సమస్య అయితే సహోద్యోగులతో, ఇంటి సమస్య అయితే కుటుంబసభ్యులతో... విడమరిచి చర్చించాలి. తప్పనిసరిగా ఏదో ఒక పరిష్కారమార్గం దొరుకుతుంది. ఒకవేళ అప్పటికి దొరక్కపోయినా సమస్య భారం పదిమందీ పంచుకున్నట్లు అవుతుంది. ఎవరికో ఒకరికి ఎప్పుడో ఒకప్పుడు దానినుంచి బయటపడే మార్గం స్ఫురించకపోదు. అంతేకానీ... ఎక్కిళ్లు పెట్టి ఏడుస్తూ కూర్చుంటే కష్టం పోదు కదా!

– సీహెచ్.రాజు

మనసే మందిరం!

అన్నింటికీ మనసే కారణం! మన ఆలోచనలకు, ప్రవర్తనకు, వ్యవహారానికి అన్నింటికీ అదే మూలం. మనసు చేసే మాయాజాలం అంతా ఇంతా కాదు. మనసు ప్రాథమిక లక్షణం చంచలిస్తూ ఉండటం. మనసే బంధ మోక్షాలకు కారణం. ఏదైనా మనం ఆశించిన మేరకే లభిస్తే మనసు సమాధానపడుతుంది. ఒకవేళ లభించింది... ఆశించిన దానికన్నా అధికంగా ఉంటే ఆనందిస్తుంది. మనసు బలహీనమైనదైతే, భ్రమలు బలంగా చుట్టుముడతాయి. ఆ స్థితిలో అల్పమైన విషయాలు ఉన్నతంగాను, క్షణికమైన ఆనందాలు శాశ్వతమైనవిగాను కనిపిస్తాయి. దృఢమైన ఆత్మవిశ్వాసం మనశ్శక్తి ద్వారానే వస్తుంది.

మనసు అన్నీ తనకు తెలుసు అనుకుంటుంది. కానీ ఆ తెలిసిన సంఘటనే జరిగితే అల్లకల్లోలమవుతుంది. మనసు దేన్నైనా పట్టుకుందంటే ఇక, అశాంతి మొదలు. అదే వదలగలిగితే... విముక్తి. అదే ప్రశాంతి. మనసు ఎప్పుడూ మాట వినదు. వినేలా చేసుకోవడం మన చేతిలో ఉన్న పని. పరిపరివిధాలా పోతానని మనసు గోల చేస్తుంది. ఆలోచనలతో, ఆక్రోశాలతో సందడి చేస్తుంది. దానికి కళ్లెంవేసి కుదురుగా కూర్చోబెట్టే నైపుణ్యాన్ని ఎవరికి వారు దక్కించుకోవాలి. అరిషడ్వర్గాల వికారాల వైపరీత్యం వల్ల వ్యక్తులు అశాంతికి గురవుతారు. మానసిక వ్యథకు లోనవుతారు. ద్వేషం వల్ల కంసుడు, కామం వల్ల కీచకుడు, అసూయతో దుర్యోధనుడు, మోహంతో రావణుడు, క్రోధంతో హిరణ్యకశిపుడు... ఇలా ఎందరో తమ జీవితాల్లో శాంతిని కోల్పోయి, దుర్మార్గులుగా మిగిలిపోయారు.



మనిషి తనను తాను ఉద్ధరించుకోవాలి! అందుకు నియమపూర్వకంగా ప్రయత్నించాలి. మనసును నిశ్చలంగా ఉంచడం, మనోభావాల్ని ఆలోచనా తరంగాల్ని పరిశుద్ధంగా ఉంచుకోగలగడం వల్ల శాంతి చేకూరుతుంది. చంచలమైన మనసును, నిశ్చలమైన బుద్ధిగా మార్చడానికి ఆత్మవిచారణ మార్గాన్ని అంటే- తనను తాను నిరంతరం తెలుసుకోగలగాలి. తాను చేపట్టిన చర్యల ఫలితాన్ని తానే అనుభవించాల్సి ఉంటుందనే ఎరుక కలిగి ఉండాలి. ఆ ఎరుకే జ్ఞానం. ఆధునిక కాలంలో మనషుల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఈ మార్పు ప్రతికూల ధోరణులకు కారకమవుతోంది. మనుషుల మనసులన్నీ అశాంతికి నెలవులు అవుతున్నాయి. ఆ అశాంతి అవివేకానికి దారితీస్తోంది. ఆ అవివేకం అనర్థాలను ప్రేరేపిస్తోంది. ఆ అనర్థాలవల్ల జీవితాలన్నీ దుఃఖపూరితమవుతున్నాయి.

అంతర్యామి

ఇంతటి నష్టానికి కారణం- మనిషి తన మనసును సానుకూల భావతరంగిణి వైపు మరలించకపోవడమే! వ్యతిరేక భావాల సంఘర్షణలో నేటితరం కొట్టుమిట్టాడుతోంది. ఆ వ్యతిరేకతను, ప్రతికూలతను వదిలించుకుని, ప్రతి వ్యక్తీ ఆత్మచైతన్యంతో పురోగమించాలి. నవ్య ఉషోదయాల్ని స్వాగతించాలి. మనసనే మందిరంలో దివ్యమైన పరంజ్యోతిని వెలిగించుకోవాలి. ఆ వెలుగు జీవితానికి సరైన దిశానిర్దేశం చేస్తుంది. ఆనందపు మధురిమల్ని ఆవిష్కరిస్తుంది.

– డాక్టర్ కావూరి రాజేశ్‌పటేల్



ఈ-కామర్స్ జోరు

జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఇంటర్నెట్ అందుబాటు నేపథ్యంలో ఆన్‌లైన్‌లో క్రయ విక్రయాలకు ప్రజలు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఈ-కామర్స్ విపణి పోనుపోను విస్తరిస్తోంది. గడిచిన సంవత్సరాల్లో దేశీయంగా ఈ కామర్స్ విపణి విలువ, భవిష్యత్తులో దాని వృద్ధి ఎలా ఉండవచ్చంటే... (కోట్ల డాలర్లలో)

సంవత్సరం	విలువ
2021	6,700
2022	8,400
2023	10,200
2024	12,300
2025	14,500
2026	16,300
2030	32,500

(ఆధారం: ఐబీఈఎఫ్ నివేదిక)

కశ్మీర్ లోయలో కొత్త తీర్పు

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), కాంగ్రెస్ కూటమి సొంతంగా మెజారిటీ కైవసం చేసుకోవడం, జమ్మూ ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ ఆధిక్యం సాధించడం విశేష పరిణామాలు. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ, కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కలలుగన్న అనేక ప్రాంతీయ పార్టీలు మట్టికరవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



జమ్మూకశ్మీర్ శాసనసభలో మొత్తం సీట్లు 90. తాజా ఎన్నికల్లో ఎన్‌సీ 42, కాంగ్రెస్ ఆరు సీట్లు, కూటమిలో మరో భాగస్వామి అయిన సీపీఎం ఒక సీటు సాధించాయి. భాజపా 29 సీట్లు గెలవగా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) 3, ఆమ్‌ఆద్మీ పార్టీ, జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్(జేకేపీసీ) తలా ఒక సీటు గెలుచుకున్నాయి. జమ్మూకశ్మీర్‌లో ఆమ్‌ఆద్మీ బోణీ కొట్టడం, ఏడుగురు ఇండిపెండెంట్లు శాసనసభకు ఎన్నికవడం అందరి దృష్టిని ఆకర్షించాయి. స్వతంత్రుల వల్ల ఎన్‌సీ-కాంగ్రెస్ ఓట్లకు కొంత గండిపడిందని విశ్లేషకుల అంచనా.

నీరసించిన పీడీపీ

ఈసారి ఎన్నికల్లో 41 మంది మహిళలు పోటీచేయగా, వారిలో ముగ్గురే గెలిచారు. 58 ఏళ్ల షమీమ్ ఫిర్దౌస్, 52 ఏళ్ల సకీనా మసూద్ ఎన్‌సీ తరఫున ఎన్నికయ్యారు. 29 ఏళ్ల ఎంటెక్ పట్టభద్రురాలు షగున్ పరిహార్ భాజపా తరఫున విజయం సాధించారు. షగున్ కిష్త్వాడ్ నియోజకవర్గంలో తన సమీప ప్రత్యర్థి, ఎన్‌సీ అభ్యర్థిపై కేవలం 521 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఆమె తండ్రి, చిన్నాన్నలు 2018లో హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదుల దాడిలో హతమయ్యారు. అందువల్ల షగున్ విజయానికి ప్రాధాన్యం ఏర్పడింది. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) తరఫున పోటీచేసిన మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ఓడిపోవడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ.

ఈ ఎన్నికలు పీడీపీకీ, ఇతర పార్టీలకూ మధ్య సమరంగా పరిణమించాయని మెహబూబా పేర్కొన్నారు. గడచిన అయిదేళ్లలో ఆ పార్టీ చీలికలుపేలికలు అయ్యింది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా 40మంది బడా నాయకులు పీడీపీని విడిచివెళ్లారు. 2014లో భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచీ పీడీపీకి కశ్మీర్ లోయలో ఆదరణ తగ్గుతూ వచ్చింది. అందుకే కశ్మీర్ లోయలో పీడీపీ ఓటింగ్ 37.43శాతం నుంచి 16.3శాతానికి పడిపోయింది. పీడీపీ ఓట్లు ఎన్‌సీకి బదిలీ అయ్యాయనేది నిర్వివాదాంశం. పీడీపీ నుంచి బయటికివచ్చి సొంతగా జమ్మూకశ్మీర్ అప్నీ పార్టీని స్థాపించిన వ్యాపారవేత్త సయ్యద్ అల్తాఫ్ బుఖారీ కూడా ఘోరంగా విఫలమయ్యారు.

నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలకు ప్రత్యామ్నాయాన్ని సృష్టిస్తానని ప్రకటించుకున్న బుఖారీ స్వయంగా ఎన్‌సీ అభ్యర్థి ముష్తాక్ గురూ చేతిలో 5,600 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పీడీపీ నుంచి డజనుకుపైగా నాయకులను చీల్చి అప్నీ పార్టీని స్థాపించిన బుఖారీకి అది ఊహించని దెబ్బ. రాష్ట్రంలోని సంపన్న రాజకీయ నాయకుల్లో బుఖారీ ఒకరు. ఆయన నిలబెట్టిన అభ్యర్థులంతా ఓటమి చవిచూశారు. అయితే, ఇంత ఎన్‌సీ ప్రభంజనంలోనూ తమ అభ్యర్థులు నాలుగు అంకెల్లో ఓట్లు సాధించారని బుఖారీ చెప్పుకొంటున్నారు.

నేలకరచిన ఆజాద్ పార్టీకి


కాంగ్రెస్ పార్టీ మాజీ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ స్థాపించిన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) 21 మంది అభ్యర్థులను నిలబెట్టి ఒక్క సీటూ గెలుచుకోలేకపోయింది. ఉత్తర జమ్మూలో ఆ పార్టీ అభ్యర్థి మహేశ్వర్ సింగ్‌కు కేవలం 204 ఓట్లు లభించడంతో ధరావతు కోల్పోయారు. డీపీఏపీ ఇలా భంగపడటం ఇది రెండోసారి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆజాద్ పార్టీకి డిపాజిట్లు దక్కలేదు. తాను పోటీచేసిన స్థానాల్లో 54 లక్షల మంది ఓటర్లు ఉండగా, వారిలో 80,000 మంది ఆదరణను మాత్రమే ఆ పార్టీ చూరగొంది. ఇంజినీర్ రషీద్ పార్టీకీ, నిషిద్ధ జమాతే ఇస్లామీ బలపరచిన ఇండిపెండెంటు అభ్యర్థులకు కూడా గుండు సున్నా వచ్చింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బారామతి నియోజకవర్గంలో ఒమర్ అబ్దుల్లాను ఓడించిన ఇంజినీర్ రషీద్ స్వయంగా వేర్పాటువాది. అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి రషీద్ రాజకీయ బలం గల్లంతయ్యింది. ఏతావతా 370వ రాజ్యాంగ అధికరణ రద్దయిన తరవాత కశ్మీర్ లోయలో దిల్లీని ఎదిరించగలిగే ఏకైక పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రమేనని ఓటర్లు భావించినందునే అది మెజారిటీ సీట్లు సాధించగలిగిందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్‌సీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలనుకున్న పార్టీలను వివిధ కారణాల వల్ల ప్రజలు ఆదరించలేదనేదీ సుస్పష్టమే.

– మొవజమ్ మహమ్మద్

హాయ్! బుజ్జీ!!

ఉడుత మాటలు..!

చిట్టి అనే చిలుక అడవిలో ఉన్న ఓ జామచెట్టు పండ్లను తింటూ.. ఎంచక్కా జీవితం గడుపుతోంది. ఒకరోజు చిన్ని అనే ఉడుత అక్కడికి వచ్చింది. చెట్టు పైనున్న చిలుకను చూసి.. 'నాకు చాలా ఆకలిగా ఉంది. కానీ చెట్టు ఎక్కేందుకు ఓపిక లేదు. ఒక పండు తెంపి.. కిందకు వేయవా?' అని దీనంగా అడిగింది ఉడుత. అలాగేనంటూ.. చిట్టి ఒక దోర జామపండును కిందకు వేసింది. ఆకలితో ఉన్న చిన్ని



గబగబా ఆ పండు తినేసి, అక్కడి నుంచే చిలుకకు కృతజ్ఞతలు తెలిపింది. అలా రెండు రోజులు గడిచాయి. ఉడుత జామపండు కోసం చెట్టెక్కింది. చిలుక పక్కనే పండు ఉన్నా అది తినకపోవడంతో.. 'ఏంటి తినడం లేదు?' అని అడిగింది. 'నాకు ఇప్పుడు ఆకలిగా లేదు. నువ్వే తిను' అంటూ ఇచ్చింది చిలుక. 'అయినా.. నేనే పండు కోసి కింద పడేస్తాను కదా! అంత కష్టపడి పైకి ఎందుకు ఎక్కావు' అని అడిగిందది ఉడుతను చూస్తూ. దానికి చిన్నగా నవ్వి.. 'మిత్రమా! మొన్న ఎన్ని చెట్లెక్కినా ఆహారం దొరకలేదు. ఇక్కడికి వచ్చేసరికి అలసిపోయి.. చెట్టు ఎక్కలేకపోయాను. కానీ ఇప్పుడు నాకు ఓపిక ఉంది. నువ్వు.. నాకు సాయం చేస్తాననడం బాగానే ఉంది. కొన్నిరోజులకు అదే నాకు అలవాటవుతుంది. దాంతో ఇక చెట్లు ఎక్కడం మర్చిపోతాను. సొంతంగా నా ఆహారాన్ని నేను సంపాదించుకోలేను. ఎప్పటికీ ఇతరుల మీద ఆధారపడాల్సి వస్తుంది. కష్టపడి మన పనులు మనం చేసుకున్నప్పుడే.. ఆరోగ్యంగా, ఆనందంగా ఉండగలుగుతాం. ఎదుటివాళ్ల మీద ఆధారపడితే.. ఎప్పుడూ సంతృప్తిగా జీవించలేం. నిజంగా నాకు నీ సాయం అవసరం అయినప్పుడు మొన్నటిలాగే కచ్చితంగా అడుగుతాను' అంది. దానికి అలాగేనంటూ నవ్వుతూ జవాబిచ్చింది చిలుక.

– కె.వి.లక్ష్మణరావు

ఒకే అక్షరం!

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరంతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. ఇంటికి ఉండేది	☐☐ప☐☐	నీటి మీద నడిచేది
2. నీటిలో ఉండేది	☐ప☐☐☐	ఒక దిక్కు
3. చేదు ఉండే కాయ	☐ప☐☐	నడక కాదు..
4. కింద పరిచేది..	☐ప☐☐	విజేతలకు ఇచ్చేది
5. చెట్టు నుంచి వచ్చేది	☐☐ప☐☐	గాలి మరోలా...

విలువల రత్నమా.. వీడుకోలు

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ప్రజల సందర్శనార్థం ఉదయం 10.30 గంటల నుంచి 3.55 వరకూ ఉంచారు. అప్పటికే చాలా మంది చివరిసారిగా చూసేందుకు క్యూ కట్టారు. ప్రజల నివాళి అనంతరం అక్కడి నుంచి వర్లిలోని శ్మశాన వాటికకు పార్థివ దేహాన్ని తరలించారు. సుమారు 2 కిలో మీటర్ల దూరం పూలతో అలంకరించిన వాహనంలో ప్రదర్శనగా తీసుకెళ్లారు. పోలీసు బ్యాండ్ సభ్యులు గౌరవ సూచకంగా హృద్య సంగీతాన్ని వినిపించారు.

పలువురి సందర్శన

ఎన్‌సీపీఏలో ఉంచిన రతన్ టాటా పార్థివ దేహాన్ని రాజకీయ, కార్పొరేట్ ప్రముఖులుసహా వేల మంది సందర్శించి నివాళులర్పించారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎంపీ సుప్రియా సూలే, ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా, ఆర్థిక పారిశ్రామికవేత్త దీపక్ పరేఖ్, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు ఆయనకు నివాళులర్పించారు. బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్ దంపతులు, మధుర్ భండార్కర్, రాజ్‌పాల్ యాదవ్ తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించారు.

రతన్ టాటా మృతి వార్త తెలిసిన వెంటనే బుధవారం రాత్రే మహారాష్ట్ర ముఖ్యమంత్రి శిందే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఆసుపత్రికి వచ్చి నివాళులర్పించారు.

◆ క్రికెట్ లెజెండ్ సచిన్ తెందుల్కర్ గురువారం ఉదయమే టాటా నివాసానికి వచ్చి నివాళులర్పించారు.

◆ రతన్ టాటా మృతికి నివాళిగా మహారాష్ట్ర ప్రభుత్వం గురువారాన్ని సంతాప దినంగా ప్రకటించి పాటించింది. గుజరాత్ కూడా గురువారాన్ని సంతాప దినంగా పాటించింది. మరికొన్ని రాష్ట్రాలూ పాటించాయి. అధికారిక కార్యక్రమాలేవీ చేపట్టలేదు.

◆ రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలని గురువారం మహారాష్ట్ర క్యాబినెట్ తీర్మానించి కేంద్రానికి పంపింది. సీఎం శిందే అధ్యక్షతన జరిగిన సమావేశంలో టాటాకు నివాళులర్పించిన అనంతరం ఈ తీర్మానం చేశారు.

◆ రతన్‌టాటా మృతికి ప్రపంచదేశాలు నివాళులర్పించాయి.

రోల్‌మోడల్

తమకు రోల్‌మోడల్‌గా నిలిచిన రతన్ టాటాకు యువత, విద్యార్థులు భారీ ఎత్తున నివాళులర్పించారు. ఎన్‌పీఏకు వారంతా భారీగా తరలివచ్చారు. 'నేను కుటుంబ సభ్యుడిని కోల్పోయానని భావిస్తున్నా. ఆయన దేశం కోసం, ప్రజల కోసం ఎంతో చేశారు' అని నాగ్‌పుర్ నుంచి ముంబయి వచ్చి ఎంబీఏ చదువుతున్న అభిషేక్ గబ్నే పేర్కొన్నారు. అతడు ఎండ వేడిమిని లెక్క చేయకుండా ఉక్కపోతలోనూ క్యూలో నిల్చుని రతన్ టాటాకు నివాళులర్పించారు.

◆ ఇలాంటి వ్యక్తి మళ్లీ పుట్టే అవకాశం లేదంటూ కొలాబాకు చెందిన విద్యార్థి రోహిత్ రాఠోడ్ వ్యాఖ్యానించారు. ఆయనా ఎన్‌సీపీఏకు వచ్చి నివాళులర్పించారు.

◆ యుగ పురుషుడిలా రతన్ టాటా పని చేశారని ఎన్‌సీపీఏకు వచ్చిన కులకర్ణి అనే ఉద్యోగి పేర్కొన్నారు.




ముంబయిలోని ఎన్‌సీపీఏలో టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ★ రతన్ టాటాకు నివాళులర్పించేందుకు ముంబయిలోని ఎన్‌సీపీఏకు చేరుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ, ఆయన సతీమణి నీతా అంబానీ, కుమారుడు ఆకాశ్, కోడలు శ్లోకా

పార్సీ అయినప్పటికీ..

వర్లి శ్మశాన వాటికలో రతన్ టాటా అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన పార్సీ మతస్థుడైనప్పటికీ విద్యుత్తు దహన పద్ధతిలోనే అంత్యక్రియలు నిర్వహించారు. వాస్తవానికి హిందూ, ముస్లింల మాదిరిగా కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడంవల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశించిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివ దేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చిందని, అలాగే తిరిగి ఐక్యమవ్వాలనేది పార్సీల సంప్రదాయం. అయితే మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారాయి. దీంతో సౌర, విద్యుత్ దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

నోయెల్ టాటాతో మాట్లాడిన ప్రధాని

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు. ఆయన సోదరుడు నోయెల్ టాటాతో ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రధాని లావోస్ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో అంత్యక్రియలకు అమిత్ షా హాజరయ్యారు.



బడ్జెట్ లక్ష్యం మేరకు రాబడి ఉండాలి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: బడ్జెట్‌కు తగ్గట్లుగా వార్షిక రాబడి లక్ష్యాలను సాధించేందుకు గట్టి ప్రయత్నం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మొదటి ఆరు నెలల్లో లక్ష్యంగా పెట్టుకొన్న రాబడుల్లో ఏ మేరకు సాధించాం, వచ్చే ఆరు నెలల్లో ఎలా చేయాలన్నదానిపై ఆర్థిక, రెవెన్యూ, ఇతర రాబడుల శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఆర్థిక, రవాణా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ల కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడుల లక్ష్యం, మొదటి ఆరు నెలల్లో సాధించింది ఎంత, కొన్ని శాఖల్లో వెనుకబడటానికి కారణాలపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. మొదటి ఆరునెలల్లో లక్ష్యం కంటే 20% తక్కువ రాబడి ఉన్నట్లు అధికారులు నివేదించినట్లు తెలిసింది. "రాబడులు పెంచడానికి ఏం చేయాలో ఆలోచించండి. వచ్చే ఆరు నెలలు లక్ష్యం మేరకు రాబడులు వచ్చేలా చూడాలి. మొదటి ఆరునెలల్లో లక్ష్యాన్ని సాధించలేని వాటిపై మరింత దృష్టి పెట్టాలి" అని సీఎం ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కొండా సురేఖకు కోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఆమెకు లీగల్ నోటీసు పంపించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన... నిరాధార ఆరోపణలు చేసిన ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తాజాగా పిటిషన్ వేశారు. "2014 నుంచి 2023 వరకు సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశా. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నా. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నా. మంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశా. ప్రపంచంలోని బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేశా. పలు అవార్డులను పొందా. అలాంటి నన్ను ఉద్దేశపూర్వకంగా కించపరిచేందుకు కొండా సురేఖ ప్రయత్నించారు. ఆమె మాట్లాడిన మాటలు పత్రిక, మీడియా, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నన్ను కించపరిచేలా ఆమె చేసిన వ్యాఖ్యల గురించి నేతలు సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్, బాల్క సుమన్, తుల ఉమ నాతో చెప్పారు. 2024 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచార సమయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అప్పుడు నా ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ సురేఖను హెచ్చరించింది. మరోసారి అక్టోబర్ 2న బహిరంగంగా ఆమె చేసిన వ్యాఖ్యలు నన్ను బాధించాయి. సమాజంలో నా గౌరవాన్ని తగ్గించాయి. భారతీయ న్యాయ సంహిత 356 కింద సురేఖపై చర్యలు తీసుకోవాలి" అని న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం సోమవారం విచారించే అవకాశం ఉంది.



మహాగౌరిగా శ్రీశైల భ్రమరాంబ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఎనిమిదో రోజు గురువారం శ్రీ భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు.

సైబర్ నేరగాళ్లకు ఏఐతో కళ్లెం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాదిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రూ.110 కోట్లు రికవరీ చేయగలిగారు. దోచుకున్న సొత్తులో ఇది పదోవంతు కూడా లేదు. తమకున్న పరిమితుల దృష్ట్యా పోలీసులు ఇలాంటి నేరాలను అంతగా అదుపు చేయలేకపోతున్నారు. నేరగాళ్లు ఎక్కడుంటారో తెలీదు.. ఎలాఉంటారో తెలీదు.. తప్పుడు పత్రాలతో ఫోన్లు, బ్యాంకు ఖాతాలు తీసుకొని బురిడీ కొట్టిస్తున్నారు. వీళ్ల ఆచూకీ తెలుసుకునేసరికి దోచుకున్న డబ్బు వివిధ రూపాల్లో దేశం దాటుతోంది. ఒకవేళ నిందితులు పట్టుబడినా రికవరీ మాత్రం కష్టసాధ్యంగా మారింది. ఒక తరహా నేరంపై ప్రజల్లో అవగాహన పెరిగేసరికి నేరగాళ్లు మరో కొత్తతరహా మోసాన్ని తెరపైకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో నేరాలు జరగకుండా చూసేందుకు బ్యాంకులు, సెల్‌ఫోన్ ప్రొవైడర్లు రంగంలోకి దిగాయి.

ఏఐ అండతో..

సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా బాధితులను సంప్రదిస్తారు. మాయమాటలతో ముగ్గులోకి దింపుతారు. నేరం జరిగిన తర్వాత బాధితులు తమకు ఫలానా నంబర్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పినప్పుడు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. చివరకు ఆ నంబర్ తప్పుడు చిరునామాతో తీసుకున్నట్లు గుర్తించి దాన్ని రద్దు చేయిస్తున్నారు. ఇది జరిగేలోపు ఆ నంబర్ నుంచి అనేక మందిని మోసం చేస్తుంటారు. అందుకే అసలు ఇలాంటి కాల్స్ లేదా మోసపూరిత సందేశాలను గుర్తించి నివారించడానికి.. లేదంటే ప్రజలను అప్రమత్తం చేయడానికి సెల్‌ఫోన్ ప్రొవైడర్లు నడుం బిగించారు. ఏఐతో సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. దాదాపు 200 అంశాలను ప్రామాణికంగా తీసుకొని అనుమానాస్పద కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నామని ఎయిర్‌టెల్ సంస్థ ప్రకటించింది. ఒకే నంబర్ నుంచి దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వరుసపెట్టి కాల్స్ వెళుతుంటే అది అనుమానాస్పద నంబర్ కిందే లెక్క. కొత్తగా నంబర్ తీసుకున్న వెంటనే వరుసపెట్టి కాల్స్ చేస్తున్నా.. అప్పటివరకూ పెద్దగా ఫోన్‌కాల్స్ వెళ్లని నంబర్ నుంచి అకస్మాత్తుగా కాల్స్, సందేశాలు వెళుతున్నా అనుమానాస్పదంగానే భావించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఇలాంటి ప్రామాణికాంశాల ఆధారంగా కేవలం పది రోజుల వ్యవధిలో 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల సందేశాలు గుర్తించినట్లు ఎయిర్‌టెల్ సంస్థ ప్రకటించింది. వీటిని నిరోధించడమో.. లేదంటే మీకు వచ్చింది అనుమానాస్పద కాల్, సందేశం అని వినియోగదారులను హెచ్చరించడమో చేస్తున్నారు.

బ్యాంకులు కూడా..

సైబర్ నేరగాళ్లు దోచుకున్న డబ్బులను బ్యాంకు ఖాతాల్లోకి మళ్లిస్తుంటారు. ముందు ఒకటి రెండు ఖాతాల్లోకి, ఆ తర్వాత వాటి నుంచి ఒకేసారి పందల ఖాతాల్లోకి మళ్లిస్తుంటారు. ఈ ఖాతాలను కట్టడి చేయగలిగితే దోపిడీని అడ్డుకోవచ్చు. కాని సైబర్ నేరగాళ్లు తప్పుడు వివరాలతో ఖాతాలు తెరిపించడంతో పాటు అమాయకులకు కమీషన్ ఆశ చూపించి వారి ఖాతాలను వాడుకుంటున్నారు. అందుకే ఇలాంటి ఖాతాలను గుర్తించేందుకు బ్యాంకులు కూడా ఏఐ ద్వారా ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నాయి. ఖాతా తెరిచిన వెంటనే పెద్దమొత్తంలో డబ్బు జమఅయినా, ఆ వెంటనే ఆ ఖాతా వాడకపోయినా, చాలాకాలంగా ఉన్న ఖాతాలో అకస్మాత్తుగా భారీస్థాయిలో లావాదేవీలు మొదలైనా సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఇలా దాదాపు 3 లక్షల ఖాతాలు గుర్తించి వాటిని రద్దుచేసింది. ఒకవేళ నిజమైన వినియోగదారుడు ఎవరైనా తన ఖాతా రద్దుచేసినట్లు ఫిర్యాదుచేస్తే వ్యక్తిగతంగా పరిశీలించి మళ్లీ పునరుద్ధరిస్తున్నారు. మిగతా బ్యాంకులు, సెల్‌ఫోన్ సంస్థలు కూడా ఇప్పుడు ఇదే బాట పట్టాయి. దీంతో రాబోయే రోజుల్లో సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కళ్లెం పడే అవకాశం ఉంది.

శ్రీవారి ఆలయంలో పుష్పాలంకరణకు వీవీఎస్ లక్ష్మణ్ విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఆలయానికి చేపట్టిన మూడో విడత పుష్పాలంకరణకు మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ రూ.15 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాల ఏడో రోజున గురువారం పుష్పాలంకరణ చేపట్టారు.



వాటికి విలువే లేదు

సంపద, విలాసాలు, ఖరీదైన వస్తువులు.. ఇలాంటి వాటికి జీవితంలో ఎలాంటి విలువ లేదని, మీరు ప్రేమించే వ్యక్తుల శ్రేయస్సే అమూల్యమైందని మీకు తప్పకుండా తెలిసే రోజు ఒకటి వస్తుంది.

– రతన్ టాటా

గ్రహం అనుగ్రహం

11-10-2024 శుక్రవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం

అష్టమి: ఉ. 6-45 తదుపరి నవమి తె. 5-37 తదుపరి దశమి

ఉత్తరాషాఢ: రా. 1-25 తదుపరి శ్రవణ

వర్జ్యం: ఉ. 9-35 నుంచి 11-10 వరకు తిరిగి తె. 5-18 నుంచి

అమృత ఘడియలు: రా. 7-05 నుంచి 8-40 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-02 వరకు తిరిగి మ. 12-10 నుంచి 12-57 వరకు

రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.55; సూర్యాస్తమయం: సా.5.39

దుర్గాష్టమి, మహానవమి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	35.2	21.8
ఆదిలాబాద్	33.8	22.2
నిజామాబాద్	33.7	24.0
హనుమకొండ	32.5	23.5
రామగుండం	32.2	25.0
హైదరాబాద్	30.6	23.8
ఖమ్మం	30.0	25.0
కరీంనగర్	30.0	23.0
నల్గొండ	29.0	24.2

సమైక్య భావం.. సమీకృత గురుకులం

(మొదటి పేజీ తరువాయి)

భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, మానకొండూరు, నర్సంపేట

2560 మంది విద్యార్థులు.. 120 మంది టీచర్లు

సమీకృత గురుకులాల్లో అంతర్జాతీయ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ఒక్కో గురుకులంలో 2560 మంది వరకు చేరడానికి అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవచ్చు. ప్రతి పాఠశాలలో 120 మంది చొప్పున టీచర్లు పనిచేస్తారు. నిర్మాణ బాధ్యతలు రోడ్లు, భవనాలశాఖకు అప్పగించారు. సమీకృత గురుకులాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరుతాయని ప్రభుత్వం చెబుతోంది.

ఇవీ సదుపాయాలు

◆ ఒక్కో లైబ్రరీలో 5 వేల పుస్తకాలు, 60 కంప్యూటర్లు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉంటాయి.

◆ సమీకృత గురుకులంలో 900 మంది ఒకే సారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్ హాలు నిర్మిస్తారు.

◆ సమీకృత గురుకుల భవనాలు వాతావరణ అనుకూలంగా ఉంటాయి. ప్రతి డార్మిటరీ గదిలో పది బెడ్‌లు, రెండు బాత్‌రూమ్స్ ఉంటాయి.


◆ విద్యార్థులు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ క్యాంపస్.. అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, సుస్థిర వాతావరణ పరిస్థితులు.

◆ సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల కోసం ప్రత్యేక ఆడిటోరియం, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడామైదానాలు, వైద్యశాల.

పీఎం జుగా.. పరిస్థితులిక మెరుగ్గా..!

ఈనాడు, హైదరాబాద్: ఏజెన్సీలు, మైదాన ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాల పరిధిలో 4జీ సర్వీసులు, అన్ని గ్రామాలకు నూరు శాతం విద్యుదీకరణ చేయాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్రంలో 500 జనాభా దాటిన దాదాపు 924 గిరిజన ఆవాసాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపట్టనుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న పీఎం జనజాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్‌ను ఉన్నతీకరించి ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్‌గా (పీఎం జుగా) మార్చింది. ఐదేళ్లలో ఎంపిక చేసిన ప్రాంతాల్లోని గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుంది. దేశవ్యాప్తంగా రూ.79,156 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా 17 మంత్రిత్వశాఖలు ఆయా ప్రాజెక్టులు చేపట్టనున్నాయి. రాష్ట్రంలో ఈ పథకం అమలు కోసం 4 కమిటీలు వేయాలని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అపెక్స్ కమిటీ పథకం అమలును పర్యవేక్షిస్తుంది. దీంతో పాటు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయుల్లో కమిటీలు.. మౌలిక సదుపాయాలు, ఇతర పనుల ప్రతిపాదనల్ని నోడల్ విభాగమైన గిరిజన సంక్షేమశాఖ ద్వారా పంపనున్నాయి. పీఎం జుగా కార్యక్రమాలకు ప్రత్యేక విధివిధానాలు త్వరలో జారీ చేస్తామంది. గిరిజన జీవన పర్యాటకం కోసం స్వదేశీదర్శన్ పేరిట నూరు శాతం నిధులతో హోం స్టే గృహాలు నిర్మించనున్నట్లు పేర్కొంది.

- గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల వృద్ధికి అవకాశం
- రాష్ట్రంలోని 924 ఆవాసాల్లో అమలుకు ప్రతిపాదనలు



కొత్త అంగన్‌వాడీలకు రూ.12 లక్షలు..

రాష్ట్రంలో పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద 81 గిరిజన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి మహిళాశిశు సంక్షేమశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పూర్తి నిధులు కేంద్రమే భరిస్తుంది. కొత్త అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.12 లక్షల చొప్పున నిధులివ్వనుంది. ప్రస్తుతమున్న కేంద్రాల ఉన్నతీకరణకు రూ.లక్ష చొప్పున అందించనుంది.

చేపట్టే కార్యక్రమాలివీ..

★ కరెంటు లేని గిరిజన ఆవాసాల్లో కుటుంబాలు, ప్రభుత్వ విభాగాలకు విద్యుత్తు సౌకర్యం, రహదారుల అభివృద్ధి

★ ఏజెన్సీలో 5 కి.మీ., మైదాన ప్రాంతాల్లో 10 కి.మీ. దూరంలో హెల్త్‌సెంటర్ లేకుంటే సంచార మెడికల్ యూనిట్ ఏర్పాటు, గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ వైద్య బీమా కార్డుల పంపిణీ.

ఒకేషనల్ విద్యార్థులకూ నైపుణ్య శిక్షణ!

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నైపుణ్యాలే సోపానమని భావిస్తున్న అధికారులు ఆ దిశగా దృష్టి సారించారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు సైతం నైపుణ్య శిక్షణ ఇప్పిస్తే వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని ఇంటర్ విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆ శాఖ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యామండలిని సంప్రదించి..వెంటనే టీసీఎస్ అధికారులతో సమావేశమై నైపుణ్య శిక్షణ అవకాశాలపై సంప్రదింపులు జరిపారు.

- ఉద్యోగావకాశాలు పెంచడమే లక్ష్యం
- టీసీఎస్ అధికారులతో ఉన్నత విద్యామండలి, ఇంటర్ విద్యాశాఖ సంప్రదింపులు



ఇంటర్ స్థాయిలోనే బీజం వేయాలని...

రాష్ట్రంలోని 425 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా...22 రకాల ఒకేషనల్ కోర్సుల్లో ఏటా 22 వేల నుంచి 25 వేల మంది ఒకేషనల్ కోర్సులను పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా ఆధునికీకరిస్తున్నారు. దీనివల్ల ఐటీఐ విద్యార్థులు మరిన్ని నైపుణ్యాలు నేర్చుకోవచ్చని, తద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.ఒకేషనల్ విద్యార్థులకు కూడా వివిధ పరిశ్రమల నిపుణుల ద్వారా నైపుణ్య శిక్షణ ఇప్పిస్తే ప్రయోజనం కలుగుతుందని ఇంటర్ విద్యాశాఖ అధికారుల్లో ఆలోచన మొదలైంది. ఈ విషయమై ఉన్నత విద్యామండలి చొరవతో ఇటీవల టీసీఎస్ అధికారులతో చర్చించారు. జూనియర్ కళాశాలల్లో ఇంజినీరింగ్, కామర్స్, మేనేజ్‌మెంట్, పారామెడికల్ విభాగాలకు చెందిన 22 రకాల కోర్సుల గురించి టీసీఎస్ ప్రతినిధులకు వివరించారు. ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వస్తే తాము విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని టీసీఎస్ ప్రతినిధులు హామీ ఇచ్చారని ఇంటర్ విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఐటీఐల ఆధునికీకరణ బాధ్యతను కూడా టీసీఎస్ తీసుకున్న విషయం తెలిసిందే.

బ్రిడ్జి కోర్సు లేకుండానే డిగ్రీలో చేరేలా...

ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులు ప్రస్తుతం డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే బ్రిడ్జి కోర్సు పూర్తి చేయాల్సి ఉంది. దానివల్ల ఆ కోర్సు లేకుండానే డిగ్రీలో చేరేలా నిబంధనలు సడలించాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఉన్నత విద్యామండలితో చర్చించారు. అందుకు ఉన్నత విద్యాశాఖ జీఓ జారీ చేయాలి. దానికి తోడు ఒకేషనల్ కోర్సుల పేరు మార్చి మరో పేరు పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం.

జనన, మరణాల లెక్కలేవీ...!?

ఈనాడు, హైదరాబాద్: జనన, మరణాల లెక్కల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. స్థానిక సంస్థలు ఈ వివరాలను ఆన్‌లైన్ జాతీయ పోర్టల్‌లో నమోదు చేయాలి. వాటి ఆధారంగా దేశవ్యాప్తంగా ప్రతి క్యాలెండర్ ఏడాదిలో ఎన్ని జనన, మరణాలు సంభవించాయనే సమగ్ర వివరాలతో జాతీయ నివేదికను కేంద్ర జనాభా లెక్కల విభాగం విడుదల చేయాలి. 2022 నివేదికను 2024లో తప్పనిసరిగా విడుదల చేయాలి. 2021లో కరోనా మరణాలు అధికం. కానీ లెక్కలేవీ బయటకు రాలేదు.

- రెండేళ్లుగా విడుదల చేయని కేంద్రం
- జాతీయ పోర్టల్‌లో నమోదుకు సాంకేతిక ఇబ్బందులు



రెండేళ్ల క్రితం వరకూ...

రెండేళ్ల క్రితం వరకూ జనన, మరణాల నమోదుకు రాష్ట్రాలు సొంతంగా ఆన్‌లైన్ పోర్టళ్లను నిర్వహించేవి. ఇలా ఏ రాష్ట్రానికా రాష్ట్రం విడివిడిగా చేయడం వల్ల జాతీయ స్థాయిలో జనాభా ఎంతనే అంచనాలు సకాలంలో తెలియడం లేదని కేంద్రం ఏడాదిన్నర క్రితం యూనిఫైడ్ బర్త్, డెత్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించింది. దేశంలో ఏ గ్రామ పంచాయతీ లేదా ఏ మున్సిపాలిటీ/కార్పొరేషన్ అయినా వాటి పరిధిలోని జనన, మరణాలను ఈ పోర్టల్‌లోనే నమోదు చేయాలని సూచించింది. కానీ ఇది సరిగా పనిచేయడం లేదని, సాంకేతిక సమస్యలతో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేయలేకపోతున్నామని పలు రాష్ట్రాలు కేంద్రానికి తరచూ ఫిర్యాదులు చేస్తున్నాయి. ఒకరి జనన లేదా మరణ వివరాలు నమోదు చేసిన తరవాత కనీసం 6 నుంచి 10 గంటల వరకూ అవి అప్‌లోడ్ అయినట్లు కన్ఫర్మేషన్ మెసేజ్ రావడంలేదని తెలియజేస్తున్నాయి. ఒకరి వివరాలు నమోదు చేసిన తరవాత మరొకరివి నమోదు చేయాలంటే చాలాసమయం పడుతోందంటున్నాయి. ఇటీవల మెదక్ మున్సిపాలిటీలో వారం.. కరీంనగర్ కార్పొరేషన్‌లో 10రోజులు పోర్టల్ సరిగా పనిచేయలేదు.

జనగణన లేక...

దేశంలో 2020-21లో జనాభా సేకరణ చేపట్టాల్సి ఉండగా అప్పట్లో లాక్‌డౌన్ కారణంగా నిరవధికంగా వాయిదా వేసింది. 2022 మే నెలలో విడుదల చేసిన జనన, మరణాల నమోదు నివేదికలో 2020 నాటికి దేశంలో జనాభా ఎంతనే అంచనాలను విడుదల చేసింది. తరవాత నివేదికలు రాకపోవడంతో ఇప్పుడు జనాభా ఎంతనేది తెలియడం లేదని ఓ సీనియర్ అధికారి 'ఈనాడు'కు చెప్పారు.



తెలంగాణ పర్యాటక స్టాల్‌ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

పర్యాటకంలో పెట్టుబడుల్ని ప్రోత్సహిస్తాం: జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పర్యాటకంలో పెట్టుబడుల్ని ప్రోత్సహిస్తామని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అమెరికాలోని లాస్ వెగాస్‌లోని మాండలే బేలో నిర్వహించిన 'ఐఎంఈఎక్స్ అమెరికా 2024' ట్రేడ్‌షోలో పాల్గొన్నారు. ఇందులో ఏర్పాటుచేసిన తెలంగాణ పర్యాటక స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల గురించి స్థానిక ట్రావెల్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తెలుగు అసోసియేషన్ సభ్యులతో చర్చించారు. హైదరాబాద్ పర్యాటక, వినోదం, వ్యాపార, ఐటీ, హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోందని చెప్పారు. పర్యాటక రంగంలో భాగస్వాముల సహకారంపై దృష్టి పెట్టామని అన్నారు. రాష్ట్రంలో పర్యటించాలని ఆయా దేశాల ప్రతినిధులకు మంత్రి జూపల్లి ఆహ్వానం పలికారు.

కొత్త టీచర్ల కోసం సీనియర్ల ఎదురుచూపులు

- వారొస్తే 7 వేల మంది రిలీవ్

ఈనాడు, హైదరాబాద్: తాజాగా నియామక పత్రాలు అందుకున్న కొత్త టీచర్ల కోసం పాత ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత జులైలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. వారిలో దాదాపు 7 వేల మంది పాత పాఠశాలల నుంచి రిలీవ్ కాలేదు. కొత్త టీచర్లు వస్తే వారు బదిలీ అయిన చోటుకు వెళ్లాల్సి ఉంది. దీంతో కొత్త టీచర్లకు పోస్టింగులపై వందల మంది సీనియర్ ఉపాధ్యాయులు డీఎస్సీ, డీఈఓ కార్యాలయాలకు ఫోన్లు చేసి గురువారం ఆరా తీశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు.. నూతన ఉపాధ్యాయులు గురువారం డీఈఓ కార్యాలయాల్లో రిపోర్ట్ చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి వారికి వేతనాలు ఇస్తామని ముఖ్య కార్యదర్శి చెప్పినట్లు డీఈఓలు తెలిపారు. కొత్త వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కౌన్సెలింగ్ ఎప్పుడనేదీ వెల్లడించలేదని సమాచారం. దీంతో దసరా సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే ఈ నెల 15వ తేదీ నాటికి కొత్త టీచర్లు విధుల్లో చేరతారా? అనే విషయంపై స్పష్టత రాలేదు.

సీకెంట్ పైల్స్ వినియోగించాలని చెప్పింది ఎవరు?

- నాటి సీడీఓ సీఈ కేఎస్ఎస్ చంద్రశేఖర్‌ను ప్రశ్నించిన విజిలెన్స్

ఈనాడు, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ (లక్ష్మీ) నిర్మాణంలో షీట్ పైల్స్‌కు బదులు సీకెంట్ పైల్స్ వినియోగించాలని ఆదేశించింది ఎవరంటూ నాటి సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ముఖ్య ఇంజినీరు, ప్రస్తుత కాడా సీఈ కేఎస్ఎస్ చంద్రశేఖర్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రశ్నించినట్లు తెలిసింది. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని ప్రధాన బ్యారేజీ మేడిగడ్డపై తుది నివేదిక రూపకల్పనకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యక్ష విచారణ నిర్వహిస్తోంది. వీలైనంత త్వరగా తుది నివేదిక అందజేయాలంటూ కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వాన్ని, విజిలెన్స్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో విజిలెన్స్ విచారణ నిర్వహిస్తోంది. శుక్రవారం గజ్వేల్ ఎస్ఈ బస్వరాజు, సీఈ సీడీవో డిప్యూటీ ఈఈలను విజిలెన్స్ విచారణ చేయనున్నట్లు సమాచారం.



పనిని, జీవితాన్ని ఏకీకృతం చేయండి

పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత పాటించడం కాదు, ఆ రెండింటినీ ఏకీకృతం చేయాలని నేను చెబుతుంటాను. మీరు చేసే పని, మీ వ్యక్తిగత జీవితం అర్థవంతంగా, సంతృప్తికరంగా ఉండేలా చూసుకోండి. అప్పుడు మీ జీవితం పరిపూర్ణమవుతుంది.

– రతన్ టాటా

మాదకద్రవ్యాల నియంత్రణకు అదనపు సిబ్బంది

ఈనాడు, హైదరాబాద్: మాదకద్రవ్యాల నియంత్రణకు అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయిస్తామని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల ఊసే లేకుండా చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో తెలంగాణ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ఇప్పుడు తీసుకుంటున్న చర్యలను మరింత తీవ్రం చేయండి. ఇందుకోసం అవసరమైతే అదనపు సిబ్బందిని కూడా కేటాయిస్తా. రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటున్నట్లు తెలంగాణను మాదకద్రవ్యాల నుంచి విముక్తి చేయాలంటే వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలి. అనుమానితులను పట్టుకోవాలి. ఈ వ్యవస్థ మొత్తాన్ని ఛిన్నాభిన్నం చేసి చట్టం ముందు నిలబెట్టండి. ఈ దందాలో విదేశీయులు ఉన్నట్లయితే బలవంతంగా వారిని వారి దేశానికి పంపేయండి. విద్యాసంస్థల వద్ద నిఘా పెట్టాలి'' అని అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, పక్కన మహేశ్ భగవత్, సందీప్ శాండిల్య

శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ నిందితులను పట్టుకోవడం ఒక్కటే కాదని, వారికి వ్యతిరేకంగా బలమైన ఆధారాలు సేకరించి శిక్షలు పడేలా చేయాలన్నారు. కార్యక్రమంలో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో సంచాలకుడు సందీప్ శాండిల్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన మరో సమావేశంలో కొత్త చట్టాల అమలు తీరును డీజీపీ జితేందర్ సమీక్షించారు.

పంచాయతీ వద్దు.. బడికి పోతాం!

- ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 111 మంది పంచాయతీ కార్యదర్శులు

ఈనాడు, హైదరాబాద్: వారు ప్రభుత్వ ఉద్యోగులే. . నిన్నటివరకు గ్రామ పంచాయతీల్లో పనిచేశారు. ఉదయం 7 గంటల నుంచి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, రోడ్ల మరమ్మతులు, ధ్రువీకరణ పత్రాలు, అనుమతుల జారీ విధులు నిర్వర్తించారు. ఇకపై వారు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 111 మంది పంచాయతీ కార్యదర్శులు డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారు. ఇందులో 70 మంది ఎస్జీటీలు కాగా.. 41 మంది స్కూల్ అసిస్టెంట్లు. నల్గొండ జిల్లా నుంచి అత్యధికంగా 11 మంది, కామారెడ్డి నుంచి 10 మంది జనగామ జిల్లా నుంచి 9 మంది పంచాయతీ కార్యదర్శులు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారు.

భారీగా ఖాళీలు: 111 మంది పంచాయతీ కార్యదర్శులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో ఆయా పోస్టులు ఖాళీ కానున్నాయి. గ్రూపు-4 ఉద్యోగాల మెరిట్ జాబితాలో 200 మంది ఉన్నారు. గ్రూపు-2, గ్రూపు-1లకు చాలా మంది సన్నద్ధమవుతున్నారు. ఆయా పరీక్షల ఫలితాలు వచ్చాక ఖాళీలు మరిన్ని పెరగనున్నాయి. పంచాయతీ కార్యదర్శులకు పనిభారంతో పాటు వేతనాలు తక్కువగా ఉన్నాయి. వెయ్యి మందికి పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అయిదేళ్లుగా పనిచేస్తున్నా క్రమబద్ధీకరణ జరగలేదు. ఈ కారణాలతో చాలామంది ఇతర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టిసారిస్తున్నారు.

17,500 మంది బాధితులు.. రూ.229 కోట్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

నగరానికి చెందిన సయ్యద్ అష్ఫఖ్ రాహిల్ ఎండీగా, అతడి భార్య సయీదా అయేషా, ఇక్బాల్, సయ్యద్ ఉమర్ అహ్మద్, మోయిజ్, అస్లాం, నజీర్, బిలాల్ ఈ సంస్థల్లో డైరెక్టర్లుగా వ్యవహరించేవారు. మాదాపూర్‌లో కార్యాలయం ఉంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు.

రూ.లక్ష పెట్టుబడికి మూడు నెలల్లో 15 శాతం...

కనీసం రూ.5 వేల నుంచి పెట్టుబడులు పెడితే నెలవారీగా లాభాలు ఇస్తామని సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికలపై నిందితులు ప్రచారం చేశారు. రూ.లక్ష పెట్టుబడికి మూడు నెలల్లో 15 శాతం, ఆరు నెలల్లో 25 శాతం, సంవత్సరానికి 60 శాతం, రెండేళ్లకు 100 శాతం చొప్పున లాభాలు ఇస్తామని ప్రకటించారు. చాదర్‌ఘాట్, టోలిచౌకీలో అమెజాన్ భాగస్వామ్యంతో స్టోర్లు ఏర్పాటు చేశామని నిత్యం 4 వేల హెడ్‌ఫోన్లు, బ్యాండ్స్ డెలివరీ చేస్తుంటామని తప్పుడు ప్రచారం చేశారు. గుడిమల్కాపూర్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ జైష్ జనవరిలో రూ.2.74 కోట్లు పెట్టుబడి పెట్టారు. కొన్నాళ్లకు మోసపోయినట్లు గ్రహించారు. హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు.

రూ.1.7 కోట్ల నగదు స్వాధీనం

డీకేజడ్ కార్యాలయాలు, నిందితుల ఇళ్లు, ఫాంహౌస్‌లలో తనిఖీలు చేసి 564 ఒప్పంద బాండ్లు, ఏజెంట్లు, వినియోగదారుల పేర్లున్న దస్త్రాలు, బ్యాంకు చెక్‌బుక్‌లు, 13 ల్యాప్‌టాప్‌లు, రూ.1.7 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏజెంట్లు, ఇతరుల పాత్రపైనా ఆరా తీస్తున్నారు. మిగిలిన నిందితుల్ని త్వరలో అరెస్టు చేస్తామని కమిషనర్ ఆనంద్ తెలిపారు.



సన్మాన కార్యక్రమంలో జానారెడ్డి, భట్టి, అభిషేక్ మనుసింఘ్వీ

అభిషేక్‌ను రాజ్యసభకు పంపించడం చారిత్రక అవసరం: డిప్యూటీ సీఎం భట్టి

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీని రాజ్యసభకు పంపించడం చారిత్రక అవసరమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. పెద్దలసభలో ఎంపీగా ఆయన తెలంగాణ గొంతుక వినిపించనున్నారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మనుసింఘ్వీ సన్మాన కార్యక్రమంలో భట్టి పాల్గొన్నారు. విభజన చట్టం కింద రావాల్సిన హక్కులు దశాబ్దకాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయని, వీటిని చట్టసభల్లో, న్యాయస్థానాల్లో వాదించి సాధించేందుకు ఉపయోగపడే వ్యక్తి అభిషేక్ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గిరీష్ సంఘీ, సీనియర్ నాయకులు జానారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో యువతుల తల్లిదండ్రులు

నలుగురు అక్కచెల్లెళ్లూ వైద్య విద్యార్థినులే

ఆర్థిక సాయం అందజేసిన హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఒకప్పుడు వైద్యవిద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షగానే ఉండేదని, ప్రస్తుతం జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడంతో ప్రతిభావంతులు ఎంబీబీఎస్ చదివేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని నర్సాపురానికి చెందిన కొంక రామచంద్రం, శారద దంపతులకు నలుగురు కుమార్తెలు. వారిది నిరుపేద కుటుంబం. రామచంద్రం స్థానికంగా దర్జీగా పనిచేస్తున్నారు. వీరి మొదటి కుమార్తె విజయవాడలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం పీజీ చదివేందుకు సాధన చేస్తున్నారు. రెండో కుమార్తె కరీంనగర్ జిల్లాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కవలలైన మూడో, నాలుగో కుమార్తెలు రోహిణి, రోషిణిలు ఈ విద్యాసంవత్సరం జగిత్యాల జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ప్రవేశాలకు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిశారు. ఆ నలుగురు అమ్మాయిలను అభినందించిన హరీశ్‌రావు.. తక్షణం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎడ్‌సెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని బీఈడీ సీట్ల భర్తీకి ఎడ్‌సెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ సీట్లను గురువారం కేటాయించారు. కన్వీనర్ కోటా కింద 5,439 సీట్లలో 3,222 మందికి సీట్లు దక్కాయని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య పి.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన వారు ఈనెల 14 నుంచి 17వ తేదీల మధ్యలో ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కళాశాలల్లో అసలు ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

'యూబిట్' దందాపై ఈడీ నజర్

- కేసు వివరాల కోసం నిర్మల్ పోలీసులకు లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ 'యూబిట్' దందాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట నకిలీ యాప్‌ల ద్వారా రూ.కోట్లు కొల్లగొట్టిన ముఠా కార్యకలాపాలపై ఆరా తీస్తోంది. నిర్మల్ ప్రాంతంలో వెలుగుచూసిన ఈ దందాలో మనీలాండరింగ్ జరిగిందని ప్రాథమికంగా అనుమానిస్తున్న ఈడీ.. లోతుగా కూపీ లాగుతోంది. ఎఫ్ఐఆర్, రిమాండ్ నివేదికలు, నిందితుల బ్యాంకు ఖాతాలు తదితర వివరాలు సమర్పించాలని నిర్మల్ పోలీసులకు తాజాగా లేఖ రాసింది. ఆ వివరాలు సేకరించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసి.. దర్యాప్తు ఆరంభించనుంది. ఒక్క నిర్మల్ ప్రాంతంలోనే సుమారు రూ.50 కోట్ల మేర కొల్లగొట్టినట్లు ఇప్పటికే పోలీసుల దర్యాప్తులో తేలింది. దాన్ని ఎక్కడికి తరలించారు? ఏం చేశారు? లాంటి వివరాలు రాబట్టడంతోపాటు ఆ సొమ్ముతో ఏమైనా ఆస్తులు కొనిఉంటే జప్తు చేసేందుకూ ఈడీ సిద్ధమవుతోంది.



క్రిప్టో కరెన్సీలోకి మార్చి దుబాయ్‌కు తరలింపు!

యూబిట్ అనే క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయంటూ ముఠా ఆశపెట్టింది. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.14 వేల చొప్పున వడ్డీ వస్తుందని చెప్పింది. కనీసం రూ.5 వేల పెట్టుబడి పెట్టినా 500 రోజుల్లో రెట్టింపు చేస్తామని నమ్మబలికింది. పెట్టుబడిదారులు మరో ఐదుగురిని చేర్పించాల్సి ఉంటుందంటూ.. నిషేధిత గొలుసుకట్టు వ్యాపారానికి తెరలేపింది. దుబాయ్‌లో ఉన్న ముఠా సూత్రధారులు దిల్లీలో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని.. ఈ దందా సాగించారు. నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతంలో పలువురు ఏజెంట్లను నియమించుకొని వసూళ్లకు పాల్పడ్డారు. దీనిపై ఉప్పందడంతో నిర్మల్ ఎస్పీ డా.జానకిషర్మిల ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. ముఠా వసూలు చేసిన సొమ్మును క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులుగా పెట్టనేలేదని తేలింది. ముఠా సభ్యులు నకిలీ యాప్‌ను రూపొందించి పెట్టుబడిదారులకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు సృష్టించారు. వారి పెట్టుబడికి వడ్డీ జమ అయినట్లు యాప్‌లో చూపించారు. అది నిజమేనని నమ్మిన వారు.. మరికొందరితో పెట్టుబడులు పెట్టించారు. అలా సుమారు 1,500 మంది నుంచి సుమారు రూ.50 కోట్ల మేర ముఠా వసూలు చేసింది. నిర్మల్‌తో పాటు ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లోనూ ఈ దందా విస్తరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎక్సైజ్ ఎస్సై, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, కానిస్టేబుల్‌ను గత నెల 25న అరెస్ట్ చేశారు. పదుల సంఖ్యలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏజెంట్లుగా చేరినట్లు తేలింది. ఏజెంట్లు వసూలు చేసిన సొమ్మును తొలుత దిల్లీలోని ముఠా సభ్యులకు పంపగా.. వారు క్రిప్టో కరెన్సీలోకి మార్చి దుబాయ్‌కి తరలించినట్లు అనుమానాలున్నాయి. ఈ దందాపై దృష్టి సారించిన ఈడీ రెండు రోజుల క్రితం నిర్మల్ పోలీసులకు లేఖ రాసింది.

స్థానిక సంస్థల నిధుల ఆడిట్‌పై నిర్ణయం తీసుకోండి

- శాసన సభాపతి, మండలి ఛైర్మన్‌లకు పీఏసీ అధ్యక్షుడి వినతి

ఈనాడు, హైదరాబాద్: స్థానిక సంస్థలకు కేటాయిస్తున్న నిధుల వినియోగం మీద ఆడిట్ నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలను పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ కోరారు. ఈ మేరకు గురువారం వారికి ఆయన వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. స్థానిక సంస్థల నిధుల వినియోగంపై కాగ్ తన నివేదికలో పొందుపరుస్తున్నా.. . వీటిపై పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించడం లేదు. ఇదే విషయంపై తెలంగాణ అకౌంటెంట్ జనరల్ మాధవి ఇటీవల పీఏసీ ఛైర్మన్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం ఆయనకు లేకపోవడంతో... ఈ అంశాన్ని శాసన సభాపతి, మండలి ఛైర్మన్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని అత్యంత ప్రాధాన్యమున్న అంశంగా పరిగణనలోకి తీసుకోవాలని, వీలైతే ప్రత్యేక కమిటీ వేయాలని, పీఏసీకైనా ఆ బాధ్యతను అప్పగించాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాక నిర్ణయాన్ని వెల్లడిస్తామని వారు హామీ ఇచ్చారు. అసెంబ్లీ ప్రాంగణంలో తనకు కేటాయించిన కొత్త గదిలో పీఏసీ ఛైర్మన్ గాంధీ గురువారం పూజ నిర్వహించారు.



మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అరెకపూడి గాంధీ. చిత్రంలో శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు

సీబీఐ అధికారుల పేరుతో వైద్యుడికి టోకరా

రూ.38 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: 'మేం సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. నీపై కేసులున్నాయి. తప్పించాలంటే వెంటనే డబ్బు పంపించాల' ంటూ మోసగాళ్లు ఓ వైద్యుడి నుంచి భారీగా డబ్బు దోచుకున్న ఉదంతమిది. బాధితుడి కథనం మేరకు.. ఏపీలోని నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని రాహుల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ రామయ్యకు మోసగాళ్లు ఫోన్ చేసి సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ విచారణ పేరిట అరగంట పాటు మాట్లాడారు. మీపై కేసులున్నాయని బెదిరించారు. రూ.38 లక్షలు పంపితే కేసుల నుంచి తప్పిస్తామని, లేకపోతే అరెస్టు తప్పదన్నారు. దీంతో సైబర్ నేరగాళ్ల ఖాతాకు ఆ మొత్తం పంపించినట్లు డాక్టర్ రామయ్య తెలిపారు. తర్వాత మోసపోయానని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మయూరం.. ప్రకృతి రమణీయం



ప్రకృతి రమణీయంగా.. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటే.. మయూరాలు పురివిప్పి ఆడుతాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్ల వాగు పక్కన సూర్యోదయ వేళ.. చల్లగాలులు గిలిగింతలు పెడుతుండగా.. ఈ మయూరం చెట్టు కొమ్మన నిలబడి ప్రకృతిని ఆస్వాదిస్తున్నట్లున్న దృశ్యం.. ఇలా కెమెరాకు చిక్కింది.

– ఈనాడు, మహబూబ్‌నగర్



పద్మ విభూషణ్

శ్రీ. రతన్ ఎన్ టాటా

28.12.1937 – 09.10.2024

తన ఎనలేని సహాయ సహకారాలతో కేవలం టాటా గ్రూప్ ను తీర్చిదిద్దటమే కాకుండా మన జాతికి అమూల్యమైన సేవలు అందించిన నిజమైన అసాధారణ నాయకుడు శ్రీ. రతన్ నవల్ టాటా ఇక లేరని బాధాతప్త హృదయాలతో ఆయనకు వీడ్కోలు చెబుతున్నాం.

టాటా గ్రూప్ కోసం, శ్రీ టాటా ఛైర్మన్ కి మించిన బాధ్యతలు చేపట్టి సంస్థ పురోగతిలో కీలకమైన బాధ్యతలు వహించారు. ఆయన ప్రేరణకు ఉదాహరణగా నిలిచారు. శ్రేష్టత, సమగ్రత, వినూత్నతలకు అచంచలమైన నిబద్ధతతో, ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ తన నైతికతకు అనుగుణంగా ఎల్లప్పుడూ ఉంటూనే ప్రపంచవ్యాప్తంగా కూడా విస్తరించింది.

దాతృత్వానికి మరియు సమాజాభివృద్ధికి శ్రీ. టాటా అంకిత భావం లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసింది. విద్య నుండి ఆరోగ్య సంరక్షణ వరకు, ఆయన చేపట్టిన చొరవలు భావి తరాల వారికి కూడా ప్రయోజనం కలిగించే విధంగా ఎంతో విస్తృతమైన ముద్ర వేశాయి. ప్రతి వ్యక్తిగత చర్యలో శ్రీ. టాటా నిజమైన వినయ విధేయతలే ఈ పని అంతటినీ బలపరుస్తోంది.

పూర్తి టాటా కుటుంబం తరపు నుండి, ఆయన కుటుంబానికి, సన్నిహితులకు మేము మా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాము. ఆయన ఎంతో అభిరుచి తో మార్గదర్శకత్వం వహించిన ఆదర్శాలను కొనసాగించడానికి మేము చేసే కృషి లో ఆయన వారసత్వం మమ్మల్ని ప్రేరేపిస్తూనే ఉంటుంది.

TATA

టాటా సన్స్ & టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్



గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్..!

రతన్‌టాటా యువ స్నేహితుడు శంతను భావోద్వేగ పోస్ట్

ఇంటర్నెట్ డెస్క్: "దుఃఖం ప్రేమకు చెల్లించాల్సిన మూల్యం. నా ప్రియమైన దీపస్తంభమా వీడ్కోలు.. (గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్)" అని దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాతో చివరిదశలో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి,



రతన్‌టాటా కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న శంతను నాయుడు పేర్కొన్నారు. టాటాకు అత్యంత విశ్వాసపాత్రుడైన అసిస్టెంట్‌గా వ్యవహరించిన ఆయన.. తన అపూర్వ స్నేహితుడి మరణంపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. "మీ నిష్క్రమణతో మన స్నేహంలో శూన్యం మిగిలింది. ఆ లోటును అధిగమించడానికి జీవితాంతం ప్రయత్నిస్తాను. మీ ప్రేమ దూరమవడంతో కలుగుతోన్న దుఃఖం పూడ్చలేనిది. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్" అని 30 ఏళ్ల శంతను ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే గతంలో ఇద్దరూ కలిసి దిగిన ఒక చిత్రాన్ని షేర్ చేశారు. శంతను 2018 నుంచి రతన్‌టాటాకు అసిస్టెంట్‌గా ఉంటున్నారు. 2014లో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. అప్పట్లో శంతను పుణెలో టాటా ఎలెక్సీలో ఇంజినీర్‌గా పనిచేసేవారు. వాహనం కింద పడి ఓ వీధి శునకం మరణించడాన్ని చూసి చలించిపోయిన ఆయన వాహనదారులు రాత్రిపూట వాటిని సులువుగా గుర్తించేలా మెరిసే బ్యాండ్ (రిఫ్లెక్టివ్ కాలర్)ను స్నేహితులతో కలిసి రూపొందించారు. అనంతరం ఆ విషయాన్ని తెలియజేస్తూ, మరిన్ని కాలర్లు రూపొందించేందుకు నిధులు సమకూర్చాలంటూ రతన్‌టాటాకు లేఖ రాశారు. ఆశ్చర్యకరంగా ఆ లేఖకు రతన్‌టాటా వ్యక్తిగతంగా స్పందించారు. తనతో సమావేశం కావాలని కోరారు. ఆ సమావేశంలో శంతను తెలివితేటలు, మూగజీవాలపై జాలి ఆయనను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం రిఫ్లెక్టివ్ కాలర్లకు నిధులు సమకూర్చడంతోపాటు తనతో కలిసి పనిచేయాల్సిందిగా ఆహ్వానించారు. పెద్ద వయస్కులతో స్నేహం వల్ల కలిగే ప్రయోజనాలు, వృద్ధాప్యంలో వారిపై చూపాల్సిన ఆప్యాయత.. రతన్‌జీతో స్నేహం వల్లే తనకు తెలిసిందని శంతను ఓ సందర్భంలో వెల్లడించారు.

ఆ 60 గంటలు ఎంతో ఉద్వేగానికి గురయ్యా..

తాజ్ హోటల్లో ఉగ్రదాడిపై టాటా

ఇంటర్నెట్ డెస్క్: ముంబయి అనగానే మొదట గుర్తుకొచ్చేది తాజ్‌మహల్ హోటల్. 16 ఏళ్ల క్రితం జరిగిన ఉగ్రదాడిలో ఆ హోటల్‌కు తీరని నష్టం వాటిల్లింది. నాడు తాము ఎదుర్కొన్న సవాళ్లను.. గతంలో రతన్ టాటా పంచుకున్నారు. తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠిన సమయాల్లో అదీ ఒకటని గతంలో తెలిపారు. "60 గంటల పాటు తాజ్‌మహల్ హోటల్‌ను ఉగ్రవాదులు ముట్టడించారు. ఎంతోమంది అతిథులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో నేనెంతో భావోద్వేగానికి లోనయ్యా. ఆ దాడి మా వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపింది. అయినా హోటల్‌ను పునరుద్ధరించేందుకు మా సంస్థ సిద్ధమైంది" అని ఆయన తెలిపారు.




అలాంటి విజేతలంటేనే అభిమానం

విజయవంతమైన వ్యక్తులను నేను ఆరాధిస్తాను. కానీ ఆ విజయాలను నిర్దాక్షిణ్య వైఖరితో సాధించినట్లయితే వారిని నేను మనస్ఫూర్తిగా అభిమానించలేను.
– రతన్ టాటా

పనితో పెళ్లి.. మంచికి తాళి!

సంపన్న కుటుంబమే గానీ...
బాల్యం సంతోషమేమీ కాదు!
తల్లిదండ్రుల విడాకులు...
తల్లి మారు పెళ్లి...
తండ్రి భిన్నధ్రువం
తోటివారి ఎకసెక్కాల మధ్య...
సంఘర్షణల కొలిమిలో
నలిగిన ఆ బంగారం...
బామ్మ చూపిన బాటలో
రతనంలా తయారైంది
శ్రమే ఆయువుగా...
ప్రజాశ్రేయస్సే వాయువుగా
పనిలో పడి పెళ్లికి దూరమయ్యారు
సేవలో పడి వయసును మరిచారు
తన జీవనయానంపై కొన్నేళ్ల
కిందట రతన్‌టాటా చేసిన
అంతరంగ ఆవిష్కరణ...
ఆయన మాటల్లోనే..!



తిరిగి ఇవ్వాలని...

నా జీవితం కంపెనీ కోసం... కంపెనీ అభివృద్ధి కోసంగా మారింది. నన్ను ఛైర్మన్‌గా ప్రకటించినప్పుడు చాలామంది ఇంటిపేరు (టాటా) వల్లే నాకీ పదవి దక్కిందనుకున్నారు. కానీ నా దృష్టంతా ఆ పేరును మించి ఏదో సాధించాలని, సృష్టించాలని, సమాజానికి తిరిగి ఇవ్వాలని ఉండేది. నిజానికి ఆరంభం నుంచీ టాటా సంస్థల డీఎన్ఏలో ఉన్నదా లక్షణమే! ఉదాహరణకు... జంషెడ్‌పుర్‌లో మా కార్మికులు ఎదుగుతుంటే... చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కష్టపడేవారు. కాబట్టి వారి జీవితాలను కూడా మెరుగుపర్చాలని నిర్ణయించుకున్నాం. ఈ దృక్పథం మా కంపెనీకి సహజంగానే అబ్బింది!

ర్యాగింగ్‌ను తట్టుకొని...

నేనూ, మా సోదరుడు ఎదిగే దశలో మా అమ్మానాన్న విడిపోయారు. బామ్మ మమ్మల్ని పెంచింది. విడాకులంటే అప్పట్లో సాధారణ విషయమేమీ కాదు. ఆ కారణంగా తోటి వాళ్లు మమ్మల్ని ర్యాగింగ్ చేసేవారు. మా అమ్మ మరో పెళ్లి చేసుకోగానే.. స్కూల్లో తోటివారి సూటిపోటి మాటలు పెరిగాయి. అలాంటి స్థితిలోనూ నిబ్బరంగా ఉండడం ఎలాగో నానమ్మ నేర్పింది. అలాంటి పరిస్థితులతో పోరాడి సమయం వృథా చేసుకునే బదులు వాటి నుంచి దూరంగా వెళ్లిపోవడం అందులో ఒకటి! ఆ గుణం అలాగే నాతో ఉండిపోయింది! నానమ్మే లేకుంటే... నేనిలా ఉండేవాడినే కాదు!

మెకానికల్‌లో చేరి ఆర్కిటెక్ట్‌గా..

అనేక విషయాల్లో నాన్నకు నాకు పొసిగేది కాదు. నేను అమెరికాలో చదువుకోవాలనుకుంటే ఆయన యూకే అని పట్టుబట్టారు. నేను ఆర్కిటెక్ట్ కావాలనుకుంటే ఆయన ఇంజినీర్ కావాలన్నారు. నానమ్మ లేకుంటే అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో చేరగలిగేవాడినే కాదు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో చేరినా... ఆమె పుణ్యమాని కాలేజీలో మేజర్ సబ్జెక్టులు మార్చుకొని ఆర్కిటెక్చర్ డిగ్రీతో బయటకు వచ్చా. ఇది నాన్నకు కోపం తెప్పించింది! కానీ సొంత వ్యక్తిత్వంతో నిలబడ్డాననే భావన నాకు సంతృప్తినిచ్చింది. నచ్చనిదాన్ని ధైర్యంగానే అయినా... సౌమ్యంగా చెప్పొచ్చనే సంగతి నానమ్మ నుంచి నేర్చుకున్నా!

ఆ యుద్ధంలో పెళ్లి ఓడింది

కాలేజీ తర్వాత లాస్‌ఏంజెలిస్‌లో రెండేళ్లపాటు ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో పనిచేశా. అక్కడి వాతావరణం నాకెంతో నచ్చింది. పనిని బాగా ఆస్వాదించాను. లాస్‌ఏంజెలిస్‌లో ఉన్నప్పుడే ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డా. దాదాపు పెళ్లి దాకా వచ్చేసింది. అదే సమయంలో బామ్మ ఆరోగ్యం బాగోలేకపోవటంతో తాత్కాలికంగా స్వదేశానికి తిరిగి వచ్చేశా! నేను పెళ్లాడాలనుకున్న ఆమె కూడా నాతో భారత్‌కు వస్తుందని భావించా! కానీ 1962 భారత్-చైనా యుద్ధం కారణంగా... ఆమె తల్లిదండ్రులు తనను పంపడానికి ఇష్టపడలేదు. అలా మా బంధానికి ఫుల్‌స్టాప్ పడింది.

ఏం చెయ్యాలో చెప్పేవారు కాదు

భారత్‌కు వచ్చాక... బామ్మ కనుమూసే వరకూ తనతోనే చాలా సమయం గడిపా! కుక్కతో పరుగెత్తడం... నానమ్మతో కబుర్లు చెప్పడం నా దినచర్యలో భాగమైంది. ఆమె మరణానంతరం ఇప్పుడు టాటామోటార్స్‌గా పిలిచే జంషెడ్‌పుర్‌కు ఇంటర్న్‌షిప్ కోసం వెళ్లా. అదో వృథాప్రయాస అనిపించింది. ఎందుకంటే అన్నింటి గురించి అవగాహన రావాలన్న ఉద్దేశంతో నన్ను ఒక విభాగం నుంచి మరో విభాగానికి పంపించేవారు.

సేవ చేసిన వారికి సేవ

టాటా స్టీల్‌కు మారిన తర్వాత నాకంటూ ఓ పని కుదిరింది. ఇష్టం పెరిగింది. కిందినుంచి పని మొదలెట్టా! అక్కడ పనిచేసేవారు ఎంతగా కష్టపడతారో అర్థం చేసుకున్నా! అందుకే... తర్వాతి కాలంలో టాటా స్టీల్ సిబ్బంది సంఖ్యను 78వేల నుంచి 40 వేలకు కుదించినప్పుడు... తీసేసిన వారందరికీ వారు రిటైరయ్యేదాకా జీతం ఇచ్చాం. మాకు సేవ చేసినవారికి సేవ చేయాలన్న గుణం... టాటా డీఎన్ఏలోనే ఉంది!

2-3 పెళ్లిళ్లు మిస్...

అలా పనే నా జీవనశైలిగా మారిపోయింది. ఉంటే బాంబే హౌస్‌లో ఉండడం, లేదంటే ప్రయాణంలోనో! అందుకే రెండు మూడుసార్లు (వేరువేరు వ్యక్తులతో) పెళ్లికి దగ్గరగా వచ్చి కూడా చేసుకోలేకపోయా! ఎందుకంటే నా జీవితంలోకి వచ్చేవారు పనే ప్రపంచంగా మారిన నా జీవనశైలితోనూ సర్దుబాటు చేసుకోవాల్సిందే! అదంత సులభం కాదని అర్థమైంది.

వ్యతిరేకత మధ్య ఛైర్మన్‌గా..

1991లో టాటా ఇండస్ట్రీస్ ఛైర్మన్ బాధ్యతల నుంచి, తర్వాత టాటా సన్స్ నుంచి జేఆర్‌డీ వైదొలగారు. ఆ బాధ్యతలు నాకు అప్పగించారు. దానిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ పదవిని ఆశిస్తున్న వారు చాలామంది జేఆర్‌డీ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని, పక్షపాతంతో నన్ను ఎంపికచేశారని ఆక్షేపించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎలా మెలగాలో అర్థమైంది కాబట్టి... నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో నా పని చేసుకుంటూ వెళ్లిపోయా! నా ప్రతి అడుగునూ దుర్భిణిలో చూసేవారు! అవన్నీ పట్టించుకోకుండా నన్ను నేను నిరూపించుకోవడంపైనే దృష్టిసారించా. చాలా నేర్చుకున్నా... మళ్లీ వెనుదిరిగి చూడాల్సిన అవసరం రానంతగా!

మా బంధం మాటలకందనిది

నన్ను ఛైర్మన్‌గా నియమించడం చాలా పెద్ద విషయం. నిర్ణయం తీసుకున్న తర్వాత జేఆర్‌డీని కలవడానికి వెళ్లా. ఆయన తన సెక్రటరీని పిలిచి... ఈ ఆఫీసు ఖాళీ చేసి రతన్‌కు అప్పగించాలని చెప్పారు. నేను వెంటనే "లేదు జే... దయచేసి మీరు ఖాళీ చేయొద్దు. ఇది మీ ఆఫీసు. మీరు కోరుకున్నన్ని రోజులు ఇక్కడే ఉండండి" అన్నాను. మరి నువ్వెక్కడ కూర్చుంటావని అడిగారాయన! ఇప్పుడు కూర్చున్నచోటే నాకు బాగుంది, సరిపోతుందని చెప్పా. జే... అక్కడే ఉండటం అదృష్టంగా భావిస్తాను. నాకు దొరికిన గొప్ప మార్గదర్శి ఆయన! ఆయన ఉన్నంతకాలం రోజూ కలిసేవాడిని. ఓ తండ్రిలా, సోదరుడిలా ముందుకు నడిపించారు. మాటలకందని బంధం మాది!

- ఈనాడు ప్రత్యేక విభాగం

రిటైర్మెంట్ అంటే...

రిటైరయ్యాక జీవనశైలి మారింది. చాలామంది నిజంగా రిటైరయ్యారా అని అడుగుతుంటారు. నిజంగానే... అందులో సందేహం అక్కర్లేదని వారికి చెబుతుంటా. కంపెనీ బాధ్యతల నుంచి దూరమయ్యా! ఆ ఎడబాటును ఎంజాయ్ చేస్తున్నా. పనికిరాని చెత్త సమాచారాన్ని నా వద్దకు చేరనివ్వను. అలాగని రిటైర్ కావడమంటే... గోల్ఫ్ ఆడుకుంటూనో, బీచ్‌లో కాక్‌టెయిల్ తాగుతూనో గడపడం కాదు. అంతకుముందు కంటే ఇంకా ఎంతో చేయాలనే తపన మొదలైంది. క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తేవడం నుంచి గ్రామీణ భారతంలో జీవితాలను మెరుగుపర్చడం దాకా టాటా ట్రస్టు ద్వారా చేయాలనుకుంటున్నాం.

అదే నా సలహా!

పాత, కొత్త... చిన్న, పెద్ద వయసులతో సంబంధం లేకుండా స్నేహితులతో సమయాన్ని ఎంజాయ్ చేస్తున్నా. వారి నుంచి నిరంతరం నేర్చుకుంటున్నా. 82 ఏళ్లు దాటాక కూడా నేర్చుకుంటున్నా. అందుకే ఎవరైనా మంచి సలహా ఇవ్వాలని అడిగితే... "మంచిసలహా అనేది సమయాన్ని బట్టి మారుతుంటుంది. కానీ ఎప్పటికీ మారనిదేంటంటే మంచి పని చేయాలన్న తపన! అదుంటే చాలు... అని చెప్పాలనిపిస్తుంటుంది" అంటాను. అందుకే... సలహాల సంగతి ఆపేసి... కష్టమైనా సరే సరైన పని చేయడంపై దృష్టి సారించాలని చెబుతుంటా! ఎందుకంటే జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే... సరైన పని చేయడమే కీలకమైందని అర్థమవుతుంది.

రతన్.. టాటా అయ్యారిలా..

రతన్ టాటా అనగానే... జంషెడ్‌జీ టాటా వంశాంకురం... వారి ఇంటపుట్టిన వారసుడు అనుకుంటారు చాలా మంది. కానీ కాదు. టాటా సంస్థల వ్యవస్థాపకుడు జంషెడ్‌జీకి రతన్‌గానీ, ఆయన తండ్రి నావల్ టాటాగానీ రక్త సంబంధీకులు కాదు. జెంషెడ్‌జీ టాటాకు ఇద్దరు కుమారులు. వారిద్దరికీ పిల్లలు లేరు. చిన్న కుమారుడు రతన్ టాటా భార్య నవాజ్‌బాయి. 1918లో రతన్‌జీ మరణించగా... 41 ఏళ్ల వయసులోనే నవాజ్‌బాయి ఒంటరయ్యారు. దీంతో ముంబయిలోని జేఎన్ పెటిట్ పార్సీ అనాథాశ్రమం నుంచి... నావల్ అనే బాలుడిని దత్తత తీసుకున్నారు. నావల్ తండ్రి అహ్మదాబాద్‌లో బట్టల మిల్లులో పని చేసి చనిపోయారు. చిన్నచిన్న పనులు చేసుకునే తల్లికి కుటుంబాన్ని నడపటం కష్టం కావడంతో నావల్‌ను ముంబయిలోని అనాథాశ్రమంలో ఉంచారు. అక్కడే ఆయన్ను చూసిన నవాజ్‌బాయి దత్తత తీసుకుని పెంచి చదివించారు. అలా నావల్ టాటాగా మారారు. నావల్, సూనిలకు జన్మించిన కుమారుడికి తన భర్త పేరు (రతన్) పెట్టుకుని మురిసిపోయారు నవాజ్‌బాయి టాటా. కానీ మనవడి పదో ఏటనే నావల్, సూనిలు విడిపోవటంతో... రతన్ టాటాను అన్నీ తానై పెంచారు నానమ్మ నవాజ్‌బాయి. జంషెడ్‌జీ టాటా వ్యాపార, నైతిక విలువలను మనవడికి నూరిపోశారు.

ఆ మాటలే మంత్రాలుగా..

టాటా గ్రూపులో చేరిన సమయాన గ్రూపులోని పెద్దలుగానీ... ఛైర్మన్ జేఆర్‌డీ టాటాగానీ సంస్థకు ఆయన్ను వారసుడిగా గుర్తించలేదు. రతన్ కూడా.. తాను సంస్థ ఛైర్మన్ అవుతానని ఎన్నడూ అనుకోలేదు. కానీ నానమ్మ ఇచ్చిన ధైర్యం.. నూరిపోసిన విలువలు ఆలంబనగా ఆయన దూసుకుపోయారు. 'మంచి ఆలోచనలు.. మంచి మాటలు.. మంచి పనులు...' ... టాటా కేంద్ర కార్యాలయం బాంబే హౌస్‌పై రాసి ఉండే పార్సీ తాత్విక వచనాలను మనసావాచా కర్మణ ఆచరిస్తూ... టాటా గ్రూపును కొత్తపుంతలు తొక్కించారు రతన్ టాటా.

- ఈనాడు ప్రత్యేక విభాగం

టాటాల కుటుంబమిదీ..

ముంబయి: టాటా గ్రూపును జంషెడ్‌జీ టాటా స్థాపించారు. తొలుత ఆయన టెక్స్‌టైల్, స్టీల్ రంగాల్లో ప్రవేశించారు. ఆయన హీరాబాయి దాదూను వివాహం చేసుకున్నారు. వారికి దొరాబ్జీ టాటా, ధుంబాయ్ టాటా, సర్ రతన్ టాటా (సీనియర్) అనే పిల్లలున్నారు.

- నవాజ్‌బాయి సేథ్‌ను సర్ రతన్ టాటా పెళ్లి చేసుకున్నారు. రతన్ చనిపోయాక నావల్ హెచ్ టాటాను నవాజ్‌బాయి దత్తత తీసుకున్నారు.
- సోనూ కమీసరియత్‌ను నావల్ హెచ్ టాటా వివాహమాడారు. వారికి రతన్ ఎన్ టాటా, జిమ్మీ ఎన్ టాటా అనే ఇద్దరు పిల్లలున్నారు. మరోవైపు సిమోన్ అనే మరో మహిళనూ నావల్ హెచ్ టాటా పెళ్లి చేసుకున్నారు. వారికి నోయల్ టాటా పుట్టారు. రతన్ ఎన్ టాటా, నోయల్ టాటా సవతి సోదరులు.
- నావల్ టాటా ముగ్గురు కుమారుల్లో రతన్ టాటా, జిమ్మీ టాటా పెళ్లి చేసుకోలేదు.
- దివంగత సైరస్ మిస్త్రీ సోదరి ఆలూ మిస్త్రీని నోయల్ టాటా వివాహమాడారు. నోయల్ దంపతులకు లీ టాటా, మాయా టాటా, నెవిల్లీ టాటా జన్మించారు.

నా తండ్రి పనికి పోకపోతే.. ఈ దేశంలోని ఏ ఇల్లూ సరిగా నడవదు..!

రతన్ టాటాను ఆకట్టుకున్న విద్యార్థి కవిత

ఇంటర్నెట్ డెస్క్: పారిశుద్ధ్య కార్మికుడైన తన తండ్రి గొప్పతనం, దయనీయ జీవన విధానంపై 2020లో ఓ విద్యార్థి పాఠశాలలో చెప్పిన కవిత ఒకటి రతన్ టాటాను బాగా ఆకట్టుకుంది. దానికి సంబంధించిన వీడియో క్లిప్‌ను అప్పట్లో రతన్ టాటా రీ ట్వీట్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల స్థితిగతులను వివరిస్తూ వారిపై భారం తగ్గించేందుకు టాటా గ్రూప్ చేస్తున్న కృషిని రతన్ టాటా అందులో వివరించారు. "ముంబయిలో రోజూ 50 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు క్లిష్ట పరిస్థితుల్లో పని చేస్తున్నారు. మిషన్ గరిమ ద్వారా ఆ పరిస్థితులు మెరుగుపరచడానికి 'టూబిన్స్ లైఫ్ విన్స్' నినాదంతో టాటా ట్రస్టు కృషి చేస్తోంది" అని ఆయన అప్పటి పోస్టులో పేర్కొన్నారు. రతన్ టాటా కన్నుమూసిన నేపథ్యంలో.. అప్పటి పోస్టు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమైంది.

నా తండ్రి దేశాన్ని దౌడు తీయిస్తాడు..

"ఆయన నాయకుడు కాదు..
అయినా దేశాన్ని దౌడు తీయిస్తాడు.
ఆయన వైద్యుడు కాదు..
అయినా వ్యాధులను దూరం చేస్తాడు.
ఆయన పోలీసు కాదు.. అయినా చెడును అడ్డుకుంటాడు.
ఆయన సైనికుడు కాదు..
అయినా దేశంలోని దుష్టశక్తులను పారదోలుతాడు.
నా తండ్రి పనికి పోకపోతే..
ఈ దేశంలోని ఏ ఇల్లూ సరిగా నడవదు.
వంట కూడా వండుకోరు.. స్నానాలు చేయరు..
నా తండ్రి మాదిరి పనిని ఏ ఒక్కరూ చేయాలనుకోరు.
తడి, పొడి చెత్తను దేశంలో ఎవరూ వేరు చేయడం లేదు.
నా తండ్రి మురుగు నీటిలో మునిగి
చెత్తను బయటకు తీస్తున్నాడు.
ఆయన పని నుంచి బయటకు వచ్చినప్పుడు..
తరచూ జబ్బు పడినట్లు కనిపిస్తాడు.
కొన్నిసార్లు ఆయన ఈ జబ్బులతో చనిపోతారనుకుంటాను.
కొన్నిసార్లు ఆయన మళ్లీ ఇంటికి రారనుకుంటాను.
దేశాన్ని నా తండ్రి ఒంటరిగా నడిపే పరిస్థితి వద్దు.
ఎందుకంటే దేశం మనలోని ప్రతిఒక్కరితో నడుస్తోంది.."

అంటూ ఆ బాలుడు తన తండ్రి పని విలువను అక్షరీకరించాడు. రతన్‌టాటా రీట్వీట్ చేసిన ఈ పోస్టు అప్పట్లో వైరల్ అయ్యింది.

నలిగిపోతున్న పిల్లల కోసం నానో

దిల్లీ, కోల్‌కతా: నానో కారు.. ఇప్పటి తరానికి దీని గురించి పెద్దగా పరిచయం లేకపోవచ్చు. రెండు దశాబ్దాల క్రితం అదో పెద్ద సంచలనం. టాటా గ్రూపు నుంచి లక్ష రూపాయలకే కారు అనగానే.. అప్పటివరకూ కారు కొనాలన్న ఊహ లేని వారి మదిలో సైతం మెదిలిన కారు అది. మధ్యతరగతి కోసం లక్ష రూపాయలకే కారు తీసుకొస్తామన్న రతన్ టాటా ప్రకటన వెలువడింది మొదలు.. ఎన్నో సందేహాలు.. మరెన్నో వివాదాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ రోడ్లపైకి వచ్చిందీ కారు.



2010లో గుజరాత్‌లో 'నానో' కారును ఆవిష్కరిస్తున్న రతన్ టాటా, ఆ రాష్ట్ర నాటి సీఎం మోదీ

మధ్యతరగతి కోసం..

దేశంలో కార్లంటే సంపన్న వర్గాలకే పరిమితం అనుకునే రోజులవి. మధ్యతరగతి కుటుంబాలకు ద్విచక్ర వాహనాలే దిక్కు. ముంబయిలో వర్షం పడుతుండగా తండ్రి స్కూటర్ నడుపుతుంటే.. భార్య, పిల్లలు వెనుక సీట్లో కూర్చునేవారు. ఆ ప్రయాణంలో తల్లిదండ్రుల మధ్య పిల్లలు నలిగిపోవడం చూసి చలించిన రతన్ టాటా.. మధ్యతరగతి వారి కోసం ఓ కారు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్లకే తన మనసులో మాటను బయటపెట్టారు. అంతేకాదు దాన్ని లక్ష రూపాయలకే అందిస్తామని ప్రకటించారు. అలా పురుడు పోసుకుంది నానో కారు.

సందేహాలు.. వివాదాలు

'అదంతా అయ్యే పని కాదు' అంటూ చాలామంది నానో ప్రాజెక్టు కారుపై పెదవి విరిచారు. తొలుత ఈ కారును పశ్చిమ బెంగాల్‌లో తయారు చేయాలనుకున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే టాటా గ్రూపునకు, అక్కడి వామపక్ష ప్రభుత్వం జరిపిన భూ కేటాయింపులకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ పెద్ద ఉద్యమం నడిపారు. దీంతో ఈ ప్రాజెక్టు గుజరాత్‌లోని సనంద్‌కు తరలి వెళ్లింది. ఎన్ని వివాదాలు చుట్టుముట్టినా.. రతన్ టాటా వెనక్కి తగ్గలేదు. తొలుత 2008లో దిల్లీలోని ఆటో ఎక్స్‌పోలో నానో కారును ఆవిష్కరించారు. 2009లో మార్కెట్‌లోకి విడుదల చేశారు. నానో కారు ప్రకటన వెలువడి ఐదేళ్లు దాటిపోయినా ఇచ్చిన మాట ప్రకారం రూ. లక్షకే కారును తీసుకొచ్చారు రతన్ టాటా. కారు ఉత్పత్తి ఖర్చులవల్ల ఆ ధరకు రాదని తెలిసినా నష్టాలను భరించి మరీ నానో కారును ప్రజలకు చేర్చారు.

ముగిసిన ప్రయాణం

నానో కారు.. 2.75 లక్షల యూనిట్లను టాటా గ్రూపు విక్రయించింది. అయితే ప్రపంచంలోనే అతి తక్కువ ధర కారుగా వచ్చిన నానో.. వాస్తవంలో మధ్యతరగతికి చేరువవ్వడంలో విఫలమైంది. దీనికి 'చీపెస్ట్ కారు' అని ముద్ర పడటం ఒక కారణమని రతన్ టాటానే ఓ సందర్భంలో అంగీకరించారు. దీంతో నానాటికీ నానో విక్రయాలు పడిపోయాయి. అలా 2019లో నానో ప్రస్థానం ముగిసింది.



2000లో రతన్‌టాటాను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరిస్తున్న నాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్



2008లో టాటాకు పద్మవిభూషణ్ పురస్కారం అందిస్తున్న రాష్ట్రపతి ప్రతిభా పాటిల్



2007లో పుణెలో టీసీఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో నాటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంతో రతన్



బెంగళూరులో 2016లో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడితో..




మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో..



2004లో దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటి ఉప ప్రధాని ఎల్.కె.అడ్వాణీ, రతన్ టాటా

దాతృత్వంలో దధీచి!



రతన్ టాటా బడా పారిశ్రామికవేత్త మాత్రమే కాదు.. గొప్ప మానవతావాది కూడా. దేశంలో విద్య, ఆరోగ్య ప్రమాణాలను పెంచేందుకు ఆయన నిరంతరం పరితపించారు. టాటా సన్స్‌లోని రతన్ షేర్లలో 65%కు పైగా దాతృత్వ కార్యక్రమాలకే మళ్లేవి. సేవా కార్యక్రమాల కోసం ఎప్పటికప్పుడు ఆయన భూరి విరాళాలు అందించారు. రతన్ టాటా తన తుదిశ్వాస వరకూ టాటా ట్రస్ట్‌ల ఛైర్మన్‌గా ఉన్నారు. అవి చేపట్టిన అనేక దాతృత్వ కార్యక్రమాలపై తనదైన ముద్ర వేశారు. ఆరోగ్య సేవలు, గ్రామీణాభివృద్ధి, సుస్థిర జీవనం తదితర రంగాల్లో పలు ప్రాజెక్టులకు టాటా ట్రస్ట్‌లు అండగా నిలిచాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే..

విద్యార్థులకు బాసట

- దేశవ్యాప్తంగా అనేక విద్యాసంస్థలకు టాటా ట్రస్ట్‌లు నిధులు సమకూర్చాయి. ఈ జాబితాలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సహా పలు ఐఐటీలు ఉన్నాయి.
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యారంగంలో ప్రమాణాలు పెంచుతున్నాయి.
- అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో భారతీయ విద్యార్థుల కోసం టాటా గ్రూప్ 2.8 కోట్ల డాలర్లతో ఉపకార వేతన నిధిని ప్రారంభించింది.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు రతన్ టాటా 2010లో వ్యక్తిగతంగా 5 కోట్ల డాలర్ల విరాళం అందజేశారు. ఆ నిధులతో అక్కడి ప్రాంగణంలో టాటా హాల్ నిర్మాణం జరిగింది.

పరిశోధనలు.. నవకల్పనలు..

- అల్జీమర్స్ వ్యాధిపై పరిశోధనల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రూ.75 కోట్లు అందించారు.
- అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంఐటీ టాటా సెంటర్ ఆఫ్ టెక్నాలజీ అండ్ డిజైన్‌ను స్థాపించారు.
- ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం, ఇంధనం, పర్యావరణం వంటి అంశాలపై దృష్టిసారించేలా షికాగో విశ్వవిద్యాలయంలో టాటా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటుచేశారు.

ఆరోగ్యానికి అండ

- ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేసేందుకు రతన్ టాటా నేతృత్వంలో టాటా ట్రస్ట్‌లు విశేషంగా కృషి చేశాయి.
- టీకా కార్యక్రమాలకు భారీగా నిధులు అందజేశాయి.
- క్యాన్సర్‌పై పోరుకు అధికంగా ప్రాధాన్యమిచ్చాయి.
- కోల్‌కతాలో టాటా మెడికల్ సెంటర్ ఏర్పాటుకు 2010లో రూ.220 కోట్లు కేటాయించారు.
- క్యాన్సర్ బాధితుల కోసం దేశవ్యాప్తంగా అత్యాధునిక చికిత్సా కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేశారు.
- ఆంకాలజీలో పరిశోధనల కోసం గ్రాంట్లు మంజూరు చేశారు. ఆధునిక చికిత్సా సాధనాలను విరాళంగా అందించారు.

గ్రామీణాభివృద్ధికి బాటలు

- జల సంరక్షణ, నీటి పారుదల వసతులపై దృష్టిపెడుతూ టాటా వాటర్ మిషన్‌ను తీసుకొచ్చారు.
- వ్యవసాయ ఉత్పాదకతను పెంచేలా, ఆ రంగంలో జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేలా పలు ప్రాజెక్టులు చేపట్టారు.
- గ్రామాల్లో మహిళల సాధికారత, సుస్థిర సాగు కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

విపత్తుల వేళ అండగా..

- ప్రకృతి విపత్తుల వేళ ప్రజలను ఆదుకునేందుకు రతన్ టాటా వ్యక్తిగతంగా, ట్రస్ట్‌ల ద్వారా ఆర్థిక సహాయం చేశారు. మౌలిక వసతులు కల్పించారు. పునరావాస కార్యక్రమాలు చేపట్టారు.
- టాటా ట్రస్టులు 2021 వరకు మొత్తంగా 10,240 కోట్ల డాలర్ల విరాళం అందజేయడం విశేషం.

ఆ యువతికి రక్షణగా ఏకంగా ఛోటూనే..!

రతన్ టాటాకు ఇన్‌స్టాలో ఫాలోవర్ల సంఖ్య పది లక్షలు దాటినప్పుడు ధన్యవాదాలు చెబుతూ ఒక ఫొటోను పోస్టు చేశారు. ఆ పోస్టుకు ఓ యువతి స్పందిస్తూ.. 'శుభాభినందనలు ఛోటూ' అని కామెంట్ చేసింది. అది చూసి చాలామంది ఆమెను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. భయపడిన ఆ యువతి తన కామెంట్‌ను డిలీట్ చేసింది. విషయం రతన్ టాటాకు తెలిసి.. "ఓ అమాయక యువతి తన మనోభావాలను హృదయపూర్వకంగా వ్యక్తం చేసింది. నన్ను ఛోటూ అని సంబోధించింది. అందుకు ఆమెను చాలా మంది వేధించారు. కానీ ఆమె కామెంట్‌ను నేను గౌరవిస్తాను, అభినందిస్తాను. భవిష్యత్తులో కూడా ఆమె నిర్భయంగా పోస్టులు పెట్టవచ్చు" అంటూ ఆమెకు అండగా ఇన్‌స్టాలో స్టోరీని షేర్ చేశారు.

క్యాన్సర్ బాధితురాలిని ఆదుకుని

ఓ పేద మహిళ క్యాన్సర్ వ్యాధితో పోరాడుతోందని, చికిత్స కోసం ఆమెకు సాయం చేయాలంటూ అందిన మెయిల్‌కు రతన్ టాటా సత్వరం స్పందించిన ఉదంతమిది. ఈ ఘటన 2019లో చోటుచేసుకుంది. తిరుపతిలో 2018 ఆగస్టు 31న అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రతన్ టాటా క్యాన్సర్ ఆసుపత్రి శంకుస్థాపనకు హాజరయ్యారు. ఆ సమయంలో అప్పటి తితిదే బోర్డు ఛైర్మన్, తెదేపా నేత పుట్టా సుధాకర్ యాదవ్ ప్రైవేటు కార్యదర్శి తోట రాజేశ్ ఆయనతో పరిచయం చేసుకున్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని నాగిశెట్టిపల్లెకు చెందిన ఆరెళ్ల రాధమ్మ రక్త క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో ఆమెను రాజేశ్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. కొంతమేర వైద్య ఖర్చులు భరించినా.. పూర్తిగా కోలుకోలేదు. చికిత్సకు మరిన్ని నిధులు అవసరమయ్యాయి. క్యాన్సర్ ఆసుపత్రి శంకుస్థాపన రోజున పరిచయం చేసుకున్న వ్యక్తినంటూ.. దొరాబ్జీ ట్రస్టుకు రాజేశ్ మెయిల్ పంపారు. బాధితురాలికి అవసరమైన వైద్యం గురించి వివరించారు. రతన్ టాటా వెంటనే స్పందించారు. సర్ దొరాబ్జీ టాటా ట్రస్టు ఛైర్మన్‌గా రూ.10 లక్షల నగదును హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి పంపించారు. అనంతరం బాధితురాలికి చికిత్స విజయవంతమై పునర్జన్మ పొందారని రాజేశ్ తెలిపారు.

ఉగ్ర బాధిత కుటుంబాలకు ..

26/11 ముంబయి ఉగ్రదాడిలో తాజ్ హోటల్ సిబ్బంది 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల, గాయపడినవారి కుటుంబాలను రతన్ టాటా స్వయంగా పరామర్శించారు. వారి పిల్లల చదువు బాధ్యతలను టాటా గ్రూప్ చూసుకొంటుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగులు ఉగ్రదాడిలో చనిపోకపోయి ఉంటే మిగిలిన జీవితకాలంలో ఎంత వేతనం వచ్చి ఉండేదో.. అంత మొత్తాన్ని మృతుల కుటుంబాలకు అందజేశారు. తాజ్ పబ్లిక్ సర్వీస్ వెల్ఫేర్ గ్రూపును ప్రారంభించారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం



అంత్యక్రియల కోసం ప్రత్యేక వాహనంలో రతన్ టాటా పార్థివదేహం తరలింపు

కొవిడ్ వేళ.. ఉద్యోగుల తరఫున గళం విప్పి..

కొవిడ్ విజృంభణ వేళ ఆ మహమ్మారిని సాకుగా చూపి కంపెనీలు ఉద్యోగులను వదిలించుకోవడంపై రతన్ టాటా గళమెత్తారు. ఉద్యోగులను రోడ్డున పడేస్తే కంపెనీల సమస్యలు తీరుతాయా అని ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ ప్రశ్నించారు. ఉద్యోగులను తొలగించకుండా, సరైన దిశలో ఆలోచించి చర్యలు తీసుకొంటే ఈ కష్టం నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు. కొవిడ్‌పై పోరాడేందుకు రతన్ వ్యక్తిగతంగా రూ.500 కోట్లు విరాళంగా అందించారు.




గుజరాత్‌లోని సూరత్‌లో రతన్ టాటా చిత్రానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తుప్పు లాంటివే ప్రతికూల ఆలోచనలు

ఇనుమును ఏదీ నాశనం చేయలేదు.. తుప్పు తప్ప! అలాగే ఎవ్వరినీ ఇంకొకరు నాశనం చేయలేరు.. వారి ప్రతికూల ఆలోచనా విధానం తప్ప!

– రతన్ టాటా



ఇక ఆ శునకాలకు దిక్కెవరు!

● బాంబేహౌస్‌లో వాటికి సౌకర్యాలు



ముంబయి: 'బాంబే హౌస్'.. టాటా గ్రూప్ కేంద్ర కార్యాలయం. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో బ్రిటిష్ కాలంనాటి ఈ భవనంలోకి ప్రవేశించే సందర్శకులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అదే సమయంలో అక్కడ ఓ వీధి శునకం ఎలాంటి బెరుకూ లేకుండా ఠీవీగా నడుచుకుంటూ లోపలకు వెళుతుంటే ఏ ఒక్కరూ ఆపరు. ఆ కార్యాలయానికి తొలిసారి వెళ్లిన వారికి ఈ తతంగమంతా ఆశ్చర్యంగా అనిపించినా.. అక్కడున్న వారికి మాత్రం అదో సర్వసాధారణ అంశం. టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్‌టాటాకు శునకాలపై ఉన్న మమకారమే ఇందుకు కారణం. గతంలో ఓసారి వర్షం కురుస్తున్న సమయంలో 'బాంబే హౌస్' వెలుపల ఓ శునకం గజగజ వణుకుతుండడం చూసి చలించిపోయిన రతన్‌టాటా.. కార్యాలయంలోకి శునకాలను అనుమతించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. బాంబేహౌస్‌ను ఆధునికీకరించినప్పుడు గ్రౌండ్‌ఫ్లోర్‌లో శునకాల కోసం ఓ గదిని తీర్చిదిద్దారు. విశాలమైన ఈ గదిలో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఇక్కడకు వచ్చిన శునకాలకు అటెండర్ స్నానం చేయిస్తాడు. అనంతరం అవి బంకర్ బెడ్‌పై హాయిగా కొద్దిసేపు నిద్రిస్తాయి. కొన్ని శునకాలు శాశ్వతంగా బాంబేహౌస్‌లోనే ఉంటుండగా, మరికొన్ని అప్పుడప్పుడూ వస్తుంటాయి. వాటికి సైతం సకల సౌకర్యాలు కల్పిస్తారు. ఇక అడుగడుగునా రాజరికం ఉట్టిపడే తాజ్ హోటల్‌కు వెళ్లినప్పుడు ఓ వీధి శునకం ప్రవేశద్వారం పక్కనే నిద్ర పోవడానికి సంబంధించిన దృశ్యాలు గతంలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ శునకం అలా హోటల్ ఆవరణలో నిద్రిస్తున్నా ఎవరూ అడ్డుకోకపోవడానికీ రతన్ టాటాకు మూగజీవులపై ఉన్న ప్రేమే కారణం.

రతన్‌టాటా మరణంతో ఆయన పెంపుడు శునకం గోవా తల్లడిల్లుతోంది. పార్థివదేహం వద్ద కూర్చొని ఆ శునకం పడుతున్న వేదనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అంతేకాదు మృతదేహం నుంచి దూరంగా తీసుకెళ్లేందుకు యత్నించగా అది నిరాకరించింది. గోవాతో రతన్ టాటాకు మంచి అనుబంధం ఉంది. గతంలో ఒకసారి రతన్ టాటా గోవా వెళ్లారు. ఆ సమయంలో ఈ శునకం ఆయన వెంటే నడవడం ప్రారంభించింది. ఆ మూగజీవిని చూసి ముచ్చట పడిన టాటా.. దాన్ని దత్తత తీసుకుని గోవా అని పేరు పెట్టారు. అనంతరం ముంబయి తీసుకొచ్చారు. అలా 11 ఏళ్లుగా ఆయనతో పాటు గోవా ఉంటున్నట్లు దాని కేర్‌టేకర్ మీడియాకు తెలిపారు.



పార్థివదేహం దగ్గర నుంచి కదలని 'గోవా'

పెంపుడు శునకం కోసం లండన్ పర్యటనే రద్దు

దిల్లీ: పెంపుడు శునకానికి అనారోగ్యంగా ఉండడంతో రతన్‌టాటా ఏకంగా లండన్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన స్నేహితుడు, వ్యాపారవేత్త నిరంజన్ హీరానందాని గురువారం గుర్తుచేసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం గతంలో రతన్ టాటాకు గౌరవ పూర్వకంగా నైట్‌హుడ్ అవార్డును ప్రకటించింది. దాన్ని స్వీకరించడానికి ఆయన బయలుదేరాల్సిన సమయమది. "లండన్ వెళ్లాల్సిన ఆయన చివరి నిమిషంలో ఆ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఎందుకా అని ఆరా తీస్తే.. ఆయన పెంపుడు శునకం అనారోగ్యానికి గురైందని తెలిసింది. దానిపై ఆయన ఎంతో శ్రద్ధ చూపారు. అత్యంత నిరాడంబరంగా ఉండే రతన్‌జీకి సంబంధించి ఇది ఒక ఉదాహరణ మాత్రమే" అని కొనియాడారు.



రతన్ టాటా భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



రతన్ టాటా చివరి చూపు కోసం ఎన్‌సీపీఏకు తరలివచ్చిన అభిమానులు

తెలంగాణతో దృఢబంధం

- టాటాతో విడదీయరాని అనుబంధం
- భారీగా పరిశ్రమలు, పరిశోధన సంస్థల ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు తెలంగాణతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో, రాష్ట్ర విభజన అనంతరం ఆయన తెలంగాణలో పలు దఫాలు పర్యటించారు. వివిధ సంస్థల ప్రారంభోత్సవాలు, గ్రాడ్యుయేషన్ డేలు, వార్షికోత్సవాలు, స్నాతకోత్సవాలు, సభలు, సమావేశాలకు హాజరయ్యేవారు. భారీ పెట్టుబడులతో పారిశ్రామిక సంస్థలను నెలకొల్పి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడమే కాకుండా అత్యున్నత విద్యా పరిశోధన సంస్థలను ఏర్పాటు చేసి.. ఆయా రంగాల్లో అభివృద్ధికి సహకరించారు. టాటా ట్రస్టు తరఫున ఉదాత్తంగా సాయం అందించారు.

- ఇండియన్ బిజినెస్ స్కూల్ హైదరాబాద్‌లో 1999 డిసెంబరు 20న ప్రారంభమైంది. బోర్డు ప్రారంభ డైరెక్టర్లలో ఒకరిగా రతన్ టాటా ఉన్నారు. 2006లో ఏప్రిల్ 8న జరిగిన గ్రాడ్యుయేషన్ డేకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- హైదరాబాద్‌లో 1998లో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీకి 2006 నుంచి రతన్ టాటా ఆర్థిక సాయం అందించారు. సంస్థలో భాగంగా కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌ను 2015లో ప్రారంభించగా.. దానికి టాటాలు సాయం అందించారు.
- 2010లో ఆదిభట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ద్వారా రూపొందించిన మొదటి సికోర్‌స్కీ ఎస్-92ను అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కె.రోశయ్య, హోంమంత్రి సబితారెడ్డిలతో కలిసి రతన్ టాటా ప్రారంభించారు.
- 2014 సెప్టెంబరు 27న ఆయన హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కెనడా స్కూలిచ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను అప్పటి సీఎం కేసీఆర్‌తో కలిసి ప్రారంభించారు.
- 2015 నవంబరు 5న హైదరాబాద్‌లో 'టీ-హబ్'ను అప్పటి గవర్నర్ నరసింహన్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి రతన్ ప్రారంభించారు.
- తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ వైమానిక సెజ్‌లో విమాన విభాగాల తయారీ కేంద్రానికి 2016 జూన్ 18న అప్పటి రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారికర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌లతో రతన్ టాటా శంకుస్థాపన చేశారు.
- 2018 మార్చి 1న ఆదిభట్లలోని టాటా బోయింగ్ ఏరోస్పేస్ సెజ్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి రాష్ట్ర పరిశ్రమల మంత్రి కేటీఆర్‌లతో కలిసి రతన్ ప్రారంభించారు.
- 2024 మార్చి 17న పీవీ నరసింహారావు స్మారక ట్రస్టు ఆయనకు పీవీ స్మారక పురస్కారం అందజేసింది.



2014లో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్‌తో రతన్ టాటా. చిత్రంలో పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు తదితరులు



హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో ఐటీ హబ్ – 1 ప్రారంభం సందర్భంగా సంతకం చేస్తున్న రతన్ టాటా

భారీగా ఉపాధి

- టాటా మోటార్స్ ద్వారా వాహనాల క్రయవిక్రయాలు, 'తనిష్క్' బంగారు ఆభరణాలు, 'క్రోమా' గృహోపకరణాల షాపులను టాటా సంస్థ నిర్వహిస్తోంది. వీటి ద్వారా రాష్ట్రంలో 60 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు.
- 2016లో తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ నాలెడ్జ్ సెంటర్(టాస్క్) ద్వారా శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భాగస్వామిగా చేరింది.

స్థాపించిన ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎన్నో..

ఆదిభట్లతో వైమానిక ఇంజినీరింగ్ ప్రత్యేక ఆర్థిక మండలి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిభట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వైమానిక ఇంజినీరింగ్ ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు ముందుకొచ్చారు. 2010లో తొలుత 50 ఎకరాల్లో ప్రారంభమైంది. తర్వాత విస్తరించారు. ప్రస్తుతం 250 ఎకరాల్లో పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. ప్రత్యక్షంగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభిస్తోంది.

టీసీఎస్ క్యాంపస్

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) దేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ. హైదరాబాద్‌లో ఆ సంస్థ గ్లోబల్ డెవెలప్‌మెంట్ సెంటర్ (దక్కన్ పార్క్) 2003లో నవంబరు 7న ప్రారంభమైంది. టీసీఎస్ క్యాంపస్ ద్వారా 90 వేల మంది ఉపాధి పొందుతున్నారు.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్

సామాజిక శాస్త్రాల అధ్యయన సంస్థ(టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్) క్యాంపస్ 2012లో హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దక్షిణ భారతంలో ఇదే మొదటిది.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్

2010 అక్టోబరు 19న హైదరాబాద్ విశ్వవిద్యాలయ సమీపంలో 209 ఎకరాల్లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ కొత్త క్యాంపస్‌కు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ శంకుస్థాపన చేయగా... 2017 నుంచి అందులో నడుస్తోంది.

ఎస్పీజీ భద్రత వద్దన్న టాటా

లఖ్‌నవూ: రతన్ టాటా ఎంత ఎదిగినా ఒదిగే ఉంటారన్న విషయాన్ని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమశాఖ మంత్రి, మాజీ ఐపీఎస్ అధికారి ఆసిమ్ అరుణ్ గుర్తుచేసుకున్నారు. 2007-08 మధ్య ఆయన ఎస్పీజీలో ఉండేవారు. అప్పట్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భద్రతా బాధ్యతలు చూస్తున్నప్పుడు.. రతన్‌టాటాను దిల్లీలోని తాజ్ మాన్‌సింగ్ హోటల్ నుంచి భద్రతతో ప్రధాని కార్యక్రమానికి తీసుకొచ్చే పనిని ఎస్పీజీకి అప్పగించారు. కానీ రతన్ మాత్రం అక్కడి ప్రెసిడెన్షియల్ స్వీట్‌కు బదులు సాధారణ గది నుంచే వచ్చి, కేవలం ఒక డ్రైవర్‌తో 50 ఏళ్లనాటి మెర్సిడెస్ కారులో వెళ్లిపోయారు. 'నాకు ముప్పు ఏముంటుంది' అని ఆయన ఎదురు ప్రశ్నించినట్లు ఆసిమ్ అరుణ్ చెప్పారు.



2018 ఆగస్టు 31న తిరుమలలోని శ్రీవారి ఆలయం ధ్వజస్తంభం వద్ద రతన్ టాటా



కార్పొరేట్ కర్మయోగి

ప్రపంచ పటంపై టాటా గ్రూప్‌ను సగర్వంగా నిలిపిన దార్శనికుడు



ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీల వ్యాపారవేత్తల్లో ఆయన ఒకరు..
కానీ ఏ కుబేరుల జాబితాలోనూ కనిపించరు..
(తాజాగా విడుదలైన ఫోర్బ్స్ ఇండియా 2024 జాబితా సహా)
100కు పైగా దేశాల్లో 30కి పైగా కంపెనీల నియంత్రణ చేతిలోనే..
కానీ అత్యంత సాధారణ జీవనశైలి ఆయన సొంతం..
ఆయనే అనితర సాధ్యుడు, కార్పొరేట్ కర్మయోగి.. రతన్ నావల్ టాటా..

టాటా గ్రూప్‌లో నమోదిత కంపెనీలు **26**

2024 మార్చికి టాటా గ్రూప్ వార్షిక ఆదాయం **165 బిలియన్ డాలర్లు** (దాదాపు రూ.14 లక్షల కోట్లు)

2024 ఆగస్టుకు ఆఖరుకు టాటా గ్రూప్ నమోదిత సంస్థల మార్కెట్ విలువ **రూ.30.7 లక్షల కోట్లు**

టాటా గ్రూప్ ఉద్యోగుల సంఖ్య: **10** లక్షలు

కార్పొరేట్ ప్రపంచంలో రతన్ టాటా ప్రస్థానం విలక్షణం. మర్యాద, హుందా, సమగ్రతల్లో ఆయన్ను 'కార్పొరేట్ మహర్షి'గా పరిగణిస్తారు. రెండు దశాబ్దాలకు పైగా టాటా గ్రూప్‌ను నడిపించిన ఆయన.. కఠోర శ్రమ, దీక్షలతో కంపెనీలను ప్రపంచ పటంపై సగర్వంగా నిలిపారు. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా రతన్ బాధ్యతలు చేపట్టిన 1991లో గ్రూప్ ఆదాయం 4 బిలియన్ డాలర్లు కాగా, 2012లో ఛైర్మన్‌గా తప్పుకునే సరికి 100 బిలియన్ డాలర్లను అధిగమించింది. టాటా గ్రూప్‌లో ఆయన కుటుంబానికి ఉన్న వాటా 1% కంటే తక్కువే అయినా.. ఆయన నాయకత్వంలో గ్రూప్ 70 రెట్లకు పైగా వృద్ధి చెందింది.

ఇన్ని రంగాల్లో

ఈరోజు టాటా గ్రూప్ ఉప్పు నుంచి ఉక్కు వరకు, కాఫీ నుంచి కార్లు, సాఫ్ట్‌వేర్ - హార్డ్‌వేర్, ఉక్కు-విద్యుత్, విమానయానం-సెమీకండక్టర్ రంగాల్లో విస్తరించి పరుగులు తీస్తోంది. దేశంలోనే మొదటి సూపర్ యాప్ 'టాటా న్యూ' ను ఆవిష్కరించింది టాటాలే. ఇటీవల చిప్ తయారీ ప్లాంటు నిర్మాణం ప్రారంభించగా, త్వరలో ఐఫోన్‌ల ఉత్పత్తికీ సిద్ధమైంది.

సాధారణ విద్యార్థి నుంచి చరిత్ర లిఖించే దిశగా

రతన్ టాటా బిడియం కలిగిన సాధారణ విద్యార్థి. నలుగురిలో మాట్లాడటం అంటే చాలా భయం. కానీ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లడం, ఆయన జీవితంలో పెను మార్పులు తీసుకొచ్చింది. ఉన్నత చదువులు ముగిశాక, ఆయన్ను టాటా గ్రూప్‌లో చేరమని అప్పటి ఛైర్మన్ జేఆర్‌డీ టాటా ప్రోత్సాహించారు. ప్రారంభంలో అనుభవం కోసం షాప్ ఫ్లోర్‌లో పనిచేసిన రతన్ టాటా, 1971లో మేనేజ్‌మెంట్‌లో చేరారు. గ్రూప్ సంస్థల్లో ఒకటైన నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 1974 టాటా సన్స్ బోర్డు డైరెక్టరుగా చేరారు. 1981లో టాటా ఇండస్ట్రీస్ ఛైర్మన్ అయ్యారు. 1991లో జేఆర్‌డీ టాటా నుంచి టాటా గ్రూప్ బాధ్యతలు చేపట్టిన రతన్ టాటా వినూత్న పంథాలో కంపెనీలను పరుగులు పెట్టించారు. ఆ ఏడాదిలోనే ఆర్థిక సంస్కరణలకు బీజం పడటంతో టాటా గ్రూప్‌ను దాదాపు అన్ని రంగాల్లోకి అడుగుపెట్టించారు.

రెండు సార్లు ఆయనదే విజయం

1991లో టాటా గ్రూప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక, కంపెనీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీన్ని విజయవంతంగా ఎదుర్కొన్న రతన్ టాటా, క్రమేణ తనదైన శైలిలో విజయవంతంగా గ్రూప్‌ను నిర్వహించారు. 2012లో బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. రతన్ టాటా వారసుడిగా వచ్చిన సైరస్ మిస్త్రీకి నాలుగేళ్లలోనే అనూహ్యంగా ఉద్వాసన పలికారు. నష్టాల్లో ఉన్న నానో కారును కొనసాగించడం సహా కొన్ని నిర్ణయాలను మిస్త్రీ ప్రశ్నించడమే ఇందుకు కారణమైంది. దీంతో 2016లో టాటాగ్రూప్ తాత్కాలిక ఛైర్మన్‌గా మళ్లీ రతన్ టాటా బాధ్యతలు చేపట్టారు.

రతన్ హయాంలో ప్రసిద్ధ బ్రాండ్ల కొనుగోళ్లు

టెట్లీ టీ (2000)	431.3 మి.డాలర్లు
దేవూ మోటార్స్ (2004)	102 మి.డాలర్లు
కోరస్ గ్రూప్ (2007)	11.3 బి.డాలర్లు
జాగ్వార్ ల్యాండ్ రోవర్ (2008)	2.3 బి.డాలర్లు

2017 జనవరిలో ఎన్.చంద్రశేఖరన్ నియామకం వరకు ఆయనే నడిపించారు. ఆ తర్వాత నుంచి బుధవారం (ఈనెల 9) వరకు టాటా సన్స్ గౌరవ ఛైర్మన్‌గా కొనసాగారు. టాటా సన్స్‌లో 66% వాటా ఉన్న టాటా ట్రస్ట్స్‌కు ఆయనే ఛైర్మన్.

ఇబ్బంది పెట్టిన మిస్త్రీ న్యాయ పోరాటం

గ్రూప్ ఛైర్మన్ పదవి నుంచి ఆకస్మాత్తుగా తొలగించడంతో టాటాలపై సైరస్ మిస్త్రీ న్యాయపోరాటానికి దిగారు. టాటా గ్రూప్ నియంత్రణ కోసం ముందుగా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)లో ఇరువర్గాలు తలపడ్డాయి. ఆ తర్వాత ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. దాదాపు నాలుగేళ్ల పాటు నడిచిన ఈ కేసులో టాటాలకు అనుకూలంగా తీర్పు రావడంతో, టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవి నుంచి మిస్త్రీని తొలగించారు. తదుపరి 2022 సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సైరస్ మిస్త్రీ మరణించారు.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

టాటా గ్రూప్ రోజువారీ బాధ్యతల నుంచి తప్పుకున్నాక, దేశంలోని యువ పారిశ్రామికవేత్తలను రతన్ ఎంతగానో ప్రోత్సాహించారు. కొత్త తరం టెక్నాలజీ ఆధారిత సంస్థల్లో ఆయన పెట్టుబడులు పెట్టారు. దేశ భవిష్యత్‌ను మార్చడంలో అంకుర సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని రతన్ నమ్మకం. ఆయన వ్యక్తిగత సామర్థ్యంతో పాటు, పెట్టుబడి కంపెనీ ఆర్ఎన్‌టీ క్యాపిటల్ అడ్వైజర్స్ నుంచి వీటిలో పెట్టుబడులు పెట్టించారు. టాటా పెట్టుబడులు పెట్టిన సంస్థల్లో ఓలా ఎలక్ట్రిక్, పేటీఎం, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్, జివామే వంటివి ఉన్నాయి.



విలువలపైనే నా దృష్టి

వ్యాపార నిర్వహణ విషయంలో ఆధిపత్యం, సంపద గురించి నేనెప్పుడూ ఆలోచించ లేదు. విలువలు, విశ్వసనీయతపైనే ప్రధానంగా దృష్టి పెట్టాను.
– రతన్ టాటా

తెలుగు రాష్ట్రాలపై
ఎనలేని ప్రేమ..



'రతన్ టాటా మరణించారనే వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఓ దిగ్గజ పారిశ్రామికవేత్తగా ఉంటూనే.. సమాజానికి విశేష సేవలను అందించిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. హైదరాబాద్, చైనా పర్యటనల సందర్భంలో రతన్ టాటాతో కొన్ని రోజులు గడిపే అదృష్టం నాకు దక్కింది. హైదరాబాద్‌లోని టీసీఎస్ డెక్కన్ పార్క్ క్యాంపస్‌ను ఆయనే ప్రారంభించారు. ఆ ప్రాంగణ నిర్మాణ శైలి ఆయన మనస్సుకు ఎంతో నచ్చింది. ఏరోస్పేస్ రంగంలో టాటా గ్రూపు పెట్టుబడులకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా మార్చేందుకు ఆయనే చొరవ తీసుకున్నారు. తిరుపతిలో టాటా మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు విషయంలోనూ ఆయనదే కీలక పాత్ర. రతన్ టాటా లేని లోటు పూడ్చలేనిది. ఆయన చూపించిన మార్గంలో నడుస్తూ, టాటా గ్రూపు విశిష్ఠతను మరింతగా పెంచేలా కృషి కొనసాగాలి'
– రాజన్న, ప్రెసిడెంట్ (టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సేవలు), టీసీఎస్

టాటా గ్రూప్ కంపెనీలు


- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్
- టాటా ఎలెక్సీ
- టాటా స్టీల్
- టాటా మోటార్స్
- జాగ్వార్ ల్యాండ్ రోవర్
- టాటా ఆటోకాంప్ సిస్టమ్స్
- టాటా కెమికల్స్
- టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్
- టైటాన్ కంపెనీ
- వోల్టాస్
- ఇన్ఫినిటీ రిటైల్
- ట్రెంట్
- టాటా పవర్
- టాటా ప్రాజెక్ట్స్
- టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్
- టాటా రియల్టీ అండ్ ఇన్‌ఫ్రా
- టాటా హౌసింగ్
- టాటా క్యాపిటల్
- టాటా ఏఐఏ లైఫ్
- టాటా ఏఐజీ
- టాటా అసెట్ మేనేజ్‌మెంట్
- టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్
- ఇండియన్ హోటల్స్
- టాటా కమ్యూనికేషన్స్
- టాటా ప్లే
- టాటా టెలిసర్వీసెస్
- టాటా ఇంటర్నేషనల్
- టాటా ఇండస్ట్రీస్
- టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్ప్
- టాటా డిజిటల్
- ఎయిరిండియా
- టాటా టెక్నాలజీస్

టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కే అత్యధికంగా 66% వాటా ఉంది. అందువల్ల టాటా ట్రస్ట్స్‌కు ఛైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి.. గ్రూపు కంపెనీల కార్యకలాపాలు, వృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటివరకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా రతన్ టాటా ఉన్నారు. ఆయన మరణంతో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. ఇప్పుడు ఈ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

టాటా X ఫోర్డ్.. చిన్న కథ కాదు

కార్పొరేట్ చరిత్రలో టాటా గ్రూప్, అమెరికా వాహన దిగ్గజం ఫోర్డ్ మధ్య చోటుచేసుకున్న ఘటనలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ వివాదమే టాటా గ్రూప్ చేతికి బ్రిటన్‌కు చెందిన ప్రసిద్ధ జాగ్వార్ - ల్యాండ్ రోవర్ బ్రాండ్లు చేరడానికి దారితీసింది. ఇదంతా టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు జరిగిన అవమానంతో ప్రారంభమైంది.

దేశీయ కారు ఇండికా


ఇండికా కారుతో...

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే కారును అభివృద్ధి చేయాలని తలపెట్టిన రతన్ టాటా, దాన్ని పట్టుబట్టి సాధించారు. 1998లో రతన్ టాటా ఆకాంక్షల కారు 'టాటా ఇండికా' విడుదలైంది. దేశంలో డీజిల్ ఇంజిన్‌తో వచ్చిన మొదటి హ్యాచ్‌బ్యాక్ కారు ఇదే. మొదట్లో విక్రయాలు అంతంతమాత్రంగా ఉండటంతో.. ఏడాదిలోపే కార్ల వ్యాపారాన్ని విక్రయించాలని టాటా మోటార్స్ నిర్ణయించింది. అమెరికా వాహన దిగ్గజం ఫోర్డ్ ఇందుకు సరైన సంస్థ అని భావించింది. ఈ అంశంపై చర్చించేందుకు 1999లో ఫోర్డ్ మోటార్స్ ప్రతినిధులు, అమెరికా నుంచి టాటాల ప్రధాన కార్యాలయమైన బాంబే హౌస్‌కు వచ్చారు. ఈ సమావేశంలో కార్ల వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు ఫోర్డ్ ఆసక్తి చూపింది.


జాగ్వార్ కార్లతో..

అమెరికా సమావేశంలో వివాదం

ఈ లావాదేవీని ముందుకు తీసుకువెళ్లడం కోసం రతన్ టాటా, ఆయన బృందం డెట్రాయిట్‌కు వెళ్లి అప్పటి ఫోర్డ్ ఛైర్మన్ బిల్ ఫోర్డ్‌ను కలిసింది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశం ఫలవంతం కాలేదు. పైగా రతన్‌టాటాను అవమానించే విధంగా బిల్ ఫోర్డ్ మాట్లాడారు. 'మీకు ఏమీ తెలియదు. అయినా ఎందుకు కార్ల వ్యాపారం ప్రారంభించారు. మీ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం ద్వారా మీకు మేలు చేస్తున్నాం' అని బిల్ ఫోర్డ్ పేర్కొన్నారట. ఫలితంగా ఫోర్డ్‌కు కార్ల వ్యాపార విభాగాన్ని విక్రయించాలనే లావాదేవీ నిలిచిపోయింది.

అవమానించిన వారినే ఆదుకున్న మంచిమనసు

వెంటనే భారత్ వచ్చేసిన రతన్ టాటా.. టాటా మోటార్స్ కార్ల వ్యాపారాన్ని విక్రయించడం ఆపేసి, ఇండికాను విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భద్రమైన కారు కావడం, దేశీయ రహదార్లపై ప్రయాణానికి అనుకూలంగా ఉందనే నమ్మకం పెరగడంతో.. ఇండికా కార్ల వ్యాపారం పుంజుకుని గాడిలో పడింది. టాటా మోటార్స్ కార్ల వ్యాపార తీరునే ఇది మార్చేసింది. 10 లక్షలకు పైగా ఇండికా కార్లు అమ్ముడయ్యాయి.



- అమెరికాలో రతన్ టాటాకు అవమానం జరిగిన 9 ఏళ్ల తర్వాత.. 2008లో అమెరికాలో మహా మాంద్యం రావడంతో ఫోర్డ్ మోటార్స్ దివాలా అంచుకు చేరింది. ఈ సమయంలో ఫోర్డ్‌కు చెందిన దిగ్గజ బ్రాండ్లు జాగ్వార్, ల్యాండ్ రోవర్‌లను కొనుగోలు చేస్తామని టాటా ఆఫర్ చేశారు. 2008 జూన్‌లో 2.3 బిలియన్ డాలర్లకు ఈ లావాదేవీ పూర్తయింది. ఈ సందర్భంగా రతన్ టాటాకు బిల్ ఫోర్డ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ విపణిలో జాగ్వార్, ల్యాండ్ రోవర్ కార్ల అమ్మకాలు దూసుకెళ్తున్నాయి. టాటా మోటార్స్‌కు కీలకంగా కూడా మారాయి. ఆ రకంగా ఫోర్డ్ అవమానించినా, రతన్ టాటా మంచి మనసుతో ఆ కంపెనీని ఆదుకోవడమే కాక, టాటా గ్రూప్‌నకూ మంచి ఆదాయ వనరును, దిగ్గజ బ్రాండ్లను సమకూర్చి పెట్టారు.

ఎయిరిండియాకు ఊపిరులూదిన ఫైటర్ పైలట్

- నష్టాల్లో ఉన్న సంస్థకు జవసత్వాలు అందించిన రతన్



తాను చదివిన ఆర్కిటెక్చర్‌కు.. కలలుగన్న విమానయాన రంగానికి సంబంధం లేదు. అయినా అప్పటికి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన ఎయిరిండియాను తమ గూటి కిందకు తెచ్చుకుని.. దానికి కొత్త జవసత్వాలు అందించారు రతన్ టాటా. విమానాలతో పాటు యుద్ధ విమానాలనూ ఎగరేసిన ఫైటర్ పైలట్ ఆయన. ఎయిరిండియాకు పునర్వైభవం తేవాలన్న ఆయన కల.. 2022 జనవరి వరకు కలగానే మిగిలిపోయింది. అంతకుముందు విదేశీ సంస్థల భాగస్వామ్యంలో ఎయిర్ ఏషియా ఇండియా, విస్తారాలను నెలకొల్పారు. ఎయిర్ ఏషియా ఇండియా పేరు ఏఐఎక్స్ కనెక్ట్‌గా మారి, ఈ సంవత్సరం అక్టోబరు 1న ఎయిరిండియాలో విలీనమైంది. 'ఎయిరిండియా ప్రయాణికులకు టాటా గ్రూప్ స్వాగతం పలుకుతోంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించడంలో, ఎయిరిండియాను అగ్రస్థానంలో నిలిపేందుకు అందరితో కలిసి పనిచేస్తాం" అని 2022 జనవరి 27న విలీనం పూర్తయ్యాక రతన్‌టాటా ప్రకటించారు.

కలలు కని.. నిజం చేసుకుని..

1932లో జేఆర్‌డీ టాటా నెలకొల్పిన టాటా ఎయిర్‌లైన్స్‌ను ఆ తర్వాత జాతీయాకరణ చేసి, ఎయిరిండియాగా పేరు మార్చారు. 1994లో టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి మన దేశంలో సంయుక్తంగా విమానయాన సంస్థను నెలకొల్పే ప్రయత్నాలు చేశారు. ఆరేళ్ల తర్వాత ఎయిరిండియాలో వాటా కొనుగోలుకు ప్రయత్నించారు. ఆ రెండు ప్రయత్నాలూ విఫలమయ్యాయి. 2015లో విస్తారాను స్థాపించగలిగారు. రతన్ మనసుకు విమానయాన రంగం చాలా దగ్గరగా ఉంటుందని విస్తారా సీఈఓ వినోద్ కన్నన్ చెబుతారు. భారీ నష్టాల్లో కూరుకుపోయిన ఎయిరిండియాకు మళ్లీ ఊపిరులూదడంలో రతన్ టాటాకు ఉన్న ఆసక్తి అందరికీ తెలుసని, ఆ కుటుంబం ఎన్నటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా విభాగం ప్రెసిడెంట్, ఎండీ రెమీ మిలార్డ్ అంటున్నారు. అంతర్జాతీయ విమానయాన రంగంలో భారత దేశానికి తగిన స్థానం సంపాదించేందుకు ఎయిరిండియా వెంట నడుస్తామని ఇండిగో బ్రాండ్‌పై విమాన సేవలందిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ ఎండీ రాహుల్ భాటియా చెప్పారు.

- రతన్ టాటా 69 ఏళ్ల వయసులో ఫైటర్ జెట్‌ను నడిపి సంచలనం సృష్టించారు. జెట్ విమానాలు, హెలికాప్టర్లు నడిపేందుకు లైసెన్స్ కూడా ఆయనకు ఉంది.
- 2007లో బెంగళూరులో ఏరో ఇండియా షోలో పాల్గొన్న లాక్‌హీడ్ మార్టిన్.. తమ ఫైటర్ విమానం నడిపేందుకు రతన్‌టాటాను ఆహ్వానించింది. ఆయన కో-పైలట్‌గా వ్యహరించి, కొన్ని విన్యాసాలు కూడా చేశారు. ఆ మర్నాడే ఆయన ఎఫ్-18 సూపర్ హార్నెట్ విమానాన్ని నడిపారు.

వారసుడు.. నోయల్ టాటా?



రతన్ సవతి తల్లి సిమోన్ టాటా కుమారుడు, వరుసకు సోదరుడైన నోయల్ టాటా ఈ పదవికి గట్టి పోటీదారుగా కనిపిస్తున్నారు. కుటుంబంతో ఆయనకున్న సంబంధాలు, టాటా గ్రూపులోని పలు కంపెనీల్లో ఇప్పటికే వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తుండటం ఇందుకు కలిసిరావచ్చని అంటున్నారు. నోయల్ ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు వైస్ ఛైర్మన్‌గానూ ఉన్నారు. శ్రీ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోనూ నోయల్ సభ్యుడిగా ఉన్నారు. ఇవన్నీ టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ అయ్యేందుకు నోయల్‌కు అనుకూలించే అంశాలే అనే మాట వినిపిస్తోంది.

- నోయల్ భార్య ఆలూ మిస్త్రీ.. పల్లోంజి మిస్త్రీ కుమార్తె. ఈమె సోదరుడే టాటా సన్స్ మాజీ ఛైర్మన్ దివంగత సైరస్ మిస్త్రీ. పల్లోంజి మిస్త్రీ గ్రూపునకు కూడా టాటా గ్రూపులో 18.4% వాటా ఉంది. నోయల్ టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ అయ్యేందుకు ఈ సంబంధాలు కూడా ఉపయోగపడొచ్చు. నోయల్, ఆలూకు ముగ్గురు పిల్లలు- లేహ, నెవిల్లె, మాయా. వీరు ప్రస్తుతం టాటా గ్రూప్‌లో వివిధ పదవుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బయటి వ్యక్తులకు అవకాశం ఉందా?

రతన్ టాటా జీవించి ఉన్న రోజుల్లోనే టాటా ట్రస్ట్, టాటా సన్స్ ఛైర్మన్లుగా ఒకే వ్యక్తి ఉండకుండా నిర్ణయం తీసుకున్నారు. రతన్ టాటా టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా ఉన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌కు బాధ్యతలు అప్పగించారు. టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి సైరస్ మిస్త్రీని తొలగించాక.. గ్రూపు సారథ్య బాధ్యతలను చంద్రశేఖరన్ విజయవంతంగా నిర్వహిస్తున్నారనే అభిప్రాయం ఉంది. అయితే చంద్రశేఖరన్.. టాటా ట్రస్ట్స్ బోర్డులో సభ్యుడిగా లేనందున.. ఆయనకు టాటా ట్రస్ట్స్ సారథ్య అవకాశం ఉండకపోవచ్చని అంటున్నారు.

- పల్లోంజి మిస్త్రీ గ్రూపునకు టాటా సన్స్‌లో 18.4% వాటా ఉన్నప్పటికీ.. ఆ కుటుంబంతో టాటాలకు న్యాయ వివాదాలు నెలకొన్నందున షాపూర్ మిస్త్రీ పేరును టాటా ట్రస్ట్స్‌కు ఛైర్మన్‌గా పరిగణనలోకి తీసుకోరనే విషయం సుస్పష్టం.

రేసులో మెహ్లి మిస్త్రీ..

రతన్ టాటా వారసుడి రేసులో మెహ్లి మిస్త్రీ పేరు కూడా బలంగానే వినిపిస్తోందని కార్పొరేట్ వర్గాల సమాచారం. మెహిర్జీ పల్లోంజి గ్రూపులో డైరెక్టరుగా ఉన్న మెహ్లి.. రతన్ టాటాకు కూడా సన్నిహితుడే. కొన్నేళ్ల పాటు టాటా గ్రూపులోనూ ఆయన పనిచేశారు. టాటా సన్స్ మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీకి కూడా మెహ్లి వరుసకు సోదరుడు అవుతారు.

- రతన్ టాటా సొంత సోదరుడు జిమ్మి టాటా కుటుంబ వ్యాపార కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అందువల్ల ఆయన నుంచి ఎటువంటి పోటీ ఉండదు.

మంచి మిత్రుణ్ని కోల్పోయాం

రతన్ టాటాకు కార్పొరేట్ రంగ ప్రముఖుల సంతాపం




'రతన్ టాటా మరణంతో భారత దేశం అత్యంత ప్రసిద్ధమైన, దయ కలిగిన కుమారుల్లో ఒకరిని కోల్పోయింది. ఆయన భారతదేశాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లారు. ప్రపంచంలోని అత్యుత్తమమైన వాటిని భారత్‌కు తీసుకొచ్చారు. టాటా హౌస్‌ను సంస్థాగతీకరించారు. మంచి మిత్రుడైన ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా తీరని లోటు'.
– ముకేశ్ అంబానీ, ఆర్ఐఎల్ సీఎండీ




'రతన్ టాటా కేవలం వ్యాపార నాయకుడే కాదు. సమగ్రత, కరుణ, మంచి కోసం తిరుగులేని నిబద్ధతతో మన దేశ స్ఫూర్తిని ప్రతిబింబించేలా చేశారు. ఆయన లాంటి లెజెండ్‌లను ఎప్పటికీ మరిచిపోలేం. ఓం శాంతి'.
– గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్



'మన దేశ ఆర్థిక వ్యవస్థ చారిత్రాత్మకంగా ముందుకు దూసుకుపోతోంది. రతన్ టాటా జీవితం, ఆయన దేశానికి చేసిన సేవతో మనం ఈ స్థితిలో ఉన్నాం'.
– ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్



'టాటా మరణంతో దేశం, దేశ పరిశ్రమ దూరదృష్టి కలిగిన నాయకుడిని కోల్పోయింది'.
– కుమార్ మంగళం బిర్లా, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్



'రతన్ టాటా నిష్క్రమణతో మనం భారతీయ పరిశ్రమ కిరీటంలో ఆభరణాన్ని కోల్పోయాం. ప్రతి భారతీయునికి ఒక స్ఫూర్తి ప్రదాతగా మారిన ఆయన దూరదృష్టి, విశిష్టమైన వ్యక్తిగత లక్షణాలను కూడా కోల్పోయాం'.
– అనిల్ అగర్వాల్, వేదాంత గ్రూప్ ఛైర్మన్

'టాటా దూరదృష్టి కలిగిన నాయకుడు. నైతిక రాజనీతిజ్ఞుడు. సమగ్రత, ఆవిష్కరణలపై ఆయన నిబద్ధత పరిశ్రమలను రూపాంతరం చెందేలా పురిగొల్పింది. అనేకమంది జీవితాలకు ఆయన స్ఫూర్తిని అందించారు'.
– పవన్ ముంజాల్, హీరో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్



'టాటా దాతృత్వం, మనం జీవిస్తున్న ప్రపంచాన్ని మెరుగుపర్చాలనే ఆయన అభిరుచి శాశ్వత ముద్ర వేశాయి'.
– సునీల్ భారతీ మిత్తల్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్

'టాటా గొప్ప వ్యాపార నాయకుడు. ఆయన వ్యాపార ప్రయోజనాల కంటే దేశమే ముఖ్యమని భావించారు. ఆయన దృష్టి దేశ ప్రజల మీద ఉండేది'.
– వేణు శ్రీనివాసన్, టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్

'టాటా గడిపిన జీవితాన్ని, ఆయన చేసిన సేవలను దేశం గౌరవించాలి. ఆయన గొప్ప నాయకుడే కాదు. నిజమైన దేశ ముద్దుబిడ్డ. ఆయన సేవల్ని తరతరాలు గుర్తుంచుకుంటాయి.'
– శశి రుయా, ఎస్సార్ వ్యవస్థాపకులు

హిందుజా గ్రూప్ ఛైర్మన్ జీపీ హిందుజా, ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా, ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఛైర్మన్ సంజీవ్ గోయెంకా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీఎస్ శెట్టి, హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ రోహిత్ జావా, శామ్‌సంగ్ నైరుతి ఆసియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్, ఐకియా ఇండియా సీఈఓ సుసన్నే పుల్వేరర్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, జేఎల్ఆర్ సీఈఓ ఆడ్రియన్ మార్డెల్, మహీంద్రా గ్రూప్ ఎండీ, సీఈఓ అనీశ్ షా, టయోటా కిర్లోస్కర్ మోటార్ ఎండీ, సీఈఓ మసకజు యోషిమురా, హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్, సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర, అక్మా ప్రెసిడెంట్ శ్రద్ధా సూరి, ఓలా వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈఓ గో చూన్ ఫోంగ్, వోల్టాస్ ఎండీ, సీఈఓ ప్రదీప్ భక్షి, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ తదితర వ్యాపార ప్రముఖులు రతన్ టాటా మృతికి తమ సంతాపాలు తెలియజేశారు.


BIG C
250+ STORES | AP | TS | TN
దసరా శుభాకాంక్షలు
₹ UPTO 10000 WORTH MOBILE PROTECTION FREE*
(Buy 1st Year & get 2nd Year FREE)
₹ UPTO 10000 INSTANT CASH BACK*
ASSURED GIFT* ON MOBILE PURCHASE
*T&C Apply
ASSURED BUY BACK
JODI OFFER
0% DOWN PAYMENT NO COST EMI
SMART TV OFFER
AIR CONDITIONER OFFER
UPTO 51% DISCOUNT BRANDED ACCESSORIES
ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి*
SMART WATCH worth ₹5999
BUDS worth ₹1799
JUICER worth ₹2000
SS 2PC SET worth ₹1500
2PC COOKWARE SET worth ₹1000
RATAN 3 PC SET worth ₹1000
3PC CASSEROLE SET worth ₹1000
MAPPLE TIFFEN BOX worth ₹699
GOOD DAY INSULATED CASSEROLE worth ₹499
3PC MIXING BOWL SET worth ₹299
OnePlus Nord CE4
All Power. All You.
Up to ₹2,000 Instant bank discount
on ICICI Bank, Kotak Mahindra Bank and OneCard Credit Cards & EMI
vivo All Models
upto 10% Instant Cash Back
₹5,999 వరకు విలువగల ఖచ్చితమైన బహుమతి.
One Year Mobile Protection FREE
Buy any vivo phone to get Amazing Gifts
Grand Prize
First Prize
TWS 3e Second Prize
Third Prize
and many more exciting prizes
oppo All Models
upto 10% Instant Cash Back
₹5,999 వరకు విలువగల ఖచ్చితమైన బహుమతి.
One Year Mobile Protection FREE
OPPO Reno12 Pro 5G
oppo స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయండి మరియు లక్కీడ్రాలో గెలుచుకోండి
రూ.10,00,000 నగదు
iPhone 16 Series
Built for Apple Intelligence.
upto ₹5000 Instant Cash Back
upto ₹6000 Exchange Bonus
Per Day EMI Starting From ₹108
Zero Down Payment | 24 Months No Cost EMI
iPhone 13 & 15 also available with Festive Offers
mi All Models
upto ₹3000 Instant Discount
₹2,000 వరకు విలువగల ఖచ్చితమైన బహుమతి.
One Year Mobile Protection FREE
BRING MAGIC HOME
WIN BIG EVERY MINUTE
WIN YOUR DREAM CAR/BIKE
(4 Hyundai Venue Cars
17 Royal Enfield Bikes & many more)
SAMSUNG Galaxy S24 Series
Per Day EMI Starting From ₹94
Galaxy S24 Ultra
Zero Down Payment| 24 Months No Cost EMI
upto ₹12000 Instant Cash Back
upto ₹12000 Exchange Bonus
realme All Models
upto ₹6500 Instant Discount
₹2,000 వరకు విలువగల ఖచ్చితమైన బహుమతి.
One Year Mobile Protection FREE
Buy a realme smartphone & win Big Prizes
(Car, Bikes & many more)
JODI OFFER
Smart Watch + Ear Buds
URBAN
base
₹6999 ₹1799*
AirPods 4
Iconic. Now supersonic.
Per Day EMI Starting From ₹18
upto ₹1500 Instant Cash Back
Zero Down Payment | 24 Months EMI
base
Buds
₹1999 ₹799
arrow
Neckband B/T
₹1799 ₹399
Redmi GOOGLE TV
32" (81cm) ₹14999 ₹10849*
+ Chance to win Cars/Bikes in lucky draw
UP TO 5% INSTANT DISCOUNT*
SBI card
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹5,000 per card. Also valid on EMI Trxn. Validity: 01 Oct - 14 Oct 2024. T&C Apply.
upto ₹5000 INSTANT DISCOUNT*
BAJAJ FINSERV
upto ₹11000 CASH BACK*
HDB FINANCIAL SERVICES
upto ₹4500 INSTANT DISCOUNT*
IDFC FIRST Bank
BIG C
Helpline: 1800 123 4578

EENADU Vol: 51, Iss: 62 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు

హైదరాబాద్ 11-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 62

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


croma

TATA

The Guiding Light Of Our Journey

Remembering Mr. Ratan N Tata

December 28, 1937 - October 9, 2024



A Visionary Who Inspired Us To Dream Big By Serving

Our Customers

Our Employees

Our Nation


ఆసియాలోనే భారీ
ఫర్నిచర్ అమ్మకం
63% వరకు తగ్గింపు
ఉచితం
హోండా యాక్టివా 6G
₹99,999
ఫర్నిచర్ కొనుగోలుపై
ఈరోజు మాత్రమే!
CC Discount ₹7,000
Effective Price ₹92,999
త్వరపడండి! చివరిగా కొన్ని బైకులే మిగిలినవి!!
ఈ దశాబ్దపు డీల్
ప్రీమియం క్వాలిటీ బెడ్‌రూమ్ సెట్: డబుల్ బెడ్ + బెడ్ సైడ్ టేబుల్ + 6 డోర్ వార్డ్ రోబ్ + డ్రెస్సింగ్ టేబుల్ + స్టూల్
MRP ₹82,999 Sale ₹39,999 PER DAY EMI ₹43
3 Seater 1st Time in India 3 Recliners
రిక్లైనర్ సోఫా సెట్: 3 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్
MRP ₹1,61,999 Sale ₹69,999 PER DAY EMI ₹75
బెడ్‌రూమ్ సెట్: డబుల్ బెడ్ + బెడ్ సైడ్ టేబుల్ + 2 డోర్ వార్డ్ రోబ్ మిర్రర్‌తో with Mirror
MRP ₹34,499 Sale ₹17,999 PER DAY EMI ₹19
యాక్టివా ప్యాకేజ్: 3+2 సోఫా సెట్ + 4 కుర్చీలతో మార్బుల్ డైనింగ్ టేబుల్ + హైడ్రాలిక్ కింగ్ సైజ్ బెడ్ + 2 సింగిల్ కాట్స్ + టివి స్టాండ్ + డ్రెస్సింగ్ మిర్రర్ + ఉచితం యాక్టివా 6G
LIMIT 1 PER PERSON
MRP ₹3,02,999 Sale ₹99,999 PER DAY EMI ₹108 CC Discount up to ₹7,000 Effective Price ₹92,999
ఉచితం యాక్టివా 6G
వెరోనా: ఆర్ట్ లెదర్ రిక్లైనర్ సోఫాసెట్: 3+1 రిక్లైనర్
ఉచితం రూ.15,000 విలువగల సెంటర్ టేబుల్ + వాల్ యూనిట్
MRP ₹91,499 Sale ₹39,999 PER DAY EMI ₹43
ఆల్ మోటరైజ్డ్: 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 2 సీటర్ + ఎలక్ట్రిక్ రిక్లైనర్‌తో 1 సీటర్
MRP ₹2,91,499 Sale ₹99,999 PER DAY EMI ₹108 CC Discount up to ₹7,000 Effective Price ₹92,999
టేక్ ఉడ్ సోఫా సెట్: 3+1+1
MRP ₹47,499 Sale ₹19,999 PER DAY EMI ₹22
సఫారి సోఫా సెట్: 3+2 దివాన్
MRP ₹51,999 Sale ₹22,222 PER DAY EMI ₹24
రాకీ సోఫా 3+2+1
MRP ₹51,499 Sale ₹22,999 PER DAY EMI ₹25
ఎల్ టైప్ / కార్నర్ సోఫా సెట్ (7 సీటర్)
MRP ₹48,499 Sale ₹20,999 PER DAY EMI ₹23
బ్రెజిల్: సోఫా సెట్ 3+2 + సెంటర్ టేబుల్
ఉచితం రూ.7,000 విలువ గల సెంటర్ టేబుల్
MRP ₹39,499 Sale ₹16,999 PER DAY EMI ₹18
యాంటియోచ్: సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 కుర్చీలు +1 బెంచ్)
MRP ₹54,999 Sale ₹22,999 PER DAY EMI ₹25
ఉచితం రూ.15,000 విలువ గల 2 కుర్చీలు మరియు టేబుల్
ప్రీమియం క్వాలిటీ ఉడెన్ డైనింగ్ టేబుల్‌తో 6 కుర్చీలు
MRP ₹42,999 Sale ₹23,999 PER DAY EMI ₹26
మార్బుల్ డైనింగ్ టేబుల్ 6 సీటర్
MRP ₹62,999 Sale ₹28,999 PER DAY EMI ₹31
హే: టేక్ఉడ్ క్వీన్ సైజ్ బెడ్
ఉచితం రూ.15,000 విలువ గల పరుపు
MRP ₹45,999 Sale ₹18,999 PER DAY EMI ₹20
ఫ్రాన్స్: ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
FREE Chair
MRP ₹9,499 Sale ₹6,999
చిల్డ్రన్ స్టడీ టేబుల్
MRP ₹6,499 Sale ₹2,999
హైడ్రాలిక్ బెడ్
MRP ₹47,499 Sale ₹20,999 PER DAY EMI ₹23
ఉచితం రూ.9,000 విలువ గల పరుపు
An ISO-9001:2015 Certified Company
Scan to know more!
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
బంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
79950 00930, 040-27841562 79933 33351
కార్పొరేట్ బుకింగ్స్ లేదా బల్క్ ఆర్డర్ల కొరకు, enquiry@bantia.in వద్ద మాకు ఇమెయిల్ చేయండి.
మీ పాత ఫర్నిచర్ ఎక్స్ఛేంజ్‌పై పొందండి 20% వరకు తగ్గింపు
ఎ.ఎస్.రావు నగర్ • అత్తాపూర్ • బోడుప్పల్ • చందానగర్ • దిల్‌సుఖ్‌నగర్ • హైటెక్ సిటీ • కర్మన్‌ఘాట్ • కొంపల్లి • కూకట్‌పల్లి • నాగోల్ • సికింద్రాబాద్ • వరంగల్ • విజయవాడ • www.bantia.in

ఈనాడు

హైదరాబాద్ 11-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51, సంచిక 62
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పద్మాక్షి సన్నిధిలో కన్నుల పండువ..



బతుకమ్మ పండగ చివరిరోజైన గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా హనుమకొండలోని పద్మాక్షి గుండం వద్దకు బతుకమ్మ ఆడటానికి వేల మంది మహిళలు, పిల్లలు తరలివచ్చారు. దాంతో సమీప ప్రాంతాలన్నీ కోలాహలంగా మారాయి. ప్రభుత్వ అధికారులు ఆలయంతోపాటు చుట్టుపక్కల రోడ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా తీసిన విహంగ వీక్షణ చిత్రమిది...

సచివాలయం వెలుగులమయం..



హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌తోపాటు డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, రోడ్లను అలంకరించారు. ఆ ప్రాంగణమంతా బాణసంచా కాంతులతో తళుకులీనింది..

హాన్ కాంగ్‌కు నోబెల్

దక్షిణ కొరియా రచయిత్రికి సాహిత్యంలో దక్కిన అత్యున్నత పురస్కారం

స్టాక్ హోమ్



హాన్ కాంగ్

దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్ (53)కు 2024 సంవత్సర సాహితీ నోబెల్ పురస్కారాన్ని గురువారం ప్రకటించారు. ఆమె రచనల్లో చారిత్రక పరిణామాలు తెచ్చిపెట్టిన మనో వ్యాఘాతాలు, మానవ జీవితంలోని దుర్బలత ప్రగాఢంగా చిత్రితమవుతాయని నోబెల్ కమిటీ వివరించింది. బలహీనుల పట్ల, ముఖ్యంగా మహిళల పట్ల సహానుభూతి కూడా వ్యక్తమవుతుందని కమిటీ అధ్యక్షుడు ఆండర్స్ ఓల్సన్ వర్ణించారు. సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన మొట్టమొదటి ఆసియా రచయిత్రి, దక్షిణ కొరియా సాహితీవేత్త హాన్ కాంగే. 2000 సంవత్సరంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు కిమ్ డే జంగ్‌ను నోబెల్ శాంతి బహుమతి వరించింది. నేడు ప్రపంచమంతటా దక్షిణ కొరియా సినిమాలు, టీవీ సీరియల్స్ బహుళ ప్రాచుర్యం పొందుతున్న సమయంలో సాహితీ నోబెల్ కూడా ఆ దేశాన్నే వరించడం విశేషం.

2016లో హాన్ కాంగ్ రాసిన ది వెజిటేరియన్ నవలకు బుకర్ బహుమతి లభించింది. నోబెల్ సాహిత్య బహుమతిని ఉత్తర అమెరికా, ఐరోపా రచయితలకు, ప్రధానంగా పురుషులకు ప్రదానం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంతవరకు సాహిత్యంలో నోబెల్ పొందినవారి సంఖ్య 119 కాగా, వారిలో 17 మందే మహిళలు. పై విమర్శలకు ఈ ఏటి సాహితీ నోబెల్‌ను సమాధానంగా పరిగణించవచ్చు. ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతిని శుక్రవారం, అర్థశాస్త్ర నోబెల్‌ను సోమవారం ప్రకటించనున్నారు. అన్ని విభాగాల్లో నోబెల్ బహుమతులను డిసెంబరు 10న ప్రదానం చేస్తారు. డైనమైట్‌ను కనుగొన్న స్వీడిష్ శాస్త్రజ్ఞుడు ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరిట ప్రదానం చేసే ఈ బహుమతుల కింద 10 లక్షల డాలర్ల నగదు లభిస్తుంది.

ఏ పుస్తకం ప్రామాణికం!



- ఉద్యోగ పరీక్షలకు ఇప్పటివరకు తెలుగు అకాడమీ పుస్తకాలనే నమ్ముతున్న అభ్యర్థులు
- ఇందుకు భిన్నంగా హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- నిరుద్యోగుల్లో గందరగోళం

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగ పరీక్షల్లో ఏ ప్రశ్న వచ్చినా తెలుగు అకాడమీ ముద్రిస్తున్న పుస్తకాలే ప్రామాణికం...ఇప్పటివరకు అభ్యర్థులు సహా అందరూ విశ్వసిస్తోంది ఇదే. తాజాగా టీజీపీఎస్సీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఆ పుస్తకాలు ప్రామాణికం కాదని, నిపుణుల కమిటీదే తుది నిర్ణయమని పేర్కొనడంతో అభ్యర్థులు, నిరుద్యోగులు సందిగ్ధంలో పడ్డారు. ముమ్ముందు ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఏ పుస్తకాలు, మెటీరియల్ చదవాలన్నది సమాధానం దొరకని ప్రశ్నలుగా తయారయ్యాయి. గ్రూపు-1 తుది కీపై కొందరు ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం.. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని జవాబులను గుర్తించినా వాటిని పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్ తరఫు న్యాయవాది వాదించడం... ఆ పుస్తకాల్లో రిఫరెన్స్‌లు లేవని, రీసెర్చ్ వర్క్ చేయలేదని, నిపుణుల కమిటీ నిర్ణయం తర్వాతే తుది ఫలితాలు విడుదల చేశామని టీజీపీఎస్సీ పేర్కొన్న నేపథ్యంలో ఈ గందరగోళం నెలకొంది. దీనిపై హైకోర్టులో ఈనెల 18న తదుపరి విచారణ జరగనుంది.

తీర్పు వెలువడిన తర్వాత కమిషన్ అధికారులతో చర్చిస్తాం

అకాడమీ డిగ్రీ పాఠ్య పుస్తకాలతోపాటు ఉద్యోగ పోటీ పరీక్షలకు అవసరమైన చరిత్ర, జాగ్రఫీ, వర్తమాన వ్యవహారాలు, ఆర్థికశాస్త్రం తదితర పుస్తకాలను ముద్రిస్తోంది. రచయితలను ఎంపిక చేసి పుస్తకాలను రాయిస్తుంది. ప్రతి పుస్తకానికి ఎడిటర్ కూడా ఉంటారు. వాటిని అకాడమీలో సబ్జెక్టుల వారీగా ఉండే ఇన్‌ఛార్జులు సైతం పరిశీలిస్తారు. ఆ తర్వాత మార్కెట్లోకి విడుదల చేస్తారు. అయినా ఆ పుస్తకాలపై టీజీపీఎస్సీ అభ్యంతరాలను లేవనెత్తడంతో అకాడమీ వర్గాలు సైతం అయోమయంలో పడ్డాయి. తరచూ తాజా అంశాలను జోడిస్తూ...పునఃముద్రణ చేయడం, పుస్తకాల్లో ఏమైనా తప్పులుంటే ఈ-మెయిల్, వాట్సప్ ద్వారా అభ్యంతరాలను స్వీకరించడం నిరంతరం జరగాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. తెలుగు అకాడమీ వర్గాలు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత టీజీపీఎస్సీ లేవనెత్తిన అంశాలపై కమిషన్ అధికారులతో సమావేశమై చర్చిస్తామని తెలిపాయి. ఆ ప్రకారం అవసరమైతే పుస్తకాల్లో మార్పులు చేర్పులు చేస్తామని వివరించాయి.

మార్కెట్లోకి ఎన్ని వచ్చినా...

ఇప్పటివరకు ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా భావిస్తూ ఉంటారు. వాటికోసం ఎదురుచూస్తుంటారు. మార్కెట్లోకి ఎన్నో పుస్తకాలు వస్తున్నా...అకాడమీ పుస్తకం చదవకుండా...కొనకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు చాలా తక్కువ. గ్రూప్ ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడినప్పుడు పెద్ద ఎత్తున ఈ పుస్తకాలకు డిమాండ్ ఉంటుంది. అకాడమీ... సకాలంలో డిమాండ్ మేరకు సమకూర్చలేక చేతులెత్తేసిన సందర్భాలు ఎన్నో. ఈ పరిస్థితుల్లో టీజీపీఎస్సీ తాజాగా హైకోర్టులో వినిపించిన వాదనలు అభ్యర్థులను అయోమయంలోకి నెట్టాయి.

ఎన్నికల తిరుగు బదిలీలకు పచ్చజెండా

డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల సమయంలో వివిధ మండలాలకు బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లకు ప్రభుత్వం దసరా ముందు ఊరట కల్పించింది. పండగలోపే తిరుగు బదిలీలపై నిర్ణయం తీసుకుంటామంటూ ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించినట్లుగానే గురువారం ఆ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. గత సంవత్సరం నవంబరులో జరిగిన శాసనసభ, ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా... మూడేళ్లు ఒకేచోట పనిచేస్తున్న, సొంత జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని రెవెన్యూ శాఖ బదిలీ చేసింది. ఎన్నికల అనంతరం వారికి తిరుగు బదిలీలు చేపట్టాల్సి ఉండగా జాప్యం జరిగింది. తాజాగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ ఈ బదిలీలకు పచ్చజెండా ఊపుతూ సర్క్యులర్ జారీ చేశారు. ఈ తిరుగు బదిలీలను ఐచ్ఛికాలతో పూర్తి చేయనున్నారు. ఈ మేరకు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు పేరు, ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా, గతంలో పనిచేసిన జిల్లా, సొంత జిల్లా వివరాలతో మూడు రోజుల్లో పంపాలని ఒక ఫార్మట్‌ను రూపొందించింది.

...మిగతా 2లో

పీసీఎఫ్ఎస్‌కు రూ.2,146 కోట్ల జరిమానా

ఫెమా ఉల్లంఘనలతో రుణ యాప్ సంస్థపై ఈడీ కొరడా


ఈనాడు, హైదరాబాద్: రుణయాప్ సంస్థ పీసీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (పీసీఎఫ్ఎస్)పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అడ్జుకేటింగ్ అథారిటీ రూ.2146,48,26,480 జరిమానా విధించింది. ఒక రుణయాప్ సంస్థపై ఇంత భారీగా జరిమానా విధించడం ఇదే మొదటిసారి. పీసీఎఫ్ఎస్ సంస్థ ఫారిన్ ఎక్స్ఛేంజి మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) ఉల్లంఘనలకు పాల్పడినట్లు నిర్ధారణ అయిన నేపథ్యంలో ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. నార్వే కేంద్రంగా నడుస్తున్న ఒపేరా గ్రూపునకు అనుబంధంగా ఉన్న పీసీఎఫ్ఎస్ సంస్థకు అంతిమ లబ్ధిదారులుగా చైనా దేశస్థులున్నట్లు గతంలోనే వెల్లడైంది. ఈ సంస్థ క్యాష్‌బీన్ అనే యాప్ ద్వారా రుణాలను మంజూరుచేసి అక్రమ వ్యాపారాన్ని నిర్వహించింది. రుణగ్రహీతలపై భారీగా వడ్డీలు విధించి పెద్ద ఎత్తున లాభాలు గడించిన పీసీఎఫ్ఎస్.. సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌లను దిగుమతి చేసుకున్నామనే సాకుతో రూ.429.3 కోట్లను విదేశాల్లోని సంస్థలకు చెల్లించింది. ఈడీ దర్యాప్తుక్రమంలో అదంతా బోగస్ అని తేలడంతో 2021లోనే సంస్థకు చెందిన రూ.252.36 కోట్ల చర, స్థిరాస్తుల్ని తాత్కాలికంగా జప్తు చేసింది.

...మిగతా 2లో

ప్రభుత్వ గోదాములకు ఖరీఫ్ ధాన్యం!

మిల్లులకు కేటాయించొద్దని పౌరసరఫరాల సంస్థ నిర్ణయం

- ఏఎంసీ, వేర్‌హౌసింగ్ గిడ్డంగుల్లో వడ్ల నిల్వ
- అంగీకారం తెలిపిన వ్యవసాయశాఖ



ఈనాడు, హైదరాబాద్: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈసారి మిల్లర్లకు కేటాయించొద్దని పౌరసరఫరాల సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాల నుంచి.. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే ప్రభుత్వ శాఖలు, సంస్థల పరిధిలోని గోదాముల్లో నిల్వ చేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ చేసిన ప్రతిపాదనకు వ్యవసాయశాఖ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. త్వరలో ఈ విషయమై ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం. ఖరీఫ్ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది. ఇందులో 48.91 లక్షల టన్నులు సన్నధాన్యం కాగా, 42.37 లక్షల టన్నులు దొడ్డురకం. రాష్ట్రవ్యాప్తంగా 7,139 కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటుచేస్తున్నారు. సాధారణంగా ప్రతి సీజన్‌లో వరి కోతలకు ముందే.. ఆయా జిల్లాల్లో వచ్చే దిగుబడుల్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం జిల్లాలవారీగా మిల్లులకు కేటాయిస్తారు. ఈసారి మాత్రం మిల్లులకు ధాన్యం కేటాయింపుల్ని పౌరసరఫరాల సంస్థ పక్కనపెట్టింది. ఈ నిర్ణయానికి ప్రధాన కారణం మిల్లర్ల సమస్యలు పరిష్కారం కాకపోవడం. వారి డిమాండ్లు పరిశీలన దశలోనే ఉన్నాయి. ముఖ్యంగా సన్నధాన్యం మిల్లింగ్‌లో 67% బియ్యం రావని.. నిబంధనల్ని మార్చాలని మిల్లర్లు పట్టుబడుతున్నారు. రైతులు ఇచ్చే ధాన్యంలో తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్నబియ్యం సరఫరాలో క్వింటాలుకు రూ.300 పరిహారం.. కస్టోడియన్, మిల్లింగ్, రవాణాఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని కొందరు మిల్లర్లు స్పష్టంచేశారు.

...మిగతా 2లో



బాసర ఆలయ నిధులు రూ.41.80 కోట్లు వెనక్కి

ఈటీవీ- ఆదిలాబాద్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో మరో కొత్త ఆలయ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.41.80 కోట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకొంది. దేవాదాయశాఖ నిర్ణీత వ్యవధిలో పనులు ప్రారంభించకపోవటం, కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవటమే ఇందుకు కారణం. ఏటా పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా మౌలిక వసతులు, మరమ్మతులు, ఇతర పనుల కోసం దేవాదాయశాఖ ప్రతిపాదనల మేరకు అప్పటి భారాస ప్రభుత్వం 2018లో రూ.50 కోట్లు మంజూరు చేసింది. అతిథిగృహాల్లో 22 స్వీట్లు, భూగర్భ డ్రైనేజీ, షెడ్ల నిర్మాణం, శివాజీ విగ్రహం ఏర్పాటు లాంటి పనుల కోసం రూ.8.20 కోట్లను ఖర్చు చేసిన దేవాదాయశాఖ మిగిలిన రూ.41.80 కోట్లు అలాగే ఉంచింది. వాటితో కృష్ణశిలతో గర్భగుడిని, మాడవీధి, ఓ ప్రాకారం, నాలుగు రాజగోపురాలు, తిరుమలలో మాదిరిగా క్యూకాంప్లెక్స్, విశ్రాంతి భవనాలతో కూడిన కొత్త ఆలయాన్ని నిర్మించాలని భావించారు.

...మిగతా 2లో

ఏపీకి వెళ్లాల్సిందే

ఆంధ్రాకు కేటాయించి తెలంగాణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు డీఓపీటీ ఆదేశం

- ఏపీలో ఉన్నవారు తెలంగాణలో చేరాలని స్పష్టీకరణ
- ఈ ఆదేశాలపై కోర్టును ఆశ్రయించనున్న తెలంగాణలోని అధికారులు?



రొనాల్డ్‌రాస్ ఆమ్రపాలి అంజనీకుమార్ అభిషేక్ మహంతి

ఈనాడు, హైదరాబాద్: పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినా.. కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) ఆదేశాలతో తెలంగాణలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని కేంద్రం ఆదేశించింది. అలానే తెలంగాణకు కేటాయించి.. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఐఏఎస్ అధికారులను తెలంగాణలో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) కార్యదర్శి తాజాగా ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాల ప్రకారం తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లు ఏపీకి వెళ్లాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఐఏఎస్ అధికారులు తెలంగాణకు రావాల్సి ఉంటుంది.

జాబితాలో వాణీప్రసాద్, వాకాటి కరుణ, ఆమ్రపాలి....

ఏపీకి కేటాయించినా తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. వాణీప్రసాద్ యువజన, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శిగా, వాకాటి కరుణ మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిగా, రొనాల్డ్ రాస్ ఇంధన శాఖ కార్యదర్శిగా, ట్రాన్స్‌కో సీఎండీగా, ఆమ్రపాలి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్నారు. ప్రశాంతి త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. డీఓపీటీ ఆదేశంపై వీరు కోర్టును ఆశ్రయించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

...మిగతా 2లో



జీవితంలో అతిపెద్ద రిస్క్ అదే..

జీవితంలో రిస్క్ తీసుకోకపోవడమే అతిపెద్ద రిస్క్. శరవేగంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచంలో, ఓడిపోవడానికి ఉన్న ఏకైక మార్గం సవాళ్లకు భయపడి సాహసోపేత నిర్ణయాలు తీసుకోకపోవడమే. పట్టుదల, దృఢత్వంతో సవాళ్లను ఎదుర్కొంటే అవే మనల్ని విజయ శిఖరాలకు చేరుస్తాయి.

– రతన్ టాటా

దేశం తన ముద్దుబిడ్డను కోల్పోయింది

● సీఎం రేవంత్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: భారత కార్పొరేట్ ప్రపంచంలో గొప్ప దార్శనికులు, మానవతావాది, దూరదృష్టి కలిగిన గొప్ప మహనీయుడు రతన్‌టాటా. ఆయన జీవితం విజయం, వినయంతో కూడిన ఒక అసాధారణ ప్రయాణం. రతన్ టాటా నాయకత్వంలో టాటా బ్రాండ్ ఉన్నత శిఖరాలకు చేరింది. దేశాన్ని ప్రపంచ పారిశ్రామికశక్తిగా మార్చడంలో ఆయన చెరగని ముద్రవేశారు. వ్యాపారం, సమాజ శ్రేయస్సు పట్ల నిబద్ధత, విలువలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన మరణంతో భారతదేశం గొప్ప పారిశ్రామికవేత్తతో పాటు సేవాస్ఫూర్తి, సమగ్రత మూర్తీభవించిన తన ముద్దుబిడ్డను కోల్పోయింది. టాటా కుటుంబానికి, అసంఖ్యాక భారతీయులందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ఆయన స్ఫూర్తి మనకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటుంది''

రతన్‌టాటా గొప్ప మానవతావాది

-ఎం.వెంకయ్యనాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి



''దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా భారత ఆర్థిక దిగ్విజయ ప్రస్థానంలో ఒక దార్శనిక పారిశ్రామికవేత్త. అన్ని రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని తపించి సాకారం చేసిన గొప్ప జాతీయవాది. టాటా వాణిజ్య సామ్రాజ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించి టాటా సంస్థలను ఉన్నత శిఖరాలపై నిలబెట్టారు. నిజాయతీ, నిరాడంబరత, విలువలకు నిలువుటద్దం. గొప్ప వితరణశీలి. సంపదకు ధర్మకర్తగా వ్యవహరించిన కర్మయోగి. ఆయన మరణం పట్ల టాటా కుటుంబంగా పరిగణించే ఆ గ్రూపు సంస్థల ఉద్యోగులందరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''

ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన పారిశ్రామికవేత్త

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



''ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అనుసంధానించిన మానవతావాది, పరోపకారి దార్శనికుడు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న గొప్ప పారిశ్రామికవేత్త. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.''

దేశానికి తీరని లోటు

-కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



''పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి తీరని లోటు. నిరంతరం సృజనాత్మకత, ఆధునిక భావాలకు పెద్ద పీట వేస్తూ ఆయన దేశ పారిశ్రామికాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. రతన్‌టాటా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా''.

దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయింది

-పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



''ఆయన మరణం దేశానికి తీరని లోటు. దేశం ఒక గొప్ప మానవతావాదిని కోల్పోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా''.

టీహబ్‌ను చూసిన ప్రతిసారి గుర్తుచేసుకుంటాం

-కేటీఆర్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు



''పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అద్భుతమైన ఆవిష్కర్త, దార్శనికులు, మహనీయులు. ఆయన మరణం ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత వ్యాపార ముఖచిత్రాన్ని మార్చిన ఆయన ఎంతోమందికి ప్రేరణ. ఆయన లేని లోటు పూడ్చలేనిది. టీహబ్‌ను చూసిన ప్రతిసారీ ఆ మహనీయుడిని గుర్తుచేసుకుంటూనే ఉంటాం. ఆయన అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. రతన్‌టాటాతో అనుబంధం ఉన్నవారందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''.

వీడ్కోలు నేస్తమా..

అలనాటి బాలీవుడ్ నటి సిమి గరేవాల్



రతన్ టాటా మృతిపై ఆయన సన్నిహితురాలు, అలనాటి నటి సిమి గరేవాల్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'మీరు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారని చెబుతున్నారు. ఆ లోటు భరించడం చాలా కష్టం.. వీడ్కోలు నేస్తమా' అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. రతన్ టాటాతో దిగిన ఫొటోను పంచుకున్నారు. సిమి గరేవాల్ చాలాకాలం కిందట రతన్‌టాటాతో ప్రేమలో పడ్డారు. ఆయనతో సన్నిహితంగా మెలిగినట్లు ఆమే గతంలో స్వయంగా వెల్లడించారు. ఆ తర్వాత తాము విడిపోయి, స్నేహితులుగా కొనసాగుతున్నట్లు ఆమె తెలిపారు. సిమి గరేవాల్ 1962లో సినీరంగంలో ప్రవేశించారు. ఆ బాలీవుడ్‌తో పాటు పలు బెంగాలీ సినిమాల్లోనూ నటించారు.

ఆయనొక జాతి రత్నం

● రతన్ టాటా మృతికి సినీ ప్రముఖుల సంతాపం

ఈనాడు, హైదరాబాద్: పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతిపట్ల తెలుగు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన గొప్పతనాన్ని స్మరించుకుంటూ సామాజిక మాధ్యమాల వేదికగా నివాళులర్పించారు. సేవలో రతన్ టాటాను మించినవారు లేరని, ఆయన అసాధారణమైన వ్యక్తి అని కొనియాడారు.

- 'భారతీయులకు ఇది బాధాకరమైన రోజు. టాటా బ్రాండ్‌ను ప్రపంచస్థాయిలో శక్తిమంతంగా నిర్మించడమే కాకుండా, మన దేశ నిర్మాణంలోనూ అద్భుతంగా కృషి చేసిన గొప్ప దార్శనికుడు రతన్ టాటా. భారతీయ పారిశ్రామికవేత్తల్లో ఆయన పెంపొందించిన విలువలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ఎక్స్ ద్వారా సందేశాన్ని పంచుకున్నారు.
- 'లక్షలమందికి ఉద్యోగావకాశాలు కల్పించి, తన దార్శనికతతో దేశానికి ప్రపంచపటంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన దూరం కావడం నన్నెంతో బాధించింది' అంటూ రజనీకాంత్ తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.
- 'నిజమైన నాయకత్వానికి నిదర్శనం రతన్ టాటా ప్రయాణం. భారతదేశ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. వినయం, గొప్పతనం ఒకే చోట ఉండగలవని నిరూపించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా' అంటూ మోహన్‌బాబు స్పందించారు.
- 'దూరదృష్టి ఉన్న వ్యక్తి. ఎంతోమంది జీవితాల్ని మార్చేశారు. భారతదేశం ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది' అంటూ ఎన్టీఆర్ పేర్కొన్నారు.
- 'పారిశ్రామిక రంగంలో ఓ దిగ్గజాన్ని కోల్పోయాం. గొప్ప వ్యక్తికి వీడ్కోలు పలుకుతున్నాం. రతన్ టాటా ఔదార్యం, వివేకం, నిబద్ధత ప్రపంచంపై చెరగని ముద్ర వేశాయి' అని మహేష్‌బాబు వీడ్కోలు సందేశం పంచుకున్నారు.
- దర్శకుడు రాజమౌళి 'టాటా ఉత్పత్తుల్ని ఉపయోగించని రోజును ఊహించుకోవడం కష్టం. రతన్ టాటా ఎన్నో తరాలకు స్ఫూర్తి' అంటూ నివాళులర్పించారు.
- రవితేజ, రానా దగ్గుబాటి, నాని, మంచు విష్ణు, ఖుష్బూ తదితర సినీ ప్రముఖులు రతన్ టాటా మృతికి నివాళులర్పిస్తూ సందేశాలు పంచుకున్నారు.

ప్రభుత్వ గోదాములకు ఖరీఫ్ ధాన్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో పౌరసరఫరాలశాఖ ప్రస్తుతానికి మిల్లర్లకు ధాన్యం కేటాయించొద్దని నిర్ణయం తీసుకుంది.

తాజా పరిణామాల నేపథ్యంలో ధాన్యం నిల్వచేసే విషయమై పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సంప్రదింపులు జరిపారు. వ్యవసాయశాఖ పరిధిలోని మార్కెట్ కమిటీల గోదాములు, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములు కావాలని కోరారు. పౌరసరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ చౌహాన్ సైతం మంత్రి తుమ్మలతో మాట్లాడారు. కాగా వ్యవసాయశాఖ పరిధిలోని కొన్ని గోదాముల్ని ప్రైవేటువ్యక్తులు అద్దెకు తీసుకున్నారు. వాటిని ఖాళీ చేయించాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలోని వ్యవసాయశాఖ గోదాములకు తరలించి నిల్వచేస్తారు. రైస్‌మిల్లర్ల సమస్యలు కొలిక్కివచ్చాక వారికి ధాన్యాన్ని కేటాయించే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ గోదాముల్లో సన్న బియ్యం నిల్వకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పౌరసరఫరాలసంస్థ నిర్ణయించింది. ఈ మేరకు 20 లక్షల టన్నుల బియ్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను కేటాయించాలని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను కోరింది. మార్కెట్ కమిటీల గోదాముల నుంచి ఎంతమేర తీసుకోవాలన్న విషయంపై పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్చిస్తున్నారు. తొలి దశలో కనీసం నాలుగైదు టన్నుల సన్న బియ్యం నిల్వకు సరిపడా ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గోదాములను ప్రైవేటు వారికి కాకుండా.. పౌరసరఫరాల సంస్థకు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తుమ్మల స్పష్టం చేసినట్లు సమాచారం. మార్కెట్ కమిటీల గోదాముల్ని అద్దె లేకుండా రెండు నెలల వ్యవధికి ఇస్తారని పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యం ఎఫ్‌సీఐ(భారత ఆహార సంస్థ)కి వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్‌చేశాక వచ్చే బియ్యాన్ని జనవరి నుంచి రేషన్‌కార్డుదారులకు.. సంక్షేమహాస్టళ్లకు ఉపయోగిస్తారు. ఇంకా మిగిలే బియ్యాన్ని ఏంచేయాలన్న విషయమై పౌరసరఫరాల సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కేంద్రం మద్దతుధర క్వింటాలుకు రూ.2,320. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి రూ.2,820కి కొనుగోలు చేయనుంది. ఈ ధరతో రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇస్తే పౌరసరఫరాల సంస్థకు నష్టమే. ఈ నేపథ్యంలో పథకాలకు పోను మిగిలే సన్నవడ్లను విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టివిక్రమార్క తదితరులు

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని బీసీ సంఘాలు స్వాగతించాయి. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నేతలు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీహరి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి వెళ్లాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్. రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.

క్యాట్ ఆదేశాలతో

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సమయంలో.. సంబంధిత చట్టం ఆధారంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులను డీఓపీటీ రెండు రాష్ట్రాలకు విభజించింది. ఈ కేటాయింపులు సరిగా జరగలేదంటూ తెలంగాణలో పనిచేస్తున్న పలువురు అధికారులు.. అప్పట్లోనే కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణలో కొనసాగుతున్నారు. ఇలా కొనసాగుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై డీఓపీటీ గతేడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడంతో సోమేశ్‌కుమార్ తెలంగాణలో రిలీవ్ అయ్యి ఆంధ్రప్రదేశ్‌లో చేరి వెంటనే వీఆర్‌ఎస్ తీసుకొన్నారు. మిగిలిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కేటాయింపును పునఃసమీక్షించాలని, అందుకు వారు అర్హులేనని ఈ ఏడాది జనవరి 3న హైకోర్టు ఆదేశించి, కేసును మూసివేసింది. నిర్ణయం తీసుకొనే ముందు వారి అభ్యర్థనను వినాలని కోర్టు డీఓపీటీకి సూచించింది. దీని ప్రకారం ఈ ఏడాది మార్చి 21న మాజీ కార్యదర్శి దీపక్ ఖండేకర్‌తో డీఓపీటీ ఏకసభ్య కమిటీని నియమించింది. వారి రికార్డులను పరిశీలించడంతో పాటు జూన్‌లో వ్యక్తిగతంగా విచారించిన కమిటీ.. ఆ అధికారుల అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆయా అధికారులు తెలంగాణలో రిలీవ్ అయ్యి ఈ నెల 16వ తేదీలోగా ఆంధ్రప్రదేశ్‌లో చేరాలని డీఓపీటీ ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారికి కూడా ఇదే రకంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

బాసర ఆలయ నిధులు రూ.41.80 కోట్లు వెనక్కి

(మొదటి పేజీ తరువాయి)

దేవాదాయశాఖ ఆగమశాస్త్ర నియమావళి ప్రకారం కర్ణాటకలోని శృంగేరి పీఠం అనుమతితో నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి సమర్పించింది. 2023 ఏప్రిల్ 24న అప్పటి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భూమిపూజ చేసినా పనులైతే ప్రారంభం కాలేదు. 2023 జూన్‌లో నిర్మల్ కొత్త కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన నాటి సీఎం కేసీఆర్ కొత్త ఆలయం నిర్మాణం కోసం మరో రూ.50 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. తర్వాత వరుసగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు అలాగే నిలిచిపోయాయి. మిగిలిపోయిన నిధులను ప్రభుత్వం తాజాగా వెనక్కి తీసుకుంది. దీనిపై బాసర ఆలయ ఈవో విజయరామారావు స్పందిస్తూ.. ఎన్నికల కారణంగా పనులు చేపట్టలేకపోయామని, తిరిగి నిధుల మంజూరు కోసం మంత్రి కొండా సురేఖను కలిశామని తెలిపారు.

ఇన్‌ఛార్జుల పాలనలో వైద్య విద్య

- అదనపు డీఎంఈల నియామకంలో వైద్యారోగ్యశాఖ ఉదాసీనత
- 64 పోస్టులకు ఉన్నది 17 మందే
- వైద్య కళాశాలల పాలన, బోధన ఆసుపత్రుల్లో సేవలపై తీవ్ర ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: అనుభవజ్ఞులైన వైద్యులను తీర్చిదిద్దడానికి, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులు ఎంతో కీలకం. రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్(డీఎంఈ) పరిధిలో అదనపు డీఎంఈల నియామకంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ చూపుతున్న ఉదాసీనత కారణంగా ఈ రెండు ప్రధాన అంశాల్లో వెనకబాటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఏళ్లుగా ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతుండటం, ఆ బాధ్యతల్లో ఉన్న ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లు సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం వైద్య విద్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా మరో 34 బోధనాసుపత్రులు ఉన్నాయి. సాధారణంగా వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లుగా, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లుగా అదనపు డీఎంఈ హోదా ఉన్న వారినే నియమించాల్సి ఉంది. ఆ ప్రకారం రాష్ట్రానికి 68 మంది అదనపు డీఎంఈలు అవసరం. ఇప్పటివరకు 64 పోస్టులే మంజూరయ్యాయి. పోనీ వాటినైనా భర్తీ చేశారా అంటే... అదీ లేదు. ప్రస్తుతం రెగ్యులర్ అదనపు డీఎంఈలుగా 17 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 47 పోస్టుల్లో వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లు ఇన్‌ఛార్జులుగా కొనసాగుతూ వస్తున్నారు.

వయో పరిమితి పెంచినా...

రాష్ట్రంలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచినప్పటికీ అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లోని వారి వయోపరిమితి మాత్రం 60గానే ఉండిపోయింది. ఈ నేపథ్యంలో చాలా కాలంగా అదనపు డీఎంఈల రెగ్యులర్ పదోన్నతుల అంశం కొలిక్కిరాలేదు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో... శాసనసభలో చట్ట సవరణ ద్వారా అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల వయోపరిమితిని 65కి పెంచారు. ఇది జరిగి నెలలు కావస్తున్నా, సీనియారిటీ జాబితా రూపొందించినా సంబంధిత ఉత్తర్వులు వెలువడకపోవడంతో నియామకాల అంశంలో ముందడుగు పడడం లేదు.

నిర్ణయాల్లో జాప్యంతో తీవ్ర నష్టం

వైద్య విద్యలో డీఎంఈ సహా కీలక పోస్టులన్నీ ఇన్‌ఛార్జులతోనే నడుస్తుండటం వైద్య విద్య బోధన, బోధనాసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది. ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లుగా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వారు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఆర్థికపరమైన అంశాలైతే మరింత జాగ్రత్తతో వ్యవహరిస్తున్నారు. ప్రతి చిన్న అంశానికి డీఎంఈకి ప్రతిపాదనలు పంపడం, డీఎంఈ ప్రభుత్వం అనుమతి కోసం ప్రయత్నించడం, అక్కణ్నుంచి వచ్చే అనుమతుల కోసం ఎదురుచూడటంలోనే కాలం గడిచిపోతోందని కొందరు ఇన్‌ఛార్జులే పేర్కొంటున్నారు. మరోవైపు వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లుగా ఉండేందుకు పలువురు సీనియర్ ప్రొఫెసర్ల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు స్వీకరిస్తే విధులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేమనే భావనతో వారు ప్రొఫెసర్లుగా ఉండేందుకే ఆసక్తి చూపుతున్నారు. అధికారులు ఆదేశించినా... వద్దంటూ నిరాకరిస్తున్న ఉదంతాలు అనేకం ఉన్నాయని ఆ శాఖ వర్గాలే పేర్కొంటున్నాయి.



బతుకమ్మ సంబరాల్లో భాగంగా గురువారం రాత్రి హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకల్లో బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క, అరుణోదయ విమలక్క తదితరులు

పీసీఎఫ్‌ఎస్‌కు రూ.2,146 కోట్ల జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఈక్రమంలోనే ఆర్‌బీఐ, సీబీఐల నకిలీ లోగోలతో రూపొందించిన పత్రాల ఆధారంగా రుణగ్రహీతల నుంచి పీసీఎఫ్‌ఎస్ పెద్దఎత్తున వడ్డీ వసూలు చేసినట్లు ఆర్‌బీఐ 2022 ఫిబ్రవరిలో గుర్తించింది. ఈ కారణంగా పీసీఎఫ్‌ఎస్‌కు ఉన్న నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసింది. ఆస్తుల జప్తు నేపథ్యంలో నిందితులకు వివరణ ఇచ్చే అవకాశం కల్పిస్తూ ఈడీ అడ్జుకేటింగ్ అథారిటీ 2022 జూన్ 22న షోకాజ్ నోటీస్ జారీచేసింది. దీనిపై పీసీఎఫ్‌ఎస్ అప్పటి కంట్రీ హెడ్ జాంగ్‌హాంగ్ నుంచి స్పందన రాలేదు. ఈక్రమంలో పీసీఎఫ్‌ఎస్ రాతపూర్వక వివరణలను పరిశీలించిన అనంతరం ఆ సంస్థ ఫెమా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఈడీ అడ్జుకేటింగ్ అథారిటీ నిర్ధారణకు వచ్చింది. పీసీఎఫ్‌ఎస్‌కు చెందిన రూ.252.36 కోట్ల ఆస్తుల జప్తును ఈ నెల 7న నిర్ధారించింది. దీనికితోడు భారీ జరిమానా విధించింది.

ఎన్నికల తిరుగు బదిలీలకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

తిరుగు బదిలీలకు అనుమతి ఇచ్చినందుకు ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్, టీజీటీఏ అధ్యక్షుడు రాములు తమ శాఖ మంత్రికి, సీసీఎల్‌ఏలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, గతంలో మాదిరే షరతులు లేకుండా సాధారణ పద్ధతిలో తిరుగు బదిలీలు చేయాలని సంఘాలు విన్నవిస్తున్నాయి.

'జమిలి'ని వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ తీర్మానం

తిరువనంతపురం: లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకే సమయంలో (జమిలి) ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కేరళ అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ప్రతిపాదిత విధానం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఇది దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని, భారత ప్రజాస్వామ్యంలోని వైవిధ్య స్వభావాన్ని విధ్వంసం చేస్తుందని ఈ తీర్మానం ఆక్షేపించింది. విపక్ష యూడీఎఫ్ ఎమ్మెల్యేలు సూచించిన కొన్ని సవరణలను కూడా చేర్చడంతో తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



51 అడుగుల బతుకమ్మ

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికసింగారంలో 51 అడుగుల ఎత్తులో పేర్చిన బతుకమ్మ విశేషంగా ఆకట్టుకుంది. మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, కుటుంబ సభ్యులు బతుకమ్మను పేర్చి శిఖరంపై ఏర్పాటుచేసిన గౌరమ్మను కొలిచారు. ఇందుకోసం 5 క్వింటాళ్ల బంతిపూలను, ఒక ట్రక్కు టేకు పూలను వినియోగించారు. 20 మంది కూలీలు ట్రాక్టర్లలో గ్రామాల్లోకి వెళ్లి టేకు పూలను సేకరించారు. ఆ కుటుంబ సభ్యులతోపాటు 40 మంది కూలీలు దాదాపు 8 గంటలపాటు శ్రమించి బతుకమ్మను పేర్చారు. గ్రామ కూడలిలో మండపం వద్ద దీన్ని అలంకరించారు. గత ఏడాది కంటే మరో 15 అడుగుల ఎత్తులో బతుకమ్మను పేర్చినట్లు గోపాలరావు కుటుంబ సభ్యులు తెలిపారు.

– కూసుమంచి, న్యూస్‌టుడే

దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన 15న

సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖలకు ఆహ్వానం



ఈనాడు, హైదరాబాద్– పరిగి, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఈ నెల 15న నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖలను భారత నౌకా దళ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం, మంత్రి నివాసాల్లో రాడార్ స్టేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నేవీ అధికారులు వారిని కలిశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంతో భారత రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందన్నారు. స్థానిక నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, దేశంలో రెండో రాడార్ స్టేషన్ కలిగిన రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

సీఎంకు 'అలయ్ బలయ్' ఆహ్వానం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వచ్చిన ఆమె ఈ నెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తాము నిర్వహించే 'అలయ్ బలయ్'కు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

'స్థానిక'ంలో బీసీల రిజర్వేషన్‌కు ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలి

- **ప్రధాని మోదీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి**

హైదరాబాద్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రధాని మోదీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా హాల్‌లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే రిటైర్డ్ జడ్జితో ఏకసభ్య కమిటీ వేసి రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. "ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకముందే తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. సాంకేతిక సమస్యలు వస్తాయనే ఉద్దేశంతోనే తాజా డీఎస్సీ నియామకాల్లో ప్రభుత్వం రిజర్వేషన్‌ను అమలు చేయలేకపోయింది" అని జీవన్‌రెడ్డి వివరించారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధంకండి

- **భాజపా శ్రేణులకు కిషన్‌రెడ్డి పిలుపు**
- **మూసీ పరీవాహకంలో పేదలకు అండగా నిలవాలని సూచన**



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఎన్నికలకు సన్నద్ధం కావాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. జీహెచ్‌ఎంసీతో ముడిపడి ఉన్న 8 జిల్లాల భాజపా అధ్యక్షులు, పదాధికారులతో కిషన్‌రెడ్డి గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ జిల్లాల్లో పార్టీ కార్యక్రమాలు, భాజపా సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కనీసం 200 మందితో సభ్యత్వ నమోదు ఉండాలని సూచించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. నివాస గృహాల తొలగింపు తదితర ప్రభుత్వం చేపట్టే చర్యలతో పేదలకు ఇబ్బందులు కలుగుతాయని, ఆయా ప్రాంతాల పరిధిలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జీహెచ్‌ఎంసీ డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావడంలేదని కార్పొరేటర్లు ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, భాజపా రాష్ట్ర నేత మల్లారెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

నవంబరు 15న బాలల సాంస్కృతికోత్సవం

నారాయణగూడ, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం సందర్భంగా చారిత్రక తెలంగాణ సారస్వత పరిషత్తు నవంబరు 15న హైదరాబాద్‌లో బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తోందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా వివిధ అంశాల్లో పోటీలు, సృజనాత్మక రచన అధ్యయన శిబిరాలు నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలు పంచుకుని తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు. విద్యార్థులు తమ గ్రామాల నుంచే కథలు, కవితలు రాసి పోటీకి పంపవచ్చు. చిత్రలేఖనం పోటీలకు చిత్రాలు గీసి పంపవచ్చు. ఎంట్రీలు తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, బొగ్గులకుంట, అబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు పంపించాల్సి ఉంటుంది. ఉత్సవం రోజున కూడా అప్పటికప్పుడు పోటీలు ఉంటాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. పోటీల్లో పాల్గొనేవారితో పాటు ప్రతినిధులుగా వచ్చేవారు తమ వివరాల నమోదుకు 9603727234 వాట్సప్ నంబరుకు పేరు, తరగతి, పాఠశాల, ఊరి పేరు తదితర వివరాలను ఈ నెల 20వ తేదీలోగా పంపించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.



మంత్రి ఉత్తమ్ తండ్రికి సీఎం నివాళులు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి పెద్దకర్మ గురువారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి చిదంబరం, సీఎస్ శాంతికుమారి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

– మాదాపూర్, న్యూస్‌టుడే

ఏఎంవీఐ ఎంపిక జాబితా వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రవాణాశాఖలో 113 సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఎంపిక జాబితా, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్‌నికోలస్ తెలిపారు.



వాటి శక్తి అపారం

దయ, కరుణ, సహానుభూతికి ఉన్న శక్తిని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకండి. ఇతరులతో మీ సంభాషణలు, సంబంధాలకు ఆ భావోద్వేగాల వెచ్చదనాన్ని అద్దండి. దానివల్ల ఆ బంధాలు ఎప్పటికీ దృఢంగా నిలిచిపోతాయి.

– రతన్ టాటా



దేశీయ కుబేరుడు అంబానీ

ఫోర్బ్స్ ఇండియా 2024 జాబితా



దిల్లీ: దేశంలోని 100 మంది అగ్రగామి కుబేరుల జాబితాను ఫోర్బ్స్ గురువారం విడుదల చేసింది. వీరందరి సంపద విలువ కలిసి 1.1 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.91.3 లక్షల కోట్ల)ని సంస్థ తెలిపింది. గత ఏడాది కాలంలోనే వీరి సంపద విలువ 316 బిలియన్ డాలర్లు (సుమారు రూ.26.23 లక్షల కోట్లు) పెరిగిందని విశ్లేషించింది. ఈ జాబితాలో అగ్రగామి ముకేశ్ అంబానీ సంపద విలువ గత 12 నెలల్లో 27.5 బి.డాలర్లు పెరగ్గా, రెండో స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ సంపద మాత్రం 48 బి.డా. పెరగడం గమనార్హం. ఈ జాబితాలోని వారి కనీస నికర సంపద 3.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.27,400 కోట్లు)గా ఉంది.

పేరు	సంపద విలువ
ముకేశ్ అంబానీ	119.5 బి.డా.
గౌతమ్ అదానీ	116 బి.డా.
సావిత్రి జిందాల్	43.7 బి.డా.
శివ్ నాడార్	40.2 బి.డా.
దిలీప్ సంఘ్వీ	32.4 బి.డా.
రాధాకిషన్ దమాని	31.5 బి.డా.
సునీల్ మిత్తల్	30.7 బి.డా.
కుమార్ బిర్లా	24.8 బి.డా.
సైరస్ పూనావాలా	24.5బి.డా.
బజాజ్ కుటుంబం	23.4 బి.డా.

మహిమా దాట్లకు చోటు: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే వ్యాక్సిన్ల తయారీ సంస్థ బయొలాజికల్ ఇ సంస్థ అధిపతి మహిమా దాట్ల తొలిసారిగా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇదేవిధంగా హెటెరో ల్యాబ్స్ వ్యవస్థాపకులు బి.పార్థసారథి రెడ్డి, ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన ప్రీమియర్ ఎనర్జీస్ ఛైర్మన్ సురేందర్ సలూజా కూడా కొత్తగా ఈ జాబితాలోకి ప్రవేశించారు. ఈ జాబితాలో పిన్న వయస్కుడిగా జెరోధా బ్రోకింగ్ నిర్వాహకులు నిఖిల్ కామత్ (38) నిలిచారు. షేర్ విలువలతో పాటు ఇతర వివరాలతో సంపద విలువను అంచనా వేసినట్లు ఫోర్బ్స్ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల నుంచి		
29	మురళి దివి, కుటుంబం	9.2 బి.డా.
70	పీపీరెడ్డి, పీవీ కృష్ణారెడ్డి	4.5 బి.డా.
78	జీఎం రావు	3.99 బి.డా.
81	బి.పార్థసారథి రెడ్డి	3.95 బి.డా.
82	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి	3.9 బి.డా.
87	డాక్టర్ రెడ్డీస్ కుటుంబం	3.67 బి.డా.
94	ప్రతాప్ రెడ్డి	3.52 బి.డా.
100	మహిమ దాట్ల	3.3 బి.డా.

టీసీఎస్ లాభం రూ.11,909 కోట్లు

● రెండో మధ్యంతర డివిడెండ్ రూ.10 ● రెండో త్రైమాసికంలో 5,726 నియామకాలు

ముంబయి: దేశీయ ఐటీ సేవల దిగ్గజ సంస్థ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.11,909 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.11,342 కోట్లతో పోలిస్తే ఇది 4.99% ఎక్కువ. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వచ్చిన రూ.12,040 కోట్ల లాభంతో పోలిస్తే తగ్గడం గమనార్హం. ఏడాది క్రితంతో పోలిస్తే మొత్తం ఆదాయం రూ.60,698 కోట్ల నుంచి 7.06% పెరిగి రూ.64,988 కోట్లకు చేరింది. ఏప్రిల్-జూన్ ఆదాయం రూ.64,575 కోట్లతో పోల్చినా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. జులై-సెప్టెంబరు ఆర్థిక ఫలితాల వివరాలు ఇలా..

✦ నిర్వహణ లాభాల మార్జిన్ 0.2% తగ్గి 24.1 శాతానికి పరిమితమైంది. ఏప్రిల్-జూన్‌తో పోల్చినా ఇది 0.6% తక్కువే.

2 త్రైమాసికాల్లో 11,000 నియామకాలు

మొత్తం సిబ్బంది సంఖ్య సమీక్షా త్రైమాసికంలో 5,726 మేర పెరిగి 6,12,724కు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నికరంగా సిబ్బంది సంఖ్య 11,000 మేర పెరిగిందని సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన విధంగానే తాజా ఉత్తీర్ణుల ఎంపికలు ఉంటాయని మానవ వనరుల ప్రధాన అధికారి మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద 40,000 మంది తాజా ఉత్తీర్ణులను నియమించుకుంటామని టీసీఎస్ గతంలోనే తన ప్రణాళికను వెల్లడించడం గమనార్హం.



'కొన్ని త్రైమాసికాలుగా వ్యాపార కార్యకలాపాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జులై-సెప్టెంబరులోనూ ఆ ధోరణి కొనసాగింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా విభాగాలు పుంజుకున్న సంకేతాలు కనిపించాయి. మిగతావాటితో పోలిస్తే తయారీ విభాగంలో వేగవంత వృద్ధి లభించింది'

\- కె.కృతి వాసన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మేనేజింగ్ డైరెక్టరు, టీసీఎస్

విభాగాల వారీగా ఆదాయాలు

✦ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా విభాగాల ఆదాయాలు స్వల్పంగా 0.1% పెరిగాయి.

✦ టీసీఎస్ మొత్తం ఆదాయంలో 9% కంటే తక్కువ వాటా ఉన్న తయారీ రంగం 5.3% వృద్ధితో మిగతా విభాగాలన్నింటి కంటే రాణించింది.

✦ విపణుల విషయానికొస్తే.. కంపెనీ మొత్తం ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 2.1% తగ్గింది. ఇదే సమయంలో భారత విపణి ఆదాయంలో 95.2% వృద్ధి ఉంది.

✦ రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.10 చొప్పున రెండో మధ్యంతర డివిడెండును చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది.

ప్రాంగణ నియామకాల ప్రక్రియ ప్రారంభం

నిపుణుల నియామకం, మౌలిక వసతులపై వ్యూహాత్మక పెట్టుబడులను కొనసాగించినట్లు కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి సమీర్ సక్సారియా తెలిపారు. ట్రైనీలకు ఉద్యోగంలోకి చేర్చుకునే ప్రక్రియ జరుగుతోందని టీసీఎస్ మానవ నరుల విభాగం అధికారి మిలింద్ లక్కడ్ తెలిపారు. 2025-26కు ప్రాంగణ నియామకాల ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

విలేకర్ల సమావేశం రద్దు

గురువారం జరగాల్సిన విలేకర్ల సమావేశాన్ని టీసీఎస్ రద్దు చేసింది. ఆ సమయంలో రతన్ టాటా అంత్యక్రియలు జరుగుతుండటమే కారణం. ఫలితాల వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంపడంతో పాటు రాత్రికి విశ్లేషకులతో కాల్ కాన్ఫరెన్స్ నిర్వహించింది.

నవంబరు 11 నుంచి క్లయింట్ల డీమ్యాట్‌లకే నేరుగా చెల్లింపులు



దిల్లీ: షేర్ల క్రయ విక్రయాలకు సంబంధించిన చెల్లింపులను క్లయింట్ల డీమ్యాట్ ఖాతాల్లోకే నేరుగా జమ చేయడాన్ని తప్పనిసరి చేస్తూ, తీసుకొచ్చిన మార్గదర్శకాల అమలు గడువును సెబీ గురువారం పొడిగించింది. ఈనెల 14 నుంచి ఈ నిబంధనను అమలు చేయాల్సి ఉండగా.. నవంబరు 11వ తేదీకి మార్చింది. ప్రస్తుతం క్లియరింగ్ కార్పొరేషన్‌లు తొలుత బ్రోకర్ల పూల్ ఖాతాలోకి సెక్యూరిటీల క్రయ, విక్రయాల చెల్లింపులను జమ చేస్తున్నాయి. ఆ తర్వాత అక్కడి నుంచి క్లయింట్ల డీమ్యాట్ ఖాతాల్లోకి ఆ నగదు చేరుతోంది. నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు, మోసాలను అరికట్టేందుకు క్లయింట్ల ఖాతాలోకే క్లియరింగ్ కార్పొరేషన్‌లు నగదు జమ చేయాల్సి ఉంటుందని జూన్ 5న సెబీ ఒక సర్క్యులర్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే.

కెనరా బ్యాంక్ రుణరేట్లు 5 బేసిస్ పాయింట్ల పెంపు

దిల్లీ: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్, నిధుల వ్యయం ఆధారిత రుణ రేట్ల (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్ల (0.05%) చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇందువల్ల వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ భారం పెరుగుతుంది. ఇప్పటివరకు ఈ రుణాలపై ఏడాది కాలావధికి వడ్డీరేటు 9% కాగా, ఇకపై 9.05% అవుతుంది. ఒక నెల, 3 నెలలు, 6 నెలల కాలావధి రుణాల వడ్డీ రేట్లు 8.40-8.85% శ్రేణిలో ఉండనున్నాయి. ఈనెల 12 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని బ్యాంక్ తెలిపింది.

టెల్కోల నెలవారీ ఆర్పు రూ.157.45

జూన్ త్రైమాసికంపై ట్రాయ్

దిల్లీ: ఈ ఏడాది జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మొబైల్ సేవల ద్వారా టెలికాం కంపెనీలు నెలవారీగా ఆర్జించిన సగటు వినియోగదారు ఆదాయం (ఆర్పు) వార్షిక ప్రాతిపదికన 8% పెరిగి రూ.157.45కు చేరిందని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నివేదిక వెల్లడించింది. జనవరి-మార్చి త్రైమాసిక ఆర్పు రూ.153.54తో పోలిస్తే ఇది 2.55% ఎక్కువ. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) త్రైమాసిక ప్రాతిపదికన 0.13% పెరిగి రూ.70,555 కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన ఏజీఆర్ 7.51% పెరిగింది. టెలిఫోన్ చందాదార్లు 119.93 కోట్ల నుంచి 0.53% పెరిగి 120.56 కోట్లకు చేరారు. వైర్‌లైన్ సబ్‌స్క్రిప్షన్లు వార్షిక ప్రాతిపదికన 15.81% పెరిగి 3.51 కోట్లకు చేరాయి. ఇంటర్నెట్ చందాదార్లు 1.59% పెరిగి 96.96 కోట్లకు చేరారు. ఇందులో 2.88 కోట్ల న్యారోబ్యాండ్ చందాదార్లు, 94.08 కోట్ల బ్రాడ్‌బ్యాండ్ చందాదార్లు ఉన్నారు. జియో చందాదార్లు 9.18% పెరిగి 48.97 కోట్లకు చేరారు. భారతీ ఎయిర్‌టెల్ వినియోగదార్లు 4.42% పెరిగి 39.81 కోట్లకు చేరారు. వొడాఫోన్ ఐడియా చందాదార్లు 5.30% తగ్గి 21.81 కోట్లకు పరిమితమయ్యారు. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ల చందాదార్లు వరుసగా 13.16%, 4.88% తగ్గారు.

కోడి గుడ్లు

11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	538

మరో 85 విమానాలకు ఎయిరిండియా ఆర్డరు!

దిల్లీ: ఎయిర్‌బస్ నుంచి మరో 85 విమానాలను కొనుగోలు చేసేందుకు ఎయిరిండియా తాజాగా ఆర్డరు పెట్టింది. వీటిలో 75 నేరోబాడీ ఏ320 విమానాలు, 10 ఏ350 విమానాలు ఉన్నాయి. కార్యకలాపాల విస్తరణ కోసమే కొత్త విమానాలను ఎయిరిండియా కొనుగోలు చేస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఎయిరిండియా, ఎయిర్‌బస్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. 2023 ఫిబ్రవరిలో కూడా ఎయిరిండియా 470 విమానాలకు ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు ఆర్డరు పెట్టిన సంగతి విదితమే. ఇందులో 250 విమానాలను ఎయిర్‌బస్ నుంచే కొంటామని అప్పట్లో ఎయిరిండియా వెల్లడించింది. అప్పుడే మరిన్ని విమానాల కొనుగోలు అవకాశాన్ని ఎయిరిండియా అట్టేపెట్టుకుంది.



వారాహి సిల్క్స్ ప్రారంభం



చీరలు చూస్తున్న బాలకృష్ణ, మీనాక్షి చౌదరి, నిర్వాహకులు స్పందన, మణిదీప్

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), న్యూస్‌టుడే: చీరల ఎంపిక చాలా కష్టమైన పని అని సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్ స్టోర్‌ను గురువారం సినీనటి మీనాక్షి చౌదరి, వారాహి సిల్క్స్ నిర్వాహకులు ఏచూరి స్పందన, మణిదీప్‌లతో కలిసి బాలకృష్ణ ప్రారంభించారు. కాంజీవరం, బనారస్, ఉప్పాడ తదితర పట్టు వస్త్రాలను ప్రత్యేకంగా నేయించి ఈ 12,000 చదరపు అడుగుల్లోని స్టోర్‌లో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రూ.25,000 కొనుగోలుపై అరగ్రాము బంగారు నాణెం, రూ.50,000 కొనుగోలుపై గ్రాము బంగారు నాణెం, రూ.లక్ష కొనుగోలుపై 2 గ్రాముల బంగారు నాణెం అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5,000 మొదలుకొని ఇక్కడ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు.

కెంట్ నుంచి అధునాతన వాటర్ ప్యూరిఫయర్లు



దిల్లీ: వాటర్ ప్యూరిఫయర్ల తయారీ సంస్థ కెంట్ ఆర్‌ఓ సిస్టమ్స్ లిమిటెడ్, గృహ ఉత్పత్తుల సంస్థ బ్లాక్+డెక్కర్‌తో లైసెన్సింగ్ భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా దేశీయ విపణిలోకి రెండు అధునాతన వాటర్ ప్యూరిఫయర్లు బ్లాక్+డెక్కర్ క్రెస్ట్ ఆర్‌ఓ ప్యూరిఫయర్, బ్లాక్+డెక్కర్ జెనిత్ ఆర్‌ఓ ప్యూరిఫయర్‌లను తీసుకురానుంది. 7 దశల్లో నీటిని శుద్ధి చేసే విధంగా బ్లాక్+డెక్కర్ క్రెస్ట్ ఆర్‌ఓ ప్యూరిఫయర్‌ను రూపొందించారు. ఖనిజాలు అధికంగా ఉండేలా నీటిని ఇవి శుద్ధి చేస్తాయని కంపెనీ తెలిపింది. క్లోరిన్, బ్యాక్టీరియా, ఇతర వ్యర్థాలు లేకుండా నీటిని ప్రీమియం మోడల్ బ్లాక్+డెక్కర్ జెనిత్ ఆర్‌ఓ ప్యూరిఫయర్ శుద్ధి చేస్తుందని వెల్లడించింది. బ్లాక్+డెక్కర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడంపై ఆసక్తిగా ఉన్నామని, వినూత్నత, కొత్త ఆవిష్కరణలకు బ్లాక్+డెక్కర్‌కు మంచి పేరు ఉందని కెంట్ ఆర్‌ఓ సిస్టమ్స్ సంయుక్త ఎండీ వరుణ్ గుప్తా పేర్కొన్నారు.

ముప్పు నియంత్రణకు అన్ని రకాల సమాచారాన్ని ఉపయోగించుకోవాలి

బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన

ముంబయి: మోసాలను గుర్తించేందుకు అంతర్గతంగానే కాకుండా బయటి వర్గాల నుంచి లభించే సమాచారాన్ని కూడా ఉపయోగించుకోవాలని బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), తన నియంత్రణలోని ఇతర సంస్థలకు ఆర్‌బీఐ తెలిపింది. మనీ ల్యాండరింగ్, ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతున్న వారి వల్ల, క్లయింట్లు, దేశాలు, ఉత్పత్తులు, సేవలు, లావాదేవీలకు పొంచి ఉన్న ముప్పును గుర్తించి, మదింపు చేసి, మోసాల నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఆర్‌బీఐ నియంత్రణలోని సంస్థలు (ఆర్‌ఈలు) తరచూ చర్యలు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో మనీ లాండరింగ్, ఆర్థిక ఉగ్రవాదం నియంత్రణ విభాగాల్లోని సిబ్బందికి అంతర్గత ముప్పు మదింపు మార్గదర్శకాలను ఆర్‌బీఐ జారీ చేసింది. అంతర్గత ముప్పు మదింపునకు సంబంధించి కీలక నియమాలను ఇందులో పొందుపరిచారు. ఆర్‌ఈల్లోని మోసం/సైబర్/ఐటీ ముప్పు నియంత్రణ విభాగాల నుంచి లభించే సమాచారం లాంటివి అంతర్గత వర్గాల సమాచారంగా భావిస్తారు. మనీలాండరింగ్, ఆర్థిక ఉగ్రవాదం రూపేణా వివిధ ఉత్పత్తులు, సేవలకు పొంచి ఉన్న ముప్పును పూర్తి స్థాయిలో అర్థం చేసుకునేందుకు బయటి వర్గాలు, ఇతరత్రా రూపంలో వచ్చే సమాచారాన్ని కూడా ఆర్‌ఈలు ఉపయోగించుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

ప్రపంచ వాణిజ్యంలో 2.7% వృద్ధి: డబ్ల్యూటీఓ

దిల్లీ: ఈ ఏడాది (2024)లో ప్రపంచ వాణిజ్యం 2.7% వృద్ధి చెందుతుందనే అంచనాను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) తాజాగా వ్యక్తం వేసింది. ఏప్రిల్ అంచనాల ప్రకారం ఈ వృద్ధి 2.6 శాతమే కావడం గమనార్హం. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం ఆందోళనకరమే అయినా కూడా, అంతర్జాతీయ వాణిజ్యంపై సానుకూల దృక్పథం పెరగడం గమనార్హం. 166 దేశాలకు ఈ సంస్థ సభ్యత్వం వహిస్తోంది. 2025 సంవత్సరానికి మాత్రం ప్రపంచ వాణిజ్య వృద్ధి అంచనాను 3.3% నుంచి 3 శాతానికి తగ్గించింది.

భారత్ ఎగుమతుల్లో వృద్ధి: ఈ ఏడాది తొలి అర్ధభాగంలో వస్తువుల ఎగుమతుల పరంగా ఆసియా గణనీయంగా మెరుగుపడిందని డబ్ల్యూటీఓ పేర్కొంది. చైనా వృద్ధి మోస్తరుగా ఉండగా, భారత్, సింగపూర్, మలేసియా, వియత్నాం రాణిస్తున్నాయని వివరించింది. భారత ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టులో 178.68 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023 ఇదే సమయం కంటే ఇవి 1.14% ఎక్కువ.

బ్యాంక్ నిఫ్టీ, ఫిన్ నిఫ్టీ వారం కాంట్రాక్టులు రద్దు!

మిడ్‌క్యాప్ సెలక్ట్ కూడా

దిల్లీ: బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఫిన్‌నిఫ్టీ), నిఫ్టీ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీలకు వారంతో గడువు తీరిపోయే డెరివేటివ్ కాంట్రాక్టులను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రద్దు చేయనుంది. నవంబరు 13 నుంచి బ్యాంక్ నిఫ్టీ, 18 నుంచి మిడ్‌క్యాప్ సెలెక్ట్, 19 నుంచి ఫిన్ నిఫ్టీల వారం కాంట్రాక్టులు ఉండవని ఎన్ఎస్ఈ తెలిపింది. ఎక్స్ఛేంజీలు ఒక ప్రామాణిక సూచీపై మాత్రమే వారం వారీ డెరివేటివ్ కాంట్రాక్టులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంచాలని సెబీ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్ఎస్ఈ పై నిర్ణయం తీసుకుంది. దీంతో ఎన్ఎస్ఈ నుంచి నిఫ్టీ 50లో మాత్రమే వారంతో గడువు తీరిపోయే డెరివేటివ్ కాంట్రాక్టులు ఉంటాయి.

పల్లెల్లో 82% .. నగరాల్లో 92%

ఇంటర్నెట్ వాడుతున్న యువత

దిల్లీ: దేశంలో ఇంటర్నెట్ వినియోగిస్తున్న 15-24 ఏళ్ల మధ్య వారిలో పల్లెల్లో 82 శాతానికి పైగా ఉన్నారని ప్రభుత్వ సర్వే వెల్లడించింది. అదే నగరాల్లో ఈ వయస్సు వారు మరింత అధికంగా 92% ఉన్నారని తెలిపింది. 15-24 ఏళ్ల మధ్య వారిలో మొబైల్ ఫోన్ వాడుతున్న వారు గ్రామీణ ప్రాంతాల్లో 95.7% ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 97% మంది ఉన్నారని సర్వే గుర్తించింది. 2022 జులై నుంచి 2023 జూన్ మధ్య నిర్వహించిన సమగ్ర వార్షిక మాడ్యులార్ సర్వే (సీఏఎంఎస్) కీలక వివరాలను గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. జాతీయ శాంపుల్ సర్వే (ఎన్ఎస్ఎస్) 79వ రౌండ్‌లో ఈ సర్వే ఒక భాగమని తెలిపింది. నివేదిక ప్రకారం..

✦ 15-24 ఏళ్ల మధ్య గ్రామీణ యువతలో 82.1% మంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 91.8 శాతంగా ఉంది.

✦ 78.4% మంది యువత అటాచ్డ్ ఫైల్స్‌తో సందేశాలు పంపుతున్నారు. 71.2% మంది కాపీ అండ్ పేస్ట్ టూల్స్ వినియోగిస్తున్నారు. 26.8% మంది అడ్వాన్స్‌డ్ టాస్కులైన సమాచార శోధన, ఇ-మెయిల్స్ పంపడం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ నిర్వహణ వంటివి చేస్తున్నారు.



✦ టెలిఫోన్/మొబైల్ ఫోన్ కలిగిన కుటుంబాలు 95.1% ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు 94.2% ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 97.1 శాతంగా ఉంది. కంప్యూటర్ (డెస్క్‌టాప్ పీసీ, ల్యాప్‌టాప్) కలిగిన కుటుంబాల సగటు 9.9%. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.2% అయితే, పట్టణ ప్రాంతాల్లో 21.6 శాతంగా ఉన్నాయి.

✦ ఏడాది కాలంలో ఒక్కో కుటుంబం సరాసరి ఆసుపత్రి వ్యయాలు గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,129, పట్టణ ప్రాంతాల్లో రూ.5,290గా ఉన్నాయి.

✦ ఆసుపత్రిలో చేరని కుటుంబాల వైద్య ఖర్చులు 30 రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ.539, పట్టణ ప్రాంతాల్లో రూ.606గా ఉన్నాయి.

ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలకు పామాయిల్ ధరల సెగ

మార్జిన్లపై అధిక వ్యయాల ప్రభావమూ

దిల్లీ: పామాయిల్ ధరలు, ముడి సరకులు, ప్రకటనల ఖర్చులు పెరగడం వల్ల సెప్టెంబరు త్రైమాసికంలో ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎండు కొబ్బరి, వంట నూనెలు ధరలు పెరగడం వల్ల ఏడాది క్రితంతో పోలిస్తే తమ మార్జిన్ల వృద్ధిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని గోద్రెజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (జీసీపీఎల్), డాబర్, మారికో సంస్థలు తాజాగా సంకేతాలివ్వడం ఇందుకు నిదర్శనం.

✦ మార్చి నుంచి పామాయిల్ ధరలు పెరుగుతున్నాయి. అయితే ఈ భారాన్ని వినియోగదార్లపై వేయకూడదని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కొత్త విభాగాల అభివృద్ధి, రూరల్ వ్యాన్ ప్రోగ్రామ్ లాంటి దీర్ఘకాలిక వృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడులు కొనసాగించాలని అనుకుంటోంది. పామాయిల్ ధరల్లో పెరుగుదల, ముడి సరకు వ్యయాలు భారం కావడం వల్ల స్టాండలోన్ ఎబిటాలో వృద్ధి స్తబ్దుగా ఉండొచ్చు. అయితే దేశీయంగా స్టాండలోన్ ఆదాయం మెరుగ్గానే నమోదయ్యే అవకాశం ఉంది. అమ్మకాల్లో వృద్ధి ఇందుకు దోహదం చేయొచ్చు. - జీసీపీఎల్



✦ మా అంతర్గత అంచనాలకు మించి ఎండు కొబ్బరి ధరలు పెరిగాయి. దిగుమతి సుంకం పెంపుతో వంట నూనెల ధరలూ పెరిగాయి. ఈ ప్రభావంతో మా నిర్వహణ లాభం, ఆదాయాల్లో వృద్ధి నెమ్మదించే అవకాశం ఉంది. - మారికో

✦ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఏకీకృత ఆదాయం 5% తగ్గే అవకాశం ఉంది. ప్రచార కార్యక్రమాలపై వ్యయాలను పెంచడం, పెట్టుబడులను కొనసాగించడం వల్ల నిర్వహణ మార్జిన్లు తగ్గొచ్చు. విక్రయాలు తక్కువగా నమోదు కావడం వల్ల లాభదాయకతపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. - డాబర్

అంతర్జాతీయ సానుకూలతలు కలిసొచ్చాయ్

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.4,562.71 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు: రూ.3,508.61 కోట్లు

సెన్సెక్స్ ▲144	నిఫ్టీ ▲17
81611	24998



సమీక్ష

అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో మన మార్కెట్లు గురువారం లాభాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్, విద్యుత్ షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 144 పాయింట్లు, నిఫ్టీ 17 పాయింట్ల మేర లాభపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు తగ్గి 83.98 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 1.37% లాభంతో 77.63 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్, షాంఘై, సియోల్ లాభపడ్డాయి. ఐరోపా సూచీలు ప్రతికూలంగా కదలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 365 పాయింట్ల లాభంతో 81,832.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,467.10 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 82,002.84 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, ఇంట్రాడేలో 81,538.94 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 144.31 పాయింట్ల లాభంతో 81,611.41 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 16.50 పాయింట్లు పెరిగి 24,998.45 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,979.40-25,134.05 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభపడ్డాయి. కోటక్ బ్యాంక్ 4.16%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75%, మారుతీ 1.46%, పవర్‌గ్రిడ్ 1.39%, ఎం అండ్ ఎం 1.24%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.19%, యాక్సిస్ బ్యాంక్ 1.17%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.13%, ఎన్‌టీపీసీ 1.09% చొప్పున లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 2.32%, సన్‌ఫార్మా 2.27%, ఇన్ఫోసిస్ 1.78%, టైటన్ 1.33%, టాటా మోటార్స్ 1.10% నష్టపోయాయి. రంగాల వారీ సూచీలకొస్తే బ్యాంకింగ్, విద్యుత్, యుటిలిటీస్, ఆర్థిక సేవలు, టెలికాం సూచీలు రాణించాయి. ఆరోగ్య సంరక్షణ, ఐటీ, టెక్, స్థిరాస్తి, ఎఫ్ఎంసీజీ, మన్నికైన వినిమయ వస్తువుల రంగాలు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 2,199 షేర్లు సానుకూలంగా, 1,730 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 117 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

టాటా షేర్లకు లాభాలు

టాటా గ్రూప్ సామ్రాజ్యాన్ని అనూహ్యంగా విస్తరించిన గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అస్తమయం చెందిన సమయంలో.. గ్రూప్ కంపెనీల విస్తరణకు ఆయన చేసిన కృషిని మదుపర్లు గుర్తు చేసుకున్నారు. ఆయన దార్శనికత వల్ల టాటా గ్రూప్ కంపెనీల షేర్లు రాణించి, తమను సంపన్నులను చేసినందుకు కృతజ్ఞతగా గురువారం టాటా కంపెనీల షేర్లను కొనుగోలు చేయడంతో, తొలుత 10% వరకు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసేసరికి టాటా టెలీ సర్వీసెస్ మహారాష్ట్ర 5.75%, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 5.71%, టాటా కెమికల్స్ 4.07%, టాటా ఎలెక్సీ 1.80%, టాటా టెక్నాలజీస్ 1.49%, టాటా పవర్ 1% లాభపడ్డాయి.

ఐఆర్ఎఫ్‌సీ సీఎండీగా మనోజ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

స్వీకరణ: ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీ (సీఎండీ), సీఈఓగా మనోజ్ కుమార్ దూబే గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1993 బ్యాచ్ ఐఆర్ఏఎస్ అధికారి. గతంలో ఈయన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎఫ్ఓ, డైరెక్టర్ (ఫైనాన్స్)గా పని చేశారు.

మ్యూచువల్‌ఫండ్ల ఆస్తులు రూ.67 లక్షల కోట్లకు

ముంబయి: మ్యూచువల్ ఫండ్ల నిర్వహణలోని నికర ఆస్తుల విలువ ఈ ఏడాది సెప్టెంబరు చివరకు రూ.67 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఆగస్టులో ఇవి రూ.66.7 లక్షల కోట్లుగానే ఉన్నాయి. వాస్తవానికి ఆగస్టు (రూ.38,239 కోట్ల)తో పోలిస్తే సెప్టెంబరులో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ల (ఎంఎఫ్)లోకి పెట్టుబడులు 10% తగ్గి రూ.34,419 కోట్లకు పరిమితమయ్యాయని మ్యూచువల్ ఫండ్‌ల సంఘం యాంఫీ గురువారం వెల్లడించింది. ఈక్విటీ ఫండ్లలోకి ఏప్రిల్‌లో వచ్చిన రూ.18,917 కోట్ల పెట్టుబడుల తర్వాత ఇదే కనిష్ఠం. ఈక్విటీ ఆధారిత పథకాల్లోకి నికర పెట్టుబడులు వరుసగా 43వ నెలా తరలి రావడం గమనార్హం.

✦ క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్)ల్లోకి సెప్టెంబరులో పెట్టుబడులు జీవన కాల గరిష్ఠమైన రూ.24,509 కోట్లకు చేరాయి. ఆగస్టులో ఇవి రూ.23,547 కోట్లుగా నమోదయ్యాయి.


✦ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నుంచి గత నెలలో నికరంగా రూ.71,114 కోట్లను మదుపర్లు ఉపసంహరించుకున్నారు. ప్రధానంగా డెట్ పథకాల నుంచి రూ.1.14 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఆగస్టులో రూ.1.08 లక్షల కోట్ల నికర పెట్టుబడులు తరలి రావడం గమనార్హం. అయినా కూడా ఫండ్ల నిర్వహణలోని ఆస్తుల విలువ పెరగడం గమనార్హం. ✦ మొత్తం మదుపర్ల సంఖ్య 5.01 కోట్లకు చేరగా, ఫోలియోల సంఖ్య 21 కోట్లుగా ఉంది.


కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద మహిళల సందడి

పూల వాకిలి.. సంబరాల లోగిలి

ఆడపడుచుల పాటలు.. యువతుల కోలాటాలు.. దాండియా ఆటలు.. చిన్నారుల సందళ్లు.. ఇలా నగరవ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం బతుకమ్మలను పేర్చి.. సాయంత్రం ప్రధాన కూడళ్లకు తీసుకొచ్చి ఆడిపాడారు. ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, కూకట్‌పల్లి, ఖైరతాబాద్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- న్యూస్‌టుడే, నారాయణగూడ, కూకట్‌పల్లి, ఖైరతాబాద్


కూకట్‌పల్లి హనుమాన్ ఆలయం నుంచి ఐడీఎల్ చెరువు వరకు భారీ బతుకమ్మలతో శోభాయాత్ర


గోపన్‌పల్లి టీఎన్జీవోస్ కాలనీలో బతుకమ్మతో విదేశీ మహిళ





గుస్సాడి నృత్య ప్రదర్శన


హుస్సేన్‌సాగర్ వద్ద ..


ట్యాంక్‌బండ్‌పై బాణసంచా మిరుమిట్లు


బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


ట్యాంక్‌బండ్‌పై ఆడటానికి సిద్ధం చేసిన బతుకమ్మలు




కూకట్‌పల్లి హనుమాన్ ఆలయం వద్ద..

విలువల రతనానికి టాటా



రతన్ టాటా మృతి నేపథ్యంలో నగరంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ప్రజలు గుర్తు చేసుకున్నారు. టీహబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అందరిలోనూ స్ఫూర్తి నింపారు. అప్పటి మంత్రి కేటీఆర్, యువకులతో కలిసి టీహబ్‌లో ఆయన సెల్ఫీ దిగారు.

నగరానికి నగిషీలు

కూడళ్ల విస్తరణ, రంగులు, కాలిబాటల అభివృద్ధికి రూ.178.87 కోట్లు



ప్రధాన రహదారుల అభివృద్ధిపై జీహెచ్ఎంసీ దృష్టిపెట్టింది. ముఖ్యంగా కూడళ్లను విస్తరించి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇంజినీరింగ్, యూబీడీ విభాగాల ఆధ్వర్యంలో 329 పనులను రూ.178.87 కోట్లతో చేపట్టేందుకు కమిషనర్ ఆమ్రపాలి ఇటీవల ఆమోదం తెలిపారు. దాదాపు సగం పనులు మొదలవగా, మిగిలినవి టెండరు దశలో ఉన్నాయి. రెండు ప్రాంతాల్లో నైట్‌బజార్ అభివృద్ధికి జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యుద్దీపకాంతులు, స్ట్రీట్ ఫర్నీచర్‌తో ఆయా ప్రాంతాల సుందరీకరణ, ఇతర పనులను ఏడాది చివరికి పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు.

విభాగాల వారీగా పనులు.. (పనులు / వ్యయం (రూ.కోట్లలో))

విభాగం	పనులు	వ్యయం
ఇంజినీరింగ్	224	149.84
నైట్‌బజార్	2	0.50
యూబీడీ	88	22.04
ఎలక్ట్రికల్	15	6.49

ఈనాడు, హైదరాబాద్

జోన్లవారీగా ఆమోదించిన పనులు (రూ.కోట్లలో వ్యయం)..

జోన్	పనులు	వ్యయం
ఎల్బీనగర్	19	24.34
చార్మినార్	55	30.00
ఖైరతాబాద్	121	34.94
శేరిలింగంపల్లి	51	30.00
కూకట్‌పల్లి	26	29.97
సికింద్రాబాద్	57	29.62
మొత్తం	329	178.87

వేగంగా పనులు..

గత సర్కారు చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనులను కొనసాగిస్తూనే.. మరిన్ని కొత్త వాటికి జీహెచ్ఎంసీ తాజాగా ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఓ చోట పని పూర్తయ్యిందని, 125 కూడళ్లలో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని ఇంజినీరింగ్ విభాగం చెబుతోంది. మరో 89 పనులు టెండరు దశలో ఉన్నాయి. ఆయా పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, టెండరు పూర్తయిన నెలలో పూర్తి చేయాలని కమిషనర్ జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు. పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ సర్కిల్, తదితర కూడళ్లలో విస్తరణ పనులు మొదలయ్యాయి. ఇటీవలి వర్షాలతో రోడ్లపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని జోనల్ కమిషనర్లు, ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

ఆహ్లాదం.. అందం

అక్టోబరు నెల దాటితే వర్షాలు దాదాపుగా ఉండవు. తర్వాత చలికాలం మొదలవుతుంది. డిసెంబరు, జనవరిలో రహదాల పొడవునా రంగురంగుల పూలను ఇచ్చే మొక్కలను నాటుతున్నాం. కూడళ్లలో కొత్త విద్యుద్దీపాలను, డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. పైవంతెనలకు ప్రకృతి, ప్రముఖులు, వేర్వేరు వృత్తులు, తెలంగాణ కళలను ప్రతిబింబించే చిత్రాలతో రంగులద్దుతున్నాం. ప్రధాన రహదారులపై ఏ ప్రాంతానికి ఎంత దూరం అని తెలిపే సూచిక బోర్డులు, ప్రధాన వీధుల పేర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేశాం. పనులన్నీ ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. వేగంగా పూర్తి చేసి నగర వాతావరణాన్ని ఆహ్లాదకరంగా, అందంగా తీర్చిదిద్దుతాం.

- ఆమ్రపాలి కాటా, కమిషనర్, జీహెచ్ఎంసీ

హైడ్రా.. చలో బెంగళూరు



ఈనాడు, హైదరాబాద్: బెంగళూరు నగరంలో మాదిరిగా హైదరాబాద్ చెరువులకు జీవం పోయాలన్న ఉద్దేశంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ఆనంద్ మల్లిగవాడ్‌తో ఆయన గురువారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బెంగళూరు నుంచి సమావేశంలో పాల్గొన్న ఆనంద్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో, పర్యావరణహిత సాంకేతికతతో చెరువులకు ప్రాణం పోయగలిగామని చెప్పారు. మురుగుతో నిండిన చెరువులు, నీరు లేని తటాకాలు, మురుగు కుంటలను కలిపి 35 నీటి వనరుల మంచినీటితో జీవం పోసుకున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ 'బెంగళూరులో చేపట్టిన విధానం బాగుంది. కొమటి మాదాపూర్ తమ్మిడికుంట, ఆక్రమణలు, వ్యర్థాలతో నిండిన దుర్గం చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, గగన్‌పహాడ్ అప్పా చెరువు, ప్రగతినగర్ ఎర్ర కుంట, కూకట్‌పల్లి నల్లచెరువులను మొదటి దశలో పునరుద్ధరిస్తాం. నిర్వహణను చుట్టుపక్కల కాలనీలకే అప్పగిస్తాం."అని వివరించారు.

నిధుల సేకరణపై నజర్

నగరంపై తనదైన ముద్రకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యత్నం

ఈనాడు- సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

అభివృద్ధిపరంగా హైదరాబాద్ మహానగరంపై వచ్చే నాలుగేళ్లలో తనదైన ముద్రవేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులకు దాదాపు రూ.లక్ష కోట్ల వరకు వ్యయం చేయాలని అనుకుంటున్నారు. వివిధ రూపాల్లో నిధుల సేకరణపై ఆయన దృష్టిపెట్టారు. ఇప్పటికే ఏషియన్ బ్యాంక్‌తోపాటు వివిధ ఆర్థిక సంస్థలతోనూ జరుపుతున్నారు. ప్రపంచ బ్యాంక్‌నూ ఒప్పించి నిధులు తేవాలని అనుకుంటున్నారు.

మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం



నగరానికి తలమానికం కాబోతున్న ప్రాజెక్టుల్లో మూసీ సుందరీకరణ ఒకటి. ప్రాజెక్టు ఐదోదశ తయారు చేయడానికి సలహా సంస్థను కూడా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించనున్నారు. దీనికి ప్రధాన అవరోధం మూసీ గర్భంలో, బఫర్ జోన్‌లోని నిర్మాణాలు. వీరిని అక్కడి నుంచి పంపించడం కష్టమైన పనే. నిర్వాసితుల కోసమే దాదాపు రూ.15 వేల కోట్ల వరకు అవసరం. ఉన్న ఇంటి విస్తీర్ణాన్ని బట్టి వంద గజాల స్థలాలు ఇస్తే ఎలా ఉంటుందనేది పరిశీలిస్తోంది. మరోవైపు నగరంలో మలక్‌పేట రేస్ కోర్సు, పేట పోలీస్ గ్రౌండ్స్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయించాలని అనుకుంటోంది. దాదాపు 400 ఎకరాల వరకు అక్కడ ఉంది. దీన్ని ప్రైవేటు వ్యక్తుల ఇచ్చి గృహ నిర్మాణ ప్రాజెక్టు చేపడితే ఆ రూపంలో వచ్చే నిధులతో నిర్వాసితులను అక్కడి నుంచి ఖాళీ చేయించొచ్చని సర్కార్ భావిస్తోంది. మరోవైపు నదిలోకి నీటిని తీసుకువచ్చేందుకు కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి పైపులైను నిర్మాణం ప్రాజెక్టుకు రూ.5500 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీనికి నిధులు అడ్డంకి ఏమీలేదని అధికారులు చెబుతున్నారు. నెల రోజుల్లో దీనికి శంకుస్థాపన చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగేళ్లలో మెట్రో విస్తరణ



నగరంలో మరో 5 దశల కింద మెట్రో రైలు నిర్మాణ ప్రాజెక్టుకు రూ.24,229 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టును కేంద్రానికి పంపించి నిధుల కేటాయించాలని కోరుతున్నారు. మొదటి దశలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతితో పనులు మొదలుపెట్టాలని ప్రభుత్వం అనుకుంటోంది.

- రూ.1500 కోట్లతో గోషామహల్‌లో నయా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- నాలుగో నగరంపై సీఎం ప్రత్యేకంగా దృష్టిసారించారు. నిధుల సేకరణపై వచ్చే 2 నెలల్లో అనేక ఆర్థిక సంస్థలతో ప్రభుత్వ వర్గాలు జరుపుతుందని అధికారులు తెలిపారు.
- రాజీవ్ రహదారి, మేడ్చల్ జాతీయ రహదారిలో ఆకాశమార్గాల నిర్మాణానికి రక్షణ అధికారుల గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ పనులను వచ్చే మూడు నెలల్లో మొదలుపెట్టాలని అనుకుంటున్నారు. రూ.2500 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆర్థిక సంస్థల దగ్గర రుణం తీసుకోవాలని నిర్ణయించారు.

అధ్వాన కేంద్రాలు

రూ.5 భోజన కేంద్రాల్లో ఎలుకలు, బొద్దింకలు, చెత్త


అన్నపూర్ణ కేంద్రం వద్ద ఎలుకల సంచారం

ఈనాడు పరిశీలన

పేదలు, అల్పాదాయ వర్గాలను ఆదరించే అన్నపూర్ణ భోజన కేంద్రాలు నిరాదరణకు గురవుతున్నాయి. పదేళ్ల క్రితం ఇనుప రేకుతో తయారైన డబ్బాల్లో మొదలైన రూ.5 భోజన కేంద్రాలు.. ఇప్పటికే అవే డబ్బాల్లో కొనసాగుతున్నాయి. కాలానుగుణంగా ఆధునికీకరణకు నోచుకోలేదు. కనీసం.. మరమ్మతులు కూడా జరగలేదు. దాంతో లోపలి ఫ్లోరింగ్ దెబ్బతింది. ఎలుకలు, పందికొక్కులు బొరియలు చేసుకుని భోజన కేంద్రాల్లో ఆవాసం ఏర్పరుచుకున్నాయి. అక్కడ పోగయ్యే ఆహార వ్యర్థాలను సిబ్బంది సకాలంలో శుభ్రం చేయట్లేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల మధ్య నగరవాసులు ఆకలి తీర్చుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. భోజన కేంద్రాల దుస్థితిపై 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన కథనం.

అసౌకర్యాల మధ్యనే..

2014లో అన్నపూర్ణ భోజన కేంద్రాల సేవలు మొదలయ్యాయి. ప్రస్తుతం 150 డివిజన్లకు 141 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో రోజూ 40 వేల మంది రూ.5కే మధ్యాహ్న ఆకలి తీర్చుకుంటున్నారు. కేంద్రాలను ఆధునికీకరించాలన్న ప్రతిపాదనా ఆగిపోయింది. నాలుగేళ్ల కిందట.. 6 జోన్లలోని 12 కేంద్రాల ఆధునికీకరణ పనులను చేపట్టినా మధ్యలోనే నిలిచిపోయాయి. మాదాపూర్ మెట్రో స్టేషన్, కూకట్‌పల్లి జోనల్ ఆఫీసు, బాలనగర్ రోడ్డు, మరికొన్ని కేంద్రాలను మాత్రమే అధికారులు ఆధునికీకరించారు. అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకలు, పందికొక్కులు, తాగునీటి, మరుగుదొడ్ల సమస్యలు కేంద్రాలను వేధిస్తున్నాయి.


మింట్ కౌంపౌండ్ కేంద్రం లోపల

- నాంపల్లి రైల్వేస్టేషన్, మింట్ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయగా మింట్ కాంపౌండ్ కేంద్రాన్ని 'ఈనాడు' పరిశీలించింది. దాదాపు 200 మంది భోజనం చేశారు. వ్యర్థాలను సిబ్బంది ఓ నల్ల సంచిలో వేసి పక్కన ఉంచగా.. లోపల ఉన్న ఎలుకలు వచ్చి వ్యర్థాలను లోపలికి తీసుకెళ్లాయి. కేంద్రంలో దుర్వాసన, మట్టి, బొద్దింకలు, పాత సామాన్లు, బూజు పట్టిన పరిసరాలతో అపరిశుభ్రత దర్శనమిచ్చింది.

ఇవిగో సాక్ష్యాలు..

- జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఎదుట కేంద్రం కూడా శిథిలావస్థకు చేరుకుంది. మురుగు, చెత్త, నాలా నుంచి వెలువడే దుర్వాసన మధ్యనే జనం ఆకలి తీర్చుకుంటున్నారు.
- రెడ్‌హిల్స్ రాయలసీమ రుచులు హోటల్ ఎదుట, పురానాపూల్ బ్రిడ్జి వద్ద, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద కేంద్రాల్లోనూ దాదాపు ఇవే దృశ్యాలు కనిపించాయి.

ఈనాడు, హైదరాబాద్





కోఠి ఆశలతో పూర్తి



కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాల (ఓయూసీడబ్ల్యూ) 19వ స్నాతకోత్సవం గురువారం సందడిగా సాగింది. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు పట్టాలు ప్రదానం చేశారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన 13 మందికి బంగారు పతకాలు, పీహెచ్‌డీ చేసిన అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. - న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్



ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు ఆటంకం

ఈనాడు, హైదరాబాద్: హెచ్ఎండీఏలో వందల సంఖ్యలో పంచాయతీ లేఅవుట్లను నిషేధిత జాబితాలో ఉంచడంతో దాదాపు 3.2 లక్షల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ తరుణంలో దాదాపు 400కు పైగా లేఅవుట్లను నిషేధిత జాబితా 22-ఏ(1)(ఈ)లో ఉండటం వల్ల ఆయా లేఅవుట్లల్లో ఎల్ఆర్ఎస్ సంక్లిష్టంగా మారింది. హెచ్ఎండీఏ ఏర్పడక ముందు వందల సంఖ్యలో గ్రామపంచాయతీ లేఅవుట్లు ఉన్నాయి. హెచ్ఎండీఏ వచ్చాక పంచాయతీ లేఅవుట్లను నిషేధించారు. అప్పటికే ఉన్న వాటిలో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. ఇప్పటికీ కొన్ని పంచాయతీ అనుమతుల లేఅవుట్లే ఉన్నాయి. ఎల్ఆర్ఎస్‌లోనూ ఈ జాబితాకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో నిషేధిత జాబితా లో చేర్చడంతో ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు.


కేబీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో మొదటి బహుమతి అందుకున్న చంద్రకళకు టీవీ అందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తదితరులు

ఖైరతాబాద్
•ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

పూల పండగతో పులకించిన హుస్సేన్‌సాగర్

నారాయణగూడ: 'బతుకమ్మను భవిష్యత్ తరాలకు అందిద్దాం, చెరువులను కాపాడుకొని జీవన వైవిధ్యాన్ని పరిరక్షించుకుందాం' అని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గురువారం రాత్రి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్మారకం నుంచి మహిళలతో కలిసి మంత్రి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, అరుణోదయ విమలక్క, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభ, తదితరులు బతుకమ్మలతో ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేశారు. విమలక్క మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, పర్యాటక శాఖ సంచాలకులు ఇలా త్రిపాఠి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


వెంగళరావునగర్‌లోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ కమిషనరేట్‌లో డైరెక్టర్ కాంతివెస్లీ, కార్యదర్శి వాకాటి కరుణ, ఉమెన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి


పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్


కృష్ణకాంత్‌పార్కు వద్ద వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్


గౌరీశంకర్‌నగర్‌లో..

సద్దుల బతుకమ్మ సంబురం


బంజారాహిల్స్ ఇబ్రహీంనగర్‌లో మహిళలు, చిన్నారులు


ఎన్బీటీనగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


ఖైరతాబాద్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద


హెచ్ఎండీఏ మైదానంలో..


శ్రీకృష్ణానగర్‌లో వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో



ట్యాంక్‌బండ్‌పై సందడి










పంజాగుట్ట ఆనంద్‌నగర్ కాలనీ అమ్మవారి మండపంలో దాండియా కళాకారులు

దుర్గమ్మ వైభవం


జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి దేవాలయంలో దుర్గాదేవిగా పర్వతవర్ధినిదేవి

చెడును నిరోధించేందుకు ప్రయత్నించాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: సమాజంలో మంచి, చెడు తలపెట్టే రెండు వర్గాలూ ఉన్నారని, మంచికోసం పోరాడే వారు ఉన్నంత కాలం సమాజం బాగుంటుందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్ అన్నారు. రాజకీయ నాయకులు అందరూ చెడ్డవారు కాదు, సమాజం కోసం జీవితం ధారపోసిన వారూ ఉన్నారని అన్నారు. సహ చట్టం ఆవిర్భావ దినం సందర్భంగా గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలెక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో సహ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడును ఎంత వరకు నిరోధించగలమో అంత వరకు ప్రయత్నం చేస్తూ ఉండాలని సూచించారు. సమితి జాతీయ ఛైర్మన్ డా.బొమ్మరబోయిన కేశవులు అధ్యక్షత వహించారు. సహ చట్టం కోసం పనిచేస్తున్న పలువురిని సత్కరించారు.


మాట్లాడుతున్న జస్టిస్ భవాని ప్రసాద్

సైకాలజీలో ఉపాధి అవకాశాలు ఎక్కువ

షేక్‌పేట, న్యూస్‌టుడే: మానసిక దృఢత్వంతోనే విజయం సాధించగలుగుతామని వక్తలు పేర్కొన్నారు. షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (జీనిట్స్)లో మనో జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ సైకాలజీ-100 ప్లస్ సైకాలజికల్ కెరీర్ పాథ్స్' ఇతివృత్తంతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. మార్ఫిక్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ డా.సుశీర్ కుమార్ పల్సపూర్ మాట్లాడుతూ.. సైకాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు డా.గీత చల్లా, డా.ఉదయ్ కుమార్ రెడ్డి, డా.శిప్రా గుప్తా, డా.బి.రాజగోపాల్, డా.వసుధారాణి, బీకే సుమలత, గంపా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హిమబిందుకు ఉత్తమ వైద్యురాలి పురస్కారం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అమెరికా హ్యూస్టన్‌లోని ప్రసిద్ధ మెథొడిస్ట్ హాస్పిటల్‌లో హృద్రోగ శస్త్ర చికిత్సల నిపుణురాలిగా సేవలందిస్తున్న డా.హిమబిందు చేబ్రోలుకు 'బెస్ట్ డాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2023' పురస్కారాన్ని జోష్ నేషనల్ అకాడమీ అందజేసింది. ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ కమిషన్ పూర్వ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు, విశిష్ట అతిథిగా పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, భూగర్భవనరుల నిపుణుడు, శాస్త్రవేత్త సి.ఆర్.ఎమ్ రావు పాల్గొన్నారు. సంజోష్, చిరంజీవులు, నృత్య గురువు కళ్యాణి పాల్గొన్నారు.

దొంగలను పట్టుకున్న యువకులకు డీసీపీ అభినందనలు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న యువతి మెడలోంచి బంగారు గొలుసు తెంపుకొని పారిపోతున్న దొంగను ఇద్దరు యువకులు పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం జయప్రకాష్‌నగర్‌లో చోటు చేసుకుంది. చోరీకి పాల్పడిన తమిళనాడుకు చెందిన నితిన్‌ను పట్టుకున్న యువకులు తేజ, శివలను వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ గురువారం తన కార్యాలయానికి పిలిచి అభినందించారు. అదనపు డీసీపీ హనుమంతరావు, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ ఉన్నారు.


తేజ, శివలను అభినందిస్తున్న డీసీపీ విజయ్‌కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా..
ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్ 80085 73345
జూబ్లీహిల్స్ 80085 73352
బంజారాహిల్స్ 80085 73348

బంజారాహిల్స్ న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ ఉదయనగర్ బస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠించిన ప్రాంతంలో పలు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– రాము, ఉదయనగర్

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్–18.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యంపై రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానం వద్ద అవగాహన కల్పించారు. మంచి మానసిక ఆరోగ్యం సాధించడం ఎలా? అనే అంశంపై ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ రొటేరియన్ శరత్ చౌదరి, అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ప్లకార్డులతో రోటరీ క్లబ్ సభ్యులు

అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: చెన్నై నుంచి వస్తున్న తల్లిని తీసుకొని వస్తానంటూ వెళ్లిన అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బంజారాహిల్స్ రోడ్ నంబరు 13లోని శ్రీసాయి మాన్షన్‌లో చెన్నైలోని పర్వల్కం ప్రాంతానికి చెంది సినీపరిశ్రమలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసే వైకే చరణ్, గొట్టిపాటి అశ్విన్ కలిసి ఉంటున్నారు. గత నెల 30న చెన్నై నుంచి హైదరాబాద్ వస్తున్న తన తల్లిని బంధువుల ఇంటి వద్ద దించి వస్తానంటూ చరణ్ వెళ్లి తిరిగిరాలేదు. ఈనెల 4న తాను ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నానని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అశ్విన్‌కు మెయిల్ పంపించాడు. మెయిల్ ఆలస్యంగా గుర్తించిన అశ్విన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రత్యేక బృందంతో గాలిస్తున్నట్లు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కెంఎం రాఘవేంద్ర తెలిపారు.


చరణ్

శ్రీవారి ఊరేగింపు


శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ముత్యాల పందిరి ఉరేగింపు వైభవంగా నిర్వహించారు. – న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నియామకం

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన బుద్దనబోయిన బిందుశ్రీ నియమితులయ్యారు. ఈమేరకు హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా.చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్‌లు ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.


బిందుశ్రీకి నియామకపత్రం ఇస్తూ..

పబ్, కెఫేలపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పబ్, కెఫేపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని లోకో పబ్ సమయం మించిన తరువాత కొనసాగుతోందని గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు, మేనేజర్ ప్రదీప్‌కుమార్‌తోపాటు పబ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. * జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లోని ట్రూ కాఫీ కెఫేకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించకపోడంతో వాహనాలన్నీ రహదారిపై నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై నర్సింహారావు జూబ్లీహిల్స్ పోలీసుకు ఫిర్యాదు చేయగా, నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌కు అలయ్-బలయ్ ఆహ్వానం

అమీర్‌పేట: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 13న అలయ్-బలయ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అలయ్-బలయ్ కమిటీ ప్రతినిధులు గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి


మాట్లాడుతున్న అల్లాదుర్గం సురేష్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముదిరాజ్ సామాజికవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటులో ఉందని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ పేర్కొన్నారు. వీరి అభివృద్ధికి బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా 56 ఏళ్లుగా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. 2009లో బీసీ-ఏలో చేర్చగా కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిపివేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఈ అంశంపై హామీ ఇచ్చిందన్నారు. అంతకుముందు బీసీ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గౌరవ అధ్యక్షులు ఎడ్ల బాబురావు, డా.ఆనందమూర్తి, ఉపాధ్యక్షుడు కటికల శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

బోరబండ, న్యూస్‌టుడే: బస్తీ దవాఖానాల్లో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని బోరబండ డివిజన్ కార్పొరేటర్ ఎం. డి. బాబాఫసియుద్దీన్ అన్నారు. సైట్-2 కాలనీ క్యాంపు కార్యాలయంలో బోరబండ ప్రాంతంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, బస్తీదవాఖానాల వైద్యాధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. దవాఖానాల్లో అందే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బోరబండ, వినాయక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు మమత, షేక్ మహబూబ్ సుభాన్, బస్తీదవాఖానాల వైద్యులు ప్రియాంక, అనురాగ, దివ్య పాల్గొన్నారు.

ఒత్తిడితో బలవన్మరణం


జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రెండేళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట ప్రాంతానికి చెందిన వాసు(36) రెండేళ్లుగా బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని ఐపీఎస్ క్వార్టర్స్ సమీపంలో నివసిస్తున్నారు. కొంత కాలంగా వివిధ పోటీపరీక్షలకు హాజరుకాగా, ఎంపిక కాలేదు. అంతేకాకుండా తల్లిదండ్రుల మరణంతో కుంగిపోయాడు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నారు. గురువారం ఇంట్లో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నగరంలోని ఓ జోన్ డీసీపీకి బామ్మర్ది కావడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబరు 1లో ఏర్పాటైన అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ - న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్



దుర్గాదేవిగా కుర్తాళం పీఠం ప్రత్యంగిరా అమ్మవారు. - న్యూస్‌టుడే, ఆర్కేపురం



ఎరుపు రంగు చీరలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మతల్లి - న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్



నిమ్మకాయల దండలతో సుందరంగా బల్కంపేట ఎల్లమ్మ మూలవిరాట్- న్యూస్‌టుడే, సంజీవరెడ్డినగర్



స్వర్ణకిరీటంతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి - న్యూస్‌టుడే, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్

సొంతూరులో మొక్కులు..

నగరంలో దోపిడీలు



- రాజధానిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ధార్ ముఠా
- పోలీసుల నిఘా తగ్గడం వల్లేనని విమర్శలు

దోపిడీకి ముందు ఎంతో నిష్ఠగా గ్రామ దేవతకు పూజలు చేస్తారు. తమ పని విజయవంతంగా పూర్తవ్వాలని.. కనీసం అర కిలో బంగారం దొరకాలని ప్రార్థిస్తారు. కత్తులు, ఇతర మారణాయుధాలతో రంగంలోకి దిగుతారు. ఎన్ని రోజులైనా.. ఎన్ని ఇళ్ల తాళాలు పగలగొట్టినా అనుకున్నది సాధించే వరకూ ఆ ప్రాంతాన్ని వదిలిపెట్టరు. అంతా అనుకున్నట్లు జరిగితే మళ్లీ సొంతూరుకు వెళ్లి దేవతకు మొక్కులు సమర్పిస్తారు. ఇదీ దొంగతనాలకు మారుపేరైన ధార్ ముఠా నేపథ్యం. వరుస దోపిడీలకు చిరునామాగా నిలిచే ధార్ గ్యాంగ్ నగరంపై మళ్లీ బుసలు కొడుతోంది. పలువురిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం, పోలీసుల కట్టుదిట్టమైన చర్యలతో 2022 జూన్ నుంచి నగరం వైపు కన్నెత్తిచూడని ఈ ముఠా కొద్దిరోజులుగా నగర శివార్లు లక్ష్యంగా తెగబడుతున్నారు.



పగలు రెక్కీ.: మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా లోని తాండా, కుక్షి పరిధిలో కొన్ని ఆదివాసీ గ్రామాలకు చెందిన ఈ ముఠాలోని సభ్యులు వేర్వేరు రాష్ట్రాలను ఎంపిక చేసుకుని చోరీలు చేస్తుంటారు. ట్రావెల్స్ బస్సుల్లో కొంపల్లి, మేడ్చల్‌కు చేరుకుంటారు. పగలు రెక్కీ నిర్వహిస్తారు. పోలీసు గస్తీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేస్తారు. ఒకవేళ ఎవరైనా అడ్డుపడితే రాళ్లతో దాడి చేస్తారు. మారణాయుధాలతో హతమార్చేందుకూ వెనుకాడరు.

తగ్గిన నిఘా..

నిఘా తగ్గడం వల్లే ధార్ ముఠా నగరంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మేడిపల్లి, అమీన్‌పూర్, మియాపూర్, హయత్‌నగర్, మేడ్చల్, సూరారం ప్రాంతాల్లో కదలికలు పెరిగాయి. శివారు ప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ తగ్గిందని స్థానికులు, కాలనీ సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈనాడు, హైదరాబాద్

తనిఖీల్లో చిక్కి..

గోదాముల్లో ముక్కి



పట్టుబడిన రేషన్ బియ్యంలో పాడవుతున్నదే ఎక్కువ

ఈనాడు, హైదరాబాద్: రేషన్ దందాలో పట్టుకుంటున్న బియ్యాన్ని ఏళ్లుగా గోదాముల్లో ఉంచడంతో మెట్రిక్ టన్నుల మేర పాడవుతోంది. రెండేళ్లలో రేషన్ దందా నుంచి 774.333 మెట్రిక్ టన్నుల బియ్యం, 59.146 మెట్రిక్ టన్నుల గోధుమలను హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా పట్టుకున్న బియ్యంలో ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ(ఎఫ్ఏక్యూ), నాన్ ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ(నాన్ ఎఫ్ఏక్యూ)గా విభజించి నాన్ ఎఫ్ఏక్యూ బియ్యాన్ని డిస్టిల్లరీ కంపెనీలకు విక్రయిస్తున్నారు. టెండర్లలో మంచి ధరన కోట్ చేసిన వారికి అమ్ముతుంటారు. రెండేళ్లుగా విక్రయించకపోవడంతో చాలావరకు బియ్యం పాడైపోయింది. 774.33 మెట్రిక్ టన్నుల బియ్యంలో 644.088 మెట్రిక్ టన్నుల బియ్యం నాన్ ఎఫ్ఏక్యూ బియ్యం, 59.146 మెట్రిక్ టన్నుల గోధుమల్లో 20.039 మెట్రిక్ టన్నులు నాన్ ఎఫ్ఏక్యూ ఉందని అధికారులు నిర్ధారించి తాజాగా టెండర్లు ఆహ్వానించారు. గతంలో కిలోకు రూ.15చొప్పున విక్రయించగా ఈసారి రూ.17నుంచి రూ.18వరకు వస్తుందని అధికారుల అంచనా.

అధికారులు దాడుల్లో పట్టుకున్న బియ్యం, గోధుమలు (మెట్రిక్ టన్నుల్లో)

సర్కిల్	సీజ్ చేసిన బియ్యం		సీజ్ చేసిన గోధుమలు	
	ఎఫ్ఏక్యూ	నాన్ ఎఫ్ఏక్యూ	ఎఫ్ఏక్యూ	నాన్ ఎఫ్ఏక్యూ
మలక్‌పేట్	2.711	117.980	1.030	4.323
యాకుత్‌పురా	2.870	251.995	15.000	9.541
చార్మినార్	9.200	57.556	3.150	0.000
నాంపల్లి	7.550	22.680	1.130	0.000
మెహిదీపట్నం	48.190	71.487	5.780	0.500
అంబర్‌పేట్	8.400	39.497	7.400	1.725
ఖైరతాబాద్	33.749	27.650	4.542	0.000
బేగంపేట్	6.350	40.243	0.350	3.950
సికింద్రాబాద్	11.225	15.000	0.725	0.000

సామాజిక మాధ్యమాలు..

మాటల మంటలు

నగర సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదుల వెల్లువ

ఈనాడు, హైదరాబాద్



- కూకట్‌పల్లి పరిధిలో గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వాట్సాప్ గ్రూపులో కొందరు సలహాలు, సూచనలిచ్చేవారు. ఇది నచ్చని కొందరు తమను ఉద్దేశించే ఇలా చేస్తున్నారంటూ ప్రతికూలంగా స్పందించటంతో గొడవ ముదిరి కొట్టుకునేంతగా మారింది.
- మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకొని వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో చేస్తున్న అభ్యంతరకరమైన పోస్టులపై సైబర్‌క్రైమ్‌లో 10కి పైగా కేసులు నమోదయ్యాయి.

ప్రాణ స్నేహితులను బద్ధశత్రువులుగా మార్చటం నుంచి శాంతిభద్రతల సమస్య సృష్టించేంత వరకూ సామాజిక మాధ్యమాలు వేదికలుగా మారాయి. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో గొడవలు సృష్టించేందుకు పాదీ నుంచి కొందరు మార్ఫింగ్ ఫొటోలు, తప్పుడు సమాచారంతో పోస్టులు చేశారు. దీన్ని పోలీసులు ముందుగానే గుర్తించటంతో అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోగలిగారు. బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఐటీ సెల్ సామాజిక మాధ్యమాల్లో జరిగే విషప్రచారాన్ని గుర్తించి కట్టడి చేస్తోంది. అయినా ఏదో ఒక మాధ్యమాల్లో ఎదురయ్యే వ్యక్తిగత దూషణలతో బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. గతేడాది రాజకీయపార్టీలు, నాయకులను దుర్భాషలాడుతూ రూపొందించిన పోస్టులపై 15 కేసులు నమోదైతే.. ఈ ఏడాది ఆ సంఖ్య 200 దాటింది.

చూడకుండా ఫార్వర్డ్ చేసినా అంతే..

నల్గొండ జిల్లాకు చెందిన యువకుడు ఒక ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తూ మార్ఫింగ్ ఫొటోతో ఫేస్‌బుక్‌లో షేర్ చేశాడు. దాన్ని పూర్తిగా చదవకుండానే మరొకరు వాట్సాప్ గ్రూపుల్లో చేరవేశాడు. పోలీసుల వద్దకు వస్తున్న ఫిర్యాదుల్లో అధికశాతం చట్టాలపై అవగాహన లేనివారే ఉంటున్నారు. ఆ పోస్ట్ తాము రూపొందించకున్నా కేసు ఎలా నమోదు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారం, అసభ్యకర ఫొటోలు, వీడియోలను చేరవేస్తున్న జాబితాలో 15-17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉంటున్నారని మరో ఇన్‌స్పెక్టర్ ఆందోళన వెలిబుచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

కొందుర్గు: కొందుర్గు మండలానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ శశాంకతో కలిసి గురువారం ఆయన ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. శంకుస్థాపన అనంతరం బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆర్డీవో వెంకటమాధవరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



డిజైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వర్గీకరణ జరిగే వరకు నియామకాలొద్దు: మందకృష్ణ మాదిగ



బౌద్ధనగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు అన్ని ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన అనంతరమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల పరీక్షలను వాయిదా వేయాలన్నారు. ఇప్పటికే నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష ఫలితాలను వర్గీకరణ అయ్యేవరకు విడుదల చేయకుండా నిలిపివేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో నిజాయతి, బాధ్యత లేదని విమర్శించారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్‌లలో ఎస్సీ వర్గీకరణను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు. ఈనెల 16న వరంగల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, మల్లికార్జున మాదిగ పాల్గొన్నారు.

ఉప్పల్ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు 12న

భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో నిర్ణయం

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ స్టేడియంలో ఈనెల 12న భారత్-బంగ్లాదేశ్ టీ20 క్రికెట్ మ్యాచ్ ఈనేపథ్యంలో పలు మార్గాలలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. 12న సాయంత్రం 4నుంచి రాత్రి 11.30గంటల వరకు చెంగిచర్ల, బోడుప్పల్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఉప్పల్‌లోని టొయోటో షోరూం ఎదురు నుంచి హెచ్ఎండీఏ భగాయత్ లే అవుట్ మీదుగా నాగోల్ వైపు మళ్లింపు. ● ఎల్బీనగర్, నాగోల్ నుంచి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో రైలు స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకొని భగాయత్ లేఅవుట్ మీదుగా చెంగిచర్ల ఎక్స్ రోడ్డు వైపు మళ్లింపు. ● తార్నాక నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్‌రోడ్డు నుంచి నాచారం వైపు, రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ వీధి నం.8 నుంచి మెట్రో పిల్లర్ నం.972 వద్ద యూటర్న్ తీసుకొని ఉప్పల్ ఎక్స్ రోడ్డు వైపు వెళ్లాల్సి ఉంటుంది.



సంధ్యవేళ.. అమ్మతో అలా..

రోజంతా ఇంట్లోనే ఉండే వారు సాయంత్రం వేళ సేదతీరేందుకు సాగర తీరానికి తరలివస్తుంటారు. నెక్లెస్‌రోడ్డులో ఓ మహిళ తన చిన్నారిని ఎత్తుకొని నడుస్తూ పరిసరాలను ఆస్వాదిస్తున్న చిత్రమిది.



పండుగ వేళ.. ప్రయాణికులకు ఎంత కష్టం

అసలే మహా నగరం.. ఆపై ట్రాఫిక్ వలయం.. మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కొరవడింది. రహదారి దాటేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



కూడలికి కళ.. బొమ్మ భళా

సుందరీకరణలో భాగంగా కూడళ్లు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఖాజాగూడ కూడలిలో నాపరాళ్లతో గోడ కట్టి వాటి ముందు ఏర్పాటు చేసిన మస్కట్‌లు ఆకట్టుకుంటున్నాయి.



సంద్రం కాదిది.. మన సాగరమేనండి

సందర్శకులు సముద్రతీరంలో సేద తీరుతున్నట్లు ఉంది కదూ.. హుస్సేన్‌సాగర్ వద్ద కనిపించిన చిత్రమిది. నెక్లెస్ రోడ్డులో రైల్వే స్టేషన్ ముందు కొన్ని గ్రిల్స్ తొలగించడంతో నగరవాసులు సాగర్ చెంత ఆహ్లాదంగా గడుపుతున్నారు.

ఒడిశాలో బాలుడి కిడ్నాప్.. రక్షించిన రాచకొండ పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ఒడిశాలో అపహరణకు గురైన బాలుడిని రాచకొండ పోలీసులు కాపాడారు. బాలుడు 12 రోజుల క్రితం అపహరణకు గురవ్వగా ఒడిశా పోలీసుల అభ్యర్థనతో రంగంలోకి దిగిన భువనగిరి ఎస్‌వోటీ బృందం 24 గంటల్లోనే కేసును ఛేదించింది. రాచకొండ సీపీ సుధీర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని బలంగీర్ జిల్లాకు చెందిన పద్మిని మాజీ (35), నౌపడ జిల్లా కోమ్నా ఠాణాకు చెందిన దుర్యోధన్ బరిహా(30)తో సహజీవనం చేస్తోంది. దుర్యోధన్ యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలానికి వచ్చి ఒక ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ ఒక చిన్నారిని అపహరించాలనుకున్నారు. పథకం ప్రకారం పద్మిని.. కోమ్నా పరిధిలో దంపతుల దగ్గర పనికి కుదిరింది. వారి కుమారుడి(5)ని గత నెల 29న అపహరించి రైల్లో సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి బొమ్మలరామారంలో ఉంటున్న దుర్యోధన్ వద్దకు వచ్చింది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కోమ్నా పోలీసులు ఈనెల 29న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



బాలుడు, అతడి తల్లితో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రమణారెడ్డి, ఏసీపీ నరేందర్‌గౌడ్ తదితరులు

ప్రత్యేక బృందంతో బాలుడి గుర్తింపు

పద్మిని రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంటున్నట్లు అక్కడి పోలీసులు గుర్తించినా.. నిర్దిష్ట ప్రాంతం కనుక్కోలేకపోయారు. పోలీసులు దుర్యోధన్‌కి ఫోన్ చేసినా తనకు ఎవరూ తెలియదని బుకాయించాడు. దీంతో ఒడిశా పోలీసులు మంగళవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబును సంప్రదించి కేసు వివరాలు చెప్పారు. బాలుడిని గుర్తించేందుకు ఐటీ సెల్, భువనగిరి ఎస్‌వోటీతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయించారు. సాంకేతిక ఆధారాలతో బాలుడు, పద్మిని బొమ్మలరామారం పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. తూముకుంట గ్రామంలో చిన్నారి ఆచూకీ లభ్యమైంది. పద్మిని, దుర్యోధన్‌ని అదుపులోకి తీసుకున్నారు. కోమ్నా పోలీసులు, బాలుడి తల్లిదండ్రులకు సమాచారమివ్వగా గురువారం కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. బాలుడిని తల్లికి అప్పగించారు. చిన్నారిని రక్షించిన బృందాన్ని కమిషనర్ అభినందించారు.

పరోపకారుడు.. విధికి తలవంచాడు



కేపీహెచ్‌బీకాలనీ: ఆపత్కాలంలో ఉన్న పలువురికి 26 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రేమించిన యువతిని తల్లిదండ్రులను ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నాడు. పరోపకారిగా పేరు తెచ్చుకున్న ఆ యువకుణ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. అతని మంచితనాన్ని చూసైనా మృత్యువు కరుణించలేదని ఆ తల్లిదండ్రులు రోదించారు. కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం గోదమగూడకు చెందిన **ఏనుగు అనంత్‌రెడ్డి(24)** ఫొటోగ్రాఫర్. సామాజిక కార్యకర్త. ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేశాడు. ఆగస్టు 11న అర్ధరాత్రి బైక్‌పై ఒంటరిగా ఉప్పల్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వచ్చాడు. జేఎన్‌టీయూ సిగ్నల్ దాటాక బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, కాచిగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అనంత్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు.

ఐటీ ఉద్యోగమిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం

మాదాపూర్, న్యూస్‌టుడే: ఐటీ ఉద్యోగాల పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమను మోసం చేసిందని పలువురు బాధితులు గురువారం మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. మాదాపూర్ కావూరి హిల్స్‌లో ఉండే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ యాజమాన్యం ఉద్యోగాలు ఇస్తామని ఒక్కొక్కరి వద్ద రూ.2.50 లక్షలు వసూలు చేసింది. డబ్బులు కట్టిన తర్వాత ఆఫర్ లెటర్ చేతికిచ్చి, వర్క్ ఫ్రం హోం అని చెప్పి ఆరు నెలలు కాలం వెల్లబుచ్చిన కంపెనీ యజమాన్యం, జీతాలు చెల్లించలేదు. దీంతో అనుమానం వచ్చిన ఉద్యోగులు కంపెనీ యాజమాన్యాన్ని నిలదీశారు. ప్రాజెక్టులు లేవని చెప్పిన కంపెనీ యజమాన్యం.. కొన్ని రోజులుగా కార్యాలయానికి రాకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న ఉద్యోగులు మాదాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కాగా ప్రస్తుతం కేసు నమోదు చేయలేదని, మోసం రూ.కోట్లలో ఉండడంతో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ విభాగంలో ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించినట్లు మాదాపూర్ సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

రూ.6 కోట్ల బంగారం మాయం

ఎనిమిది మంది ఉద్యోగులపై కేసు



అదృశ్యమైన సుఖేతు షా

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆభరణాల దుకాణంలో పనిచేసే ఉద్యోగులు దాదాపు రూ.6 కోట్ల బంగారం మాయం చేసిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు వివరాల ప్రకారం.. రోడ్ నంబరు 10లోని శ్రీకృష్ణ జువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌కేజేపీఎల్) ఇటీవల అంతర్గత ఆడిట్ నిర్వహించింది. సంస్థ ఉద్యోగులు ఉదయ్‌కుమార్, బబ్బూరి శ్రీకాంత్ బంగారు కడ్డీలు దొంగిలించి విక్రయించినట్లు గుర్తించారు. శ్రీకాంత్ వినియోగదారులకు బంగారం అందజేస్తానని నమ్మించి ఉదయ్‌కుమార్, మరికొందరు ఉద్యోగుల సాయంతో విక్రయాల సాగించినట్లు తెలుసుకున్నారు. శ్రీకాంత్‌ను విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. మేనేజర్‌గా పనిచేసే సుఖేతు షా నేతృత్వంలో ఉదయ్‌కుమార్, చింటు, సత్య, అజయ్, టింకు, చంద్ర కలిసి ఈ మోసాలకు పాల్పడినట్లు అతడు తెలిపాడు. ఈ మేరకు హెచ్‌ఆర్ మేనేజర్ విజయ్‌కుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెక్షన్ 316(4), 318(4) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసును గురువారం సీసీఎస్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కెంఎం రాఘవేంద్ర తెలిపారు. మరోవైపు సుఖేతు షా భార్య శృతిషా తన భర్త ఈనెల 1నుంచి కనిపించడం లేదని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయిదురోజులుగా తాను పనిచేసే ప్రాంతంలో డబ్బుల విషయంలో వేధిస్తున్నారని లేఖ, వీడియో రికార్డు ఇంట్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 3 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి



నినాదాలు చేస్తున్న వేముల రామకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం నేతలు

అంబర్‌పేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించి రూ.3 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 16 లక్షల మందికి చెల్లించాల్సిన రూ. 4500 కోట్ల ఫీజు బకాయిలలో రూ. 1500 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మిగిలిన బకాయిలను చెల్లించాలని గురువారం అంబర్‌పేటలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

గోసంరక్షణ బిల్లు ఆమోదించాలి



గోపూజలో జస్మత్‌పటేల్, రితీష్ జాగిర్దార్

కాచిగూడ: పార్లమెంటులో గోసంరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ గోసంరక్షణ సంస్థలు డిమాండ్ చేశాయి. గురువారం తెలంగాణ లౌ ఫర్ కౌ ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణిమిత్ర రితీష్ జాగిర్దార్, కమలేష్ మహారాజ్, మహంత్ ప్రశాంత్ దాస్‌జీ మాట్లాడారు.

అబ్దుల్లాపూర్‌మెట్: గోవును జాతీయ మాతగా ప్రకటించాలనే డిమాండ్‌తో గో ప్రతిష్ఠ ఆందోళన, గో ధ్వజ స్థాపన భారతయాత్రలో భాగంగా శంకరాచార్య జ్యోతిష్య పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి గురువారం జాఫర్‌గూడలో యుగ తులసి గో మహాక్షేత్రానికి విచ్చేశారు. యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివకుమార్ ఘన స్వాగతం పలికారు.

కోయంబత్తూర్ విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్, న్యూస్‌టుడే: 'కోయంబత్తూర్ నుంచి బయల్దేరిన ఇండిగో విమాన సర్వీస్‌లో బాంబు పెట్టామని గుర్తు తెలియని వ్యక్తులు విమానాశ్రయానికి మెయిల్ పంపించారు. భద్రతాధికారుల తనిఖీలు చేపట్టగా విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్ అధికారులు, ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ-764 విమాన సర్వీస్ కోయంబత్తూర్ నుంచి 181 మంది ప్రయాణికులతో శంషాబాద్ బయల్దేరింది. ఈ విమాన సర్వీస్‌లో బాంబులున్నాయని ఎయిర్‌పోర్ట్‌కు మెయిల్ వచ్చింది. మెయిల్ వచ్చిన చిరునామా ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించిన నాగార్జున

రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ

కేపీహెచ్‌బీకాలనీ: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను గురువారం పలువురు సినీ ప్రముఖులు పరామర్శించారు. నటులు అక్కినేని నాగార్జున, గోపిచంద్, శ్రీవిష్ణు, దర్శకుడు శ్రీను వైట్ల, ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, ఐపీఎల్ కౌన్సిల్ సభ్యుడు ఛాముండేశ్వరీనాథ్ నటుడి నివాసంలో ఆయనతోపాటు కుటుంబసభ్యులను ఓదార్చారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	109-00	డ్రెస్డ్	190-00
రిటైల్	131-00	స్కిన్‌లెస్	216-00

ట్రాన్స్‌కో 1535 పవర్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి


రోనాల్డ్ రోస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో 1535 పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఎ.వజీర్, కార్యదర్శి డి.రాధాకృష్ణ తదితరులతో కలిసి గురువారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు యూనియన్ ప్రతినిధులు జ్ఞాపికను బహూకరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా బండారి నగేష్‌ను, సలహాదారుగా రవి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని, ఇతర కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు.

కొత్త చట్టంపై ధరణి బాధితుల ఆశలు

ధరణి | Dharani
Integrated Land Records Management System
Government of Telangana

ఈనాడు, హైదరాబాద్, కాప్రా, యాచారం, న్యూస్‌టుడే: పట్టా భూములు.. ప్రభుత్వ భూములుగా.. రైతుల భూములను నిషేధిత భూములుగా రికార్డుల్లో చూపిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి పోర్టల్ స్థానంలో రాబోతున్న కొత్త చట్టంతో ఉపశమనం లభిస్తుందేమోనని ఆశతో ధరణి బాధితులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఏడేళ్ల క్రితం ధరణి పోర్టల్‌ను అమల్లోకి తెచ్చిన మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలోనే సమస్యలున్నాయి. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో వందలాది రైతులు, భూముల యజమానులు తహసీల్దార్, కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ధరణి.. దరఖాస్తులు..

జిల్లా	దరఖాస్తులు	పరిష్కారం	తిరస్కరణ
రంగారెడ్డి	1.97 లక్షలు	1.78 లక్షలు	19 వేలు
మేడ్చల్	32 వేలు	28 వేలు	4 వేలు

పంట రుణాలు లేవు.. రైతుబంధు లేదు



– రవికిరణ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, బొమ్మరాస్‌పేట, మేడ్చల్‌జిల్లా

ధరణి పోర్టల్ వచ్చిన కొత్తలో బొమ్మరాస్‌పేటలోని రైతుల భూమి లక్ష సర్వే నంబర్లూ నమోదు చేయడంతో అవి ప్రభుత్వ భూముల ఖాతాలోకి వెళ్లాయి. 150 మంది రైతు కుటుంబాలకు అన్యాయం జరిగింది. భూమి క్రయవిక్రయాలు కొనసాగించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉంచడంతో బ్యాంకులు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతుబంధు రావడంలేదు. భూమి కమిటీ సభ్యులు కొద్దినెలల క్రితం మా గ్రామానికి వచ్చి మా సమస్యలు విన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

మా భూములు ఖాళీ చేయండి అంటున్నారు



– రామచంద్రయ్య, కుర్మిద్ద, యాచారం మండలం

కుర్మిద్ద గ్రామంలోని సర్వే నం.92లో నలుగురు అన్నదమ్ములం నాలుగున్నర ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నాం. రెవెన్యూ శాఖ అధికారులు దశాబ్దాల క్రితమే మాకు ఈ భూమిని ఇచ్చారు. అప్పట్లో పహాణీల్లో ఉన్నాం. ధరణి పోర్టల్ వచ్చాక అందులో రికార్డుల ప్రకారం అవి అటవీశాఖ భూములుగా మారిపోయాయి. రైతుల భూమి అంటూ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ మేం చాలా సార్లు తిరిగినా ఫలితం లేదు. అటవీశాఖ అధికారులు వచ్చి మా భూముల ఖాళీచేయమని అంటున్నారు.

పథకాల అమలు తీరు బాగుంది...!


ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారుల బృందం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పలు పథకాలను ఏపీ మున్సిపల్ అధికారులు ప్రశంసించారు. జీహెచ్ఎంసీ విధానాలు, అభివృద్ధి పథకాలను వారికి గురువారం పవర్ పాయింట్ ద్వారా తెలంగాణ మున్సిపల్ అధికారులు వివరించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, గీత రాధిక, సీఆర్ఎంపీ విభాగంలో సీఈ భాస్కర్‌రెడ్డి, ఫైనాన్స్ అడ్వయిజర్ శరత్ చంద్ర, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎస్ఈ కోటేశ్వరరావు, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేశ్ కులకర్ణి గ్రేటర్ విధానాలు, ప్రజల సమస్యలను పరిష్కరించే తీరును ఏపీ మున్సిపల్ అధికారులకు వివరించారు. వీరిలో గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు (ఐఏఎస్), ఈఈ సుందరరామిరెడ్డి, ఏలూరు కమిషనర్ ఏ.భానుప్రతాప్, ఏఈ ఎలక్ట్రికల్ శేషగిరిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంజూరి రవి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ కాలారి వెంకట నాగరవి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

గోల్నాక: రాష్ట్రంలోని ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించి.. అధికారుల జోక్యం లేకుండా చూడాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నాడపు సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురువారం నింబోలిఅడ్డలో ఆయన మాట్లాడుతూ.. ఆలయ సంప్రదాయాలు, ఆగమ, వైదిక వ్యవహారాలలో దేవాదాయ శాఖ అధికారుల జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ఆలయ వైదిక కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలను చేపడుతారని ఆయన తెలిపారు.

ప్రతిభ చూపిన అభ్యర్థులకు అభినందనలు

ముషీరాబాద్: డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపి, ఉద్యోగాలకు ఎంపికైన దిల్‌సుఖ్‌నగర్ రామయ్య శిక్షణ సంస్థ విద్యార్థులను సంస్థ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. సంస్థలో శిక్షణ పొంది సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న వారిని గురువారం సత్కరించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో రాష్ట్ర, జిల్లాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిలో 50శాతం మంది తమ వద్దే శిక్షణ పొందినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లి ఒడి చేరిన పసికందు

పోలీసుల అదుపులో మహిళలు



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అపహరణకు గురైన పసికందు ఆచూకీ లభించింది. నలుగురు మహిళలు బుధవారం శిశువును అపహరించిన విషయం విదితమే. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ 24 గంటల్లోనే కేసు ఛేదించారు. గురువారం హైదరాబాద్ బోరబండ పరిధి అల్లాపూర్‌లో సంచరిస్తున్న ఇద్దరు మహిళలను సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

10 బృందాలతో గాలింపు: మునుగోడు మండలం దామెరచర్లకు చెందిన సనీమా ఈ నెల 9న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చారు. సనీమా తల్లి మునీబీ, అత్త హమీదాలు ఆసుపత్రి వార్డులో శిశువును పడుకోబెట్టగా నలుగురు మహిళలు శిశువును ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాల్లో నమోదయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ రూపేశ్ పది ప్రత్యేక బృందాలను నియమించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా అల్లాపూర్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శిశువును తల్లి ఒడికి చేర్చారు. శిశువులను అపహరించేందుకు నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

యూజీసీ వేతనాలు వర్తింపజేయండి


యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, సుల్తాన్ బజార్: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పలు ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్దేశించిన వేతనాలను వర్తింపజేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌ను విజ్ఞప్తి చేశారు. నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు ఉపేందర్, సరత్, శేఖర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణవేణి, అసూరి, రవికిరణ్ గురువారం కలిశారు. 12విశ్వవిద్యాలయాల్లో 1445మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు.

ఆదిభట్లలో రతన్‌టాటా విగ్రహం ఏర్పాటు చేస్తాం


నివాళులర్పిస్తున్న నరసింహారెడ్డి, యాదగిరి, టీసీఎస్ ఉద్యోగులు

ఆదిభట్ల: రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఆదిభట్లలో ఏర్పాటు చేస్తామని పురపాలిక ఛైర్మన్ అన్నారు. టీసీఎస్ ప్రధాన గేటు వద్ద రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్‌ఛైర్మన్ యాదగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు, పెట్టుబడి సాయానికి 'రాయల్ అలయన్స్'


అవగాహన పత్రంపై సంతకం చేస్తున్న మారియా లియోనార్, చిత్రంలో సందీప్ మక్తల


రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో టీ కన్సల్ట్ సంస్థ ఛైర్మన్ సందీప్ మక్తల, ఫిలిప్పీన్స్ రాజు సోదరి మారియా అమోర్ లియోనార్ జోసెన్ మస్కరా.. రాయల్ అలయన్స్‌ను ఏర్పాటు చేశారు. టీకన్సల్ట్ ద్వారా ఈ అలయన్స్ పనిచేయనుంది. ఈ మేరకు రాయదుర్గం టీ హబ్‌లో బుధవారం సందీప్, మారియా లియోనార్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సందీప్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా రాచ కుటుంబాల సహకారంతో ఈ అలయన్స్ ముందుకు సాగుతుందన్నారు.

నగరంలో ఈనాడు

◆ సికింద్రాబాద్ గురుస్వామి సెంటర్‌లో సా.6 గంటలకు 'బిహైండ్ బిర్యానీ' పుస్తకావిష్కరణ
◆ షాద్‌నగర్‌లో మ.2 గంటలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్ట్ ప్రారంభం
◆ ఎన్టీఆర్ గ్రౌండ్‌లో సా.6.30కు దుర్గాదేవి ప్రత్యేక పూజా కార్యక్రమం.

పండగ వేళ ప్రయాణ కష్టాలు

◆ సకాలంలో రాని స్పెషల్ బస్సులు ◆ ప్రైవేటు బస్సుల్లో భారీగా దోపిడీ


మియాపూర్‌లో ఎక్కితే ఎంజీబీఎస్ నుంచి కొట్టిన టికెట్

ఈనాడు, హైదరాబాద్: పండగ వేళ ఊర్లకు వెళ్లేవారికి ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. అదనపు బస్సులు ఏర్పాటు చేసినా సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మార్గమధ్యంలో కొన్ని బస్సులు బ్రేక్‌డౌన్ కావడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, గచ్చిబౌలి, ఉప్పల్, ఆరాంఘర్, శంషాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేర్వేరు జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారు. సాధారణంగా ఆయా ప్రాంతాలు లేదా అంతకు ముందు ఉన్న స్టాపుల నుంచి టికెట్లు తీసుకోవాలి. కానీ ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి ఛార్జీలు వసూలు చేస్తుండటంతో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.


కొన్ని ఉదంతాలు... ◆ సంగారెడ్డికి వెళ్లేందుకు మియాపూర్‌లో బస్సు ఎక్కితే ఎంజీబీఎస్ స్టాప్ నుంచి టిక్కెట్ తీసుకోవడంతో ప్రయాణికులు కండక్టర్ మధ్య వాగ్వాదం జరిగింది. మధ్యలో కూకట్‌పల్లి స్టేజీ ఉన్నా ఎంజీబీఎస్ నుంచి టికెట్ ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మియాపూర్ డిపో కంట్రోలర్‌ను అడిగితే కంప్యూటర్‌లో కూకట్‌పల్లి స్టేజీ ఫీడ్ చేయకపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. ◆ జనగాం, వరంగల్, యాదాద్రి వెళ్లేవారంతా ఉప్పల్ పాయింట్ నుంచి బస్సు ఎక్కుతుంటారు. ప్రత్యేక బస్సుల్లో ఉప్పల్ స్టాప్ నుంచి కాకుండా జేబీఎస్ స్టాప్ నుంచి టికెట్ తీసుకుంటున్నారు. ఇదేంటని కండక్టర్‌ను అడిగితే టిమ్ మెషీన్‌లో అలాగే ఉందంటూ వాగ్వాదానికి దిగారు. ◆ ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ నంబర్లు ఇచ్చినా...స్పందించే అధికారులు కరవయ్యారు. ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ విచారణ కేంద్రాల నంబర్లకు గంటల తరబడి ఫోన్ చేసినా ఎవరూ తీయడం లేదంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

◆ కరీంనగర్, ఖమ్మం మార్గాల్లో సూపర్ లగ్జరీ బస్సులు మార్గ మధ్యంలో బ్రేక్‌డౌన్ అవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.

ప్రైవేట్‌లో దాదాపు రెట్టింపు

పండగవేళ ఎల్బీనగర్, గచ్చిబౌలి మీదుగా విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. విజయవాడకు రూ.450 వరకు టికెట్ ఛార్జీలు ఉండగా రూ.600-700 వరకు ఛార్జీలు వేస్తున్నారు. కాకినాడకు రూ.800 ఉంటే రూ.1,200 వరకూ వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోయారు. శుక్రవారం ఛార్జీలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతుండటం గమనార్హం.







ఆధ్యాత్మిక సౌరభం..

భక్తజన పరవశం

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవతలకు విశిష్ట స్థానం ఉంది. వీరు కొలువైన ఆలయాలకు ఘన చరిత్ర సైతం ఉంది. భక్తుల పాలిట కొంగు బంగారమై విలసిల్లుతున్నాయి. ఆషాఢ ఉత్సవాలు, శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. నిత్యం వేలాదిమంది దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వ్యాధుల పీడ వదిలించిన తల్లి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటైన అంబర్‌పేట మహంకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. ఏడున్నర దశాబ్దాలుగా నగరవాసులు మహంకాళిని భక్తిప్రపత్తులతో కొలుస్తున్నారు. 1948లో నగరవాసులు కలరా, ప్లేగు తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. అమ్మవారికి పూజలు చేయడం ద్వారా ఆ వ్యాధులు దూరమవుతాయని భావించి.. బోనాలు, దసరా శరన్నవరాత్రులను నిర్వహించాలని అప్పటి అంబర్‌పేట గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితిని ఏర్పాటుచేసి గ్రామం నడిబొడ్డున 1950లో మహంకాళి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. 1953 సెప్టెంబరులో సింహవాహిని అమ్మవారు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.






భక్తుల ఆరాధ్య దైవం.. మైసిగండి మైసమ్మ

ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండిలో చారిత్రక మైసమ్మ ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. పూర్వం మర్రి చెట్టు కింద వెలసిన మైసమ్మ భక్తుల పూజలందుకునే వారు. ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ, మాజీ ఎంపీపీ రామావత్‌నాయక్ దాతల సాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఏటా కార్తిక మాసంలో అమ్మవారి జాతర, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, శ్రీరామ నవమి ఉత్సవాలు. విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.

వరద కట్టడి చేసిన కట్టమైసమ్మ


రాంనగర్, న్యూస్‌టుడే: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయానికి ఘనచరిత్ర ఉంది. తెలంగాణలో పొలాలు, జలవనరులు ఉన్నచోట తప్పనిసరిగా కట్టమైసమ్మ ఆలయం ఉండటం రివాజు. నిజాం నవాబుల పాలన(1835-40)లో ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. 1907లో హైదరాబాద్‌లో వరదలు సంభవించినప్పుడు..వాటిని ఆపడానికి అమ్మవారికి 'గంగ పూజ' చేయించారని ప్రతీతి. అనంతరం వరదలు తగ్గుముఖం పట్టాయని అప్పటి నుంచి అలాంటి ఘటనలు పునరావృతం కాకపోవడానికి కట్టమైసమ్మ మహిమేనని భక్తుల నమ్మకం. నేటికీ గంగపూజను ఈ ఆలయంతోపాటు గండిపేట దగ్గరున్న మైసమ్మ ఆలయంలో మాత్రమే జరుపుతారు. అమ్మవారికి ఆషాఢ ఉత్సవాలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలనూ ఘనంగా నిర్వహిస్తారు.





ఇక్కడ ఆర్మీ అధికారే.. పూజారి

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: గోల్కొండ కోటకు తూర్పు వైపున ఉన్న ఆరె మైసమ్మ ఆలయంలో పూజలను ఆర్మీ అధికారులే నిర్వహిస్తారు. ఈ ఆలయానికి సెప్టెంబరు 17, 1948తో అవినాభావ సంబంధం ఉంది. ఆనాడు భారత ఆర్మీ 'హైదరాబాద్ సంస్థానం'పై పోలీసుచర్య చేపట్టేందుకు నలుదిక్కులా మోహరించింది. గోల్కొండ కోటలోని నిజాంసైన్యం నుంచి వ్యతిరేకత ఉండటంతో.. భారత కమాండర్ చౌదరి, ఆయన బృందం ఆరె మైసమ్మ ఆలయం వద్ద ఆశ్రయం పొంది ప్రయత్నాలు మొదలుపెట్టింది. మకాయిదర్వాజ మీదుగా లోనికి వెళ్లాలని చౌదరికి కలలో ఆరె మైసమ్మ సూచించినట్లు, ఆ మేరకే ఆర్మీ కోటలోకి ప్రవేశించి నిజాంసేనలను కట్టడి చేసిందని ప్రతీతి. ఈ ఆలయ నిర్వహణ అంతా ఆర్మీ వారే చూసుకోవాలని, అమ్మవారి సేవలో నిరంతరం ఉండాలని కమాండర్ చౌదరి ఆర్మీ రికార్డులలో నమోదు చేశారు.





చాంపియన్స్

మట్టివీరుడు సెలవన్నాడు

● రిటైర్మెంట్ ప్రకటించిన నాదల్

● వచ్చే నెల డేవిస్ కప్ ఫైనల్స్‌తో ఆటకు వీడ్కోలు

ఓ అద్భుతమైన ప్రయాణానికి తెరపడనుంది!

ఓ శకం ముగియనుంది!

రాకెట్‌ను ఆయుధంగా మలచి.. కోర్టును రణక్షేత్రంగా తలచి.. ప్రత్యర్థులపై దండయాత్ర చేసి.. అసాధారణ విజయాలు.. అసామాన్య ఘనతలు అందుకున్న ఆ యోధుడు ఇక విశ్రాంతి తీసుకోబోతున్నాడు!

23 ఏళ్ల సుదీర్ఘ కెరీర్.. 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు.. మరెన్నో ఘనతలు. అంతకుమించి తన దైన ఆటతీరుతో కోట్లాది అభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆ వీరుడు ఇక సరిపోయిందంటూ ఆటను వదిలేయబోతున్నాడు.

అవును.. ప్రతిదానికి ఓ ముగింపు ఉంటుందని.. తన చిరస్మరణీయ టెన్నిస్ కెరీర్‌కు రఫెల్ నాదల్ వీడ్కోలు పలకబోతున్నాడు. వచ్చే నెలలో డేవిస్ కప్ ఫైనల్స్‌తో రిటైరవుతున్నట్లు ఈ స్పెయిన్ బుల్ ప్రకటించాడు. కొంతకాలంగా గాయాలతో సతమతమవుతున్న ఈ టెన్నిస్ దిగ్గజం ఆటకు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

మాడ్రిడ్

టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్ ఆటకు వీడ్కోలు పలకబోతున్నాడు. వచ్చే నెలలో స్వదేశంలో జరిగే డేవిస్ కప్ ఫైనల్స్‌తో రిటైర్ కానున్నట్లు ఈ స్పెయిన్ ఆటగాడు గురువారం ప్రకటించాడు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగంతో కూడిన ఓ వీడియో పోస్టు చేశాడు. "ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైరవుతున్నా. గత కొన్నేళ్లు ముఖ్యంగా ఈ రెండేళ్లు ఎంతో కఠినంగా గడిచాయి. ఎలాంటి పరిమితులు లేకుండా మళ్లీ ఆడతానని అనుకోవడం లేదు. ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకోవడానికి సమయం పట్టింది. కానీ ఈ జీవితంలో ప్రతిదానికి ఓ ఆరంభం, ముగింపు ఉంటుంది. నేను ఊహించని సుదీర్ఘమైన, విజయవంతమైన కెరీర్‌ను ముగించడానికి ఇదే సరైన సమయమనిపించింది. చివరగా డేవిస్ కప్‌లో నా దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఉత్తేజితంగా ఉన్నా. ప్రొఫెషనల్ ఆటగాడిగా నేను సాధించిన తొలి పెద్ద విజయం కూడా 2004 డేవిస్ కప్ ఫైనల్‌లోనే దక్కింది. ఎన్నో అనుభవాలు పొందిన నేను అదృష్టవంతుణ్ని. నేను అనుభవించిన ప్రతి ఒక్కటి కల నిజం అవడం లాంటిదే. నా అత్యుత్తమ ప్రదర్శన చేశాననే ప్రశాంతమైన మానసిక దృక్పథంతో ఆటను వదిలేస్తున్నా. అందరికీ ధన్యవాదాలు" అని ఆ వీడియోలో నాదల్ పేర్కొన్నాడు. 2001లో ప్రొఫెషనల్ ఆటగాడిగా మారిన 38 ఏళ్ల నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఏకంగా 14 సార్లు విజేతగా నిలిచాడు. యుఎస్ ఓపెన్‌ను నాలుగు సార్లు సొంతం చేసుకున్నాడు. వింబుల్డన్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండేసి సార్లు ట్రోఫీ ముద్దాడాడు. కొంతకాలంగా గాయాలతో ఇబ్బంది పడుతున్న నాదల్ చివరగా ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో ఆడాడు. ఒలింపిక్స్‌లో నాదల్ 2008లో సింగిల్స్, 2016లో డబుల్స్ స్వర్ణాలు గెలిచాడు. నవంబర్ 19 నుంచి 24 వరకు డేవిస్ కప్ నాకౌట్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ ఫైనల్స్‌తోనే నాదల్ కెరీర్‌కు తెరపడనుంది.

"అద్భుతమైన కెరీర్ రఫా! కానీ ఈరోజు రాకూడదని ఎప్పుడూ అనుకునేవాడిని. చిరస్మరణీయ స్మృతులు అందించినందుకు కృతజ్ఞతలు. ఆటలో ఎన్నో ఘనతలు అందుకున్నావ్. ఇదెంతో గొప్ప గౌరవం"
– రోజర్ ఫెదరర్



నాదల్ గ్రాండ్‌స్లామ్ విజయాలు

ఫ్రెంచ్ ఓపెన్: 14
(2005, 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014, 2017, 2018, 2019, 2020, 2022)

యుఎస్ ఓపెన్: 4
(2010, 2013, 2017, 2019)

వింబుల్డన్: 2
(2008, 2010)

ఆస్ట్రేలియన్ ఓపెన్: 2
(2009, 2022)

● నాదల్ ఇప్పటివరకు 135 మిలియన్ డాలర్లు నగదు బహుమతిగా సొంతం చేసుకున్నాడు.

● నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. అత్యధిక టైటిళ్లతో జకోవిచ్ (24) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. 30 గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడాడు.



నాదల్ భార్య, తనయుడు

పోరాట యోధుడు

అదొక సువిశాల రాజ్యం. విజయాలు సాధించిన రాజులదే అధికారం. ఇలా ఎంతో మంది రాజులు వచ్చారు.. వెళ్లారు. ఆ కాలంలో ఓ రాజు (ఫెదరర్) దండయాత్రలు చేస్తూ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. అప్పుడే ఓ యువరాజు బరిలో దిగాడు. నైపుణ్యాలను ప్రదర్శించాడు. క్రమంగా విజయాలు సాధించడం మొదలెట్టాడు. మరోవైపు ఇంకో చక్రవర్తి (జకోవిచ్) దూసుకొచ్చాడు. అయినా యువరాజు తగ్గలేదు. ఈ ఇద్దరితో తలపడి అసాధారణ ఘనతలు సొంతం చేసుకున్నాడు. అమోఘమైన పోరాటంతో రాజ్యాన్ని ఏలాడు. అతడే.. రఫెల్ నాదల్. ఫెదరర్, జకోవిచ్ లాంటి దిగ్గజాలను ఢీకొట్టి.. ప్రపంచ టెన్నిస్‌పై చెరగని ముద్ర వేసిన యోధుడు అతడు.

ఈనాడు క్రీడావిభాగం

మూడేళ్ల వయసులో రాకెట్ చేతబట్టిన నాదల్.. టెన్నిస్‌లో తిరుగులేని ప్రదర్శనతో దిగ్గజంగా ఎదిగాడు. కోర్టు లోపలే కాదు బయట కూడా తన వ్యక్తిత్వంతో కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచాడు. రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఘనతలు అతని ఖాతాలో చేరాయి.

దూకుడైన ఆటతీరు: ఒక్కసారి కోర్టులో అడుగుపెట్టాడంటే నాదల్ భిన్నంగా కనిపిస్తాడు. రాకెట్ మంత్రదండంలా మారి బంతి గమనాన్ని నిర్దేశిస్తుంది. ఎడమ చేతివాటం ఆటగాడైన నాదల్ ఫోర్‌హ్యాండ్‌కు ఎదురులేదు. దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తాడు. టాప్‌స్పిన్‌తో పాయింట్లు కొల్లగొడతాడు. ఎంత వేగంగా వచ్చిన బంతినైనా సరే అతను స్పిన్ చేసి పంపే తీరు ఎంతో ప్రత్యేకం. బేస్‌లైన్ బయట ఆటతో గేమ్‌లు గెలుస్తాడు. కోర్టులో అతని వేగం కట్టిపడేస్తుంది. ఒక మూల నుంచి మరో మూలకు పరుగెత్తుతూ, నేలపై జారుతూ అతను చేసే రిటర్న్‌లకు ప్రత్యేక అభిమానులున్నారు. వేగమైన ఫుట్‌వర్క్‌తో ప్రత్యర్థులకు ఎక్కువగా అవకాశాలివ్వడు. క్లేకోర్టు కింగ్ అయినప్పటికీ హార్డ్, గ్రాస్ కోర్టుల్లోనూ నాదల్ మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ కోర్టుల్లో 8 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గాడు.



ఫ్రెంచ్ ఓపెన్‌లో కొన్ని గెలుపు క్షణాలు

ఫ్రెంచ్ ప్రేమ కథ: ఫ్రెంచ్ ఓపెన్‌కు నాదల్ పర్యాయపదం అనడంలో సందేహం లేదు. ఎర్రమట్టి కోర్టులో జరిగే ఈ టోర్నీపై అతని ముద్ర అలాంటిది. 2005లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ బరిలో దిగి విజేతగా నిలిచి గ్రాండ్‌స్లామ్ బోణీ కొట్టాడు. అప్పటి నుంచే అతని ఫ్రెంచ్ ప్రేమ కథ మొదలైంది. 19 సార్లు ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడిన అతను 14 సార్లు విజేతగా నిలవడం విశేషం. ఒకే గ్రాండ్‌స్లామ్‌ను అత్యధిక సార్లు గెలిచిన ఏకైక టెన్నిస్ ప్లేయర్‌గా నాదల్ చరిత్ర సృష్టించాడు. ఇక్కడ అతని గెలుపోటముల రికార్డు 112-4గా ఉంది. ఫైనల్ చేరిన ప్రతిసారి విజేతగా నిలిచాడు. వరుసగా 39 విజయాలు సాధించాడు. ఈ ఘనతలకు గాను రోలాండ్ గారోస్ బయట అతని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ టోర్నీలో 2009లో నాలుగో రౌండ్లో, 2015లో క్వార్టర్స్‌లో, 2021లో సెమీస్‌లో ఓడిన నాదల్.. 2016లో మూడో రౌండ్‌కు ముందు మణికట్టు గాయంతో తప్పుకున్నాడు. కెరీర్ మొదలెట్టినప్పటి నుంచి 2023లోనే తొలిసారి ఆడలేదు. ఈ ఏడాది మొదటి రౌండ్లో నిష్క్రమించాడు. ఎర్రకోర్టు మట్టిపై ఎలా ఆడాలో నాదల్ చూపించాడు. క్లేకోర్టులో వరుసగా 81 విజయాలు సొంతం చేసుకున్నాడు. నాదల్ రిటైర్మెంట్ నేపథ్యంలో "లక్షలాది జ్ఞాపకాలను అందించినందుకు 14 ధన్యవాదాలు" అని రోలాండ్ గారోస్ ఎక్స్‌లో పోస్టు చేసింది.

బిగ్-3లో ఒకడిగా



జకోవిచ్, ఫెదరర్, నాదల్

గత రెండు దశాబ్దాలుగా పురుషుల టెన్నిస్ అంటే బిగ్-3 పేరే వినిపిస్తుంది. ఇందులో ఫెదరర్ 2022లో ఆటకు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు నాదల్ గుడ్‌బై చెప్పాడు. ఇక మిగిలింది జకోవిచ్. ఈ ముగ్గురు కలిసి పురుషుల టెన్నిస్‌ను ఏలారు. ఈ ముగ్గురి మధ్య పోటీ టెన్నిస్ ప్రపంచాన్ని అలరించింది. 2005 ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో ఫెదరర్‌పై విజయంతో నాదల్ సత్తా ప్రపంచానికి తెలిసింది. 2008 వింబుల్డన్ ఫైనల్లో ఫెదరర్‌తో నాదల్ పోరు ప్రత్యేకం. 4 గంటల 48 నిమిషాల పాటు సాగిన ఈ పోరును టెన్నిస్ చరిత్రలోనే అత్యుత్తమ మ్యాచ్‌గా క్రీడా పండితులు పేర్కొంటున్నారు. ఈ విజయంతో నాదల్ తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. ఫెదరర్‌తో 40 మ్యాచ్‌ల్లో తలపడ్డ నాదల్ 24 విజయాలు సాధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 10-4తో, గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో 6-3తో ఆధిపత్యం కొనసాగించాడు. హార్డ్, గ్రాస్, క్లే కోర్టుల్లో ఫెదరర్‌ను గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఓడించిన ఏకైక ఆటగాడు నాదల్. 2022లో ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి ఫెదరర్‌ను దాటి అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డు దక్కించుకున్నాడు. కానీ ఆ తర్వాత జకోవిచ్ ఈ రికార్డును బద్దలుకొట్టాడు. ఇక 2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జకోవిచ్, నాదల్ మ్యాచ్ కూడా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయేదే. 5 గంటల 53 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ సుదీర్ఘ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌గా నిలిచింది. జకోవిచ్‌తో 60 మ్యాచ్‌ల్లో పోటీపడ్డ నాదల్ 29 విజయాలు సాధించాడు. ఓపెన్ శకంలో మరే ఇద్దరు ఆటగాళ్లు ఇన్నిసార్లు తలపడలేదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 11-7తో, గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో 5-4తో నాదల్‌దే పైచేయి. రాకెట్‌లా దూసుకెళ్తున్న ప్రతిసారి నాదల్ కెరీర్‌కు గాయాలు అడ్డంకిగా మారాయి. ఒకవేళ అతనికి ఫిట్‌నెస్ సమస్యలు లేకపోయి ఉంటే ఇప్పటికే కనీసం 30 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచేవాడని చెప్పొచ్చు. చీలమండ, మణికట్టు, మోకాలు, మోచేతి, ఉదరం, తుంటి తదితర సమస్యలతో నాదల్ 18 గ్రాండ్‌స్లామ్‌లకు దూరమయ్యాడు. అయిదు గ్రాండ్‌స్లామ్‌ల్లో మధ్యలో తప్పుకున్నాడు. అయినా అతను ప్రతిసారి బలంగా పుంజుకున్నాడు. గత రెండేళ్లలో నాదల్ 23 మ్యాచ్‌లే ఆడాడు. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్లో తుంటి గాయంతో ఆ ఏడాది మొత్తం ఆటకు దూరమయ్యాడు. జూన్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో పునరాగమనం చేసినా.. మళ్లీ ఫిట్‌నెస్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. గత నెలలో లేవర్ కప్‌లో ఆడి, ఆటకు వీడ్కోలు పలుకుతాడేమో అనిపించింది. కానీ మళ్లీ గాయాలతో టోర్నీలో ఆడలేదు.

● కెరీర్ గోల్డెన్ స్లామ్ (నాలుగు గ్రాండ్‌స్లామ్‌లతో పాటు ఒలింపిక్ స్వర్ణం) పూర్తి చేసిన ముగ్గురు ఆటగాళ్లలో నాదల్ ఒకడు. జకోవిచ్, ఆండ్రీ అగస్సీ కూడా ఈ ఘనత సాధించారు.

● రఫెల్ నాదల్ అయిదు సార్లు నంబర్‌వన్‌గా ఏడాదిని ముగించాడు. మొత్తంగా 209 వారాల పాటు అగ్రస్థానంలో ఉన్నాడు. 2004 నుంచి 2022 వరకు ప్రతి ఏడాది కనీసం ఒక టైటిల్ నెగ్గాడు. అయిదు డేవిస్ కప్ టైటిళ్లు ఖాతాలో వేసుకున్నాడు.

మనసు బంగారం



అనంతపురంలో నాదల్ (పాత చిత్రం)

కోర్టులోనే నాదల్ దూకుడు ప్రదర్శిస్తాడు. అతని ప్రవర్తన, వ్యక్తిత్వం ఎంతో గొప్పది. కోర్టులో భావోద్వేగాలను గొప్పగా నియంత్రించుకుంటాడు. కోర్టులో టెన్నిస్ రాకెట్లను ఆటగాళ్లు విరగ్గొట్టడం చూస్తుంటాం. ఫెదరర్, జకోవిచ్ కూడా ఇలా చేశారు. కానీ నాదల్ మాత్రం ఒక్కసారి కూడా రాకెట్ విరగ్గొట్టలేదు. భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోతేనే రాకెట్‌ను విరగ్గొడతామని చెప్పే నాదల్ ఏనాడూ ఆ పని చేయలేదు. ఆటపై అతనికున్న అమిత గౌరవం కూడా అందుకు కారణం. నాదల్ వివాద రహితుడు. అజాత శత్రువు. కోర్టులో విజయం కోసం ప్రాణం పెట్టి పోరాడే అతను.. బయట మాత్రం ప్రత్యర్థులతో సన్నిహితంగా ఉంటాడు. అందుకే ఫెదరర్ చివరి మ్యాచ్ తర్వాత నాదల్ ఎంతో భావోద్వేగానికి గురయ్యాడు. ఎన్ని ఘనతలు అందుకున్నా ఒదిగి ఉండే తీరు అతని సొంతం. అత్యంత సాధారణ జీవితం గడుపుతాడు. భారీ భద్రత లేకుండానే బహిరంగ ప్రదేశాలకు వెళ్తాడు. ప్రత్యర్థులను కవ్వించడం, మాటలనడం అతనికి తెలియదు. ఇక నాదల్ ఫౌండేషన్ ద్వారా పేద పిల్లలకు, ప్రతిభావంతులకు ఆటలతో పాటు చదువులోనూ సాయం చేస్తున్నాడు. 2010 నుంచి అనంతపురంలో నాదల్ ఎడ్యుకేషనల్ టెన్నిస్ స్కూల్‌లో పిల్లలు టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్నారు. నాదల్ కంటే ముందు ఎంతో మంది మేటి ఆటగాళ్లున్నారు. నాదల్ తర్వాత కూడా వేరే వాళ్లు వస్తారు. కానీ తన ఆటతీరు, వ్యక్తిత్వంతో టెన్నిస్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నాదల్ లాంటి ఆటగాడు మరొకరు రాలేరు. అతని స్థాయిని అందుకోలేరు.

లక్ష్యసేన్ ఔట్

వాంటా (ఫిన్లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ 500 సూపర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ లక్ష్యసేన్ కథ ముగిసింది. గురువారం పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో అతడు 21-19, 18-21, 15-21తో చో తిన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. మరో షట్లర్ కిరణ్ జార్జ్ కూడా ఇంటిముఖం పట్టాడు. అతడు 17-21, 8-21తో స్థానిక ఆటగాడు జొనాథన్ క్రిస్టీకి తలొంచాడు. మహిళల సింగిల్స్‌లో మాల్విక బాన్సోద్ కూడా ఓడింది. ఆమె 15-21, 8-21తో రచనోక్ ఇంటోనన్ (ఇండోనేషియా) చేతిలో ఓడిపోయింది. ఉన్నతి హుడా 10-21, 19-21తో మిచెలీ లీ (కెనడా)కు తలొంచగా.. ఆకర్షి కశ్యప్ 9-21, 8-21తో హన్ యా (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్‌కుమార్-ఆద్య జంట 12-21, 15-21తో చెంగ్ జియాంగ్-జాంగ్ జోడీ చేతిలో ఓడింది.

పురుషుల జట్టూ కంచుతోనే..

ఆసియా టీటీ



శరత్ కమల్

దిల్లీ: ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు మహిళల బాటలోనే నడిచింది. సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకంతోనే సరిపెట్టుకుంది. కజకిస్థాన్‌లోని ఆస్తానాలో జరుగుతున్న పోటీల్లో గురువారం భారత్ 0-3తో చైనీస్ తైపీ చేతిలో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో శరత్‌కమల్ 7-11, 10-12, 9-11తో లిన్ యా జూ చేతిలో ఓడగా.. తర్వాతి మ్యాచ్‌లో మానవ్ థక్కర్ 9-11, 11-8, 3-11, 11-13తో చెంగ్ జుయ్‌కు తలొంచాడు. ఆఖరి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 6-11, 9-11, 7-11తో హువాంగ్ యన్ చేతిలో ఓటమి పాలు కావడంతో భారత్ పరాజయం పూర్తయింది. మహిళల సెమీస్‌లో ఓటమి చవిచూసిన భారత్ బృందం ఇప్పటికే కాంస్యం గెలిచింది. 1972లో ఈ టోర్నీ ఆరంభమైన నాటి నుంచి మహిళల విభాగంలో కంచు గెలిచిన జట్టుగా మనిక బృందం చరిత్ర సృష్టించింది.

రూట్, బ్రూక్ రికార్డుల వేట

● ఇంగ్లాండ్ 823/7 డిక్లేర్డ్

● ఓటమి దిశగా పాక్



రూట్



బ్రూక్

ముల్తాన్: టెస్టు క్రికెట్ చరిత్రలో 2553వ మ్యాచ్‌ను ఇంగ్లాండ్ చిరస్మరణీయం చేసుకుంది. పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లాండ్ రికార్డులు, మైలురాళ్లతో హోరెత్తించింది. మిడిలార్డర్ బ్యాటర్లు జో రూట్ (262; 375 బంతుల్లో 17×4), హ్యారీ బ్రూక్ (317; 322 బంతుల్లో 29×4, 3×6) రికార్డు డబుల్, ట్రిపుల్ సెంచరీలతో చెలరేగడంతో పరుగుల వరద పారింది. ఓవర్‌నైట్ స్కోరు 492/3తో గురువారం ఉదయం ఆట కొనసాగించిన ఇంగ్లాండ్.. 150 ఓవర్లలో 823/7 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నాలుగో రోజు ఆటలో ఇంగ్లాండ్ 49 ఓవర్లలో 331 పరుగులు సాధించడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు సాధించినా.. ఇంగ్లాండ్‌కు 267 పరుగుల ఆధిక్యం లభించడం పాక్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు విఫలమవడంతో పాక్ ఓటమి దిశగా పయనిస్తోంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 37 ఓవర్లలో 6 వికెట్లకు 152 పరుగులు సాధించింది. గస్ అట్కిన్సన్ (2/28), బ్రైడన్ కార్స్ (2/39), క్రిస్ వోక్స్ (1/29), జాక్ లీచ్ (1/20) దెబ్బకు ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరుకున్నారు. శుక్రవారం మ్యాచ్‌కు చివరి రోజు కాగా.. ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవాలంటే పాక్ మరో 115 పరుగులు రాబట్టాలి. సల్మాన్ ఆఘా (41 బ్యాటింగ్), ఆమిర్ జమాల్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రికార్డులే.. రికార్డులు

● టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక జట్టు 800 స్కోరు అధిగమించడం ఇది నాలుగో సారి మాత్రమే. నాల్గింట్లో మూడు మార్లు ఇంగ్లాండ్ రికార్డు సాధించడం విశేషం. 1997లో శ్రీలంక 952/6 డిక్లేర్డ్ (భారత్‌పై), 1938లో ఇంగ్లాండ్ 903/7 డిక్లేర్డ్ (ఆస్ట్రేలియాపై), 1930లో ఇంగ్లాండ్ 849 ఆలౌట్ (వెస్టిండీస్)పై అత్యధిక స్కోర్లు నమోదు చేశాయి. ఒక జట్టు 800 స్కోరు అధిగమించడం ఈ శతాబ్దంలో ఇదే మొదటి సారి.

● టెస్టు క్రికెట్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు జాబితాలో బ్రూక్ (317) 20వ స్థానం సాధించాడు. ఇంగ్లాండ్ తరపున ట్రిపుల్ సెంచరీ రాబట్టిన ఆరో బ్యాటర్‌గా నిలిచాడు. ఇక రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు 454 పరుగులు జోడించారు. టెస్టుల్లో ఇంగ్లాండ్ తరపున ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం కాగా.. సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో నాలుగోది. 2006లో దక్షిణాఫ్రికాపై కుమార సంగక్కర, మహేల జయవర్ధనె భాగస్వామ్యం (624) నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతుంది.

● ఆరుగురు పాక్ బౌలర్లు 100 పైచిలుకు పరుగులు సమర్పించుకున్నారు. 2004లో జింబాబ్వే (శ్రీలంకపై), ఇప్పుడు పాక్ ఈ చెత్త రికార్డు సాధించాయి.

విండీస్ చేతిలో బంగ్లా చిత్తు



షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరే అవకాశాలను వెస్టిండీస్ మెరుగుపరుచుకుంది. ఆ జట్టు రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. గురువారం గ్రూప్-బి మ్యాచ్‌లో కరీబియన్ జట్టు 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట బంగ్లా 8 వికెట్లకు 103 పరుగులే చేయగలిగింది. నిగర్ సుల్తానా (39) టాప్ స్కోరర్. ఆఫ్ స్పిన్నర్ కరిష్మా రమ్‌హారక్ (4/17) ప్రత్యర్థికి కళ్లెం వేసింది. లక్ష్యాన్ని విండీస్ 12.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హేలీ మాథ్యూస్ (34) విజయంలో కీలకపాత్ర పోషించింది. స్టెఫానీ టేలర్ (27), షిమైన్ క్యాంప్‌బెల్ (21) కూడా రాణించారు. ప్రస్తుతం విండీస్ 3 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది. మరోవైపు బంగ్లాకు మూడు మ్యాచ్‌ల్లో ఇది రెండో ఓటమి.

హైదరాబాద్‌లో భారత్, బంగ్లా

శంషాబాద్, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత జట్టు హైదరాబాద్ చేరుకుంది. గురువారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన టీమ్ఇండియా క్రికెటర్లకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఉప్పల్ స్టేడియంలో శనివారం జరిగే మూడో టీ20 కోసం భారత్‌తో పాటు బంగ్లా జట్టు కూడా హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. ఈ రెండు జట్లూ ఒకే విమానంలో నగరానికి చేరుకున్నాయి. భారీ బందోబస్తు మధ్య భారత్-బంగ్లా క్రికెటర్లను వారు బస చేసే హోటళ్లకు తీసుకెళ్లారు.

దేశవాళీ క్రికెట్ పండుగ

రంజీ ట్రోఫీ నేటినుంచే



దిల్లీ: దేశవాళీ క్రికెట్ పండుగకు రంగం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా యువ ఆటగాళ్ల పోరాటాల వేదిక రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌కు సమయం ఆసన్నమైంది. శుక్రవారం రంజీ ట్రోఫీకి తెరలేవనుంది. సొంతగడ్డపై జరిగే తొలి రౌండ్లో గుజరాత్‌తో హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది. కెప్టెన్ తిలక్‌వర్మ సీజన్‌పై తనదైన ముద్ర వేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. నాగ్‌పూర్‌లో ప్రారంభమయ్యే మ్యాచ్‌లో విదర్భతో ఆంధ్ర తలపడనుంది. టెస్టుల్లో పునరాగమనంపై విహారి, వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ కన్నేశారు.

రతన్ టాటా దేశాన్ని కదిలించారు



రతన్ టాటాతో సచిన్

ముంబయి: దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మరణం పట్ల క్రీడా ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. "రతన్ టాటా తన జీవితంతో, మరణంతో దేశాన్ని కదిలించారు. గతంలో ఆయనతో సమయాన్ని గడిపే అవకాశం దక్కడం నా అదృష్టం. కానీ ఆయన్ని కలవని కోట్లాది మంది ప్రజలు కూడా నాలాగే కన్నీళ్లు పెడుతున్నారు. ఇది ఆయన చూపించిన ప్రభావం" అని క్రికెట్ దిగ్గజం సచిన్ పేర్కొన్నాడు. "దిగ్గజ పారిశ్రామికవేత్త, దాతకు వీడ్కోలు పలకడం చాలా బాధగా ఉంది. టాటా గ్రూప్‌తో చెస్ సమాజానికి సాన్నిహిత్యం ఉంది. హాలాండ్‌లో జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీ మమ్మల్ని గర్వపడేలా చేసింది. మా అందరి జీవితాలను ఆయన (టాటా) ప్రభావం చేశారు. సమాజ హితం కోసం ఎప్పుడూ నిలబడ్డారు" అని అగ్రశ్రేణి చెస్ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ తెలిపాడు. భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, టీమ్ఇండియా మాజీ ఆటగాడు రవిశాస్త్రి తదితరులు రతన్ టాటా మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in



హస్త కళలను ప్రోత్సహించాలని...

వ్యాక్సిన్ రంగంలో విప్లవాలు తెచ్చిన భారత్ బయోటెక్ సంస్థకు ఎండీగా సుచిత్ర ఎల్ల... అందరికీ సుపరిచితమే. వ్యాపార నిర్వహణతో విజయపథంలో నడుస్తున్నారు. మరో పక్క వ్యక్తిగత-వృత్తి జీవితాలకు సమప్రాధాన్యం ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దసరా వేళ బొమ్మల కొలువు ఏర్పాటుతో ఈతరం మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు. 'వసుంధర'తో ఆవిడ పంచుకున్న సంగతులివి...

స్త్రీ శక్తికి రూపం... ఆమె ఇష్టపడితే ఎంత కష్టాన్నైనా ఎదిరించగలదు, అనుకున్నది సాధించగలదు. దసరా మనందరికీ ఇచ్చే స్ఫూర్తి ఇదే. 2021లో తొలిసారి 250 బొమ్మలతో కొలువు(గొలు) పెట్టా. ఇప్పుడా సంఖ్య 500 దాటేసింది. ఈ బొమ్మలన్నీ హస్త కళారూపాలే. కళాకారులకు గౌరవం, వారి పనికి ప్రాధాన్యం ఇస్తా. ఇవి మన సంస్కృతినీ, చరిత్రనూ సజీవంగా ఉంచుతాయి. పశ్చిమ బంగ మట్టిబొమ్మలు, తమిళనాడు ఇత్తడి విగ్రహాలు... ఇలా మనదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హస్తకళాకృతులెన్నో సేకరించా. వీటిల్లో నల్లరాతి అందాల బాల రాముడు, కార్తికేయుడు, అన్నమయ్య ఒడిలో బాలాజీ వంటి బొమ్మలూ కృష్ణలీల, రామ్ దర్బార్ వంటి ఘట్టాలూ ఉన్నాయి. చిన్నప్పుడు కొలువు పెట్టడం కోసం దసరా ఎప్పుడొస్తుందా అని వేచి చూసేదాన్ని. వచ్చే ఏడాదైనా అమ్మ గొలు పెట్టల్ని వెతికి నా కొలువులో పెట్టడానికి ప్రయత్నిస్తా. ఈ అలవాటు సాంస్కృతిక విలువల్ని భవిష్యత్తు తరాలకు అందిస్తుందని నా నమ్మకం. దసరా పూజలు, బొమ్మల కొలువు ఏర్పాటులో మా పిల్లలూ ఎంతో ఇష్టంగా పాల్గొంటారు.



పోలీసులకు... శాంతిభద్రతలను కాపాడే క్రమంలో కాస్త కటువుగానే వ్యవహరిస్తారనే పేరు. కానీ, నాగాలాండ్‌లోని ఫెక్ జిల్లా ఎస్పీ ప్రీత్ పాల్ రూటు మాత్రం సెపరేటు. మయన్మార్‌తో అంతర్జాతీయ సరిహద్దు పంచుకుంటోన్న ఈ ప్రాంతంలో ఓ పక్క చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూనే మరోవైపు సామాజికాభివృద్ధి కార్యక్రమాలెన్నో చేపట్టారు. ఇప్పుడవే ఆమెకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుని తెచ్చాయి. తాజాగా ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ చీఫ్స్ ఆఫ్ పోలీస్(ఐఏసీపీ) ఉత్తమ పోలీస్ అధికారిణిగా ఎంపికయ్యారు.

ఈ పోలీస్... వాళ్లకి ఆరాధ్య దేవత!

ప్రీత్‌పాల్ కౌర్‌ది హరియాణ. బీడీఎస్ చేశారు. వాళ్లమ్మ 'నీ చదువు, ఉద్యోగం... నీకు మాత్రమే ఉపయోగపడితే అర్థం లేదు. సమాజానికీ సాయపడాలి' అనేవారట. ఆ మాటలు తన మనసులో బలంగా నాటుకున్నాయి. వైద్యురాలిగా పోలీసులు నిర్వహించిన అనేక సామాజిక కార్యక్రమాల్లో భాగమయ్యారు. ఈ పని తనకి సంతృప్తితో పాటు స్ఫూర్తినీ ఇచ్చిందంటారు ప్రీత్‌పాల్. అందుకే, మనసు తరవాత సివిల్ సర్వీసెస్‌పైకి మళ్లింది. దీనిద్వారా మరింత మందికి ప్రయోజనం కల్పించొచ్చని ఆమె నమ్మకం. అనుకున్నట్లుగానే యూపీఎస్సీ పరీక్షలు రాసి 2016లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు.

సమర్థమైన అధికారిణిగా...


శిక్షణ పూర్తి చేసుకున్నాక నాగాలాండ్‌లో తుయెన్ సాంగ్‌లో మొదటి పోస్టింగ్ ఇచ్చారు. తరవాత నోక్లక్ జిల్లాలో ఎస్పీగా పనిచేశారు. ఆపై నాగాలాండ్‌లో కొత్తగా ఏర్పాటైన ఫెక్ జిల్లాకు తొలి ఎస్పీగా నియమితులయ్యారు. అది మయన్మార్‌తో సరిహద్దుని పంచుకుంటుంది. సున్నితమైన ఆ ప్రాంతంలో ఘర్షణలు నిత్యకృత్యం. ముఖ్యంగా సాయుధ వేర్పాటువాదుల ప్రాబల్యం, మాదక ద్రవ్యాల వ్యాపారం అక్కడి ప్రజల జీవితాల్ని దుర్భరంగా మార్చేశాయి..దీనికి తోడు సరిహద్దు రక్షణ మరో అతి పెద్ద సవాల్. ఓ మహిళ... అందులోనూ పిన్న వయస్కురాలు. ఇంతటి క్లిష్టతరమైన పరిస్థితుల్ని ప్రీత్‌పాల్ చక్కబెట్టగలరా? అని అంతా సందేహపడ్డారు. కానీ, ఆమె ఏ మాత్రం తడబడలేదు. నేరస్థులతో కఠినంగా వ్యవహరిస్తూనే మరో పక్క విద్యార్థిసంఘాలు, పౌర సమాజం... ఇలా వివిధ వర్గాల వారితో కలిసి పనిచేయడం ప్రారంభించారు.

నిరసన అందుకే...

పోలీసులంటే చట్టాన్ని, ప్రజల భద్రతను కాపాడటం మాత్రమే కాదు... వారిలో నైతిక విలువలను పెంపొందించాలి అనుకున్నారు. ఘర్షణలు తగ్గుముఖం పట్టాలంటే ముందు సామాజిక పరివర్తన రావాలి. వారికి సరైన ఉపాధి మార్గాలు కనిపించాలి అని భావించారు. పిల్లలు బడిబాట పట్టేలా చేశారు. విద్యార్థులకు ఉచిత కోచింగ్ తరగతులు, కెరియర్ గైడెన్స్ ఏర్పాటు చేశారు. తీవ్రవాదాన్ని అణచి వేయడానికి 'నాట్ గన్స్...బట్ మెషీన్స్' పేరుతో స్థానికులను సిద్ధం చేశారు. ప్రతిభగల యువతకు స్కిల్ ట్రెయినింగ్ అందించారు. సోలార్ డ్రయ్యర్‌లు, ఎలక్ట్రిక్ సైకిళ్లు, స్వయం ఉపాధి యంత్రాలను తక్కువ ధరకే ఇప్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్పించారు. మహిళలకు నెలసరి పరిశుభ్రత, ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాలు నేర్చుకోవలసిన అవసరాన్ని తెలియజేశారు. మాదకద్రవ్యాలకు బానిసలైనవారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. చర్చలతో ఘర్షణ వాతావరణాన్నీ, ఉద్రిక్త పరిస్థితుల్నీ తగ్గించారు. మరో పక్క సరిహద్దు గ్రామాల్లో డ్రగ్స్ రవాణాపై కన్నెర్ర జేశారు. అంతర్జాతీయ ముఠాల ఆటకట్టించేందుకు కొన్నిసార్లు మారు వేషాల్లోనూ వెళ్లేవారు. ఇవన్నీ క్రమంగా అక్కడ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చాయి. అందుకే, ఆమె ఎక్కడి నుంచి బదిలీ అయినా స్థానికులు రోడ్లెక్కి నిరసనలు చేశారు.

నాగా గిరిజనుల్లోని 'ఖియామ్ని యుంగన్' అనే గిరిజన తెగ... ప్రీత్‌పాల్‌కి 'థేంషావో లామ్' అని తమ ఆరాధ్య దేవత పేరు పెట్టుకుంది. ఇదే జీవితంలో తనకు దక్కిన అరుదైన గౌరవంగా చెబుతారు ప్రీత్. అలానే, తాజా అవార్డుతో పాటు గతంలో... 'ఇంటర్నేషనల్ ఇన్‌స్పిరేషన్ విమెన్-2023, స్కోచ్ గోల్డ్-2023తో పాటు వరల్డ్ విమెన్ లీడర్‌షిప్ కాంగ్రెస్ 'గ్లోబల్ విమెన్ లీడర్-2024'లూ ఈ ఐపీఎస్‌ని వరించాయి.

మహిషాసురమర్దిని దేవి!



శక్తిరూపం

దసరా నవరాత్రుల్లో నవమినాడు అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరిస్తారు. అమ్మవారి అత్యంత ఉగ్రరూపమిది. ఎనిమిది భుజాలతో... ఆయుధాలను ధరించి, సింహ వాహనంపై దర్శనమిస్తారు. దేవతలు, అష్టదిక్పాలకులు, సామాన్యులు ఎవరైనా కానీ... మగవారి చేతిలో మరణం ఉండకూడదని బ్రహ్మ నుంచి వరం పొందుతాడు మహిషాసురుడనే రాక్షసుడు. అది మొదలు ఇంద్రుడిని ఓడించి దేవలోకం నుంచి తరిమేయడమే కాదు దేవతలనీ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో వాళ్లంతా కలిసి విష్ణువుని ఆశ్రయిస్తారు. యాగం చేసి మనందరి శక్తులతో ఓ స్త్రీశక్తిని సృష్టిద్దామంటాడాయన. అలా జన్మించిందే జగన్మాత. అంతేకాదు వాళ్లందరి ఆయుధాలనూ అమ్మవారికి కానుకగా ఇస్తారు. అవన్నీ ధరించి యుద్ధానికి వెళ్తుంది అమ్మవారు. మహిషాసురుడు పంపిన అనుచరులతో ఎనిమిది రోజులు యుద్ధం చేసి, వారందరినీ సంహరిస్తుంది. తొమ్మిదోరోజున మహిషాసురుడే నేరుగా వస్తాడు. అతనితో హోరాహోరీగా యుద్ధం చేసి వధిస్తుంది. అందుకే ఈ నవమికి 'మహర్నవమి' అనీ పేరు. అందరు దేవతల శక్తి సమాహారం కాబట్టి... నేడు దేవిని కొలిస్తే సకల దేవతల్నీ పూజించినట్టేనని చెబుతారు. భక్తిగా తలిస్తే చాలు భయాలను పోగొట్టి, ధైర్యాన్ని, శత్రుపీడనూ పోగొడుతుందంటారు. ఈరోజు అమ్మవారినే కాదు... ఆ ధైర్యాన్నీ శక్తినీ అందించే ఆయుధాలనూ కొలవడం పరిపాటి.

అమ్మానాన్నలు విడిపోతున్నారు!

అమ్మానాన్నలకు ఒక్కదాన్నే. ఏది కావాలన్నా కాదనరు, చాలా ప్రేమగా ఉంటారు. అది చూసి నా స్నేహితులు కుళ్లుకునేవారు. కానీ అమ్మానాన్నలు విడిపోవాలి అనుకుంటున్నారు. నాకు 17ఏళ్లు. పెద్దదాన్నే అయినా నేనది తట్టుకోలేకపోతున్నా. వాళ్లని ఎలా ఆపాలో తెలియట్లేదు. ఇంట్లోంచి పారిపోవాలి అనిపిస్తోంది. - ఓ సోదరి

డియర్... వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

తల్లిదండ్రులు తమ పాత్ర సరిగా నిర్వర్తించకపోతే పిల్లల మనసు ఎంత క్షోభకు గురవుతుందో నీ పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. చాలా సున్నితమైన అంశమిది. ఇందులోనూ సానుకూల విషయమేమిటంటే... మీ అమ్మానాన్నలిద్దరికీ నీ మీద ప్రేమ ఉండటం. విడిపోయే వరకూ వచ్చారంటే సమస్య పెద్దదేమో! అభిప్రాయ భేదాలకు కారణాలూ నీకు తెలియకపోవచ్చు. అందుకే ఇంతలా బాధపడుతున్నావు. పారిపోవాలనే నిర్ణయానికి వస్తున్నావు. కానీ ఒకసారి వాళ్లతో నువ్వు విన్న విషయం నిన్నెంతగా బాధిస్తోందో... వారిద్దరి ప్రేమ నీకెంత అవసరమో చెప్పు. ఈ విషయంలో అవసరమైతే సన్నిహితుల సాయాన్నీ తీసుకోవచ్చు. వాళ్లు చెప్పినా మారకపోతే అమ్మానాన్నల్ని ప్రొఫెషనల్ కౌన్సెలింగ్‌కి వెళ్లేలా ఒప్పించు. నీ కోసమైనా వాళ్లు కౌన్సెలింగ్‌కి వెళతారు. నిపుణుల సలహాతోనైనా వాళ్లు విడాకుల నిర్ణయాన్ని మార్చుకుంటారని ఆశిద్దాం. నువ్వు మాత్రం తొందరపడి ఏమీ చేయొద్దు.

బంగారం వెండి



10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	77,400	77050	74,200	74,900
ఆర్నమెంట్	71,050	71,100	70,250	70,300
వెండి (కిలో)	91,807	90,379	90,800	91,000
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	77,350	77,450	77,300	77,350
ఆర్నమెంట్	71,630	71,720	71,050	71,100
వెండి (కిలో)	91,000	91,000	90,800	91,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	76,360	76,420	------	------
ఆర్నమెంట్	70,250	70,300	7,025	7,030 గ్రా
వెండి (కిలో)	92,000	------	100.00	100.00గ్రా

అవగాహనే అసలైన ఆయుధం!

అభం శుభం తెలియని చిన్నారులపైనా లైంగిక దాడుల గురించి వింటున్నాం. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పైన అవగాహన కలిగిస్తూ ఆ ప్రమాదం నుంచి పిల్లల్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు సైకాలజిస్ట్ ఏలూరి మమత.



గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి 15 ఏళ్లుగా ఆడపిల్లలకు అవగాహన కల్పిస్తున్నా. ఇప్పటివరకు 20వేలకు పైగా విద్యార్థులూ తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులకు దీనిమీద అవగాహన కల్పించా. ఆడపిల్లలు ఎవరి సమక్షంలోనైనా, సురక్షితంగా అనిపించకపోతే గట్టిగా అరవడం, కొరకడం, నెట్టేయడం... వంటివి ఎలా చేయాలో వివరిస్తా. ఖమ్మంలో జాన్సన్ కిడ్స్ స్కూల్ నడుపుతున్నా. ఐసీటీటీ (యూకే) నుంచి చైల్డ్ సైకాలజీ కోర్సు, ఆపై సైకాలజీలో పీజీ చేశా. చైల్డ్ సైకాలజిస్ట్‌గా చదువులో వెనకబడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తుంటా. చిన్న పిల్లలపైనా లైంగిక దాడుల సంఘటనల్ని చూశాక దానిమీదా దృష్టి పెట్టాలనిపించింది. దీనికోసం 'స్టార్ రూల్స్ ఫర్ ది సేఫ్టీ'ని డిజైన్ చేశాం. అప్రమత్తంగా ఉండండి, భద్రతకోసం పరికరాలు ఉంచుకోండి, అనంత శక్తి నీదే, నిర్భయంగా ఉండండి, దాడిని ప్రతిఘటించండి, ఆపదలో హెల్ప్‌లైన్ నంబర్స్ (1098/100)కు ఫోన్ చేయండి... ఇలా పది అంశాల్ని చార్ట్ రూపంలో వివరిస్తాం. కథలు, పాటలు, చిన్న నాటకాల రూపంలోనూ చెబుతాం. ఆడపిల్లలతో ఎలా సఖ్యంగా ఉండాలో అబ్బాయిలకు చెబుతాం. ఈ ప్రయత్నంలో అభయ-భవిత ఫౌండేషన్, ఆకెళ్ల ఫౌండేషన్, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్... కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చాయి. మా కార్యక్రమాల్ని మెచ్చి తమిళనాడు, దిల్లీ నుంచి ఆహ్వానాలు వచ్చాయి. అక్కడా వర్క్‌షాపులు నిర్వహించాం. ఈ సేవలకు ప్రశంసలతోపాటు అవార్డులూ అందుకున్నా. ఆసక్తి ఉన్నవారిని శిక్షకులుగానూ తీర్చిదిద్దుతున్నా. ఒక్కరితో మొదలైన ఈ ప్రయత్నం ఉద్యమంలా మారి పిల్లలకు మేలు జరుగుతుంటే సంతృప్తిగా ఉంది. అది మరింత ఉత్సాహంగా పనిచేసే ప్రేరణనిస్తోంది! - కె.వెంకటసాయి, హైదరాబాద్

అంతర్జాతీయ బాలికా దినోత్సవం!

అందానికి... 'గుడ్'

అందంగా, ఆకర్షణీయంగా కనిపించడానికి అమ్మాయిలు రకరకాల క్రీములు ఎన్నో వాడుతుంటారు. కానీ, మేనికి అందాన్ని తేవడంలో సహజ పదార్థాలకు మించినవి లేవనడంలో అతిశయోక్తి లేదు. అలాంటి వాటిలో కోడిగుడ్డు కూడా ఒకటి. చర్మం, శిరోజాల సంరక్షణకు భలేగా పనిచేస్తుంది ఇది.

గుడ్డులోని తెల్లసొనలో కాస్తంత మొక్కజొన్నపిండి, చిటికెడు పంచదార కలిపి, మెత్తని పేస్టులా తయారుచేసి ముఖానికి రాసుకుంటే సరి. ముఖం, పై పెదవి మీద ఉండే అవాంఛిత రోమాలు తొలగిపోతాయి. చర్మం బిగుతుగా తయారై, నల్లమచ్చలనీ తొలగిస్తుంది. దీన్లో ఉండే ప్రొటీన్లు, మల్టీ విటమిన్లు చర్మానికి తేమనందించి మృదువుగా ఉండేలా చేస్తాయి.

కాలుష్యం, రసాయనాలు అధికంగా ఉన్న షాంపూలు వాడడం వల్ల ఒక్కోసారి జుట్టు నిర్జీవంగా తయారవుతుంటుంది కదా! అలాంటప్పుడు తెల్లసొనలో కొద్దిగా అవకాడో లేదా ఆలివ్ నూనెను కలిపి కురులకు పట్టించి అరగంటపాటు వదిలేయాలి.



ఆ తరవాత గోరువెచ్చని నీటితో తలంటుకుంటే చాలు. జుట్టు తేమను సంతరించుకుని నిగనిగలాడుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే గుడ్డును మాయిశ్చరైజర్లు, లోషన్లలోనూ వాడతారు.

అంతేనా, కాదేదీ కళకు అనర్హం అన్నట్లుగా కోడిగుడ్డు పెంకులతో అనేక కళాఖండాలూ తయారుచేస్తున్నారు. మొజాయిక్ ఆర్ట్‌తో రకరకాల జంతువులు, పక్షులు, మొక్కల్లాంటి అందమైన చిత్రాలు, అద్భుతమైన శిల్పాలుగానూ మారుస్తున్నారు. ఇక సూక్ష్మంగా, అతి సున్నితంగా చేసే ఎగ్ కార్వింగ్‌లనూ సృజనాత్మకంగా తీర్చిదిద్దుతారు కళాకారులు. ఏది ఏమైనా గుడ్డు అందానికి అందం ఇవ్వడంతోపాటు, ఆర్ట్ రూపంలో ఆకర్షణీయ రూపాల్లోకీ మారుతోంది.







అనార్కలీ... పట్టులో!

నేటి ఫ్యాషన్

పట్టు లేని పండగలను మనం ఊహించగలమా? చూపులకు రాయల్ లుక్‌నీ... కట్టుకుంటే శరీరానికి హాయినీ ఇస్తుంది. అందుకే పట్టు అంటే మన ఆడవాళ్లకి అంత ప్రేమ. దసరా ఆపై దీపావళి... సందడంతా మనదే! ఈ ఆటపాటలకి మనతోపాటుగా దుస్తుల మెరుపూ నృత్యం చేస్తున్నట్టుగా ఉంటే చూడటానికి కళ్లు మాత్రం ఏం సరిపోతాయి. ఇవన్నీ సాధ్యమవ్వాలంటే మరి పట్టు ఉండాలిగా! అలాగని చీర, పట్టు పరికిణీ ప్రతి పండగకీ అదేనా అనిపిస్తే... ఈసారి లాంగ్ ఫ్రాక్‌లు ఎంచుకోండి. చిన్న చిన్న ఫ్రిల్స్‌తో వస్తున్న అనార్కలీ, లాంగ్‌ఫ్రాక్‌లు ఇప్పుడు తెగ సందడి చేస్తున్నాయి. ఓవైపు చేత్తో పట్టుకుని అలా అలా కాలు కదిపితే ఫ్రిల్స్ అలల్లా ఎగిసిపడుతున్నట్టే కనిపిస్తాయి. బనారసీ, టస్సర్, చందేరీ, నారాయణపేట, కాంచీపురం, పైథానీ... ఒకటా రెండా కోరుకున్న పట్టు చక్కని డ్రెస్‌గా కళ్లముందుకు వచ్చేస్తుంది. చీరనే కుట్టించేసుకోవచ్చు. సమయం లేదా... రెడీమేడ్‌వీ దొరికేస్తున్నాయి. కోరుకున్న రంగుల్లో... నచ్చిన కలంకారీ, పిచ్‌వాయీ, నెమళ్లు మొదలైన డిజైన్లలో మీకు నచ్చిందేదో ఎంచుకోవడమే తరువాయి. ఆధునిక లుక్‌తో అదిరిపోయే పట్టులో మెరిసిపోదామా మరి?





పండగ సంతోషం సాయం చేసి పంచేద్దాం!

దసరా వేళ పండగ కళ ఉట్టిపడాల్సిన కాలనీలు.. వరద ప్రభావంతో కళావిహీనంగా మారాయి. జల పంజా ధాటికి సర్వం కోల్పోయిన బాధితులు మళ్లీ నిలబడేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వరద భయం లోంచి ఇప్పుడిప్పుడే బయటకొచ్చి మళ్లీ ఒక్కో ఇటుక పేర్చుకుంటున్న ఆ బాధితుల మోముల్లో సంతోషం నింపాలని ఎంతో మంది వదాన్యులు ముందుకొస్తున్నారు.



నలదల ప్రసాద్ నాయుడు
రగ్బీ, ఇంగ్లాండ్
విరాళం: రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
జెట్టి కృష్ణమూర్తి, ఈడేపల్లి, మచిలీపట్నం, కృష్ణా జిల్లా	1,25,000
పదో తరగతి విద్యార్థులు, జడ్పీ హైస్కూల్, రంగంపేట, తూర్పుగోదావరి జిల్లా	16,600
గుత్తా గోవిందస్వామి నాయుడు, ఇరికిపెంట, చిత్తూరు జిల్లా	10,116
అతిపేట్ సుగుణ, బెంగళూరు	10,000
భాగవతుల సుమతి, బెంగళూరు	10,000
కోయంబత్తూర్ తిర్కాటే నాగరాజ్, సికింద్రాబాద్	10,000
కుంభారగేరి ప్రభాకర్, సికింద్రాబాద్	10,000
చల్లా జ్యోతి, హైదరాబాద్	10,000
సోయం సీతారామమ్మ (కీ.శే.సోయం భద్రయ్య గారి సతీమణి), చర్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	10,000
మంతెన సూర్యనారాయణరాజు, ఖాజీపాలెం, గుంటూరు జిల్లా	6,666
శ్రీ సాయి సమైఖ్య (మంజు బంధుమిత్రులు), బొమ్మూరు, తూర్పుగోదావరి జిల్లా	5,558
దేవులపల్లి సాంబయ్య (విశ్రాంత ఉద్యోగి), హనుమకొండ	5,555
శ్రీకాంత సుబ్బారావు, కరణం ఉమామహేశ్వరి, అనంతపురం	5,555
వెంపటి రామచంద్రరావు, హైదరాబాద్	5,222
చెరిపెల్లి హిమగిరి, హైదరాబాద్	5,116
జెస్సు మదన్‌మోహన్, ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా	5,116
చెన్నా మాధవరావు, కాకినాడ	5,116
నేమాని శ్రీహర్ష, ముంబై	5,116
బొమ్మిశెట్టి పాండురంగారావు, ఈతముక్కల, ప్రకాశం జిల్లా	5,006
పొన్నాన సిమ్మయ్య, కోదడ్డపనస, శ్రీకాకుళం జిల్లా	5,001
కామనూరు వరలక్ష్మి, కడప	5,000
పలుకూరి లేఖ్య, మదనపల్లి, అన్నమయ్య జిల్లా	5,000
సమ్మింగదేవి, విశాఖపట్నం	5,000
గీతాలక్ష్మి, కడప	5,000

మనం చేసే సాయం.. కొత్త జీవితానికి శ్రీకారం

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి.
1. దాత పేరు 2. పూర్తి చిరునామా
3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

రూ.పది వేలు ఆశచూపి.. రూ.2.29 కోట్లకు టోకరా

- సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఈనాడు, హైదరాబాద్: షేర్ల విక్రయిస్తామంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.10 వేల ఆశచూపిన సైబర్ నేరగాళ్లు.. రూ.2.29 కోట్లు కొల్లగొట్టేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు వివరాలివీ.. బాచుపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి(51) ఫోన్ నంబరును గుర్తుతెలియని వ్యక్తులు జులై 10న 'కేఎస్ఎల్ అఫీషియల్ స్టాక్' పేరుతో ఉన్న వాట్సప్ గ్రూపులో చేర్చారు. నారాయణ జిందాల్ అనే వ్యక్తి కోటక్ సెక్యూరిటీస్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని, షేర్ల క్రయవిక్రయాలపై మెలకువలు నేర్పిస్తుంటారని.. గ్రూపులోని సభ్యులు తరచూ చాటింగ్ చేసేవారు. అక్టోబరు 2 నుంచి కోటక్ సెక్యూరిటీస్ లిమిటెడ్ స్ట్రాటజీ ప్లాన్ ప్రారంభిస్తున్నానంటూ నారాయణ జిందాల్ పేరుతో ఒక వ్యక్తి పోస్టు చేశారు. ఇందులో చేరాలంటే కోటక్ ప్రో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, వీఐపీ ట్రేడింగ్ ప్లాన్‌లో చేరితే లాభాలు వస్తాయని చెప్పేవాడు.

ఈ ప్లాన్‌లో చేరినందుకు తమకు లాభాలు వచ్చాయని గ్రూపు సభ్యుల పేరుతో సందేశాలు పోస్టు చేసేవారు. ఇదంతా నిజమేనని నమ్మిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులోని కస్టమర్ కేర్ ప్రతినిధి సూచనల ప్రకారం డబ్బులు పంపేవాడు. తొలిసారి రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టినందుకు 10 శాతం లాభం వచ్చినట్లు యాప్‌లో మరుసటి రోజు మోసగాళ్లు చూపించారు. దీంతో అతను దఫదఫాలుగా మరో రూ.90 లక్షల పెట్టుబడి పెట్టాడు. రూ.1.5 కోట్ల విలువైన ఐపీవో షేర్లు కేటాయిస్తున్నామని మళ్లీ రూ.80 లక్షలు, రూ.49.62 లక్షలు, రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.2.29 కోట్లు బదిలీ చేయించుకున్నారు.

అయితే కేవలం రూ.10 వేలు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇచ్చారు. రూ.2.29 కోట్ల పెట్టుబడికి రూ.1.10 కోట్ల లాభం వచ్చిందని ఖాతాలో చూపారు. మొత్తం రూ.3.29 కోట్లు విత్‌డ్రా చేసుకోవాలంటూ మరో రూ.40 లక్షలు కట్టాలని చెప్పారు. డబ్బు మొత్తం విత్‌డ్రా చేసుకోవాలంటే రకరకాల నిబంధనలు చెప్పడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి అనుమానమొచ్చింది. తనకు తెలిసినవారిని ఆరా తీయగా అంతా మోసమని తేలింది. దీంతో ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

అంతమంది విద్యార్థులకు ఒకేచోట చదువు సాధ్యమా?

'సమీకృత గురుకులాలపై చర్చ'లో ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: 'రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకులాల పేరుతో 2,500 మంది విద్యార్థులను ఒకే చోట చేర్చి చదువు చెప్పాలనే ఆలోచన ఆచరణ సాధ్యమేనా' అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అనుమానం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మేధావులు, అఖిలపక్ష పార్టీలతో చర్చించాల్సి ఉందన్నారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో 'సమీకృత గురుకులాలపై సమగ్ర చర్చ' అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఫ్రంట్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గురుకులాల ఏర్పాటుకు తన మాతృమూర్తి ఆభరణాలు అమ్మి పోరాటం చేశానంటూ కృష్ణయ్య భావోద్వేగానికి గురయ్యారు. అలా సాధించిన గురుకులాల్లో ప్రస్తుతం అందరూ బాగా రాణిస్తున్నారని, ఇప్పటికిప్పుడు మార్చాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించారు. ఉన్నవాటికి సొంత భవనాలు, మెరుగైన విద్య అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. సమీకృత గురుకులాలకు 25 ఎకరాలు సరిపోవని, 50 ఎకరాలు కేటాయించాల్సి ఉంటుందన్నారు. తాము సంస్కరణలకు వ్యతిరేకం కాదని, అన్నింటినీ కలిపి, పాతవి తొలగిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ఇప్పుడున్న గురుకులాలు యథావిధిగా ఉంటాయని, రాబోయే రోజుల్లో పాఠశాలల్లో చేరేవారు కులవ్యవస్థను మరిచిపోయేలా ప్రభుత్వం సమీకృత గురుకులాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోందన్నారు. కొద్దికాలం తర్వాత లోటుపాట్లు సవరించి మార్పులు చేస్తామన్నారు. ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. భారాస అధికార ప్రతినిధి విజయ్ ఆర్య మాట్లాడుతూ గురుకులాలను ఇప్పుడున్నట్లే కొనసాగించాలన్నారు.

టీచర్లకు నియామక పత్రాలు మా నోటిఫికేషన్‌కు కొనసాగింపే

మాజీ ఎంపీ వినోద్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్ హయాంలో రికార్డు స్థాయిలో 1.60 లక్షల ఉద్యోగాలిచ్చామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో పేర్కొన్నట్లుగా ముందుగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆ మేరకు ప్రచారం చేసుకోవాలని భారాస సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలను ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం. బుధవారం మీరు(సీఎం రేవంత్) ఇచ్చిన ఉపాధ్యాయ నియామక పత్రాలు కూడా సెప్టెంబరు 6, 2023 నాడు భారాస ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపే. కేవలం ఆరు వేల ఉద్యోగాలను నోటిఫికేషన్‌లో అదనంగా కలిపారు. కోర్టు కేసులను పరిష్కరించింది కేసీఆర్ ప్రభుత్వమే. ఎమ్మెల్సీ కోదండరాం ఏం చేస్తున్నారు? ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు గుర్తించి.. సీఎం రేవంత్‌కు జాబితా ఇవ్వొచ్చు కదా? నిరుద్యోగులతో సభ పెట్టి ఎన్ని ఖాళీలు ఉన్నాయో రేవంత్ చెప్పాలి. నేను ఓడిపోతే కేసీఆర్ ఉద్యోగం ఇచ్చారని రేవంత్ మాట్లాడారు. నేను తెలంగాణ ఉద్యమంలో ఆరంభం నుంచి ఉన్నాను. పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు' అని వినోద్‌కుమార్ తెలిపారు.

పంట నష్టానికి అరకొర సాయం

- మాజీ మంత్రి కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని ప్రభుత్వం వంచనతో మళ్లీ ముంచిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది పరిహారం కాదని.. పరిహాసమని ధ్వజమెత్తారు. "లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా? ఏకంగా 3.35 లక్షల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇవ్వడం దారుణం. అపార నష్టంతో అల్లాడుతున్న రైతులను ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం నివేదిక ఇచ్చింది నిజం కాదా? ఇప్పుడు ఇంత భారీ కోతలా? పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లు, ఇసుక మేటలు వేసిన పొలాలను బాగు చేసుకోవడానికి మీరిచ్చే రూ.10వేలు ఏమూలకూ సరిపోవు. అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు. అన్నదాత ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి. రుణమాఫీలో దగా జరిగింది. రైతు భరోసా పత్తా లేదు. వరదలు ముంచెత్తి నష్టాల్లో, కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు. అన్నదాతపై ఎందుకీ వివక్ష" అని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు.

యాదాద్రి విమాన గోపుర స్వర్ణతాపడానికి 12 కిలోల బంగారం అప్పగింత

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహుల గర్భాలయ విమాన గోపురం స్వర్ణతాపడం పనులు వేగంగా జరుగుతున్నాయి. బుధవారం పూజా కార్యక్రమాల అనంతరం గోపురానికి సంబంధించిన రాగి విగ్రహ తొడుగులను చెన్నైకి తరలించగా.. గురువారం దాతల ద్వారా సేకరించిన 12 కిలోల బంగారాన్ని చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారు. ఆలయ విమాన గోపురాన్ని వచ్చే ఏడాది మార్చి నెల నాటికి పసిడిమయం చేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ తెలిపారు. పనులు పక్కాగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఆలయ ఈవో భాస్కర్‌రావు పేర్కొన్నారు.

తెలంగాణకు రూ.3,745 కోట్లు

ఈనాడు, దిల్లీ: కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,211 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.1,78,173 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ప్రతీ నెల రాష్ట్రాలకు రూ.89,086.50 కోట్లు విడుదల చేస్తుంది. ఈ సారి అదనంగా మరో నెల వాటాను కలిపి రూ.1,78,173 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది.



రాష్ట్రంలో నాబార్డు సేవలు విస్తరించాలి: భట్టి

జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) కొత్త చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ్‌భాస్కర్ గురువారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రంలో నాబార్డు ప్రాజెక్టులు, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెలంగాణలో బ్యాంకు సేవలను విస్తరించి, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఉదయ్‌భాస్కర్‌కు ఉపముఖ్యమంత్రి సూచించారు.

– ఈనాడు, హైదరాబాద్

న్యాయవాదులు ప్రతిపక్ష పాత్ర పోషించినప్పుడే ప్రజల్లో ఆదరణ

- ఏఐసీసీ లీగల్ సెల్ ఛైర్మన్, రాజ్యసభ ఎంపీ అభిషేక్ సింఘ్వీ



తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ సింఘ్వీకి జ్ఞాపిక అందజేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో పొన్నం అశోక్‌గౌడ్, మధుయాస్కీగౌడ్ తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: న్యాయవాదులు ప్రతిపక్ష పాత్ర పోషించినప్పుడే ప్రజల్లో ఆదరణ ఉంటుందని ఏఐసీసీ లీగల్ సెల్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ పేర్కొన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా ఆయన్ను పీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. పీసీసీ లీగల్ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్షతన బేగంపేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీగౌడ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింఘ్వీ మాట్లాడుతూ.. ప్రస్తుతం న్యాయవాదులు అధికారం ఎటుంటే.. అటు వైపే వెళ్తున్నారని విమర్శించారు. పీసీసీ లీగల్‌సెల్‌ను క్షేత్రస్థాయిలో విస్తరించాలని, అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా మహిళలకు దీని ద్వారా భరోసా కల్పించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ మధ్యకాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పలు కేసుల్లో సెక్షన్ 45ను దుర్వినియోగం చేస్తోందని, సీబీఐ విచారణలకే పరిమితమైందని, అరెస్టులు తగ్గిపోయాయని విమర్శించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పీసీసీ లీగల్ సెల్‌కు పార్టీ పూర్తి సహకారం ఉంటుందన్నారు. జూనియర్ న్యాయవాదుల స్టైపెండ్, ఇళ్ల స్థలాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, హైకోర్టు కొత్త భవనం నిర్మాణం సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఎత్తుపల్లాలతోనే పురోగతి

ఎలక్ట్రోకార్డియోగ్రామ్(ఈసీజీ) సూచీ తిన్నగా కాకుండా ఎత్తుపల్లాలతో కనిపిస్తుంటేనే మనిషి ప్రాణాలతో ఉన్నట్లు. అదే విధంగా మన జీవితంలో ఎత్తుపల్లాలను చవిచూసినప్పుడే పురోగతి సాధించగలం.
– రతన్ టాటా

దసరా, దీపావళికి 1400 రైలు ట్రిప్పులు: ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జోన్ పరిధిలో మొత్తం 1,400 ప్రత్యేక రైలు ట్రిప్పులను నడిపిస్తున్నట్లు ద.మ.రైల్వే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లను రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలకూ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించింది. అక్టోబరు 30వ తేదీ వరకు ఈ రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, తిరుపతి సహా జోన్ పరిధిలోని 150 రైల్వేస్టేషన్లలో 'నవరాత్రి స్పెషల్ థాలీ' పేరుతో ప్రత్యేక భోజన సదుపాయాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ద.మ.రైల్వే తెలిపింది.

EENADU Vol: 51, Iss: 62 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మెక్రాన్, కీర్ స్టార్మర్‌లతో జెలెన్‌స్కీ భేటీ

- నాటో సెక్రటరీ జనరల్‌తోనూ..

లండన్: రష్యాతో యుద్ధంలో విజయం సాధించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించానని చెబుతున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. పశ్చిమ దేశాల నేతలతో దానికి ఆమోదముద్ర వేయించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో లండన్‌లో ఆయన గురువారం భేటీ అయ్యారు. తన ప్రణాళికపై సమాలోచనలు జరిపారు. అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తోనూ పారిస్‌లో సమావేశమయ్యారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్‌తో కూడా జెలెన్‌స్కీ భేటీ కావడం గమనార్హం. యుద్ధంలో గెలిచేందుకు తాను రచించినట్లు చెబుతున్న ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు ఇంకా బహిర్గతం చేయలేదు. పోప్ ఫ్రాన్సిస్, జర్మనీ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌లతో ఆయన శుక్రవారం సమావేశమై చర్చలు జరపనున్నారు.

ఐరాసకు కొత్త మానవతా విభాగాధిపతి

- టామ్ ఫ్లెచర్‌ను నియమించిన ప్రధాన కార్యదర్శి గుటెరస్

ఐక్యరాజ్యసమితి: ఐరాస మానవతా వ్యవహారాల విభాగాధిపతిగా బ్రిటన్‌కు చెందిన టామ్ ఫ్లెచర్‌ను సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ బుధవారం నియమించారు. ఇంతకుముందు ఈ పదవిని మరో బ్రిటిష్ జాతీయుడు మార్టిన్ గ్రిఫిత్స్ నిర్వహించేవారు. ఆరోగ్య కారణాల వల్ల జూన్‌లో ఆయన తప్పుకోవడంతో, ఆ పదవిని తాత్కాలికంగా జాయిస్ ఎంసుయా నిర్వహిస్తున్నారు. ఫ్లెచర్ లాంఛనంగా పదవిని స్వీకరించేవరకు ఎంసుయా కొనసాగుతారు.

కష్టకాలంలో తోడుగా నిలిచిన భారత్‌కు కృతజ్ఞతలు: ముయిజ్జు

మాలె: భారత నిరంతర సహకారం, ఆర్థిక సాయానికి మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. ఐదురోజుల భారత్ పర్యటనను ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సందర్భంగా ముయిజ్జు ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రెండుదేశాల మధ్య స్నేహం, భాగస్వామ్యం బలోపేతం అయ్యే విధంగా ఈ చర్చలు జరిగాయని పేర్కొన్నారు. కష్టకాలంలో తోడుగా నిలుస్తున్న భారత్‌కు ధన్యవాదాలు తెలిపారు. మరో ఏడాదికి గాను భారత్ అందించనున్న 50 మిలియన్ డాలర్ల ట్రెజరీ బిల్లుకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఏడాది భారత్-మాల్దీవులు 60ఏళ్ల అధికారిక సంబంధాల వార్షికోత్సవాలు జరుపుకోనున్నాయి. ఈ సందర్భంగా మాల్దీవుల్లో పర్యటించాలని భారత ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్మును ముయిజ్జు ఆహ్వానించారు.



ములాయం సింగ్ యాదవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అఖిలేశ్

కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుంది

- ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

ఇటావా: కాంగ్రెస్‌తో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) పొత్తు కొనసాగుతుందని ఆ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ గురువారం ప్రకటించారు. తన తండ్రి, ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ వర్ధంతి సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇటావాకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆరు స్థానాల్లో తమ అభ్యర్థులను బుధవారం అఖిలేశ్ ప్రకటించారు. 'యూపీ ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి ఉంటుంది. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల పొత్తు కొనసాగుతుంది' అని పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికల్లో పొత్తులో భాగంగా తమకు 5 సీట్లు కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

పురుషోత్తం ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు

- యూపీలో మూడు గంటలు నిలిపివేత

దిల్లీ: పూరీ-దిల్లీ నడుమ నడిచే పురుషోత్తం ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు రావడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని తుండ్ల స్టేషన్‌లో మూడు గంటలు నిలిపివేశారు. ''రైల్లో కొందరు ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో వెళ్తున్నారని, వాళ్లు దాన్ని దిల్లీ-లేహ్ ఎయిరిండియా విమానంలో పెడతారని ఎక్స్‌లో మాకు సమాచారం వచ్చింది. కానీ అది ఉత్తుత్తి బెదిరింపుగా తేలింది'' అని ప్రయాగ్‌రాజ్ డివిజన్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో ప్రయాణికులందరినీ నిద్రలేపి, వారి సామగ్రిని మెటల్ డిటెక్టర్లు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. అయితే, ఎక్స్‌లో అర్ధరాత్రి 12.47 గంటల సమయంలో పోస్ట్ చేస్తే తనిఖీలు చేసేసరికి 2.30 దాటిందన్న విమర్శలు వచ్చాయి.

గూడ్స్ రైల్లో జీపీఎస్ ట్రాకర్

ఝాన్సీ: భోపాల్-దిల్లీ మార్గంలో ఒక గూడ్స్ రైల్లో అనుమానాస్పద ఎలక్ట్రానిక్ పరికరం లభించింది. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి రాజస్థాన్‌కు బొగ్గు తీసుకెళ్తున్న రైలును ఝాన్సీ సమీపంలోని బిజౌలి స్టేషన్ వద్ద నిలిపారు. గార్డు బోగీ సమీపంలో ఒక పరికరం లైటు వెలుగుతూ ఆరుతూ ఉందని రైలుగార్డు మీనా గుర్తించారు. వెంటనే బాంబు స్క్వాడ్‌ను పిలిపించి తనిఖీ చేయగా, జీపీఎస్ ట్రాకర్ కనిపించింది. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పట్టాలపై రాళ్లు.. రైలు క్షేమమే

బిజ్నోర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘుమ్మల్‌పుర్ క్రాసింగ్ వద్ద రైలు పట్టాలపై గురువారం ఉదయం కొందరు దుండగులు చిన్న చిన్న రాళ్లను పెట్టారనీ, అయినా రైలు భద్రంగా వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. రైలు మురాద్‌పుర్ చేరాక లోకోపైలట్ దీనిగురించి రైల్వే పోలీసులకు తెలిపారు. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లో కాన్పుర్, జౌన్‌పుర్, బాఘ్‌పత్ సహా పలు చోట్ల రైలు పట్టాలపై సిలిండర్లు, ఇనుప కమ్మీలు, ఇతర వస్తువులను పెట్టిన ఘటనలు జరిగాయి.

డిజిటల్ చెల్లింపు వ్యవస్థల అనుసంధానం

- ఆసియాన్ దేశాలకు సాయం చేయనున్న భారత్
- భద్రత కోసం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం

వియాంటియాన్: ఆధార్, యూపీఐ లాంటి డిజిటల్ మౌలిక సదుపాయాల (డీపీఐ) వినియోగంలో తన విజ్ఞానం, అనుభవాలను ఆసియాన్ దేశాలతో భారత్ పంచుకోనుంది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వాతావరణ మార్పుల విషయంలో ఎదురయ్యే విభిన్న సమస్యల పరిష్కారానికి సహకారం అందించనుంది. ఈ విషయాన్ని గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. లావోస్ రాజధాని వియాంటియాన్‌లో జరిగిన 21వ భారత్-ఆసియాన్ సదస్సుకు ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. సదస్సు అనంతరం ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరత, సమగ్రత కోసం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంపైనా ఇరువర్గాలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. భవిష్యత్తులో పరస్పర సహకారానికి ఈ భాగస్వామ్యం పునాది వేస్తుందని సదస్సు ముగింపు సందర్భంగా మోదీ అన్నారు. ఆసియాన్ దేశాల్లో ఇండొనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనై, వియత్నాం, లావోస్, మయన్మార్, కాంబోడియా లాంటి పది దేశాలున్నాయి.

'అంతర్జాతీయ చట్టాలను చైనా గౌరవించాలి'

వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంపై తరచూ వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలంటూ ఆగ్నేయాసియా దేశాల నేతలు చైనాకు సూచించారు. దీనిపై చైనా ప్రధాన మంత్రి లీ కియాంగ్ స్పందిస్తూ.. ప్రాంతీయ వ్యవహారాల్లో 'బాహ్యశక్తులు' జోక్యం చేసుకుంటున్నాయని విమర్శించారు. మరోవైపు ఆసియాన్ దేశాలతో లోతైన మార్కెట్ ఏకీకరణను కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆసియాన్ దేశాలు చైనా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుదిదశకు చేరుకున్నాయని సంబంధిత నేతలు వెల్లడించారు.



లావోస్ రాజధాని వియంటియాన్‌లో స్థానిక కళాకారులకు నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

జపాన్, న్యూజిలాండ్ ప్రధానులతో మోదీ చర్చలు

వియంటియాన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం లావోస్ రాజధాని వియంటయాన్‌లో జపాన్, న్యూజిలాండ్ ప్రధానులు శిగేరు ఇషిబా, క్రిష్టోఫర్ లుక్సాన్‌లతో గురువారం చర్చలు జరిపారు. మౌలికసదుపాయాలు, అనుసంధానత, రక్షణ సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. 21వ ఆసియాన్-భారత్ సదస్సు నేపథ్యంలో లావోస్ చేరుకున్న మోదీ ఇక్కడ పలు ఇతర దేశాల నేతలతోనూ భేటీ కానున్నారు.

ఆప్, భాజపా మధ్య మాటల యుద్ధం

- ఓటమి భంగపాటుతోనే సీఎం అధికారిక నివాసాన్ని భాజపా ఆక్రమించాలని చూస్తోంది: ఆతిశీ

దిల్లీ: దిల్లీలో ఆప్, భాజపా మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లో దిల్లీ సీఎం అధికారిక నివాసం నుంచి ఆతిశీని బలవంతంగా ఖాళీ చేయించారంటూ ఆప్ చేస్తోన్న ఆరోపణలతో అక్కడి రాజకీయం మరోసారి వేడెక్కింది. గురువారం ఇక్కడ దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించలేక భాజపా నిరాశకు గురైందని, ఓటమి భంగపాటును జీర్ణించుకోలేకనే ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని సీఎం అధికారిక నివాసాన్ని ఆ పార్టీ ఆక్రమించుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో తమను ఓడించలేకపోవడంతో భాజపాకు టెన్షన్ పట్టుకుందన్నారు. తమ పార్టీ బంగ్లాలు, కార్ల కోసం రాజకీయాలు చేయదని చెప్పారు. అవసరమైతే.. ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు వీధుల్లోంచి పనిచేసేందుకు సైతం సిద్ధమేనన్నారు.

ఆప్ డ్రామాలు ఆడుతోంది.. భాజపా

ఆతిశీ వ్యాఖ్యలను భాజపా ఖండించింది. ఆతిశీ తన వస్తువులతో నిండిన డబ్బాలు ఉన్నచోట ఫైల్స్‌పై సంతకాలు చేస్తున్న ఫొటోలను ఆప్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడాన్ని తప్పుపట్టింది. ఆప్ డ్రామాలు ఆడుతోందని.. ప్రజల్లో సానుభూతి కార్డు ప్లే చేస్తోందని మండిపడుతోంది. ఆప్ నేతలు చెబుతున్నట్లుగా ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని బంగ్లా దిల్లీ సీఎం అధికారిక నివాసం కాదని భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ అన్నారు. ఆతిశీకి మథుర రోడ్డులో ఇప్పటికే బంగ్లా ఉందని.. ఆప్ నేతలు చెబుతున్నవి కేవలం ఆరోపణలేనన్నారు. సీఎం దిల్లీ సచివాలయంలో తన పూర్తిస్థాయి కార్యాలయం నుంచే పని చేయాల్సి ఉన్నా.. ఇలా ఖాళీ పెట్టెలు ఉన్నచోట ఫైళ్లపై సంతకాలు చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలను షేర్ చేయడం ద్వారా ఆప్ నేతలు సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని భాజపా నేతలు పేర్కొన్నారు.



కొత్త నివాసం నుంచి విధులు నిర్వర్తిస్తున్న దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ

హిజ్బుత్ తహ్రీర్‌పై కేంద్రం నిషేధం

దిల్లీ: హిజ్బుత్ తహ్రీర్ (హెచ్‌యూటీ) అనే ముష్కర ముఠాపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం హోంశాఖ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. జిహాద్, ఉగ్రవాద కార్యకలాపాల ద్వారా భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఖలీఫా రాజ్యం ఏర్పాటుకు ఈ సంస్థ కుట్ర పన్నుతోందని తెలిపింది. యువతలో అతివాద బీజాలు నాటుతూ వారిని ఐసిస్ వంటి ఉగ్రవాద ముఠాల్లో చేరేలా ప్రేరేపిస్తోందని, ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సేకరిస్తోందని పేర్కొంది. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్న ప్రధాని మోదీ విధానానికి అనుగుణంగా హెచ్‌యూటీపై నిషేధం విధించినట్లు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కార్యాలయం తెలిపింది. దేశ భద్రతకు ఈ ముఠా పెను ముప్పుగా పరిణమించిందని వివరించింది. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసేందుకు మోదీ సర్కారు కట్టుబడి ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాలు, కొన్ని యాప్‌లు, 'దవా' సమావేశాల ద్వారా ఈ ముఠా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని హోంశాఖ తన నోటిఫికేషన్‌లో తెలిపింది. హెచ్‌యూటీ 1953లో ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం లెబనాన్‌లో ఉంది. బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా సహా 30కిపైగా దేశాల్లో ఈ ముఠా కార్యకలాపాలు సాగిస్తోంది. పలు దేశాల్లో దీన్ని నిషేధించారు.

అణ్వస్త్ర విన్యాసాలకు దిగనున్న నాటో

బ్రసెల్స్: నాటో కూటమి భారీ అణ్వస్త్ర విన్యాసాలు చేపట్టనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం దాదాపు రెండు వారాల పాటు సాగనున్నాయి. తమపై ఉక్రెయిన్ సాగిస్తున్న దాడులకు పశ్చిమ దేశాల నుంచి మద్దతు అందకుండా చూడటానికి రష్యా తన అణ్వస్త్ర వ్యూహపత్రానికి మార్పులు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. 'స్టడ్‌ఫాస్ట్ నూన్' అనే ఈ విన్యాసాలకు బెల్జియం, నెదర్లాండ్స్ ఆధ్వర్యంలో జరుగుతాయి. ఇందులో 13 దేశాలకు చెందిన 2వేల సిబ్బందితోపాటు 60 యుద్ధవిమానాలు పాలుపంచుకుంటాయి. అణ్వస్త్రాలు మోసుకెళ్లగల ఫైటర్ జెట్‌లు, బాంబర్ విమానాలు కూడా ఇందులో ఉంటాయి. అయితే ఇందులో నిజమైన బాంబులను వాడటంలేదు. విన్యాసాల్లో ఎక్కువభాగం.. రష్యాకు 900 కిలోమీటర్ల దూరంలోని ఉత్తర సముద్రంలో జరుగుతాయి. ''ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో మా రక్షణ సామర్థ్యాన్ని పరీక్షించుకొని, బలోపేతం చేసుకోవడం చాలా ముఖ్యం. దీనివల్ల.. ఎలాంటి ముప్పునైనా తిప్పికొట్టేందుకు నాటో సిద్ధంగా ఉందని మా ప్రత్యర్థులకు తెలుస్తుంది'' అని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె లండన్‌లో తెలిపారు.


శాంతియత్నాలను ముమ్మరం చేయండి

- మోదీని కోరిన అంతర్జాతీయ సదస్సు

లండన్: యుద్ధంతో రగులుతున్న దేశాల మధ్య సయోధ్య కుదర్చడం ద్వారా శాంతి నెలకొల్పే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ప్రధాని మోదీని ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ జూరిస్ట్స్ అండ్ రైటర్స్ ఫర్ వరల్డ్ పీస్ కోరింది. దౌత్యమార్గాల్లో చర్చల ద్వారా ఉద్రిక్తతలను తొలగించుకునేందుకు అన్ని ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సంఘాలు కలిసికట్టుగా పనిచేయాలనీ పిలుపునిచ్చింది. లేనిపక్షంలో మూడో ప్రపంచ యుద్ధం వచ్చి వేలమంది మరణించే ముప్పుందని హెచ్చరించింది. లండన్‌లో బుధవారం ఈ అంతర్జాతీయ సదస్సు జరిగింది. 'మానవాళి భవిష్యత్తు కోసం విశ్వశాంతి అత్యావశ్యకం' అంటూ మోదీ పంపిన సందేశాన్ని ఈ సదస్సులో చదివి వినిపించారు.

మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణా లేదు

- గత పదేళ్లలో వేగంగా దేశాభివృద్ధి: షా



దిల్లీ: ప్రపంచంలో 'బలహీనమైన అయిదు ఆర్థిక వ్యవస్థ'ల్లో ఒకటిగా ఉన్న భారత దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు తీయించి ఉన్నత స్థానానికి చేర్చిన ఘనత ప్రధాని మోదీదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని పేర్కొన్నారు. దిల్లీలో గురువారం నిర్వహించిన పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వార్షిక సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. మోదీ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, చేపట్టిన సంస్కరణల వల్ల 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా అవతరిస్తుందన్నారు. ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదంతో పాటు ఈశాన్య భారత్‌లో చొరబాట్లను మోదీ ప్రభుత్వం 200 గజాల లోతులో పాతి పెట్టిందని అమిత్ షా పేర్కొన్నారు. తయారీ రంగం, సెమీకండక్టర్ పరిశ్రమ, విద్యుత్తు వాహనాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి వివిధ రంగాల అభివృద్ధితో 2047 లోపు భారత్ గ్లోబల్ లీడర్‌గా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



అమెరికాలోని ఫిలడెల్ఫియాకు చెందిన ఈ అవిభక్త కవలల పేర్లు అమారి, జావర్ రఫిన్. శస్త్రచికిత్స చేయడం ద్వారా ఈ ఇద్దరు చిన్నారులను వైద్యులు విజయవంతంగా విడదీశారు. ఇటీవలే ఆ పిల్లలు తమ పుట్టినరోజును ఘనంగా నిర్వహించుకున్నారు.



క్యాష్‌బీన్ రుణ యాప్‌పై ఫెమా అథారిటీ కొరడా

- రూ.252 కోట్ల ఆస్తుల స్వాధీనం.. రూ.2,146 కోట్ల జరిమానా

దిల్లీ: చైనా వ్యక్తుల అజమాయిషీలో ఉన్న పీసీఎఫ్‌ఎస్ అనే సంస్థకు చెందిన రూ.252 కోట్లకుపైగా ఆస్తుల స్వాధీనానికి 'ఫెమా' వివాద పరిష్కార ప్రాధికార సంస్థ ఆదేశాలిచ్చింది. అలాగే ఆ సంస్థకు రూ.2,146 కోట్లకు పైగా జరిమానాను విధించింది. 'క్యాష్‌బీన్' అనే అక్రమ రుణ యాప్‌నకు సంబంధించిన కేసులో విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద ఈ ఉత్తర్వులు వెలువడినట్లు ఈడీ గురువారం తెలిపింది. పీసీఎఫ్‌ఎస్ అనేది.. నార్వే కేంద్రంగా పనిచేసే ఒపేరా గ్రూప్ అనుబంధ సంస్థ. దీని నియంత్రణ.. చైనా వ్యక్తుల చేతిలో ఉందని ఫెమా అథారిటీ పేర్కొంది. ఈ సంస్థ.. క్యాష్‌బీన్ అనే మొబైల్ యాప్ ద్వారా భారత్‌లో ప్రజలకు రుణాల ఇస్తోందని పేర్కొంది. సాఫ్ట్‌వేర్ లైసెన్సులు, 'సేవల' దిగుమతి ముసుగులో పీసీఎఫ్‌ఎస్.. విదేశాల్లోని తన మాతృ సంస్థలకు రూ.429.30 కోట్లను చేరవేసిందని తెలిపింది. ఇది బోగస్ లావాదేవీ అని వెల్లడైనట్లు వివరించింది. పీసీఎఫ్‌ఎస్ సంస్థ అధిక వడ్డీ రేటును వసూలు చేస్తున్నట్లు 2022 ఫిబ్రవరిలో రిజర్వు బ్యాంకు పేర్కొంది. దీని విధానాలు కూడా పారదర్శకంగా లేవని, ఆర్‌బీఐ, సీబీఐ అధికారిక చిహ్నాలను అక్రమంగా ఉపయోగిస్తోందని తెలిపింది.



సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో రహదారిపై కూలిపోయిన భారీ క్రేన్

ఫ్లోరిడాను వణికించిన మిల్టన్ హరికేన్

- ఐదుగురి మృత్యువాత

టాంపా: హెలీన్ తుపాను ధాటికి ఇటీవల బెంబేలెత్తిన అమెరికాను తాజాగా మిల్టన్ హరికేన్ వణికించింది. ప్రధానంగా ఫ్లోరిడా రాష్ట్రంలో దాని తీవ్రత ఎక్కువగా కనిపించింది. మిల్టన్ దెబ్బకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఆ రాష్ట్రంలో 34 లక్షల మందికిపైగా ఇబ్బందిపడ్డారు. హరికేన్ సంబంధిత వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృత్యువాతపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 45 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మిల్టన్ దెబ్బకు రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో వరదలు పోటెత్తాయి. ఫ్లోరిడాలోని హిల్స్‌బరో, పినెలాస్, సారసోటా, లీ కౌంటీల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు.

అవినీతికి రతన్ టాటా ఎలా దూరంగా ఉన్నారంటే..

దిల్లీ: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా అవినీతి, లంచం అనే పదాలను తన దరికి చేరనివ్వలేదు రతన్‌టాటా. ఓ సందర్భంలో దీని గురించి ఆయన చెప్పిన మాటలు ఇప్పుడు మరోసారి వైరల్‌గా మారాయి. ఒక వ్యాపార ఒప్పందం కోసం సంబంధిత మంత్రికి రూ.15 కోట్లు చెల్లించాలని స్నేహితుడు ఒకరు రతన్‌టాటాకు సలహా ఇచ్చారు. అందుకు ఆయన తిరస్కరించారు. అవినీతికి ఎలా దూరంగా ఉంటున్నావని అప్పుడు ఆ మిత్రుడు ప్రశ్నించారు. "అందుకు స్వీయ నియంత్రణ అవసరం. అది మీరు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు" అని టాటా బదులిచ్చారు. ఈరోజు అవినీతికి పాల్పడలేదనే విషయాన్ని గుర్తుచేసుకొని నిద్రకు ఉపక్రమించాలని కోరుకుంటానని ఆ ఇంటర్వ్యూలో రతన్ వెల్లడించారు.

'భారతరత్న' ఇవ్వాలనే డిమాండ్

ఇంటర్నెట్ డెస్క్: రతన్ టాటాకు 2008లోనే పద్మవిభూషణ్ పురస్కారం దక్కింది. కానీ, ఆయనకు 'భారతరత్న' పురస్కారం ఇవ్వాలని ప్రముఖులు అనడంతో పాటు.. సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున డిమాండ్లు వచ్చాయి. అయితే, రతన్ టాటా మాత్రం అలాంటివాటిని ఎప్పుడూ ప్రోత్సహించలేదు. పురస్కారాలు, పదవులు కంటే 'దేశమే ముందు' అనే సిద్ధాంతాన్ని ఆచరించారు. 'భారతరత్న' ఇవ్వాలన్న సోషల్ మీడియా ప్రచారాన్ని వెంటనే ఆపేయాలని మూడేళ్ల క్రితం ఓ పోస్టులో విజ్ఞప్తి చేశారు. భారతీయుడిగా పుట్టడమే తాను చేసుకున్న అదృష్టంగా భావిస్తానని.. దేశ అభివృద్ధిలో, సంపద పెరగడంలో తనవంతు సహకారం అందించినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. 'భారతరత్న ఫర్ రతన్ టాటా' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవడంతో.. రతన్ పైవిధంగా విజ్ఞప్తి చేశారు.

ఇండియన్ అమెరికన్ల నివాళి

వాషింగ్టన్/లండన్: రతన్ టాటాకు అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు నివాళులు అర్పించారు. "చివరిసారిగా గూగుల్‌లో రతన్ టాటాతో మాట్లాడా. ఆయన దార్శనికత స్ఫూర్తి రగిలిస్తుంది. భారతదేశంలో ఆధునిక వ్యాపార నాయకత్వాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు" అని గూగుల్, ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ 'ఎక్స్' ద్వారా స్పందించారు. యూఎస్ - ఇండియా బిజినెస్ కౌన్సిల్ అధ్యక్షుడు అతుల్ కేశప్ మాట్లాడుతూ.. భరతమాత ముద్దుబిడ్డ, ఆదర్శప్రాయమైన దాతగా రతన్‌జీని అభివర్ణించారు. ప్రవాస భారతీయుల సంఘం తరఫున సంఘ వ్యవస్థాపకుడైన ఎం.ఆర్.రంగస్వామి స్పందిస్తూ.. రతన్ టాటా స్ఫూర్తి, అందించిన సేవలు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలిచిపోతాయన్నారు. భారతదేశ అత్యంత శక్తిమంతమైన, ఆరాధ్యుడైన వ్యాపారవేత్తగా రతన్ టాటాను 'ది న్యూయార్క్ టైమ్స్' అభివర్ణించింది.

✦ రతన్ టాటాను వ్యాపార ప్రపంచ దిగ్గజంగా బ్రిటన్ వ్యాపార, వాణిజ్య మంత్రి జోనాథన్ రెనాల్డ్స్ అభివర్ణించారు. బ్రిటన్‌లోని భారత హై కమిషనర్ విక్రం దొరైస్వామి కాసేపు మౌనం పాటించి రతన్‌జీకి అంజలి ఘటించారు.

మానవ అక్రమ రవాణా ముఠా సూత్రధారులు చైనా స్కామర్లు

- ఛార్జిషీట్‌లో ఎన్ఐఏ అభియోగాలు

దిల్లీ: ఉపాధి పేరుతో భారతీయ యువకులకు వల విసిరి వారిని అక్రమంగా లావోస్‌కు తరలిస్తున్న ముఠాపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అభియోగాలు మోపింది. చైనాకు చెందిన స్కామర్లు నడుపుతున్న సైబర్ కాల్ సెంటర్లలో పని చేయించేందుకు వీరిని వినియోగిస్తున్నారని ప్రత్యేక కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో ఆరోపించింది. ముఠా సభ్యుల్లో కమ్రాన్ హైదర్ అలియాస్ జైదీని కీలక నిందితుడిగా పేర్కొంది. మన్జూర్ ఆలమ్, సాహిల్, ఆశీష్ అలియాస్ అఖిల్, పవన్ యాదవ్ అలియాస్ అఫ్జల్ ముఠా సభ్యులని తెలిపింది. లావోస్ పీడీఆర్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ల నుంచి అమెరికా, యూరోపియన్ పౌరులను మోసగించేలా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఛార్జిషీట్ వివరించింది. ఆ కాల్‌సెంటర్ల కోసమే భారతీయ యువకులను తరలిస్తున్నట్లు గుర్తించామని ఎన్ఐఏ ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ముఠా ఇంకా అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ఐఏ వెల్లడించింది.

బెంగాల్ ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రిలో 40మంది వైద్యుల రాజీనామా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యురాలికి న్యాయం జరగాలంటూ జూడా(జూనియర్ డాక్టర్)లు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులు మద్దతు తెలుపుతున్నారు. తాజాగా వీరికి సంఘీభావం తెలుపుతూ ఎస్ఎస్‌కేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో 40 మంది వైద్యులు సామూహికంగా రాజీనామా చేశారు. న్యాయమైన వైద్యుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ వైద్యుడు వెల్లడించారు. కాగా..ఐదురోజులుగా నిరాహార దీక్షను చేపట్టిన వైద్యుల ఆరోగ్యంపై రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. నిరాహార దీక్షను విరమించాలని, ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా నిరసనలు వ్యక్తం చేయాలని జూడాలు కోరారు.సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే అన్ని వాటాదారులతో కలిసి శాంతి సమావేశాలను ఏర్పాటు చేస్తామని గురువారం నిరసన శిబిరాన్ని సందర్శించి జూడాలకు హామీ ఇచ్చారు.

సీలు పెట్టెలో 'రక్తంతో తడిసిన' సర్జికల్ గ్లోవ్స్ లభ్యం

- ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో వెలుగులోకి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగికి చికిత్స చేస్తున్న సమయంలో ఓ సీలు పెట్టెలో రక్తంతో తడిసి ఉన్న సర్జికల్ గ్లోవ్స్ లభ్యమయ్యాయని ఓ జూనియర్ డాక్టర్ (జూడా) వెల్లడించారు. గ్లోవ్స్‌పై మట్టి లేదా బురద ఉంటే తొలగించవచ్చనీ..కానీ దానిపై రక్తం మరకలు ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం ఆర్‌జీ కర్ ఆసుపత్రికి పరిమితమైన విషయం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఈ సమస్య ఉందని ఆరోపించారు. ఈ సమస్యపై దర్యాప్తు జరుపుతామని రాష్ట్ర ఆరోగ్యశాఖ కేంద్ర వైద్య సరఫరాల విభాగం వెల్లడించింది.

37 రోజుల కుమార్తెను బలిచ్చిన తల్లిదండ్రులు

- ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం

ముజఫర్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బెల్డా గ్రామంలో తాంత్రికుడి సలహాపై- 37 రోజుల ఆడ శిశువును ఆమె తల్లిదండ్రులే బలిచ్చారు. ఆడ పిల్ల పుట్టినప్పటి నుంచి తనకు ఆరోగ్యం సరిగాలేదని బిడ్డ తల్లి మమత రోజూ చెప్పేది. దీంతో భర్త గోపాల్ కాశ్యప్ ఆమెను హరేంద్ర అనే తాంత్రికుడి వద్దకు తీసుకెళ్లాడు. శిశువును బలిస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని తాంత్రికుడు సలహా ఇచ్చాడు. దీంతో బుధవారం రాత్రి వారు శిశువును బలిచ్చారు. మంగళవారం బిడ్డతో తాంత్రికుడి వద్దకు వెళ్లిన మమత, గోపాల్ దంపతులు శిశువు లేకుండా ఇంటికి తిరిగిరావడం చూసి ఇరుగుపొరుగువారికి అనుమానం వచ్చింది. అనంతరం స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు గురువారం దంపతులను ప్రశ్నించగా అసలు సంగతి బయటపడింది. వారిద్దరితోపాటు తాంత్రికుడు హరేంద్రనూ పోలీసులు అరెస్టు చేశారు.



కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని దిల్లీలో శ్రీధార్మిక్ లీలా కమిటీ సభ్యులు ఎర్రకోట మైదానంలో నిర్వహించే రామ్‌లీలా కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు బహూకరించిన విల్లును సోనియా ఇలా ఎక్కుపెట్టారు

ఈనాడు సినిమా

డిసెంబరు నుంచి బరిలోకి!


సూర్య

కథానాయకుడు సూర్య ఇప్పటికే రెండు చిత్రాలు పూర్తి చేశారు. ఆయన నటించిన 'కంగువా' నవంబరులో తెరపైకి రానుండగా.. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో చేసిన 'సూర్య 44' (వర్కింగ్ టైటిల్) నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈలోగానే మరో ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు సూర్య. ఆయన ప్రస్తుతం నటుడు, దర్శకుడు ఆర్.జె.బాలాజీ దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. 'సూర్య 45'గా సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం డిసెంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇందుకోసం చిత్ర బృందం లొకేషన్ల వేట మొదలెట్టినట్లు తెలుస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే సూర్య, వెట్రిమారన్ దర్శకత్వంలో 'వాడివాసల్'ను పట్టాలెక్కించనున్నారు.

ఆగస్టులో తెరపైకి 'కాంతార 1'


రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. 'కాంతార'కు ప్రీక్వెల్‌గా నిర్మితమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్ర నిర్మాత విజయ్ కిరగందూర్ ఓ వేడుకలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ ప్రీక్వెల్ చాలా బాగా వస్తోందని.. ఇప్పటికే 30 శాతం చిత్రీకరణ పూర్తయిందని.. ప్రస్తుతం కుందాపురలో సిద్ధం చేసిన సెట్స్‌లో చిత్రీకరణ చేస్తున్నామని వివరించారు. ఈ సినిమాని వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశమున్నట్లు తెలియజేశారు. ఇది కదంబ యుగం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతోంది ఇందులో రిషబ్ మునుపెన్నడూ చూడని విధంగా విభిన్నమైన లుక్‌లో కనువిందు చేయనున్నారు. ఆయన తండ్రి పాత్రలో మలయాళ స్టార్ మోహన్‌లాల్ కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఈటీవీలో బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుక

● నేటి ఉదయం 9.గం నుంచి ప్రసారం


బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి 50వసంతాలు పూర్తయిన నేపథ్యంలో 'ఎన్‌బీకే 50' పేరుతో ఇటీవల హైదరాబాద్‌లో స్వర్ణోత్సవ వేడుకని నిర్వహించారు. ఈ మరపురాని వేడుక దసరా సందర్భంగా శుక్రవారం ఉదయం 9నుంచి 12గం.ల మధ్య ఈటీవీ, ఈటీవీ హెచ్‌డీలో ప్రసారం కానుంది. ఈటీవీ విన్‌లో కూడా వీక్షించవచ్చు. చిత్రసీమలో బాలయ్య 50ఏళ్ల అసమాన వారసత్వాన్ని గౌరవిస్తూ.. భారతీయ సినీ పరిశ్రమలోని ప్రముఖ తారలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. అగ్రతారలు చిరంజీవి, వెంకటేశ్, మోహన్‌బాబు తదితరుల అద్భుత ప్రసంగాలు.. యువ నటీనటులు సిద్ధు జొన్నలగడ్డ, అడివి శేష్, విష్వక్ సేన్, సోనాల్ చౌహాన్, సీరత్ కపూర్, ప్రగ్యా జైస్వాల్ తదితరులు చేసిన ప్రదర్శనలు ప్రేక్షకులకు కనువిందు చేయనున్నాయి. ఈ వేడుకలో సినీతారలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, కె.రాఘవేంద్రరావు, కోదండ రామిరెడ్డి, బోయపాటి శ్రీను, బ్రహ్మానందం, మురళీ మోహన్, అల్లు అరవింద్, దిల్‌రాజు, డి.సురేశ్‌బాబుతో పాటు రాజకీయ ప్రముఖులు పెమ్మసాని చంద్రశేఖర్, రఘురామ కృష్ణంరాజు, శ్రీభరత్, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ వర్మ చిత్రం మహాకాళి



దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి వచ్చిన తొలి సినిమా 'హనుమాన్'. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రశాంత్ తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మూడో ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఇది 'మహాకాళి' పేరుతో ఫీమేల్ సూపర్ హీరో సినిమాగా ముస్తాబు కానుంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. ఆర్.కె.దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మించనున్నారు. ఈ చిత్ర టైటిల్ మోషన్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. "మా యూనివర్స్‌కు కొత్త శక్తి జత కలిసింది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. ఇది బెంగాల్ ప్రాంతంలో జరిగే కథగా ఉంటుంది'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ఈ సినిమా భారతీయ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లోనూ విడుదల కానుంది. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతమందించనుండగా.. నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.

హమ్మయ్య... హమ్మయ్యా...

నారా రోహిత్ కథానాయకుడిగా... వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సుందరకాండ'. వృతి వాఘని, శ్రీదేవి విజయ్‌కుమార్ కథానాయికలు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. ఇది నారా రోహిత్‌కి 20వ చిత్రం. గురువారం ఈ సినిమాలోని 'హమ్మయ్య.. హమ్మయ్యా...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. 'శనివారం నుంచి రాజయోగం అంట... ' అంటూ మొదలయ్యే ఈ పాటకి లియోన్ జేమ్స్ స్వరాలు సమకూర్చగా, ఆయనే రామ్ మిర్యాలతో కలిసి ఆలపించారు. శ్రీహర్ష ఈమని సాహిత్యం అందించారు. "హుషారుగా సాగే ఈ పాట, ఇందులో నారా రోహిత్ చేసిన డ్యాన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. విడుదల కాగానే ఈ పాటకి మంచి స్పందన లభించింద"ని సినీ వర్గాలు తెలిపాయి.



నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ ఓ ఇంటివాడు కాబోతున్నారు. 'ప్రతినిధి2'లో తనతో కలిసి తెరని పంచుకున్న నటితో ఆయన జీవితాన్ని పంచుకోనున్నారు. ఈ జంట నిశ్చితార్థం ఈ నెల 13న హైదరాబాద్‌లో జరగనుంది. ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల్ని అభ్యసిస్తున్న ఆ నటి, సినిమాపై ప్యాషన్‌తో 'ప్రతినిధి2'లో నటించారు. ఆ తర్వాత మళ్లీ ఆస్ట్రేలియాకి వెళ్లిపోయారు. ఈ సినిమా ప్రయాణమే ఇద్దరి మనసుల్ని కలిపినట్టు తెలుస్తోంది.

ప్రీ వెడ్డింగ్ షో మొదలైంది!


రానా, టీనా శ్రావ్య, తిరువీర్

'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు తిరువీర్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రాహుల్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్నారు. సందీప్ అగరం, అష్మితా రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీనా శ్రావ్య కథానాయిక. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రానా దగ్గుబాటి క్లాప్ కొట్టారు. సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేశారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ.. "ఇదొక కామెడీ డ్రామా సినిమా. నవంబరు 7నుంచి ఎస్.కోట, వైజాగ్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు.

నవ్వులతో ఖేల్ ఖతమ్


నేహా పాండే, రాహుల్ విజయ్

రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'డియర్ మేఘ', 'భాగ్ సాలే' చిత్రాల్ని నిర్మించిన ఈ సంస్థలో రూపొందుతున్న నాలుగో చిత్రమిది. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ దాస్యన్ నిర్మాత. ఈ చిత్రానికి 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్' అనే పేరుని ఖరారు చేశారు. గురువారం ఈ సినిమా లుక్‌ని, టైటిల్‌ని ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి ఆవిష్కరించారు. కడుపుబ్బా నవ్వించే కథతో ఈ చిత్రం రూపొందుతోందని, త్వరలోనే మరిన్ని వివరాల్ని వెల్లడిస్తామని సినీ వర్గాలు తెలిపాయి.


మహేశ్‌రెడ్డి, రామ్ నందా

ఐదు చిత్రాలతో మొదలు

తెలుగు చిత్ర పరిశ్రమలోకి మరో కొత్త నిర్మాణ సంస్థ అడుగు పెట్టింది. హెచ్‌ఎన్ క్యాబ్ ప్రొడక్షన్స్ అనే ఈ సంస్థను నిర్మాత రామ్ నందా ప్రారంభించారు. ఈ సంస్థ లోగో, మోషన్ పోస్టర్‌ను వ్యాపారవేత్త మహేశ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత రామ్ నందా మాట్లాడుతూ.. "నేను రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చా. 2002 నుంచి ఈ పరిశ్రమలో ఉన్నా. త్వరలో మా నిర్మాణ సంస్థ నుంచి 'ప్రేమలు - పెళ్లిళ్లు', 'మనసు', 'ఎల్‌ఎస్‌ఎల్‌ఎమ్', 'గతి', 'రాముణ్ని నేనే - రావణుణ్ని నేనే' అనే ఐదు చిత్రాలు రానున్నాయి. ప్రస్తుతం 'ప్రేమలు - పెళ్లిళ్లు' చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నాం. కొత్తవాళ్లతోనే దీన్ని చేస్తాం. ఇప్పటికే పాటలు సిద్ధమయ్యాయి. దీని తర్వాత మిగతా చిత్రాల్ని ఒకొక్కటిగా పట్టాలెక్కిస్తా" అన్నారు.

బహుశా అవార్డు అందుకుంటూ ఏడ్చిన తొలి నటినేమో!


మానసీ పరేఖ్

ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయ పురస్కారాల వేడుకలో వేదికపై ఉత్తమ నటి పురస్కార విజేత మానసీ పరేఖ్ కన్నీళ్లు పెట్టుకోవడం తెలిసిందే. మరి అంతటి ఆనందకర సమయంలో భావోద్వేగానికి కారణం ఏంటో తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పింది మానసి. "రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. అవార్డు తీసుకోవడానికి వేదిక పైకి పిలిచినప్పుడు ఇది నిజమేనా.. అనుకున్నాను. ఒక్కో మెట్టూ ఎక్కుతుంటే అప్పటి వరకూ నా జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే నా తల్లిదండ్రులు, నా భర్త, స్నేహితులు, అభిమానులు.. ఇలా అందరూ గుర్తొచ్చారు. ఇంతమంది గొప్పవ్యక్తుల మధ్య అవార్డు అందుకుంటున్న భావన, మాటలకు అందని సంతోషంలో కన్నీళ్లు ఆగలేదు. మాటల్లో చెప్పలేనంత ఆనందం వస్తే శరీరం మనకు తెలియకుండానే స్పందిస్తుందేమో. బహుశా వేదికపై అవార్డు తీసుకుంటూ ఏడ్చిన మొదటి నటిని నేనేనేమో (నవ్వుతూ)" అని అంది మానసి.

మిస్టరీని ఛేదించే డేవిడ్ కోశ్


'బోగన్ విలియా'

గతేడాది 'పుష్ప: ది రైజ్', 'విక్రమ్' లాంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన అగ్రనటుడు ఫహాద్ ఫాజిల్. వైవిధ్యమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బోగన్ విలియా'. కేరళలో కనిపించకుండా పోయిన టూరిస్టుల కథ ఆధారంగా దీనిని అమల్ నీరద్ తెరకెక్కిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. కుంచాకో బోబన్, జ్యోతిర్మయి, జిను జోసెఫ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'ప్రమాదం జరిగినప్పటి నుంచి తన ప్రవర్తన మారింది. అప్పటినుంచి పెయింటింగ్ ఆసక్తిగా వేస్తూనే ఉంది'. 'డేవిడ్ కోశ్ అసిస్టెంట్ కమిషనర్'.. అంటూ ఫహాద్ మిస్టరీ కేసును ఛేదించే అధికారిగా కనిపించనున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మనసులు కలిస్తేనే... 'లగ్గం'


ప్రజ్ఞ, సాయిరోనక్


ప్రచారంలో కొత్త పంథాని అనుసరిస్తోంది 'లగ్గం' బృందం. ఇంజాపూర్‌లో వివాహంతో ఒక్కటవుతున్న నిజమైన జంట గోవర్ధన్, అనూష చేతుల మీదుగా ట్రైలర్‌ని విడుదల చేయించింది. ప్రేక్షకులకు చేరువయ్యే క్రమంలో పోస్టర్ మొదలుకొని, ట్రైలర్ విడుదల వరకూ ప్రచార కార్యక్రమాల్ని ఇదే తరహాలో వినూత్నంగా జరిపినట్టు చిత్రబృందం తెలిపింది. సాయి రోనక్, ప్రజ్ఞ నగ్రా జంటగా రూపొందుతున్న చిత్రమిది. రమేశ్ చెప్పాల దర్శకుడు. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'విష్ణుమూర్తి 11వ అవతారమే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం...', 'లగ్గం అంటే రెండు కుటుంబాలు కలవడం కాదు... రెండు మనసులు కలవడం...' అంటూ రాజేంద్రప్రసాద్ చెప్పిన సంభాషణలు ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచాయి. ఒక జంట పెళ్లి నేపథ్యంలో సాగే ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందని, ఈ సినిమా ట్రైలర్ విడుదల అనంతరం పెళ్లి పీటలపై కూర్చున్న గోవర్ధన్, అనూష భావోద్వేగానికి గురయ్యారని సినీ వర్గాలు తెలిపాయి. రాజేంద్రప్రసాద్, రోహిణి, సప్తగిరి, ఎల్బీ శ్రీరామ్, కృష్ణుడు, రఘుబాబు, రచ్చ రవి, కనకవ్వ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: బాల్‌రెడ్డి, సంగీతం: చరణ్ - అర్జున్.

భూకబ్జాదారుల ఆటకట్టించే 'ఝాన్సీ ఐపీఎస్'

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఇప్పటికే తమిళ, కన్నడ భాషల్లో విడుదలైన ఈ సినిమాని ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రేమ, యాక్షన్, సెంటిమెంట్ కలగలిసిన కథతో తెరకెక్కిన చిత్రమిది. ఇందులో లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం చేసింది. భూకబ్జాదారుల గుండెల్లో నిద్రపోయే ఐపీఎస్ అధికారిగా, సమాజంలో జరిగే అన్యాయాలపై తిరగబడే యోధురాలిగా.. కాలేజీ యువతిగా మూడు కోణాల్లో కనిపిస్తుంది. త్వరలో ట్రైలర్‌ను.. నవంబరులో సినిమాని విడుదల చేస్తామ"న్నారు.


లక్ష్మీరాయ్

అమితాబ్‌బచ్చన్ త్రిశూల్ సీక్వెల్!


అమితాబ్ బచ్చన్

అమితాబ్‌బచ్చన్ కెరీర్‌లో ఎన్నో ఐకానిక్ చిత్రాలున్నాయి. వాటిలో 'త్రిశూల్' ఒకటి. చేతిలో చిల్లిగవ్వ లేకుండా పట్టణానికొచ్చి ఉన్నత స్థానానికి ఎదిగిన విజయ్ అనే వ్యాపారవేత్త పాత్రలో అమితాబ్ బచ్చన్ నటన అందర్నీ కట్టిపడేసింది. ప్రేక్షకులకే కాదు అమితాబ్‌తో పలు చిత్రాలు నిర్మించిన ఆనంద్ పండిట్‌కు కూడా ఈ చిత్రం ఎంతగానో నచ్చిందట. అందుకే ఆయన ఈ చిత్రం సీక్వెల్‌కి సన్నాహాలు చేస్తున్నారు. "త్రిశూల్'ని నేను ఓ 60సార్లు చూశాను. ఈ చిత్ర కథ నాలో ఎంతో స్ఫూర్తినింపింది. అందుకే గుజరాత్ నుంచి ముంబయికి వచ్చాను. ఎప్పటికైనా అమితాబ్‌తో 'త్రిశూల్' సీక్వెల్ చేయాలనేది నా కల''అని చెప్పారు ఆనంద్. ఆయన దీని కోసం కథను కూడా సిద్ధం చేశారు. మాతృకకు యశ్‌చోప్రా దర్శకత్వం వహించగా, సీక్వెల్‌కి దర్శకుడెవరో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తుంటాం. డబ్బును వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నన్ని రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తూనే ఉంటాం. చెడు మార్గంలో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఈ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకుంటే.. మీకు కావాలి అనుకున్నప్పుడు మీ రూపంలోనైనా, ఎవరి నుంచైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, భిన్నంగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులూ అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.

కొత్తగా సిప్ చేస్తుంటే



క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలూ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందుకోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్‌ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్లు, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీల ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీలంటేనే అస్థిరతకు మారుపేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కాస్త అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్లు, వాల్యూ ఫండ్, లో వోలటాలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాతే.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలకూ అవకాశం ఉంటుంది. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగానూ: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్‌ఫోలియో స్థిరంగా ఉంటుంది.

ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండండి. ఫండ్‌లను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఇటీవలి కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్లను ఎంచుకోవడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై ఎక్కువగా దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

సిరి

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లు తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపేరు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.

పండగల వేళ కొనుగోళ్లు జాగ్రత్తగా

దసరా, దీపావళి.. ఈ పండగలంటేనే ఆనందం. ఏదో ఒక కొత్త వస్తువును కొనాలని అందరూ ఆలోచిస్తుంటారు. ఈ సమయంలో సంస్థలు ఇచ్చే రాయితీలూ మనల్ని ఆకర్షిస్తుంటాయి. కొనుగోళ్ల విషయంలో కాస్త క్రమశిక్షణ లేకపోతే ఆర్థిక సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దీనిని నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలన్నది తెలుసుకుందాం.



ఒకప్పుడు పండగల సందర్భంలోనే కొనుగోళ్లు ఉండేవి. ఇ-కామర్స్ సంస్థల రాకతో ఇది మారిపోయింది. ఇక్కడ ఏడాదంతా ఏదో ఒక రాయితీ లభిస్తూనే ఉంటుంది. కొత్త కొత్త వస్తువులు కనిపిస్తూనే ఉంటాయి. దీంతో కొనుగోళ్ల తీరు మారిపోయింది. అయినప్పటికీ పండగలప్పుడు అధికంగా కొనడం చూస్తూనే ఉంటాం.
ఈ సమయంలో కాస్త అప్రమత్తంగా ఉంటే, మిగతా సంవత్సరం అంతా ఆనందంగా ఉండొచ్చు.

బడ్జెట్‌ను సిద్ధంగా..

కొనుగోళ్ల కోసం ప్రత్యేకంగా ఒక బడ్జెట్‌ను కేటాయించుకోవాలి. ఇందులోనే ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులూ ఉండాలి. ప్రతి అంశానికీ ఎంత మేరకు ఖర్చు చేయాలన్నది నిర్ణయించుకోవాలి. చివరి నిమిషంలో కొంత వ్యత్యాసం ఉండొచ్చు. కానీ, ఇది 5-10 శాతానికి మించి పెరగకూడదు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. పండగల కోసం ముందునుంచే కొంత మొత్తాన్ని పొదుపు చేసి పెట్టుకోవడం వల్ల చివరి నిమిషంలో ఆర్థిక ఒత్తిడి లేకుండా చూసుకోవచ్చు. వచ్చే ఏడాది కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావడం అన్నమాట.

ఆన్‌లైన్ చెల్లింపులతో

కొనుగోళ్లు ఎక్కువగా చేసేందుకు ఆన్‌లైన్‌లో చెల్లించడమూ ఒక కారణమని నివేదికలు చెబుతున్నాయి. యూపీఐ, క్రెడిట్ కార్డులకూ పరిమితులు విధించుకోండి. ఎంత వరకూ ఖర్చు చేయాలో అంతే మొత్తం సంబంధిత ఖాతాలో ఉండేలా చూసుకోండి. తాత్కాలికంగా క్రెడిట్ కార్డులను బ్లాక్ చేయండి. యూపీఐ అనుసంధానించిన బ్యాంకు ఖాతాలను తొలగించండి. దీనివల్ల ఖర్చులను కాస్త అరికట్టేందుకు వీలవుతుంది.

అత్యవసర నిధిని వాడొద్దు..

పండగల వేళ కొనుగోళ్ల కోసం అత్యవసర నిధిని వాడకుండా చూసుకోండి. ఇది అత్యవసరాల కోసం ఉపయోగించుకునేదని మర్చిపోవద్దు. మీ పండగ ఖర్చులు మీ బడ్జెట్‌ను మించిపోతే, కొనుగోళ్లను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడమే ఉత్తమం.

ముందుగానే...

విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలును పండగల ముందే చేసుకోవచ్చు. ఇప్పుడు రెండు మూడు నెలల ముందు నుంచే పలు ఆఫర్లు కనిపిస్తున్నాయి. నెలనెలా కొంత మొత్తాన్ని ఈ కొనుగోళ్ల కోసం వినియోగించుకోవచ్చు. దసరా, దీపావళి సందర్భంలో వచ్చిన బోనస్‌లాంటి వాటిలో 40 శాతానికి మించి కొనుగోళ్లకు వాడొద్దు. మిగతా 60 శాతాన్ని తప్పకుండా దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో మదుపు చేయడం మంచిది.

గృహరుణం మార్చుకోవచ్చా?



రెండేళ్ల క్రితం రూ.30లక్షల గృహరుణం తీసుకున్నాను. ఇప్పుడు వడ్డీ రేట్లు పెరిగాయి కదా. మరో బ్యాంకు అర శాతం తక్కువకే రుణం ఇస్తానంటోంది. ఆ బ్యాంకుకు మారిపోవచ్చా? రుణం మరో రూ.6లక్షలు అధికంగానే వచ్చే అవకాశాలున్నాయి. తీసుకోవాలా? - అనిల్

❑ ఇప్పుడు గృహరుణం వడ్డీ రేట్లు అధికంగానే ఉన్నాయి. అరశాతం తక్కువగా రుణం లభిస్తుందంటే మార్చుకునే ప్రయత్నం చేయొచ్చు. కానీ, ప్రాసెసింగ్ ఫీజు, ఇతర రుసుములనూ చూసుకోవాలి. అవి అధికంగా ఉంటే బ్యాంకు మారడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అదనంగా తీసుకునే మొత్తం వల్ల మీకు రుణ భారం తప్ప లాభం లేదు. వచ్చే ఆరు నెలల సమయంలో రుణాల వడ్డీ రేట్లు తగ్గే సూచనలు ఉన్నాయి. కాబట్టి, ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

మా అబ్బాయి వయసు 11. మరో 10 ఏళ్ల తర్వాత అవసరాలకు సరిపోయేలా నెలకు రూ.25 వేల వరకూ మదుపు చేయాలని అనుకుంటున్నాం. ఎలాంటి ప్రణాళిక వేసుకోవాలి? - ప్రవీణ్

❑ మీ అబ్బాయి భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా రక్షణ కల్పించండి. ఇందుకోసం టర్మ్ పాలసీని ఎంచుకోండి. మీ వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ దీని విలువ ఉండాలి. మీ పెట్టుబడికి అధిక రాబడి వచ్చేలా చూసుకోండి. విద్యా ద్రవ్యోల్బణం 8-10 శాతం వరకూ ఉంది. దీనికి మించి రాబడి రావాలంటే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడమే మార్గం. నెలనెలా రూ.25వేలను క్రమం తప్పకుండా 10 ఏళ్లపాటు మదుపు చేస్తే 10 శాతం వార్షిక రాబడి అంచనాతో రూ.52,64,620 అయ్యేందుకు వీలుంది.

మార్గదర్శి

నా వయసు 25. నెలకు రూ.10వేల వరకూ పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నాను. ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? - సందీప్

❑ మీపై ఆధారపడిన వారుంటే.. జీవిత బీమా పాలసీని తీసుకోండి. ఆరోగ్య, వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోవడమూ మర్చిపోవద్దు. ఆరు నెలలకు సరిపోయే అత్యవసర నిధిని సిద్ధం చేసుకోండి. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి. మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.10వేలలో రూ.3వేలను ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్), రూ.3వేలను మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లలో, మిగతా రూ.4వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి మళ్లించండి. ఆదాయం పెరిగినప్పుడల్లా పెట్టుబడులు పెంచుకునే ప్రయత్నం చేయండి.

- తుమ్మ బాల్‌రాజ్

అపోహలు వీడితేనే కుటుంబానికి భరోసా



అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబానికి ఆర్థికంగా భరోసాగా నిలిచేవి బీమా పాలసీలు. చాలామంది వీటిని పెట్టుబడి సాధనాలుగా, పన్ను ఆదా పథకాలుగానే భావిస్తుంటారు. కొంతమంది బీమా పాలసీలకు ప్రీమియం చెల్లించడం వృథా ఖర్చుగా అనుకొని విస్మరిస్తుంటారు. జీవితం అంతా సవ్యంగానే సాగుతుందని అనుకోవడం పొరపాటే. ఎలాంటి సంఘటనలు ఎదురైనా సిద్ధంగా ఉండాలనే ప్రాథమిక ఆర్థిక సూత్రాన్ని పాటిస్తూ ఉండాలి. బీమా పాలసీల చుట్టూ ఉండే కొన్ని అపోహలు, వాస్తవాలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

సంపాదన, బాధ్యతలు, రుణాలు.. వీటిన్నింటినీ ఒక చోట లెక్కతీస్తే ఒక వ్యక్తికి వాస్తవానికి ఎంత బీమా పాలసీ ఉండాలన్నది తెలుసుకోవచ్చు. చాలామంది దీన్ని పట్టించుకోకుండా తక్కువ బీమా మొత్తం లేదా అధిక విలువైన పాలసీలు తీసుకుంటారు. వాస్తవానికి ఇవి రెండూ పొరపాటే అని చెప్పొచ్చు. అవసరాన్ని సరిగ్గా అర్థం చేసుకొని పాలసీలు తీసుకున్నప్పుడు అవి మనకు మేలు చేకూరుస్తాయి.

జీవితాంతం ఉండాల్సిందేనా?

బీమా పాలసీ జీవితాంతం వరకూ ఉండాలని కొంత మంది భావిస్తుంటారు. బీమా పాలసీలు 85 ఏళ్ల వరకూ అందుబాటులో ఉంటాయి. వాస్తవానికి బీమా పాలసీ ప్రధాన లక్ష్యం.. అకాల మరణం సంభవించినప్పుడు ఆ వ్యక్తిపై ఆధారపడిన వారికి ఆర్థికంగా అండగా నిలవడం. గతంలో తనపై ఆధారపడిన కుటుంబంలోని వారందరూ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత బీమా పాలసీ అవసరం పెద్దగా ఉండకపోవచ్చు. పెద్ద మొత్తంలో బీమా ఉన్నప్పటికీ, దానికి ప్రీమియం చెల్లించడమూ ఒక రకంగా భారమే. కాబట్టి, జీవితాంతం వరకూ బీమా ఉండాలనే లక్ష్యం కాకుండా.. మీపై బరువు బాధ్యతలు ఉన్నంతకాలం బీమా రక్షణ అవసరం అని గుర్తించాలి.

ధూమపానం.. ప్రీమియం భారం

ధూమపానం చేసే వారికి సాధారణ వ్యక్తులతో పోలిస్తే ప్రీమియం కాస్త అధికంగా ఉంటుంది. ఇక్కడ ఒక విషయాన్ని తెలుసుకోవాలి. ఏడాదికిపైగా ధూమపానం మానేస్తే.. వారికి సాధారణ వ్యక్తులకు వర్తించే ప్రీమియమే ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవన శైలి ఉన్న వారికి బీమా సంస్థలు ప్రాధాన్యం ఇస్తాయి. ధూమపానం మానేయడమూ దీని కిందకే వస్తుంది. కాబట్టి, బీమా పాలసీకి ప్రీమియం అధికంగా ఉండదు.

ఆరోగ్య వివరాలు దాచిపెడితే..

'ఆరోగ్య సమస్యలు, ధూమపానం అలవాటును దాచి పెట్టడం వల్ల ప్రీమియం తగ్గుతుందని చాలామంది అనుకుంటారు. ఇది ఎంతో ప్రమాదం. బీమా అనేది ఒక నమ్మకమైన ఒప్పందం. దీన్ని బీమా సంస్థతోపాటు, పాలసీదారుడూ పాటించాలి. ప్రతి పాలసీలోనూ ముందుగానే ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలకు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. ఆ గడువు తీరిన తర్వాత అవన్నీ బీమా పరిధిలోకి వస్తాయి. మీరు విషయాన్ని దాచి, పాలసీ తీసుకుంటే పాలసీ క్లెయిం చేసుకునే సందర్భంలో అది బయటపడిందనుకోండి. పాలసీ ప్రయోజనాలు దూరం అవుతాయి. కాబట్టి, పాలసీ తీసుకునేటప్పుడు ప్రతి అంశాన్నీ వివరంగా చెప్పడమే మంచిద'ని సూచిస్తున్నారు అప్‌స్టాక్స్ సహ వ్యవస్థాపకులు కవితా సుబ్రమణియన్.

చిన్న వయసులో పాలసీ అవసరం లేదు..

ఇది చాలా ప్రమాదకరమైన అపోహ. చిన్న వయసులోనే పాలసీ తీసుకోవడం ఎప్పుడూ అవసరం. యువకులు, ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడూ ఊహించని అవాంతరాలు ఎదురుకావచ్చు. ఇలాంటప్పుడు బీమా ఒక రక్షణ వలయంగా పనిచేస్తుంది. చిన్న వయసులోనే బీమా తీసుకుంటే సాధారణంగా తక్కువ ప్రీమియం ఉంటుంది. పాలసీ వ్యవధి ముగిసే వరకూ అదే కొనసాగుతుంది. అంటే, తొందరగా పాలసీ తీసుకున్నప్పుడు వయసు పెరిగినా, బీమా ప్రీమియం అధికంగా చెల్లించాల్సిన అవసరం ఉండదు.

ఖర్చుగా అనుకుంటే..

చాలామంది బీమా పాలసీని ఒక అనవసరమైన ఖర్చుగా భావిస్తుంటారు. నిజానికి ఇది ఒక అవసరం. యూనిట్ ఆధారిత బీమా పాలసీలు, ఎండోమెంట్ వంటి వాటికి ప్రీమియం అధికంగానే ఉంటుంది. వాస్తవానికి ఇవి అవసరమైనంత మేరకు బీమా రక్షణను అందించలేవు. తక్కువ ఖర్చుతో అందే టర్మ్ బీమా పాలసీల్లాంటివి తీసుకోవడం ఉత్తమం.

బృంద బీమా సరిపోతుంది కదా..

ఉద్యోగం చేస్తున్న సంస్థ అందించే ఆరోగ్య బీమా (బృంద బీమా) సరిపోతుంది కదా అని చాలామంది అనుకుంటారు. ఇందులో కొన్ని పరిమితులు ఉంటాయన్నది గుర్తించాలి. ఉద్యోగంలో కొనసాగినన్ని రోజులే ఈ రక్షణ ఉంటుంది. మీరు సంస్థను మారినా, ఉద్యోగం కోల్పోయినా బీమా దూరం అవుతుంది. బృంద బీమా ఒక అదనపు రక్షణగానే భావించాలి. సమగ్రమైన వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం ఎప్పుడూ అవసరం అని గుర్తించాలి.

పెట్టుబడి కాదు..

బీమా పాలసీ ఎప్పుడూ పెట్టుబడి పథకం కాదు. పాలసీదారు మరణించిన సందర్భంలో అతను/ఆమెపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఆర్థిక రక్షణ అందించే ఒక భద్రతా వలయం. జీవిత బీమా ప్రాథమిక లక్ష్యమూ ఇదే. కాబట్టి, మీకు ప్రియమైన వారికి రక్షణను పెట్టుబడిగా చూడకండి.

కరెంట్ అఫైర్స్



✦ భారత వాయుసేన (ఐఏఎఫ్) ఇటీవల వెపన్ సిస్టమ్స్ స్కూల్ (డబ్ల్యూఎస్ఎస్)ను ఏ నగరంలో ప్రారంభించింది?
జ: హైదరాబాద్

✦ నెదర్లాండ్స్ నూతన ప్రధానమంత్రిగా ఇటీవల ఎవరు బాధ్యతలు చేపట్టారు? (ఈయన గతంలో దేశ గూఢచారి చీఫ్‌గా పనిచేశారు.)
జ: డిక్ స్కూఫ్

మాదిరి ప్రశ్నలు


✦ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎవరిని అదనపు జాతీయ భద్రతా సలహాదారు (అడిషనల్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్)గా నియమించింది? (ఈయన గతంలో రిసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్‌కి చీఫ్‌గా పనిచేశారు. ఈయనతోపాటు టీవీ రవిచంద్రన్, పవన్ కపూర్‌లను కేంద్రం డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారులుగా నియమించింది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్)కు ప్రధాని మోదీ నాయకత్వం వహిస్తారు. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ ఎన్ఎస్‌సీఎస్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తారు.)
జ: రాజీందర్ ఖన్నా

✦ షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ 24వ సమావేశాన్ని ఇటీవల ఎక్కడ నిర్వహించారు? జ: అస్తానా, కజకిస్థాన్

మరింత సమాచారం

JUNIOR INTER Mathematics - I A





Find the circum diameter..

4 Marks **Properties of Triangles**



1) $\sin\theta = \frac{a}{b+c}$, prove that $\cos\theta = \frac{2\sqrt{bc}}{b+c}\cos\frac{A}{2}$

Sol: Given $\sin\theta = \frac{a}{b+c}$

$\cos^2\theta = 1 - \sin^2\theta = 1 - \frac{a^2}{(b+c)^2}$

$= \frac{(b+c)^2 - a^2}{(b+c)^2} = \frac{(b+c+a)(b+c-a)}{(b+c)^2}$

$= \frac{2s.(2s-2a)}{bc} \cdot \frac{bc}{(b+c)^2} \quad \because 1a+b+c = 2s$

$= 2.2\frac{s.(s-a)}{bc} \cdot \frac{bc}{(b+c)^2}$

$= 4\cos^2\frac{A}{2} \cdot \frac{bc}{(b+c)^2} \quad \because \cos^2\frac{A}{2} = \frac{s(s-a)}{2}$

$\cos\theta = \frac{2\sqrt{bc}}{b+c}\cos\frac{A}{2}$

2) $\cot A + \cot B = \cot C = \frac{a^2+b^2+c^2}{4\Delta}$?

Sol: $\cot A + \cot B + \cot C = \Sigma\cot A = \Sigma\frac{\cos A}{\sin A}$

$= \Sigma\frac{b^2+c^2-a^2}{2bc\sin A} = \Sigma\frac{b^2+c^2-a^2}{4\Delta}$

$\because \cos A = \frac{b^2+c^2-a^2}{2bc} \quad \because \Delta = \frac{1}{2}bc\sin A$

$= \frac{1}{4\Delta}[b^2+c^2-a^2+c^2+a^2-b^2+a^2+b^2-c^2] = \frac{a^2+b^2+c^2}{4\Delta}$

3) If a = 26 cms, b = 30 cms and $\cos c = \frac{63}{65}$, then find c.

Sol: Given that a = 26 cms; b = 30 cms and $\cos c = \frac{63}{65}$

since by cosine rule $c^2 = b^2 + a^2 - 2ab\cos c$

$= 26^2 + 30^2 - 2(26)(30)\frac{63}{65}$

$= 676 + 900 - 1512$

$= 1576 - 1512$

$c^2 = 64 ; \Rightarrow c = 8$ cms

-K.Kumar

4 Marks Some more questions


For Answers

1) If the sides of a triangle are 13, 14, 15 then find the circum diameter.

2) If the angles are in the ratio 1 : 5 : 6, then find the ratio of its sides.

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

స్వచ్ఛం.. సమృద్ధం.. శక్తిమంతం!



ప్రకృతిలో అపరిమితంగా లభించే స్వచ్ఛమైన ఇంధనం హైడ్రోజన్. నీటితో పాటు ఎన్నోరకాల జీవపదార్థాల్లో హైడ్రోజన్ ఒక భాగంగా ఉంది. ఆధునిక సాంకేతికతతో దీన్ని సంగ్రహించి ఇంధనంగా మారుస్తున్నారు. శిలాజ ఇంధనాలకు భవిష్యత్తు ప్రత్యామ్నాయంగా, వాతావరణ మార్పులకు మేలైన పరిష్కారంగా విస్తృత ఆమోదంతో ఇప్పుడిప్పుడే దీన్ని ఉపయోగంలోకి తెస్తున్నారు. పెట్రోల్ కంటే మూడు రెట్లు అధిక దహన సామర్థ్యం ఉన్న ఉదజని సంగ్రహణ, నిల్వ, వినియోగం జరిగే తీరుపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. హైడ్రోజన్ ఇంధనం రకాలు, ఉత్పత్తి విధానాలు, ఇందుకు కావాల్సిన శక్తి వనరులతో పాటు, దీని ఉత్పత్తి, వాణిజ్య ప్రయోజనాలకు ప్రస్తుతం ఉన్న సవాళ్లు, దేశం విధించుకున్న లక్ష్యాల గురించి తెలుసుకోవాలి.

హైడ్రోజన్ ఇంధనం

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. అందుకే వాతావరణంలో పైకి చేరుతుంది. శుద్ధమైన స్థితిలో చాలా అరుదుగా ఉంటుంది. స్థిర ఉష్ణోగ్రత పీడనాల వద్ద రంగు, రుచి, వాసన లేని విషరహితమైన అలోహ స్థితిలో ఉంటుంది. ఈ ఇంధనాన్ని ఆక్సిజన్‌తో మండించినప్పుడు వెలువడే ఉద్గారాలు శూన్యం. రవాణా ఇంధనంగా హైడ్రోజన్ మార్కెట్ ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, దీన్ని ఫ్యూయెల్ సెల్స్ లేదా అంతర్గత దహన యంత్రాల్లో ఉపయోగించవచ్చు. ఇది అంతరిక్ష నౌకలో ఇంధనంగా కూడా వాడకంలో ఉంది.

గమనిక: హైడ్రోజన్‌ను సహజ వాయువు, జీవద్రవ్యరాశి, అణుశక్తితోపాటు పునరుత్పాదక వనరులైన సౌరశక్తి, పవనశక్తి నుంచి కూడా ఉత్పత్తి చేయవచ్చు.

లభ్యత: వాతావరణంలో అత్యంత సమృద్ధిగా ఉండే మూలకం హైడ్రోజన్. సూర్యుడు, ఇతర నక్షత్రాలు ఎక్కువగా హైడ్రోజన్‌తోనే నిండి ఉంటాయి. విశ్వంలోని 90% పరమాణువులు హైడ్రోజన్ పరమాణువులేనని ఖగోళ శాస్త్రవేత్తల అంచనా. ఇతర మూలకాల కంటే కూడా హైడ్రోజన్ మూలకం ఎక్కువ సమ్మేళనాల్లో భాగంగా ఉంటుంది. నీరు, హైడ్రోకార్బన్లు, ఇతర సేంద్రియ పదార్థాల్లో నిల్వ ఉంటుంది. హైడ్రోజన్‌ను అణుస్థాయిలో నిల్వ చేసే సౌకర్యం అందుబాటులో లేదు.

నిల్వ: పర్యావరణంలో హైడ్రోజన్ సమృద్ధిగా లభిస్తుంది. నీటిలో, హైడ్రోకార్బన్లలో, జీవద్రవ్యరాశిలో నిల్వ ఉంటుంది. హైడ్రోజన్‌ను భౌతికంగా ద్రవ లేదా వాయు స్థితిలో నిల్వ చేయవచ్చు. గ్యాస్‌గా నిల్వ చేయడానికి సాధారణంగా అధిక పీడన ట్యాంకులు అవసరం. ద్రవంగా నిల్వ చేయడానికి క్రయోజెనిక్ ఉష్ణోగ్రతలు కావాలి. ఎందుకంటే దీని మరిగే స్థానం -252.8 ^oC. * హైడ్రోజన్ ఇంధనాన్ని ఘన పదార్థాల ఉపరితలంపైన శోషణ ప్రక్రియను ఉపయోగించి, లేదా వాటిలోపల అభిశోషణ ప్రక్రియను ఉపయోగించి నిల్వ చేయవచ్చు.

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గించడంలో క్లీన్ హైడ్రోజన్ పరిశ్రమ సామర్థ్యం: హైడ్రోజన్ ఒక స్వచ్ఛమైన ఇంధనం. ఇంధన కణాల్లో దీన్ని వినియోగించినప్పుడు నీటిని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. అందుకే హైడ్రోజన్‌ను నేడు ప్రత్యామ్నాయ ఇంధనంగా పరిగణిస్తున్నారు. గ్యాసోలిన్ (పెట్రోలియం)తో నడిచే వాహనాల కంటే హైడ్రోజన్ వినియోగం మరింత ప్రభావవంతంగా ఉన్నట్లు గుర్తించారు. 1 కేజీ హైడ్రోజన్‌లో ఉన్న శక్తి = 2.8 కేజీల గ్యాసోలిన్ శక్తికి సమానం. FCEVలు ఇప్పుడు దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా స్థానికీకరించిన ప్రాంతాల్లో వినియోగదారుల మార్కెట్‌లో పరిమితంగా అందుబాటులో ఉన్నాయి.

* గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో హైడ్రోజన్‌ను సహజ వాయువు వ్యవస్థలో కలిపే భారతదేశపు తొలి ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం గ్రే హైడ్రోజన్‌ను కలుపుతుండగా, తర్వాత దీనిస్థానంలో గ్రీన్ హైడ్రోజన్‌ను చేరుస్తారు. ఇందౌర్‌లో హైడ్రోజన్ మిశ్రమ సహజ వాయువుని సీఎన్‌జీ వాహనాలకు, పైప్డ్ నేచురల్ గ్యాస్‌ను ఇళ్లలో వినియోగానికి సరఫరా చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్, గెయిల్ కంపెనీల ఉమ్మడి భాగస్వామ్య సంస్థ 'అవంతికా గ్యాస్ లిమిటెడ్' ద్వారా ఈ సరఫరా జరుగుతోంది.

వాణిజ్య స్థాయిలో హైడ్రోజన్ వినియోగానికి ఉన్న సవాళ్లు: 1) గ్రీన్ హైడ్రోజన్, బ్లూ హైడ్రోజన్ సంగ్రహణకు ఆర్థిక స్థిరత్వం అవసరం. అప్పుడే హైడ్రోజన్ ఇంధనాన్ని వాణిజ్య స్థాయిలో ఉపయోగించడానికి వీలవుతుంది. 2) కార్బన్ సంగ్రహం, స్టోరేజీ, హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ టెక్నాలజీ లాంటి హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగ సాంకేతికతలు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఇవి ఖరీదైనవి కావడంతో హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా ఉంటోంది. 3) ప్లాంటు పూర్తయిన తర్వాత ఇంధన కణాల నిర్వహణ ఖర్చులు దక్షిణ కొరియాలో మాదిరిగా ఖరీదైనవి కావచ్చు. 4) హైడ్రోజన్‌ను ఇంధనంగా, పరిశ్రమల్లో వాణిజ్యపరంగా ఉపయోగించాలంటే అలాంటి సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)లో, హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా, డిమాండ్ సృష్టికి తగిన మౌలిక సదుపాయాల కల్పనకు భారీ పెట్టుబడులు అవసరం.

గ్రీన్ హైడ్రోజన్: నీటిని విద్యుత్తు విశ్లేషణకు గురిచేసి గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఈ ప్రక్రియలో నీటిఅణువు.. హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విభజన చెందుతుంది. అంటే ఇందులో ఉపఉత్పన్నంగా వాతావరణంలోకి ఆక్సిజన్ విడుదలవుతుంది. ఈ ప్రక్రియను పవన విద్యుత్తు లేదా సౌర విద్యుత్తుతో నిర్వహిస్తారు. ఫలితంగా కార్బన్‌డయాక్సైడ్ విడుదల జరగదు. అందుకే ఈ ఎంపిక శుద్ధమైనది.

* ప్రస్తుతం వాడుకలో ఉన్న హైడ్రోజన్‌ను రసాయన ప్రక్రియల ద్వారా శిలాజ ఇంధనాలు, బయోమాస్‌ను ఉపయోగించి ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో వాతావరణంలోకి ఎలాంటి కర్బన ఉద్గారాలు విడుదల కావు.

గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం: గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపుపై 'ఉద్దేశిత జాతీయ నిర్ణాయక భాగస్వామ్యం' (INDC) లక్ష్యాలను సాధించేందుకు గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగపడుతుంది. ఈ ఇంధనాన్ని రైల్వేలు, పెద్ద ఓడలు, బస్సులు లేదా ట్రక్కులు లాంటివాటిలో ఉపయోగించవచ్చు. అలాగే గ్రీన్ హైడ్రోజన్‌ను 10% వరకు ఇంధన సరఫరాలో కలపడం ద్వారా విస్తృత ఆమోదం పొందవచ్చు.

గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగించడం వల్ల ప్రయోజనం: * ఇది స్వచ్ఛ దహన పరమాణువు. ఇనుము- ఉక్కు పరిశ్రమ, రసాయన పరిశ్రమలు, రవాణా సహా అనేక రంగాలను కర్బన ఉద్గార రహితం చేయగలుగుతుంది. * గ్రిడ్ ద్వారా నిల్వ చేయలేని లేదా ఉపయోగించలేని పునరుత్పాదక శక్తిని హైడ్రోజన్ ఉత్పత్తి కోసం మళ్లించవచ్చు.

మిషన్ 2030 లక్ష్యాలు: * 'భారత్ నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' ప్రకారం దేశంలో 2030 నాటికి దాదాపు 125 GW అనుబంధ పునరుత్పాదక శక్తి సామర్థ్యంతో పాటు సంవత్సరానికి కనీసం 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం.
* ఈ రంగంలో మొత్తం రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 6 లక్షల ఉద్యోగాల కల్పించడం.
* శిలాజ ఇంధన దిగుమతుల వ్యయాన్ని రూ.లక్ష కోట్లు మేర తగ్గించడం. * దాదాపు 5 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపు.

హైడ్రోజన్ రకాలు: ఉత్పత్తి ప్రక్రియ ఆధారంగా హైడ్రోజన్‌ను గ్రీన్ హైడ్రోజన్, పింక్ హైడ్రోజన్, బ్లూ హైడ్రోజన్, గ్రే హైడ్రోజన్, ఎల్లో హైడ్రోజన్‌లుగా వర్గీకరించవచ్చు.

పింక్ హైడ్రోజన్: గ్రీన్ హైడ్రోజన్ మాదిరిగానే పింక్ హైడ్రోజన్ కూడా విద్యుద్విశ్లేషణతో నీటిని విభజించడంతో తయారవుతుంది. అయితే ఇందులో అణుశక్తిని శక్తి వనరుగా ఉపయోగిస్తారు.

బ్లూ హైడ్రోజన్: స్టీమ్ మీథేన్ రీఫార్మింగ్ లేదా ఆటోథర్మల్ రిఫార్మింగ్ ద్వారా సహజవాయువును విభజిస్తే హైడ్రోజన్, CO_2 ఏర్పడతాయి. ఇలా ఏర్పడిన CO_2ని కూడా సంగ్రహించి నిల్వ చేస్తారు.
నోట్: సహజవాయువులో అత్యధికంగా మీథేన్ ఉంటుంది.

గ్రే హైడ్రోజన్: ఈ ప్రక్రియ దాదాపు బ్లూ హైడ్రోజన్ మాదిరిగానే సహజ వాయువును హైడ్రోజన్, CO_2గా విభజించడానికి ఉపయోగిస్తారు. కానీ CO_2 సంగ్రహణతోపాటు వాతావరణంలోకి విడుదలవుతుంది. ఈ విధానం చాలా ఏళ్లుగా ఆచరణలో ఉంది.


ఎల్లో హైడ్రోజన్: గ్రీన్ హైడ్రోజన్ మాదిరిగానే నీటిని విద్యుత్తు విశ్లేషణ చేసి ఎల్లో హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. అయితే ఇందులో పూర్తిగా సౌర విద్యుత్తును వినియోగిస్తారు.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

డీఎస్సీ - 2024 చరిత్ర

'ఇక చండపాలన లేదు.. అంతా ధర్మపాలనే!'


కళింగ యుద్ధం ఊహాచిత్రం

ప్రాచీన భారతదేశాన్ని పాలించిన రాజవంశాల్లో మౌర్యులు, గుప్తులు శిఖర సమానులుగా నిలిచారు. సువిశాల ప్రాంతాన్ని ఏకం చేసి, ఒకే అధికారం కిందకు తీసుకురావడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మనుగడ, విస్తరణకు పటిష్ఠ పునాదులు వేశారు. సాహిత్యం, శాస్త్ర విజ్ఞానాలను తర్వాతి తరాలకు అందించారు. వీరి కాలంలో సాగిన పాలన, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, న్యాయవ్యవస్థ నిర్మాణం, శాంతిభద్రతల పరిరక్షణ తీరు, నాటి విశేషాలను పరిశోధించి గ్రంథస్థం చేసిన చరిత్రకారులు, ఆ రచనల్లోని కీలకాంశాలు పరీక్షార్థులకు తెలియాలి. మౌర్యులు, గుప్తుల వంశక్రమం, గొప్ప పాలకులు, వారి ప్రతిభాపాటవాలు, విజయాలు, ఆదర్శాలతో పాటు కుషాణులు, హూణులు మొదలైన విదేశీ పాలకుల గురించి తగిన అవగాహన కలిగి ఉండాలి.

ప్రాచీన భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు (క్రీ.పూ.3 నుంచి క్రీ.శ. 7 వరకు)

1. పిప్పలి వనంలో మౌర్యులు అనే క్షత్రియ తెగ ఉండేదని ఏ గ్రంథంలో ఉంది?
   1) మహావంశం 2) దిగనికాయ 3) మజ్జిమనికాయ 4) అంగుత్తనికాయ
2. చంద్రగుప్తుడు రాజైన సంవత్సరం, ఆ సమయంలో అతడి వయసు వరుసగా?
   1) క్రీ.శ.321 - 25 సంవత్సరాలు
   2) క్రీ.పూ.321 - 29 సంవత్సరాలు
   3) క్రీ.పూ.321 - 25 సంవత్సరాలు
   4) క్రీ.శ.321 - 29 సంవత్సరాలు
3. నిశ్చితం (ఎ): చంద్రగుప్తుడు 500 ఏనుగులను గ్రీకు యోధుడైన సెల్యూకాస్ నికేటర్‌కు బహుమానంగా ఇచ్చాడు.
   కారణం (ఆర్): క్రీ.పూ.305లో చంద్రగుప్తుడిని నికేటర్ యుద్ధంలో ఓడించినందు వల్ల.
   1) ఎ కు ఆర్ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ లు రెండూ సరైనవి. కానీ, ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ, ఆర్ లు రెండూ సరికావు
4. కిందివాటిలో చంద్రగుప్తుడు ఆదరించిన మతం?
   1) బౌద్ధ 2) జైన 3) హిందూ 4) అజీవక
5. కిందివాటిలో చంద్రగుప్తుడు మరణించిన ప్రాంతం?
   1) గయ 2) పాటలీపుత్రం 3) శ్రావణబెళగొళ 4) వైశాలి
6. అమిత్రఘాత లేదా శత్రుసంహారకుడు (శత్రు సంహారకుడు) లేదా అమిత్రో ఖేట్స్ అనే బిరుదు పొందిన మగధ చక్రవర్తి?
   1) చంద్రగుప్తుడు 2) బిందుసారుడు 3) బింబిసారుడు 4) అజాతశత్రువు
7. 'దేవానాంప్రియ, ప్రియదర్శి' అనే బిరుదులున్న మగధ సామ్రాజ్య రాజు?
   1) కనిష్కుడు 2) అశోకుడు 3) మహాపద్మనందుడు 4) బిందుసారుడు
8. అశోకుడు ఏ సంవత్సరంలో కళింగ యుద్ధం చేశాడు?
   1) క్రీ.శ. 261 2) క్రీ.పూ. 261 3) క్రీ.పూ. 621 4) క్రీ.శ. 621
9. 'నేను మారతాను ఇక నేను చండ పరిపాలకుడిగా కాకుండా ధర్మ పరిపాలకుడిగా ఉంటాను..' అని అన్నదెవరు?
   1) కనిష్కుడు 2) నెపోలియన్ 3) పురుషోత్తముడు 4) అశోకుడు
10. అశోకుడి కళింగ యుద్ధం వివరాలు ఉన్న శాసనం?
    1) 11వ శిలాశాసనం 2) 12వ శిలాశాసనం 3) 13వ శిలాశాసనం 4) 15వ శిలాశాసనం
11. 'అశోకుడి జీవితంలో కళింగ యుద్ధం ఒక మలుపు' అని అన్న చరిత్రకారుడు?
    1) రాయ్‌చౌదరి 2) నీలకంఠశాస్త్రి 3) రోమిల్లా థాపర్ 4) ఆర్.డి.బెనర్జీ
12. మగధ సామ్రాజ్యంలో చివరి మౌర్యవంశపు రాజు?
    1) దశరథుడు 2) కునాలుడు 3) బృహద్రదుడు 4) నహపాలుడు
13. ఉత్తర భారతదేశంలో మౌర్యవంశం తర్వాత పరిపాలనకు వచ్చిన వంశం?
    1) నంద వంశం 2) కుషాణ వంశం 3) శుంగ వంశం 4) శిశునాగ వంశం
14. కుషాణులు మధ్య ఆసియాలోని ఏ తెగవారు?
    1) పార్థియన్ 2) తైమూర్ 3) యూచీ 4) శక
15. కుషాణుల రాజు కనిష్కుడు శక యుగాన్ని ఎప్పుడు ప్రారంభించాడు?
    1) క్రీ.శ.87 2) క్రీ.శ.78 3) క్రీ.శ.68 4) క్రీ.శ.79
16. మొదటి చంద్రగుప్తుడి బిరుదు?
    1) మహారాజాధిరాజ 2) రాజ 3) చక్రవర్తి 4) మహారాజు
17. సముద్రగుప్తుడి రాజ్యాభిషేకం గురించి వివరణ ఇచ్చే శాసనం?
    1) అలహాబాదు ప్రశస్తి 2) ఉత్తర మోరూర్ 3) ఐహోలు శాసనం 4) 14వ శిలాశాసనం
18. అశ్వమేధ యాగం నిర్వహించిన గుప్త చక్రవర్తి?
    1) చంద్రగుప్తుడు 2) 2వ చంద్రగుప్తుడు 3) సముద్రగుప్తుడు 4) నాగగుప్తుడు
19. సముద్రగుప్తుడి మరణం తరువాత తన సోదరుడు అయిన రామగుప్తుడిని వధించి సింహాసనం అధిష్టించినవారు?
    1) మొదటి విక్రమాదిత్యుడు
    2) 2వ సముద్రగుప్తుడు 3) బుధగుప్తుడు
    4) 2వ చంద్రగుప్త విక్రమాదిత్యుడు
20. గుప్త వంశ రాజులను వరుసలో అమర్చండి.
    ఎ) సముద్రగుప్తుడు
    బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
    సి) కుమారగుప్తుడు డి) స్కంధగుప్తుడు
    1) ఎ, బి, సి, డి 2) బి, ఎ, డి, సి 3) బి, ఎ, సి, డి 4) డి, బి, ఎ, సి
21. కిందివారిలో ఏ రాజు మరణం తరువాత గుప్తవంశ పాలన అంతమైంది?
    1) స్కంధగుప్తుడు 2) బుధగుప్తుడు 3) 1వ చంద్రగుప్తుడు 4) సముద్రగుప్తుడు
22. గుప్తవంశంలో చివరి పాలకుడు?
    1) స్కంధగుప్తుడు 2) విష్ణుగుప్తుడు 3) కుమారగుప్తుడు 4) బుదగుప్తుడు
23. పుష్యభూతి వంశ ప్రారంభకుడు?
    1) హర్షవర్ధనుడు 2) ప్రభాకర వర్ధనుడు 3) విష్ణువర్ధనుడు 4) చంద్రవర్ధనుడు
24. హూణులు అనే హరిణాలకు సింహం లాంటివాడు?
    1) హర్షవర్ధనుడు 2) ప్రభాకర వర్ధనుడు
    3) రాజ్యవర్ధనుడు
    4) విష్ణువర్ధనుడు
25. కిందివాటిలో చైనా యాత్రికుడైన ఫాహియాన్‌కు సంబంధించి సరైనవి.
    ఎ) ఇతడు చంద్రగుప్త విక్రమాదిత్యుడి కాలంలో భారత్‌కు వచ్చాడు.
    బి) క్రీ.శ. 405లో భూమార్గం ద్వారా భారత్‌కు వచ్చాడు.
    సి) గుప్తుల పరిపాలన ఇతడి రచన ద్వారా తెలుసుకోవచ్చు.
    డి) ఇతడు రాసిన గ్రంథం ఫు-కువో-కి
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి మాత్రమే 3) సి మాత్రమే 4) ఏదీకాదు
26. 'శిలాదిత్య' అనే బిరుదు పొందిన పుష్యభూతి వంశపు రాజు ఎవరు?
    1) ప్రభాకర వర్ధనుడు 2) హర్షవర్ధనుడు 3) రాజ్యవర్ధనుడు 4) విష్ణువర్ధనుడు
27. పరమ భట్టారక అనే బిరుదు పొందిన పుష్యభూతి వంశపు రాజు?
    1) ప్రభాకర వర్ధనుడు 2) హర్షవర్ధనుడు 3) రాజ్యవర్ధనుడు 4) విష్ణువర్ధనుడు
28. హుయాన్‌త్సాంగ్ - ఏ రాజుల మధ్య యుద్ధ సన్నాహాలను వివరించాడు?
    1) 2వ పులకేశి - హర్షుడు
    2) హర్షుడు - శశాంకుడు
    3) 2వ పులకేశి - ప్రభాకర వర్ధనుడు
    4) హర్షుడు - గౌడరాజు
29. కౌటిల్యుడు అర్థ శాస్త్రంలో వివరించిన రాజు లక్షణాల్లో సరైనవి గుర్తించండి.
    ఎ) రాజు ఒక నిరంకుశ చక్రవర్తి
    బి) రాజు ఉన్నత స్వభావం, సున్నిత దృష్టి కలిగి ఉండాలి.
    సి) సత్య, ధైర్య, ధర్మ వ్యవహారాలు నిష్టతో వ్యవహరించాలి.
    డి) ఇతర రాజ్యాల ఆక్రమణ చేయరాదు.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, డి 4) ఎ మాత్రమే
30. "మంత్రి పరిషత్ రాజు శకటంలో చక్రం లాంటిది" అన్నవారు?
    1) మెగస్తనీస్ 2) చాణక్యుడు 3) విశాఖదత్తుడు 4) అశోకుడు
31. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలోని మంత్రివర్గ సభ్యుల సంఖ్య?
    1) 16 2) 17 3) 18 4) 19
32. "మౌర్య సామ్రాజ్యంలో అనేక పరిపాలనా శాఖలుండేవి. ప్రతి శాఖకు సంబంధిత అధికారులు ఉండేవారు." అని అన్నదెవరు?
    1) వి.ఎ.స్మిత్ 2) ఆర్.డి.బెనర్జీ 3) ఎస్.ఎన్.బెనర్జీ 4) ఎస్.జె.మార్షల్
33. చంద్రగుప్త మౌర్యుడి పరిపాలనా కాలంలో 30 మంది సభ్యులున్న కూటమిని ఎన్ని శాఖలుగా విభజించారు?
    1) 7 2) 6 3) 8 4) 10
34. కిందివాటిలో చంద్రగుప్త మౌర్యుడి పరిపాలనా శాఖలో లేనిది?
    1) పరిశ్రమలు, విదేశీ వ్యవహారాలు
    2) జనాభా వివరాలు
    3) పన్నులు, కొలతలు, తూనికలు
    4) విద్య, వైద్య శాఖలు
35. మౌర్య సామ్రాజ్యంలోని పరిపాలనలో ప్రతి జిల్లాను 4 భాగాలుగా విభజించారు. ఒక్కో విభాగానికి అధిపతి?
    1) గ్రామణి 2) స్థానికుడు 3) నగర అధ్యక్షుడు 4) నాగరికుడు
36. మౌర్యుల పరిపాలనా కాలంలో 10 గ్రామాలకు అధిపతిని ఏమని పిలిచేవారు?
    1) గ్రామణి 2) గోపుడు 3) గహపతి 4) నాయకుడు
37. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.
    ఎ) ధర్మ స్థేయ - సివిల్ న్యాయస్థానం - న్యాయమూర్తి - వ్యవహారిక
    బి) కంటక శోధన - క్రిమినల్ న్యాయస్థానం - న్యాయమూర్తి - ప్రదేష్ట
    సి) నగర న్యాయమూర్తులు - మహామాత్రులు
    డి) జిల్లా న్యాయమూర్తులు - రజుకలు
    1) సి, డి 2) బి మాత్రమే 3) ఎ, డి 4) పైవన్నీ
38. "ఆరు లక్షల జనాభా ఉన్న పాటలీపుత్రంలో సరాసరి దొంగతనాలు రోజుకు ఎనిమిదికి దాటలేదు" అని అన్నది?
    1) ఆర్.డి.శర్మ 2) చంద్రగుప్తుడు 3) చాణక్యుడు 4) మెగస్తనీస్
39. "చాలా కఠిన శిక్షాస్మృతి అమలుతో ఆస్తిపాస్తుల రక్షణ సాధించారు" అని అన్నది?
    1) వి.ఎ.స్మిత్ 2) నీలకంఠ శాస్త్రి 3) ఆర్.బి.చౌదరి 4) ఆనందశాస్త్రి
40. కిందివాటిలో కౌటిల్యుడి అర్థ శాస్త్రం ప్రకారం మౌర్యుల గూఢచారి వ్యవస్థకు సంబంధించి సరైంది?
    ఎ) సంతల్ - కొన్ని ప్రదేశాల్లో నియమించేవారు
    బి) సంచారా - ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి రహస్యంగా తిరిగేవారు
    సి) గూఢచారులు - సంచార జాతులుగా ఉండేవారు
    డి) దూతలు - రాజు నుంచి సమాచారం తెచ్చేవారు
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, డి 3) బి, సి, డి 4) ఎ, సి, డి
41. అశోకుడు నియమించిన ధర్మమహామాత్రులను గురించి తెలిపే శాసనం?
    1) 14వ 2) 13వ 3) 12వ 4) 11వ



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-3; 2-3; 3-3; 4-2; 5-3; 6-2; 7-2; 8-2; 9-4; 10-3;11-1; 12-3; 13-3; 14-3; 15-2; 16-1; 17-1; 18-3; 19-4; 20-1; 21-1; 22-1; 23-2; 24-2; 25-1; 26-2; 27-1; 28-1; 29-2; 30-2; 31-3; 32-1; 33-2; 34-4; 35-2; 36-2; 37-4; 38-4; 39-1; 40-1; 41-2.

విసర్జన వ్యవస్థలో అదొక రిజర్వాయర్!

శరీరం సమతాస్థితి నిర్వహణలో విసర్జన వ్యవస్థ చాలా ముఖ్యమైంది. ఇది వ్యర్థాలను తొలగించడమే కాకుండా రక్తపోటు, ఎలక్ట్రోలైట్‌లు, మొత్తం ద్రవ సమతౌల్యతను నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. పరీక్షల్లో జనరల్ సైన్స్ విభాగంలో విసర్జన వ్యవస్థ ముఖ్యమైన అంశం. ఈ వ్యవస్థ నిర్మాణం, విధులు, ప్రక్రియ అస్తవ్యస్తమైతే సంభవించే ఆరోగ్య సమస్యలు తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

విసర్జన వ్యవస్థ

విసర్జన వ్యవస్థ మానవ శరీరంలో ముఖ్యమైన వ్యవస్థ. ఈ వ్యవస్థనే మూత్ర వ్యవస్థ అని కూడా పిలుస్తారు. ఈ ప్రక్రియలో శరీరం నుంచి వ్యర్థ పదార్థాల తొలగింపు జరుగుతుంది. అంతేకాకుండా నీరు, లవణాల (ఎలక్ట్రోలైట్స్) సమతౌల్యత నియంత్రణకు, ఆమ్ల - క్షార సమతౌల్యత నిర్వహణకు ఈ ప్రక్రియ బాధ్యత వహిస్తుంది.

విసర్జన వ్యవస్థ ప్రధాన భాగాలు

మూత్రపిండాలు

నిర్మాణం: వెన్నుపూసకు ఇరువైపులా పక్కటెముకల కింద ఉండే కిడ్నీలు లేదా మూత్రపిండాలను విసర్జన అవయవాలు అంటారు.

✦ ఇవి చిక్కుడు గింజల ఆకారంలో ఉంటాయి. ప్రతి మూత్రపిండంలో నెఫ్రాన్స్ లేదా మూత్ర కేశనాళికలు అని పిలిచే వడకట్టే ప్రమాణాలు లేదా ఫిల్టరింగ్ యూనిట్లు మిలియన్ సంఖ్యలో ఉంటాయి.

విధి: మూత్రపిండాల ప్రాథమిక పని రక్తాన్ని వడకట్టడం, వ్యర్థ పదార్థాలను తొలగించడం, మూత్రాన్ని ఉత్పత్తి చేయడం.

✦ ఇవి రక్తపోటు, ఎలక్ట్రోలైట్ స్థాయులు, pH సమతౌల్యతను నియంత్రిస్తాయి.

మూత్రనాళాలు

నిర్మాణం: ఇవి మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి మూత్రాన్ని రవాణా చేసే సన్నని గొట్టాలు.

విధి: మూత్రం పెరిస్టాలిక్ కదలికల ద్వారా మూత్ర నాళాల ద్వారా ముందుకు సాగుతుంది. పెరిస్టాలిక్ కదలికలు తరంగాల లాంటి కండరాల సంకోచాలు.

మూత్రాశయం

నిర్మాణం: మూత్రాశయం అనే నిర్మాణం మూత్రాన్ని నిల్వ చేయడానికి విస్తరించగల కండరాల సంచి.

విధి: ఇది మూత్రం శరీరం నుంచి బయటకు వెళ్లే వరకు దాని నిల్వ కోసం ఒక రిజర్వాయర్‌గా పనిచేస్తుంది.

మూత్రనాళం

నిర్మాణం: మూత్రనాళం అనేది మూత్రాశయం నుంచి శరీరం వెలుపలికి మూత్రాన్ని తీసుకెళ్లే గొట్టం.

విధి: ఇది మగవారిలో స్పెర్మ్ (వీర్యం) కోసం ఒక మార్గంగా కూడా పనిచేస్తుంది. స్త్రీ, పురుషుల్లో మూత్రనాళం పొడవు, నిర్మాణం మారుతూ ఉంటాయి.

విసర్జన వ్యవస్థ, విధులు

రక్తం వడపోత: మూత్రపిండాలు రక్తం నుంచి వ్యర్థపదార్థాలు, టాక్సిన్లు, ఇతర పదార్థాలను ఫిల్టర్ చేస్తాయి.

● ప్రతి నెఫ్రాన్‌లోని కేశనాళికల జాలక నిర్మాణం అయిన గ్లోమెరులస్ ఈ ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది.

పునశ్శోషణం: ఫిల్ట్రేట్ మూత్రపిండ గొట్టాల నుంచి వెళ్తున్నప్పుడు గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, కొన్ని అయాన్ల లాంటి ముఖ్యమైన పదార్థాలు తిరిగి రక్తప్రవాహంలోకి వెళ్తాయి. శరీరంలో అవసరమైన స్థాయులను నిర్వహిస్తాయి.

స్రావం: మూత్రపిండాలు అదనపు వ్యర్థ ఉత్పత్తులను, అయాన్లను మూత్రంలోకి స్రవిస్తాయి. ఇందులో హైడ్రోజన్ అయాన్లు, పొటాషియం మొదలైనవి ఉంటాయి.

నీరు, ఎలక్ట్రోలైట్ల నియంత్రణ: విసర్జన వ్యవస్థ నీరు గ్రహించే స్థాయులు, ఆహారం తీసుకోవడం ఆధారంగా శరీరంలో నీరు, ఎలక్ట్రోలైట్ల పరిమాణాన్ని సర్దుబాటు చేస్తుంది.

● ఈ నియంత్రణలో యాంటీడియురేటిక్ హార్మోన్ (ADH), ఆల్డోస్టెరాన్ కీలకపాత్ర పోషిస్తాయి.

ఆమ్ల–క్షార సమతౌల్యత: మూత్రపిండాలు హైడ్రోజన్ అయాన్లను విసర్జించడం ద్వారా మూత్రం నుంచి బైకార్బోనేట్‌ను తిరిగి పీల్చుకోవడం ద్వారా శరీరం pHని క్రమపర్చడానికి సహాయపడతాయి.

నియంత్రణ వ్యవస్థ, హార్మోన్ల నియంత్రణ

రెనిన్ – యాంజియోటెన్సిన్ – ఆల్డోస్టెరాన్ సిస్టమ్ (RAAS): ఈ వ్యవస్థ రక్తపోటు, ద్రవ సమతౌల్యతను నియంత్రించడంలో సహాయపడుతుంది. రక్తపోటు తగ్గినప్పుడు, మూత్రపిండాలు రెనిన్‌ను విడుదల చేస్తాయి. ఇది రక్తపోటు, రక్తపరిమాణాన్ని పెంచే చర్యకు దారితీస్తుంది.

యాంటీడియురేటిక్ హార్మోన్ (ADH): పృష్ఠ పిట్యూటరీ గ్రంథి ద్వారా విడుదలైన ADH మూత్రపిండాల్లో నీటి పునశ్శోషణాన్ని పెంచుతుంది. మూత్ర ఉత్పత్తిని తగ్గిస్తుంది. మూత్ర గాఢతను పెంచుతుంది.


సాధారణ రుగ్మతలు

యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్‌లు (UTIs): మూత్ర వ్యవస్థలోని ఏదైనా భాగాన్ని ప్రభావితం చేసే ఇన్ఫెక్షన్‌లు మూత్రవిసర్జన సమయంలో మంట, తరచుగా మూత్ర విసర్జనకు ప్రేరేపించడం లాంటి లక్షణాలకు దారితీస్తాయి.

కిడ్నీలో రాళ్లు: ఖనిజాలు, లవణాల నుంచి ఏర్పడిన గట్టి అవక్షేపాలు మూత్రనాళంలో తీవ్రమైన నొప్పి, అడ్డంకిని కలిగిస్తాయి.

క్రానిక్ కిడ్నీ డిసీజ్ (CKD): కాలక్రమేణా మూత్రపిండాల పనితీరు మందగించడం, తరచుగా మధుమేహం, అధిక రక్తపోటుకు సంబంధించిన పరిస్థితుల్లో వస్తుంది.

గ్లోమెరులోనెఫ్రిటిస్: మూత్రపిండాల పనితీరును దెబ్బతీసే గ్లోమెరులర్ వాపు కలుగుతుంది.





రచయిత
కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

మూత్రం ఏర్పడే ప్రక్రియ

వడపోత, పునశ్శోషణం, స్రావం ప్రక్రియ ద్వారా మూత్రపిండాలలో మూత్రం ఉత్పత్తి అవుతుంది.

గ్లోమెరులర్ వడపోత: రక్తం నెఫ్రాన్‌లోని కేశనాళికల బాల్ అయిన గ్లోమెరులస్‌లోకి ప్రవేశిస్తుంది.

▌ యూరియా, అదనపు నీరు లాంటి వ్యర్థ ఉత్పత్తులను తొలగించడానికి ఫిల్టర్ అవుతుంది. ఈ ప్రక్రియ నిష్క్రియమైంది అంటే దీనికి శక్తి అవసరం లేదు.

నాళికా పునశ్శోషణం: గ్లోమెరులస్ ప్రాక్సిమల్ ట్యూబుల్స్‌లో కీలకమైన అణువులు, అయాన్లు, నీరు తిరిగి చేరతాయి.

నాళికా స్రావం: మందులు, క్రియాటినిన్, యూరియా లాంటి పదార్థాలు సేకరించే వాహిక ద్వారా, శరీరం నుంచి మూత్రంగా స్రవిస్తాయి.

▌ మూత్రం ఉత్పత్తి అయిన తర్వాత అది నిల్వ కోసం మూత్రాశయానికి మూత్రనాళాల ద్వారా ప్రయాణిస్తుంది. మూత్రాశయం సంకోచిస్తుంది. మూత్ర విసర్జన సమయంలో మూత్రనాళ స్పింకర్లు విశ్రాంతి తీసుకుంటాయి. దీన్ని మిక్చురిషన్ అంటారు

▌ ఒక రోజులో ఉత్పత్తి అయ్యే మూత్రం సాధారణ పరిమాణం 800 - 2000 మిల్లీలీటర్ల మధ్య ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. మూత్ర ఉత్పత్తికి బాధ్యత వహించే ప్రాథమిక అవయవం ఏది?
   1) కాలేయం 2) కిడ్నీ, మూత్రపిండాలు
   3) మూత్రాశయం 4) యురేటర్
2. కింది వాటిలో విసర్జన వ్యవస్థ విధి కానిదేది?
   1) రక్తపోటు నియంత్రణ
   2) వ్యర్థ ఉత్పత్తుల తొలగింపు
   3) హార్మోన్ ఉత్పత్తి 4) జీర్ణక్రియ
3. కిడ్నీ క్రియాత్మక యూనిట్ ఏమిటి?
   1) న్యూరాన్ 2) నెఫ్రాన్
   3) అల్వియోలస్ 4) గ్లోమెరులస్
4. ఏ పదార్థం ప్రధానంగా మూత్రపిండాల ద్వారా విసర్జితమవుతుంది?
   1) గ్లూకోజ్ 2) యూరియా
   3) అమైనో ఆమ్లాలు
   4) ప్రోటీన్లు
5. నెఫ్రాన్‌లోని ఏ భాగం రక్తం వడపోతకు బాధ్యత వహిస్తుంది?
   1) హెన్లీ లూప్ 2) బౌమన్ క్యాప్సూల్
   3) ప్రాక్సిమల్ మెలికలు తిరిగిన గొట్టం
   4) దూర మెలికలు తిరిగిన గొట్టం
6. శరీరంలో నీటి సమతౌల్యతను నియంత్రించే హార్మోన్?
   1) ఇన్సులిన్ 2) ఆల్డోస్టెరాన్
   3) యాంటీడియురేటిక్ హార్మోన్ 4) కార్టిసాల్
7. ప్రోటీన్ జీవక్రియ ప్రధాన వ్యర్థ ఉత్పత్తి ఏది?
   1) క్రియాటినిన్ 2) యూరియా
   3) అమ్మోనియా 4) యూరిక్ యాసిడ్
8. మూత్రపిండాలు శరీరంలోని ఏ భాగంలో ఉంటాయి?
   1) థొరాసిక్ కుహరం 2) పెల్విక్ కుహరం
   3) ఉదర కుహరం 4) కపాల కుహరం
9. ఏ నిర్మాణం మూత్రపిండం నుంచి మూత్రాశయం వరకు మూత్రాన్ని తీసుకువెళ్తుంది?
   1) మూత్రనాళం 2) యురేటర్
   3) మూత్రపిండ కుడ్యం 4) నెఫ్రాన్
10. మూత్రంలో ప్రోటీన్ ఉండటం ద్వారా ఏ పరిస్థితి కలిగినట్లు చెప్పవచ్చు?
    1) హెమటూరియా 2) ప్రొటీనురియా
    3) గ్లైకోసూరియా 4) ఒలిగురియా
11. సాధారణంగా ఒక రోజులో ఉత్పత్తి అయ్యే మూత్రం పరిమాణం ఎంత?
    1) 800 - 2000 మిల్లీలీటర్లు 2) 200 - 400 మిల్లీలీటర్లు
    3) 700 - 3000 మిల్లీలీటర్లు 4) 800 - 1000 మిల్లీలీటర్లు
12. మూత్రపిండాలకు అనుబంధంగా ఉండే గ్రంథి?
    1) ఎడ్రినల్ గ్రంథి 2) పిట్యూటరీ
    3) కాలేయం 4) క్లోమం
13. మూత్రపిండాలు పాడైన సమయాల్లో రోగికి చేయాల్సిన చికిత్స?
    1) వాక్సినేషన్ 2) సీపీఆర్
    3) ఈసీజీ 4) డయాలసిస్

సమాధానాలు

1-2, 2-4, 3-2, 4-2, 5-2, 6-3, 7-2, 8-3, 9-2, 10-2, 11-1, 12-1, 13-4.

437 Word of the Day

Knee-jerk

Telugu meaning: స్వభావసిద్ధంగా, అసంకల్పిత

English meaning: The word knee-jerk is an adjective that describes a quick, automatic reaction made without thinking carefully.

Synonyms: Instinctive, Reflexive

Antonyms: Deliberate, Thoughtful

Usage: 1. Her knee-jerk response to criticism often made things worse rather than resolving the issue.

2. The manager's knee-jerk reaction to the problem led to an even bigger misunderstanding.

నోటిఫికేషన్స్

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సులు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ - 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు రుసుము రూ.2500. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 14 అక్టోబరు 2024.

అప్రెంటిస్ పోస్టులు

ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ (ఐఆర్ఈఎల్), తమిళనాడు అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీల సంఖ్య 38. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 17 అక్టోబరు 2024.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 11) ఆఖరు తేదీ

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) - 2025. ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యుమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు.

ఎంటీపీఎఫ్‌లో 84 టెక్నీషియన్ పోస్టులు. సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్-2025). నిర్దేశిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



బ్యాంకులు లేదా వ్యక్తుల నుంచి అవసరానికి డబ్బు అప్పుగా తీసుకోవడం సర్వసాధారణం. అప్పు తీసుకున్న కాలానికి వడ్డీ లెక్కించేటప్పుడు అసలు విలువ మారకుండా ఉంటే దాన్ని బారువడ్డీగా పేర్కొంటారు. అంటే ఇందులో అసలును స్థిరంగా ఉంచి, దానిపై మాత్రమే వడ్డీ లెక్కిస్తారు. దీన్నే సరళ వడ్డీ, సాధారణ వడ్డీ అని కూడా అంటారు.

☛ ఈ వీడియోలో నిత్య జీవితంలో బారువడ్డీ ఉపయోగాలు, పోటీపరీక్షల్లో ఈ అంశంపై ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, బేసిక్ ఫార్ములాలు, సంక్షిప్త పద్ధతిలో తక్కువ సమయంలో సమాధానం ఎలా రాబట్టాలి అనే విషయాలను వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

Miss Universe India 2024 title winner?

Current Affairs

1. Which of the following persons has been elected as the new president of the Indian Newspaper Society?
   A) MV Shreyams Kumar B) Rakesh Sharma
   C) Preetesh D) Shreyas Iyer
2. What is the full form of ICC in sports?
   A) International Count Council
   B) International Cricket Council
   C) International Carrier Council
   D) International Complete Council
3. India's foreign exchange reserves have surged to $ .... billion in 2024
   A) 100.9 B) 515.7 C) 202.3 D) 704.89
4. What is the full form of GREEN scheme launched by Conrad K Sangma, Meghalaya Chief Minister?
   A) Grassroot level Response Towards Ecosystem Enhancement and Nurturing
   B) Grassroot level Response Towards Era Enhancement and Nurturing
   C) Gasroot level Response Towards Ecosystem Enhancement and Nurturing
   D) Grassroot laid Response Towards Ecosystem Enhancement and Nurturing
5. World Cerebral Palsy Day is observed on which of the following days?
   A) June 6 B) March 6
   C) October 6 D) November 6
6. NASA'S .... mission launched on September 28, 2024, sending astronauts Nick Hague and Aleksandr Gorbunov to the ISS for a five-month scientific expedition.
   A) SpaceX Crew-8 B) SpaceX Crew-1
   C) SpaceX Crew-3 D) SpaceX Crew-9
7. The Book Titled 'Sri Rama in Tamilagam – An inseparable bond' Released by which of the following persons?
   A) Karunakar B) R.N. Ravi
   C) Rakesh D) Virat Kumar
8. Which of the following persons wins Miss Universe India 2024 title?
   A) Rhea Singha B) Lara Sharif
   C) Riya Sharma D) Deepika Singh

History

9. Which of the following kings was also known as Amitrochates or Amitraghata meaning Slayer of all enemies?
   A) Chandra Gupta Maurya B) Bindusara
   C) Ashoka D) Akbar
10. Ashvaghosha was the court poet of king .....
    A) Kanishka B) Ashoka
    C) Bindusara D) Harshavardhana


SSC Exams Special

General Awareness

11. Tipu Sultan succeeded his father Hyder Ali as the Ruler of Mysore in which year?
    A) 1795 B) 1782 C) 1792 D) 1785
12. Zakat tax was abolished by which of the following rulers?
    A) Qutbuddin Aibak B) Firoz Shah Tughlaq
    C) Sikander Lodi D) Razia Sultana

General Science

13. Who recognized hydrogen and named it and observed that air contains more than one gas?
    A) Carl Wieman B) Antonie Lavoisier
    C) Erich Huckel D) Sidgwick and Powell
14. Which of the following is used in various industries, including fragrances and flavorings?
    A) Ethylbenzene B) Acetophenone
    C) Paradichlorobenzene D) Nitromethane



15. In which year, Johann Dobereiner recognised triads of elements with chemically similar properties, such as lithium, sodium and potassium?
    A) 1825 B) 1829 C) 1831 D) 1833
16. Who discovered the positron, a particle described as 'carrying a positive charge but having a mass of the same order of magnitude as that normally possessed by a free negative electron'?
    A) Niels Bohr B) Carl Anderson
    C) F Wohler D) Philipp Lenard

Geography

17. What is the population density of Arunachal Pradesh as per the 2011 population census of India?
    A) 17 per km^2 B) 25 per km^2
    C) 10 per km^2 D) 30 per km^2
18. Which River originates from the Siachen Glacier?
    A) Gomti B) Nubra
    C) Son D) Lohit
19. Which of the following is the study of the relationships between living organisms, including humans, and their physical environment?
    A) Ethnobotany B) Paleobotany
    C) Ecology D) Agronomy
20. The study of mountains is called ....
    A) Petrology B) Orology
    C) Geology D) Ecology

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy,** Hyderabad*